'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 267

గురువారం 18-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'మ్యాచ్'కు పొగబెట్టిన 'మంచు'

లక్నోలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య నాలుగో టి20 రద్దు - 12లో

ఆకాశాన వెండి ధర

రూ.2,05,800 వద్ద కొత్త రికార్డు..

రూ.600 లాభపడిన పసిడి - 13లో

మనది సహజ భాగస్వామ్యం

ప్రాంతీయ శాంతిభద్రతలు, అనుసంధానంలో భారత్, ఇథియోపియాలు సహజ భాగస్వామ్య దేశాలని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



మరో 20 దేశాలపై నిషేధం

అమెరికాలోకి ప్రవేశించకుండా నిషేధించిన జాబితాలోకి మరో 20 దేశాలను ట్రంప్ యంత్రాంగం తాజాగా చేర్చింది.

వివరాలు 6లో ▸

శాటిలైట్ ఆధారిత టోల్‌వ్యవస్థ

వచ్చే ఏడాది చివరికల్లా జాతీయ రహదారులపై ఉపగ్రహ ఆధారిత టోల్‌చార్జీల వసూలు అమలు చేస్తామని కేంద్ర మంత్రి గడ్కరీ ప్రకటించారు.

వివరాలు 6లో ▸

చరిత్ర సృష్టించిన సాయిజాదవ్

ప్రతిష్టాత్మక ఇండియన్ మిలిటరీ అకాడమీ తొలి మహిళా ఆఫీసర్‌గా సాయి జాదవ్ చరిత్ర సృష్టించింది.

వివరాలు 11లో ▸

మెడి'కిల్'పై మహోద్యమం

కోటి గళాల సింహగర్జన

కోటి సంతకాల ప్రతులతో జిల్లాల నుంచి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న వాహనాలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ఒప్పుకోం..

చంద్రబాబు సర్కార్ నిర్ణయంపై వైఎస్సార్‌సీపీ సమరభేరి

నేడు కోటి సంతకాలను గవర్నర్‌కు అందజేయనున్న వైఎస్ జగన్

ప్రభుత్వ కుట్రపై ఉవ్వెత్తున ఎగిసిన నిరసన జ్వాల.. స్వచ్ఛందంగా సంతకాలు చేసిన అన్ని వర్గాల ప్రజలు

కమీషన్ల కోసం ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబర్ 7న ప్రజా ఉద్యమ కార్యాచరణ ప్రకటన

- అక్టోబర్ 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించిన వైఎస్ జగన్
- అక్టోబర్ 10 నుంచి నవంబర్ వరకు గ్రామాల్లో, పట్టణాల్లో రచ్చబండ
- స్కాముల కోసం పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను దూరం చేస్తున్న తీరును వివరించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- చంద్రబాబు సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్వచ్ఛందంగా సంతకాలు చేసిన ప్రజలు
- నవంబర్ 12న నియోజకవర్గాల కేంద్రాల్లో నిర్వహించిన ర్యాలీలు గ్రాండ్ సక్సెస్
- ఈ నెల 10న 175 నియోజకవర్గాల్లో సంతకాల ప్రతులతో నిర్వహించిన ర్యాలీలు విజయవంతం.. ఈ నెల 15న జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ర్యాలీల్లో కదంతొక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు
- కోటి సంతకాల మహోద్యమాన్ని అణచి వేసేందుకు సర్కార్ విఫలయత్నం
- అడ్డంకులు సృష్టించినా కోటి గళాలు సింహగర్జన చేశాయంటున్న రాజకీయ పరిశీలకులు

2లో

2లో

నేడు గవర్నర్‌తో వైఎస్ జగన్ భేటీ

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ 1,04,11,136 సంతకాల పత్రాలు అందజేత

ఉదయం 10 గంటలకు జెండా ఊపి ఆ పత్రాలున్న వాహనాలను లోక్‌భవన్‌కు పంపనున్న జగన్

ఆ తర్వాత పార్టీ నేతలతో సమావేశం

అనంతరం గవర్నర్‌తో భేటీ

99 పైసలకే 27.10 ఎకరాలా?

రహేజా కార్ప్‌కు భూకేటాయింపులపై హైకోర్టు విస్మయం

ఒక రియల్ ఎస్టేట్ కంపెనీకి ఇంత తక్కువ ధరకు భూములు ఇచ్చేస్తారా?

దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారా?

ఇంత తక్కువ ధరకు భూములిస్తే మిగిలిన కంపెనీలు ముందుకు రాలేదా?

వస్తే ఎన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి?

అన్నింటికీ అవకాశం ఇవ్వకుండా ఒకే కంపెనీకి భూ కేటాయింపులు ఏమిటి?.. ప్రభుత్వానికి చీఫ్ జస్టిస్ బెంచ్ ప్రశ్నల వర్షం

పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు

సాక్షి, అమరావతి: పలు ప్రైవేటు కంపెనీలకు నామమాత్రపు ధరలకే భూములు కట్టబెడుతూ వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా ఓ రియల్ ఎస్టేట్ సంస్థ– రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కూడా కేవలం 99 పైసలకే 27.10 ఎకరాలు కట్టబెట్టడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఇంత తక్కువ ధరకు రియల్ ఎస్టేట్ కంపెనీకి అంత భూమి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించింది. ఇతర కంపెనీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఒక వేళ దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ ఇచ్చి ఉంటే మరిన్ని కంపెనీలు కూడా

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

స్క్రబ్ టైఫస్‌తో వృద్ధురాలు మృతి

స్క్రబ్ టైఫస్‌తో ఓ వృద్ధురాలు మరణించిన ఘటన అన్నమయ్య జిల్లా ముప్పిరెడ్డిగారిపల్లెలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పదిహేను రోజులుగా జ్వరంతో బాధపడుతున్న మంగమ్మ సోమవారం మృతి చెందింది. మదనపల్లె నియోజకవర్గంలో 9 మందికి స్క్రబ్ టైఫస్ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు.

2లో

సర్కారు తీరుపై గురువులు గుర్రు!

10లో

తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు పోరాటానికి సిద్ధమయ్యారు. పెండింగ్ బకాయిలు, డీఏలు చెల్లించాలని, ఐఆర్, పీఆర్సీ ప్రకటించాలనే డిమాండ్‌లతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం గురువారం కలెక్టరేట్ల ఎదుట ఉపాధ్యాయులు ధర్నాలు చేయనున్నారు.

రాష్ట్రాలపై భారం మోపి.. 'ఉపాధి'ని ఎత్తేసే కుట్ర

కొత్త బిల్లుతో ఉపాధి హామీ పథకం నిర్వీర్యం.. పేదల హక్కుకు భంగం

ఈ బిల్లును జేపీసీకి పంపాలి.. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: గ్రామీణ పేదలకు కష్టకాలంలో అండగా నిలుస్తున్న ఉపాధి హామీ పథకాన్ని అటకెక్కించేందుకు.. పేదలకు హక్కుగా ఉన్న ఉపాధిని అగమ్యగోచరంగా మార్చేలా, ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాల మెడపై కత్తి వేలాడదీసేలా రూపొందించిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ బిల్లు–2025'పై వైఎస్సార్‌సీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లోక్‌సభలో బుధవారం ఈ బిల్లుపై జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్రాలపై భరించలేనంత భారం మోపి, పరోక్షంగా ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల పొట్టకొట్టే ఈ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని, జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. 'ఇన్నాళ్లూ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఒక చట్టబద్ధమైన హక్కుగా ఉండేది. కానీ కేంద్రం తెస్తున్న కొత్త బిల్లులోని అస్పష్టమైన నిబంధనల వల్ల ఆ హక్కును పేదలు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఈ బిల్లు పేదల్లో తీవ్ర అభద్రతాభావాన్ని, గందరగోళాన్ని సృష్టిస్తోంది. నిధుల కేటాయింపులో కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో కేంద్రం 90 శాతం నిధులు ఇస్తుండగా, రాష్ట్రాలు కేవలం 10 శాతం మాత్రమే భరిస్తున్నాయి. కొత్త బిల్లులో కేంద్రం తన వాటాను 60 శాతానికి తగ్గించుకుని, రాష్ట్రాలపై ఏకంగా 40 శాతం

మిగతా 3వ పేజీలో ▶

అన్నీ చేసి అధికారులపై నిందలా?

మన పాలనను జనం మెచ్చడం లేదని కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు వ్యాఖ్య

- మేనిఫెస్టోను అటకెక్కించి.. సూపర్ సిక్స్‌కు చెదలు పట్టించి..
- సంపద సృష్టికి చెల్లుచీటి ఇచ్చి.. అవినీతిని విశృంఖలం చేసి..
- కనీవిని ఎరుగని అప్పులు చేసి.. ప్రతి పనిలో కమీషన్లు కొట్టేసి..
- రాజకీయ పాలన పేరుతో రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపి.. ఆ తప్పులన్నీ అధికారులపైకి నెట్టేసేందుకు బాబు ఆపసోపాలు..
- సీఎం ఎత్తుగడ చూసి అవాక్కయిన కలెక్టర్లు.. చేసిందంతా చేసి వేరేవాళ్లపై నెట్టేయడం బాబుకు అలవాటేనని అధికారుల్లో చర్చ
- రాష్ట్రంలో 49 శాతం మంది ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్న సీఎం
- రైతులు తమ పంటలకు ధరలు రావడం లేదంటున్నారు

3లో



- ప్రజలు విద్యుత్ బిల్లులు, కోత సమస్యలను ఎదుర్కొంటున్నారు
- రోడ్లు, తాగునీరు, పేదల గృహాలు, నిరుద్యోగం లాంటి సమస్యలున్నాయి
- మనం బాగా పని చేశామనుకుంటున్నాం కానీ.. ఏదో మిస్ అవుతున్నాం
- ఎన్నికలు లేకపోతే డిక్టేటర్‌లా 20 ఏళ్లకు ప్లాన్‌చేసి కొట్టేయచ్చు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే ప్రజలకు మెరుగైన వైద్యం.. పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లిపోతున్నారన్న సీఎం

సచివాలయాలు ఇక 'స్వర్ణ గ్రామం'

- గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పనితీరు మార్చుకోకుంటే తీవ్ర చర్యలు తీసుకుంటాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిక

3లో

..అమెరికానే విశ్వసనీయంగా ఉండటం లేదాసార్!

ప్రైవేటు సంస్థల నుంచి యూనిట్ విద్యుత్ రూ.3.09 చొప్పున కొనుగోలు చేసేందుకు ఏపీఈఆర్‌సీ ఇచ్చిన అనుమతి



after the award of LoA by DISCOMs, whose finalised tariff is above Rs. 3.09 per unit in the proposals, they may be given the benefit of an additional tariff over Rs.3.09 per unit on a prorated basis corresponding to such expenditure based on the statutory auditor certificate, assuming GST impact 11 paise for Rs.4.20 crores per MW. Further, the tariffs under or at Rs.3.09 per unit need not be altered.

పొలంలో ప్రైవేట్ 'పవర్'!

వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్ పేరుతో దోపిడీకి రంగం సిద్ధం

కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో నాడు ఒప్పందం తప్పన్న చంద్రబాబు

ఇప్పుడు ప్రైవేటు సంస్థలతో అధిక ధరకు సోలార్ ఒప్పందాలు

'సెకీ' విద్యుత్ యూనిట్ రూ.2.49.. బాబు కొంటున్నది యూనిట్ రూ.3.09

డిస్కమ్‌ల కోరిక మేరకు టారిఫ్‌ను ఆమోదించిన 'ఏపీఈఆర్‌సీ'

10లో

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో హోమ్ బౌండ్

జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా ప్రధాన పాత్రల్లో నటించిన 'హోమ్ బౌండ్' చిత్రం.. 98వ ఆస్కార్ అవార్డ్స్ కోసం భారతదేశం తరఫున అధికారిక ఎంట్రీ సాధించిన సంగతి తెలిసిందే. తాజాగా 12 విభాగాల్లో పోటీ పడుతున్న సినిమాల షార్ట్ లిస్ట్‌లో ఈ సినిమా చోటు దక్కించుకుంది.

12లో

బేరం కుదిరితేనే బిల్లు!

పేదల ఇళ్ల నిర్మాణ ఏజెన్సీలకు సర్కారు రూ.80 కోట్ల బకాయి

డిమాండ్ చేసినంత కమీషన్ ఇచ్చే కంపెనీల బిల్లులకే మోక్షం

20 శాతానికి పైగా కమీషన్లు డిమాండ్

ఎల్లో గ్యాంగ్ దందాలతో ముందుకు సాగని ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణాలు

సాక్షి, అమరావతి: అక్రమార్జనే పరమావధిగా ప్రభుత్వ పెద్దలు, చినబాబు, పలువురు మంత్రులు, కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. లాభాపేక్ష లేకుండా పేదలకు పక్కా ఇళ్లను నిర్మించే ఏజెన్సీలను సైతం వదలడం లేదు. దీంతో గత వైఎస్ జగన్ హయాంలో తలపెట్టిన ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడంలేదు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే టీడీపీ కూటమి నేతలు ఆదాయార్జన మార్గాలపై కన్నేశారు. ఇందులో భాగంగా జగనన్న కాలనీల్లోని ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణాలపై వాలిపోయారు. వాటిని నిర్మించే ఏజెన్సీల నుంచి అందినంత వరకూ దండుకునేందుకు ముందుగా వాటిపై ఆరోపణలు చేశారు. దీంతో విజిలెన్స్ విచారణ పేరిట ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపులు ఆపేశారు. ఫలితంగా రూ.80 కోట్లకు పైనే

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

మచిలీపట్నం పోర్టు నిర్మాణం మరింత ఆలస్యం

పనుల గడువు మరో ఏడాది పొడిగింపు

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు అధికారం చేపట్టిన తర్వాత మచిలీపట్నం పోర్టు పనులు నత్తనడకన సాగడంతో.. నిర్మాణం పూర్తి చేసే గడువును 2026 డిసెంబర్ 28 వరకు పొడిగించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.5,155.73 కోట్లతో మచిలీపట్నం పోర్టు నిర్మాణం చేపట్టడానికి 2021 ఆగస్టు 18న పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఇందులో రూ.3,668.83 కోట్ల విలువైన పనులు చేపట్టడానికి మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్‌కు కాంట్రాక్టు పనులను అప్పగించింది. 2023 ఏప్రిల్ 21న పనులను ప్రారంభించి శరవేగంతో పరిగెత్తించింది. ఈ పోర్టు 2025 అక్టోబర్ 9 నాటికి పూర్తికావాల్సి ఉండగా.. చంద్రబాబు సర్కారు ఉదాసీనత కారణంగా పనులు మందగించాయి. దీంతో మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ పొడిగిస్తూ పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుల నియామకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) మెంబర్లుగా కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వంగా గీత విశ్వనాథ్, శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజక వర్గానికి చెందిన షేక్ మహ్మద్ ఇస్మాయిల్‌ను నియమించారు. ఈ మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది.

స్క్రబ్ టైఫస్‌తో వృద్ధురాలు మృతి

ఆలస్యంగా వెలుగులోకి...

మంగమ్మ (ఫైల్)

పీలేరు రూరల్/మదనపల్లె రూరల్: స్క్రబ్ టైఫస్‌తో వృద్ధురాలు మృతి చెందిన ఘటన అన్నమయ్య జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. కేవీపల్లె మండలం నూతనకాల్వ పంచాయతీ ముప్పిరెడ్డిగారిపల్లె హరిజనవాడకు చెందిన మంగమ్మ (65) కూలి పనులు చేసుకుంటూ పీలేరు మోడల్ కాలనీలో నివాసం ఉంటోంది. ఆమె పదిహేను రోజులుగా జ్వరంతో బాధపడుతూ స్థానికంగా చికిత్స పొందుతోంది. అయినా జ్వరం తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను 13న తిరుపతి రుయా ఆస్పత్రిలో చేర్పించారు. జ్వరం ఎక్కువ ఉండడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించగా స్క్రబ్ టైఫస్ ఉన్నట్టు నిర్ధారించారు. సోమవారం ఉదయం ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు మంగమ్మ మృతదేహానికి సోమవారం దహనక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య, తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల రాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు మోడల్ కాలనీని సందర్శించారు. మంగమ్మ నివాసం ఉన్న ఇంటితోపాటు, పరిసర ప్రాంతాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఫీవర్ సర్వే నిర్వహించి స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి కాదని తెలిపారు. ఎవరికైనా జ్వరం వస్తే తక్షణం సమీప ప్రభుత్వాస్పత్రిలో సంప్రదించాలని సూచించారు.

మదనపల్లె నియోజకవర్గంలో కలకలం

మదనపల్లె నియోజకవర్గంలో స్క్రబ్ టైఫస్ కలకలం రేగింది. ప్రస్తుతం మదనపల్లె మండలంలో 8 మందికి, నిమ్మనపల్లె మండలంలో 1 మొత్తంగా 9 మందికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్రమత్తమైన అధికారులు ఆయా ప్రాంతాల్లో కీటకాల నివారణ, పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టారు.

గిరిజన గురుకులాల ఏఎన్‌ఎంలకు శిక్షణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులాల్లో సేవలు అందిస్తున్న ఏఎన్ఎం, జీఎన్ఎంలకు బుధవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 23 వరకు శిక్షణ తరగతులు జరుగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా 199 గిరిజన గురుకుల విద్యా సంస్థల్లో రెగ్యులర్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ద్వారా విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం, జీఎన్ఎం, నర్సులకు ఏడు కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నామని ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి ఎం.గౌతమి ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, రంపచోడవరం, ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, అల్లూరి జిల్లా పాడేరు, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం, నంద్యాల జిల్లా మహానంది, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గురుకులాల్లోని విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, రోజువారీ సంరక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాలను పెంచడం కోసం ఈ శిక్షణ ఇస్తున్నట్టు గౌతమి పేర్కొన్నారు.

మెడి'కిల్'పై మహోద్యమం

కోటి గళాల సింహగర్జన

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ఒప్పుకోం | **చంద్రబాబు సర్కార్ నిర్ణయంపై వైఎస్సార్‌సీపీ సమరభేరి**

సాక్షి, అమరావతి: కమీషన్ల కక్కుర్తితో పేదలకు నాణ్యమైన వైద్యాన్ని, విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తూ ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ చంద్రబాబు సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపు ప్రభంజనమైంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు, మేధావులు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు సర్కార్‌పై క్లారిత్ర చేశారు. కోటి గళాలతో సింహగర్జన చేశారు. నిరసన జ్వాల ఉవ్వెత్తున ఎగసి పడటంతో కోటి సంతకాల ఉద్యమం ప్రజా మహోద్యమంగా మారింది. గద్దెనెక్కిన 18 నెలల్లోనే చంద్రబాబు సర్కార్ రూ.2,81,312 కోట్లు అప్పు చేసింది. దీన్ని బట్టి చూస్తే.. నెలకు రూ.15,628.44 కోట్లు.. రోజుకు రూ.520.94 కోట్లు చొప్పున అప్పు చేసింది. అంటే.. ఒక్క రోజులో చేసిన అప్పుతో ఒక మెడికల్ కాలేజీని పూర్తి చేయొచ్చు. కేవలం పది రోజుల్లో చేసిన అప్పుతో మెడికల్ కాలేజీల్లో మిగిలిన పనులను పూర్తి చేయొచ్చు. కానీ.. అందుకు విరుద్ధంగా అధిక వడ్డీలకు అప్పుగా తెచ్చిన నిధులను దుబారా చేస్తూ మెడికల్ కాలేజీల నిర్మాణానికి నిధుల్లేవని సాకు చూపుతూ.. ప్రైవేటీకరణ ముసుగులో వాటిని చంద్రబాబు సర్కార్ బినామీలకు కట్టబెట్టాలన్న కుట్రపై జనం భగ్గుమన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లోని 175 నియోజకవర్గాలలో గ్రామాలు.. పట్టణాల్లో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన రచ్చబండ కార్యక్రమాల్లో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న చంద్రబాబు సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని వర్గాలకు చెందిన 1,04,11,136 మంది ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేశారు. ఆ సంతకాల ప్రతులు 26 జిల్లాల నుంచి మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నాయి. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో ఆ సంతకాల ప్రతులను గురువారం గవర్నర్‌కు అందజేయనున్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిలుపుదల చేసి.. వాటిని ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేయనున్నారు.

14 ఏళ్లలో ఒక్క మెడికల్ కాలేజీ కట్టని చంద్రబాబు

రాష్ట్రంలో 1923 నుంచి 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. పద్మావతి అటానమస్ మెడికల్ కాలేజీతో కలిపితే 12 ఉన్నాయి. 2019 నాటికి చంద్రబాబు మూడు సార్లు అంటే 1995–99, 1999–04, 2014–19 మధ్య 14 ఏళ్లు సీఎంగా పాలించారు. ఆ మూడు దఫాల్లో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా కట్టలేదు. కనీసం కొత్తగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా చేయలేదు. ఈ క్రమంలో 2019 ఎన్నికల మేనిఫెస్టోలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 13 జిల్లాలను పునర్విభజించి, 26 జిల్లాలుగా ఏర్పాటు చేశారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతోపాటు నాణ్యమైన వైద్యం అందించడం.. పేదలకు వైద్య విద్యను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో కాలేజీకి 50 ఎకరాల కనీస స్థలం ఉండేలా భూమిని కేటాయించారు. ఒక్కో మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.500 కోట్లకుపైగా ఖర్చు చేసి అన్ని రకాల సదుపాయాలు ఉండేలా క్యాంపస్‌ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. కోవిడ్ మహమ్మారి వంటి సమస్యలు రెండేళ్లపాటు రాష్ట్రాన్ని పీడించినా, ఎన్ని ఇబ్బందులున్నా ఎక్కడా వెనక్కు తగ్గకుండా మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో అడుగులు ముందుకు వేశారు. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను 2023–24లోనే ప్రారంభించి, తరగతులు మొదలుపెట్టారు. గతేడాది ఎన్నికలు వచ్చే నాటికి పాడేరు, పులివెందుల కాలేజీలు కూడా తరగతులు ప్రారంభించడానికి సిద్ధమయ్యాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత పాడేరులో అడ్మిషన్లు ముగిసి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి.

కోటి సంతకాల ప్రతులతో అన్ని జిల్లాల నుంచి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న వాహనాలు

కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట

పులివెందుల మెడికల్ కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించడానికి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) గతేడాది అనుమతులు ఇచ్చింది. కానీ.. ఆ సీట్లు మాకు వద్దంటూ ఎన్ఎంసీకి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. సీఎం చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ట. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి అవసరమైన నిధులను అప్పట్లోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమీకరించింది. ఆ నిధులను సద్వినియోగం చేసుకుని.. వైఎస్సార్‌సీపీ సర్కార్ రూపొందించిన ప్రణాళిక ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టి ఉంటే.. 2024–25 విద్యా సంవత్సరంలో ఆదోని, మదనపల్లి, మార్కాపురం మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చేవి. ఈ విద్యా సంవత్సరం అంటే 2025–26లో అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పార్వతీపురం, పాలకొల్లు, పెనుకొండలో కూడా వైద్య కళాశాలలు ప్రారంభం అయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు 2,360 మాత్రమే ఉండేవి. కొత్త మెడికల్ కాలేజీల ద్వారా అదనంగా మరో 2,550 సీట్లు పెరిగితే.. మొత్తంమ్మీద 4,910 సీట్లు అందుబాటులోకి వచ్చేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తరగతులు ప్రారంభమైన కొత్త మెడికల్ కాలేజీల్లో అప్పట్లోనే 800 సీట్లు భర్తీ చేశారు. పులివెందుల మెడికల్ కాలేజీలో తరగతులు ప్రారంభించేందుకు చంద్రబాబు సర్కార్ అంగీకరించి ఉంటే మరో 50 సీట్లు వచ్చేవి. ఎక్కడ వైఎస్ జగన్‌కు క్రెడిట్ వస్తుందోనని ఏకంగా ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు దెబ్బ తీస్తున్నారని మేధావులు, ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. ఏడాదికి రూ.వెయ్యి కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కాలేజీలన్నీ అందుబాటులోకి వచ్చేవి.

మహోద్యమంగా ప్రజా ఉద్యమం

కమీషన్ల కక్కుర్తితో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలని చంద్రబాబు సర్కార్ నిర్ణయించడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 7న వైఎస్ జగన్ ప్రజా ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. అక్టోబర్ 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించి సమరభేరి మోగించారు. అక్టోబర్ 10 నుంచి నవంబర్ ఆఖరు వరకు 175 నియోజకవర్గాల్లో గ్రామాలు, పట్టణాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు విస్తృతంగా రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. భవిష్యత్తులో రూ.లక్ష కోట్ల విలువ చేసే మెడికల్ కాలేజీలను బినామీలకు కట్టబెట్టాలన్న చంద్రబాబు కుట్రను.. పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను దూరం చేస్తున్న దురాగతాన్ని ప్రజల కళ్లకు కట్టినట్టు వివరించారు. వీటికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. చంద్రబాబు సర్కార్ నిర్ణయాన్ని నిరసిస్తూ.. మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నిర్మించి, నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కోటి మందికి పైగా ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేశారు.

నేడు గవర్నర్‌తో వైఎస్ జగన్ భేటీ

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ 1,04,11,136 సంతకాల పత్రాలు అందజేత
- ఉదయం 10 గంటలకు జెండా ఊపి ఆ పత్రాలున్న వాహనాలను లోక్‌భవన్‌కు పంపనున్న జగన్
- ఆ తర్వాత పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల అధ్యక్షులు, రీజినల్ కో-ఆర్డినేటర్లు, సీనియర్ నాయకులతో సమావేశం
- ఆ తర్వాత లోక్‌భవన్‌కు పయనం

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సాయంత్రం 4 గంటలకు గవర్నర్‌తో భేటీ కానున్నారు. పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు, ఎంపీలు, తదితరులతో కలిసి ఆయన గవర్నర్‌కు 1,04,11,136 సంతకాల పత్రాలను అందించనున్నారు. అంతకు ముందు ఉదయం 10 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద కోటి సంతకాల పత్రాలతో వచ్చిన వాహనాలను వైఎస్ జగన్ జెండా ఊపి లోక్‌భవన్‌కు పంపనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, రీజినల్ కో–ఆర్డినేటర్లు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, పార్టీకి చెందిన సీనియర్ నాయకులు పాల్గొంటారు. ఆ తర్వాత వీరితో వైఎస్ జగన్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమవుతారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత గవర్నర్ నివాసం లోక్‌భవన్‌కు బయల్దేరి వెళతారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కోటి మందికిపైగా చేసిన సంతకాల పత్రాలతో వాహనాలు ఇప్పటికే పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నాయి.

అణచివేసే దుస్సాహసంపై ప్రజాగ్రహం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయంపై ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబుకుతుండటం.. రచ్చబండ కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేస్తుండటంతో చంద్రబాబు సర్కార్ వెన్నులో వణుకు పుట్టింది. రచ్చబండ కార్యక్రమాలపై పోలీసులను ఉసిగొల్పి ప్రజా ఉద్యమాన్ని అణచివేసే దుస్సాహసంపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. చంద్రబాబు సర్కార్ ప్రజా వ్యతిరేక చర్యలపై సమర భేరి మోగించింది. నవంబర్ 12న నియోజకవర్గాల కేంద్రాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ర్యాలీల్లో అన్ని వర్గాల ప్రజలు కదం తొక్కారు. ఈ నెల 10న ఏపీలోని 175 నియోజకవర్గాల్లోనూ ప్రజలు స్వచ్ఛందంగా చేసిన సంతకాల ప్రతులను ప్రదర్శిస్తూ వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ర్యాలీల్లో ప్రజలు భారీగా పాల్గొన్నారు. పోలీసుల ద్వారా ర్యాలీలను అడగడుగునా అడ్డుకోవడానికి చంద్రబాబు చేసిన కుట్రలను జనం పటాపంచలు చేశారు. ఈ నెల 15న జిల్లా కేంద్రాల్లో కోటి సంతకాల పత్రాలను ప్రదర్శిస్తూ నిర్వహించిన ర్యాలీల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి బాబు సర్కార్‌పై రణభేరి మోగించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ కోటి గళాలు సింహగర్జన చేశాయి.

నూతన వధూవరులకు వైఎస్ జగన్ ఆశీస్సులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుమారుడి వివాహ వేడుక బుధవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై.. వధూవరులు ఏంజెల్, అమల్‌రాజ్‌లకు వివాహ శుభాకాంక్షలు తెలియజేసి.. ఆశీర్వదించారు.

దావోస్ ప్రచారం కోసం రూ.30 లక్షలతో మ్యాగజైన్

సాక్షి, అమరావతి: దావోస్‌లో వచ్చే ఏడాది జనవరిలో దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు ప్రచారంలో భాగంగా చంద్రబాబు ప్రభుత్వం రూ.30 లక్షలతో ప్రత్యేక మ్యాగజైన్ విడుదల చేయనుంది. ఇందుకోసం ఆంగ్ల పత్రిక బిజినెస్ టుడే మల్టీవర్స్‌కు రూ.30 లక్షలు విడుదల చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

99 పైసలకే 27.10 ఎకరాలా..?

▶ మొదటి పేజీ తరువాయి

ముందుకు వచ్చి ఉండేవని తెలిపింది. అలా ఎన్ని కంపెనీలు ముందుకు వచ్చాయని ప్రశ్నించింది. అందరికీ అవకాశం ఇవ్వకుండా ఒకే కంపెనీకే భూములు కట్టబెట్టడం ఏమిటని ప్రశ్నించింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రహేజాకు భూ కేటాయింపు విషయంలో అనుసరించిన విధానాన్ని కూడా తమ ముందుంచాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎదురు రూ.91.2 కోట్లు చెల్లిస్తోంది: పొన్నవోలు

విశాఖపట్నంలోని మధురవాడ, ఐటీ హిల్‌లో కేవలం 99 పైసలకే 27.10 ఎకరాల భూమిని రహేజాకు కేటాయించడాన్ని సవాలు చేస్తూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ కాన్‌స్టిట్యూషనల్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు, మానవ హక్కుల కమిషన్ పూర్వ సభ్యుడు డాక్టర్ గోచిపాత శ్రీనివాసరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనల్లో ముఖ్యాంశాలు..

- పొన్నవోలు వాదనల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ, కంపెనీలకు భూ కేటాయింపులపై ఇప్పటికే ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలై ఉన్నాయని, ప్రస్తుత వ్యాజ్యంలో కూడా పిటిషనర్ భూ కేటాయింపులను, కేటాయింపుల విధానాన్ని సవాలు చేశారని వివరించారు.
- అలా అయితే ఆ వ్యాజ్యాలతో కలిపి ఈ వ్యాజ్యాన్ని కూడా వింటామని ధర్మాసనం స్పష్టం చేసింది.
- ఈ సమయంలో పొన్నవోలు జోక్యం చేసుకుంటూ, ఇది రియల్ ఎస్టేట్ కంపెనీకి భూములు కేటాయించిన వ్యవహారమని తెలిపారు. గతంలో దాఖలు చేసిన వ్యాజ్యాలు పలు ఐటీ కంపెనీలకు భూ కేటాయింపులపై దాఖలైనవని వివరించారు. దీంతో ధర్మాసనం విచారణను కొనసాగించింది
- రహేజా రియల్టీ సంస్థ కాదని ఏజీ చెబుతుండగా, పొన్నవోలు అడ్డుతగులుతూ అది రియల్ ఎస్టేట్ కంపెనీనేనని, కావాలంటే జీవో 204ను చూడాలని, అందులో రియల్ ఎస్టేట్ కంపెనీ అని స్పష్టంగా ఉందని చెప్పారు.
- ప్రభుత్వం భూ కేటాయింపులతో సరిపెట్టలేదని, ప్రోత్సాహకాలుగా సదరు రియల్ ఎస్టేట్ కంపెనీకి ఎదురు రూ.91.2 కోట్లు చెల్లిస్తోందని వివరించారు. ఈ మొత్తాన్ని ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశం ఉందని, అందువల్ల తగిన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.
- పొన్నవోలు లేవనెత్తిన పాయింట్ సరైనదేనని, అయితే ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తరువాత అన్ని విషయాలను పరిశీలిస్తామని పొన్నవోలుకు ధర్మాసనం స్పష్టం చేసింది.

99 పైసలకే భూ కేటాయింపుల తీరిది..

కంపెనీ	ఎకరాలు
టీసీఎస్	21.60
కాగ్నిజెంట్	22.19
సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్	3.55
ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్	10.29
రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్	27.10

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అతిపెద్ద కుంభకోణం

- ప్రైవేటీకరణ తర్వాత రెండేళ్ల జీతాల చెల్లింపు మరో పెద్ద స్కాం
- ప్రైవేటీకరణ నిర్ణయంపై వెల్లువెత్తిన ప్రజానిరసన
- రాష్ట్ర వ్యాప్తంగా కోటి మందికి పైగా సంతకాలు
- ప్రభుత్వ నిర్ణయంపై ఇది కచ్చితంగా రెఫరెండమే
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి,అమరావతి: రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ద్వారా సీఎం చంద్రబాబు అతిపెద్ద కుంభకోణానికి తెగబడుతున్నారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా కోటిమందికిపైగా సంతకాలు చేసిన ప్రతులను బుధవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద పరిశీలించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కోటిమందికి పైగా చేసిన సంతకాలే.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయంపై వెల్లువెత్తిన ప్రజా నిరసనకు నిదర్శనమని, ఇది ప్రభుత్వ పనితీరుపై కచ్చితంగా రెఫరెండమే అని సజ్జల రామకృష్ణారెడ్డి తేల్చి చెప్పారు. ఏపీని మెడికల్ హబ్‌గా మార్చాలని కలగన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందులో భాగంగానే 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని స్పష్టం చేశారు. అయితే అధికారంలోకి రాగానే కాలేజీల నిర్మాణాలను నిలిపివేసిన చంద్రబాబు.. కమీషన్ల కక్కుర్తితోనే ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ముందస్తు కుట్రేనని.. ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటమాడుతున్నారని ఆక్షేపించారు. కాలేజీల ప్రైవేటీకరణతోపాటు అప్పనంగా ఆస్తులు అప్పగిస్తున్న చంద్రబాబు.. అదనంగా రెండేళ్లపాటు రూ.1400 కోట్లు జీతాలు ప్రభుత్వం నుంచి చెల్లించాలన్న నిర్ణయం మరో భారీ స్కామ్ అని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు తీరుకు నిరసనగా గురువారం (ఈ నెల 18న) సాయంత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం గవర్నర్‌కు కోటి సంతకాల ప్రతులు సమర్పిస్తారని తెలిపారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కారు మొండిగా ముందుకెళ్తే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రైవేటీకరణపై సమీక్షించి, బాధ్యులను బోనెక్కిస్తామని, జైలుకు కూడా పంపిస్తామని హెచ్చరించారు.

కోటికి పైగా సంతకాలు ప్రభుత్వ పతనానికి సిరా శాసనాలే

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మొత్తం 1,04,11,136 సంతకాలు వచ్చాయి. ఈ సంతకాలన్నీ ప్రభుత్వ పతనానికి రాసిన సిరా శాసనాలే. ఇది కచ్చితంగా ప్రభుత్వ నిర్ణయంపై రెఫరెండమే. ఈ సంతకాలతో గురువారం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ని కలిసి వినతిపత్రం సమర్పిస్తుంది.'' అని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రోడ్లు పీపీపీ విధానంలో నిర్మిస్తే అవి ప్రభుత్వం వద్దే ఉంటాయి కదా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. అలా చేయడం వల్ల టోల్ గేట్ల భారం ప్రజలపై పడుతుందని సజ్జల రామకృష్ణారెడ్డి గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీని మెడికల్ హబ్ చేయడమే వైఎస్ జగన్ లక్ష్యం

ఏపీని మెడికల్ హబ్ చేయాలనే సమున్నత ఆశయంతో వైఎస్ జగన్ ఎంతో కృషి చేసి ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తెచ్చారు. ఐదు కాలేజీలను పూర్తిచేశారు. మరో ఐదు దాదాపు పూర్తయిన దశలో ఉన్నాయి. టీడీపీ కూటమి సర్కారు వచ్చిన వెంటనే.. కాలేజీల నిర్మాణాలను తక్షణం నిలిపివేసి ప్రైవేటీకరణకు పూనుకుంటోంది. ఆర్థిక లోటు లేకున్నా.. కాలేజీలపై విషంగక్కుతోంది. ప్రైవేటు రంగంలోనే అత్యుత్తమ సేవలందుతాయని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదం'' అని సజ్జల విమర్శించారు.

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరగలేదు

- కృష్ణానదీ జలాల వినియోగంలో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు
- బచావత్ ట్రిబ్యునల్ అవార్డును కొనసాగించాలని అభ్యర్థన



సాక్షి, అమరావతి: కృష్ణానదీ జలాల వినియోగంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరగలేదని ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. శ్రీశైలం కుడిగట్టు కాలువ (ఎస్ఆర్‌బీసీ)తో పోల్చితే ఎస్సెల్బీసీని (శ్రీశైలం ఎడమ గట్టు కాలువ) నిర్లక్ష్యం చేశారన్న తెలంగాణ ఆరోపణ తప్పని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కృష్ణా జలాలను పంపిణీ చేయడానికి జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర సభ్యులుగా కేంద్రం ఏర్పాటుచేసిన ట్రిబ్యునల్–2(కేడబ్ల్యూడీటీ) ఎదుట బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు. 'నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద తెలంగాణలో ఆయకట్టు 6.6 లక్షల ఎకరాల కంటే తగ్గలేదు. కృష్ణా జలాల కేటాయింపులో, వినియోగంలో అన్యాయం చేశారంటూ తెలంగాణ చేస్తున్న వాదనలకు చట్టపరమైన, చారిత్రక ఆధారాలు లేవు. బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేసింది. వాటిని యథాతథంగా కొనసాగించాలని విభజన చట్టంలోని సెక్షన్–89 స్పష్టంగా చెబుతోంది. ఈ నేపథ్యంలో బచావత్ ట్రిబ్యునల్ అవార్డును పునఃసమీక్షించకూడదు. కృష్ణా నదిలో 75 శాతం లభ్యత, బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు.. ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌కు 512, తెలంగాణకు 299 టీఎంసీల కేటాయింపును కొనసాగించాలి' అని గుప్తా ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించారు. ఆయన వాదనలు గురువారం కూడా కొనసాగనున్నాయి. ఈ విచారణకు తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, రెండు రాష్ట్రాల అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం అధికారులు హాజరయ్యారు.

అన్నీ చేసి అధికారులపై నిందలా?

మన పాలనను జనం మెచ్చడం లేదని కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు వ్యాఖ్య

- మేనిఫెస్టోను అటకెక్కించి.. సూపర్ సిక్స్‌కు చెదలు పట్టించి..
- సంపద సృష్టికి చెల్లుచీటి ఇచ్చి.. అవినీతిని విశృంఖలం చేసి..
- కనీవిని ఎరుగని అప్పులు చేసి.. ప్రతి పనిలో కమిషన్లు మెక్కి..
- రాజకీయ పాలన పేరుతో రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపి...
- ఆ తప్పులన్నీ అధికారులపైకి నెట్టేసేందుకు బాబు ఆపసోపాలు..
- సీఎం ఎత్తుగడ చూసి అవాక్కయిన కలెక్టర్లు..

కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు

సాక్షి, అమరావతి: గద్దెనెక్కిన పద్దెనిమిది నెలల కాలంలో మూటగట్టుకున్న వైఫల్యాలన్నిటినీ అధికారులపైకి నెట్టేసి చేతులు దులుపుకుందామనుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీరుని చూసి కలెక్టర్లంతా అవాక్కయ్యారు. తప్పులన్నిటినీ అధికారులపై పడేసి అసలు సమస్యలను పక్కదారి పట్టించడం ఆయనకు పరిపాటే. బుధవారం సచివాలయంలో ప్రారంభమైన రెండు రోజుల కలెక్టర్ల సదస్సునుద్దేశించి ముఖ్యమంత్రి చేసిన సుదీర్ఘ ప్రసంగంలో ఇది మరింత ప్రస్ఫుటమయ్యింది. మేనిఫెస్టోకు అసలు విలువే ఇవ్వకుండా.. సూపర్ సిక్స్ సూపర్ సెవన్ హామీలను అటకెక్కించేసిన చంద్రబాబు 'మన పనితీరును జనం మెచ్చడంలేదు' అంటూ ఇప్పుడు తన వైఫల్యాలన్నీ అధికారులపైకి నెట్టేసేందుకు ఆపసోపాలు పడ్డారు. పొలిటికల్ గవర్నెన్స్ కీలకమని చంద్రబాబు ఈ సమావేశంలో పునరుద్ఘాటించారు. నిజానికి ఆయన 'రాజకీయ పాలన' 18నెలలుగా సాగుతూనే ఉంది.. సోషల్ మీడియాపై దాడులు చేస్తూ, ప్రతిపక్షంపై దాడులు చేస్తూ, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ఆయన పాలన సాగుతోంది. సంపద పెంచక పోగా అడుగడుగునా అవినీతి, కనీవిని ఎరుగని రీతిలో అప్పులు, ప్రతిదాంట్లోనూ కమీషన్లు చూసి జనం ఛీత్కరించుకోక ఏం చేస్తారు? అయితే ఈ ఛీత్కారాలు, వైఫల్యాలు తనపైకి రాకుండా వేరేవాళ్ల పైకి తోసేయడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. అన్నిటికీ బాధ్యత తనదే అయినా కలెక్టర్లపైకి నెట్టేసేందుకు కలెక్టర్ల సదస్సును ఆయన వేదికగా చేసుకున్నారు. రాష్ట్రంలో 49 శాతం మంది ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారని, మన పని తీరును జనం మెచ్చడం లేదని అధికార యంత్రాంగాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'మీరు, నేను బాగా పని చేశామనుకుంటున్నాం.. కానీ ప్రజలు మాత్రం మెచ్చడం లేదు. ప్రజలకు సంతృప్తి లేకుండా పని చేస్తున్నాం. ఎక్కడో, ఏదో మిస్ అవుతున్నాం. ప్రజలు మనతో కలిసి వస్తున్నారా? లేదా? చూసుకోవాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు. డేటా చూస్తే.. కొన్ని అంశాల్లో మనం చేసే పనులను ప్రజలు మెచ్చడం లేదనే అవగాహన వచ్చిందన్నారు. రహదారులు, పంచాయతీరాజ్, తాగునీరు, పేదల గృహాలు, నిరుద్యోగం లాంటి సమస్యలున్నాయని, రైతులు పంటలకు ధరలు రావడం లేదంటున్నారని, భూముల సమస్య ఉందని, విద్యుత్ బిల్లులు పెరిగాయని, ప్రజలు విద్యుత్ కోత సమస్యలను ఎదుర్కొంటున్నారని సీఎం చెప్పారు. అంకెలతో సమస్యలు తీరవన్నారు.

ఎన్నికలే లేకపోతే 20 ఏళ్లు కొట్టేయచ్చు

ప్రభుత్వానికి కలెక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం పట్ల పాజిటివ్ వాతావరణం రావాలంటే వారిపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఎన్నికలు లేకపోతే డిక్టేటర్, చైనాలా 20 ఏళ్ల ప్లాన్ చేసుకుని కొట్టేయవచ్చున్నారు. కానీ ఇక్కడ ఐదేళ్లకోసారి ఎన్నికలకు వెళ్లాల్సి ఉందని, అందుకే రాజకీయ గవర్నెన్స్ కీలకమన్నారు.

పారిశ్రామికవేత్తలు తిరుగుముఖం

విశాఖ సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల అమలు బాధ్యత కలెక్టర్లపై ఉందని సీఎం చెప్పారు. పరిశ్రమల అనుమతులకు జాప్యం చేస్తుండటంతో కొంత మంది పెట్టుబడిదారులు తిరిగి వెనక్కి వెళ్లిపోతున్నారని వెల్లడించారు. పెట్టుబడులు పెట్టే వారిని కలెక్టర్లు, మంత్రులు తక్కువగా చూస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి జనవరి నుంచి ఫైళ్లు, సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే క్లియర్ చేయాలని ఆదేశించారు. జనవరి నుంచి జిల్లాల్లో ఆకస్మిక తనిఖీకి వస్తానని సీఎం ప్రకటించారు.

ఆ డబ్బులతో మరో రెండు మెడికల్ కాలేజీలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీలో ఇవ్వడం వల్లే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల కంటే కార్పొరేట్ ఆస్పత్రులే బాగా పనిచేస్తాయన్నారు. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ నిర్మించి డబ్బులు వృథా చేశారని విమర్శించారు. ఆ డబ్బులు ఉంటే రెండు మెడికల్ కాలేజీలను నిర్మించుకునేవాళ్లమని, రుషికొండ ప్యాలెస్ తెల్ల ఏనుగులా మారిందన్నారు. రోడ్లను కూడా పీపీపీ ద్వారానే నిర్మిస్తున్నారని, మరి అవి ప్రైవేటు వ్యక్తులవి అయిపోతాయా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కూడా పీపీపీ కింద ప్రాజెక్టులు చేపడుతోందని, విమర్శలు చేస్తే భయపడేది లేదన్నారు.

సచివాలయాల ఉద్యోగుల పనితీరుపై సమీక్ష

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల పనితీరును సమీక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పాలనా యంత్రాంగం రోజువారీ విధులకు హాజరు కావాల్సిందేనని, నిర్లక్ష్యం చేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ఉద్యోగులను నియమించి 100 శాతం నిర్వహణ వ్యయం పెంచేసిందని విమర్శించారు.

ఆహా..! అలవోకగా అబద్ధాలు

సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామంటూ కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ప్రకటించడంపై అధికార యంత్రాంగంలో తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. సూపర్ సిక్స్‌లో ప్రధాన హామీలైన నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, లేదంటే నెలకు రూ.3,000 చొప్పున భృతి, ఆడబిడ్డ నిధి కింద మహిళలకు ఏటా రూ.18,000 హామీలను నెరవేర్చకుండానే సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామంటూ సీఎం చెప్పడం పట్ల కలెక్టర్లు కంగుతిన్నారు. ఇక 1వతేదీ సెలవు వస్తే ముందు రోజే ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు ఇస్తున్నట్లు చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో చెప్పారు. అయితే ఒక్క నెల మినహా ఏనాడూ 1వతేదీన జీతాలు ఇచ్చిన పాపాన పోలేదని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి.

సచివాలయాలు ఇక 'స్వర్ణ గ్రామం'

- గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పనితీరు మార్చుకోకుంటే తీవ్ర చర్యలు: సీఎం చంద్రబాబు హెచ్చరిక

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాలను విజన్ యూనిట్లుగా తీర్చిదిద్దుతూ మరింత సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు వాటి పేరును 'స్వర్ణ గ్రామం'గా మారుస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బుధవారం కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పనితీరు బాగుండటం లేదని, హాజరు 74 శాతం దాటడం లేదని, పనితీరు మార్చుకోకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమంటూ హెచ్చరించారు. వాట్సాప్ సేవల్లో సెక్యూరిటీ ఉండదని వినియోగించుకోవడానికి వెనుకాడుతున్నారని, మరికొంతమంది స్మార్ట్ ఫోన్ లేదని, ఎలా వినియోగించుకోవాలో అర్థం కావడం లేదంటున్నారని, అలాంటి వారికి అవగాహన కల్పించడం ద్వారా వాట్సాప్ సేవలను విరివిగా వాడుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

- మారుమూల ప్రాంతాల్లో బ్యాండ్‌విడ్త్ కనెక్టివిటీ త్వరితగతిన పూర్తి చేసి 4 జీ టవర్ల ఏర్పాటుకు కలెక్టర్లు సహకరించాల్సిందిగా సీఎం సూచించారు. జిల్లాల్లో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి ఫైలు ఇకపై ఈ–ఫైల్‌గానే నిర్వహించాలని, జనవరి 15వతేదీ తర్వాత ప్రజలకు అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందించే విధంగా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిసారి సర్టిఫికెట్ల కోసం ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీకి సంబంధించి ఇప్పటికే రూ.2,847 కోట్ల పెట్టుబడులకు 29 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. రాష్ట్రంలో ఏటా 5 వేల మందికి క్వాంటం టెక్నాలజీలో శిక్షణ ఇవ్వాలన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 538కిపైగా ఎంవోయూలు గ్రౌండ్ అయ్యే విధంగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, లాజిస్టిక్స్ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులకు నెల రోజుల్లోగా శంకుస్థాపనకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రాలపై భారం మోపి..
'ఉపాధి'ని ఎత్తేసే కుట్ర

▶ మొదటి పేజీ తరువాయి

భారం మోపడం దారుణం. ఇది సమాఖ్య స్ఫూర్తికే విఘాతం. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలను మరింత సంక్షోభంలోకి నెట్టేయడమే. మరీ ముఖ్యంగా.. రాష్ట్రాలు తమ వాటా 40 శాతం నిధులను ముందుగా జమచేస్తేనే, కేంద్రం తన వాటా నిధులను విడుదల చేస్తుందన్న నిబంధన పెట్టడం పూర్తిగా అసంబద్ధం. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత పెద్ద మొత్తాన్ని ముందుగా ఎలా సర్దుబాటు చేస్తాయి? ఈ నిబంధన ఆచరణ సాధ్యం కాదు. ఇది పథకాన్ని నిర్వీర్యం చేయడమే. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్లలో సగటున రూ.8 వేలకోట్లు ఉపాధి హామీ కోసం ఖర్చు చేశారు. కొత్త నిబంధన అమలైతే రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.3,200 కోట్లు భరించాల్సి వస్తుంది. ఇంతటి భారీ భారాన్ని రాష్ట్రం మోయలేదు.

పనిదినాల పెంపు ఆచరణ సాధ్యం కాదు

'మరోవైపు పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచామని కేంద్రం గొప్పగా చెప్పుకొంటున్నా.. అది ఆచరణలో సాధ్యం కాదు. రాష్ట్రాలు తమ వాటా నిధులను కట్టలేకపోతే, కేంద్రం నిధులు ఆగిపోతాయి. అప్పుడు ఈ పెంచిన పనిదినాల వల్ల పేదలకు ఒరిగేదేమీ ఉండదు. ఇది కేవలం కంటితుడుపు చర్యగానే మిగిలిపోతుంది' అని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను గమనించకుండా, ఏకపక్షంగా రూపొందించిన ఈ బిల్లును వెంటనే జాయింట్ పార్లమెంటరీ కమిటీ లేదా సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ఇతర వాటాదారులతో విస్తృత చర్చలు జరిపిన తర్వాతే, పేదల ప్రయోజనాలు కాపాడేలా మార్పులు చేయాలని అవినాశ్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

రఘురామను అన్ని పదవుల నుంచి తొలగించాలి

- అప్పుడే సీబీఐ సక్రమ దర్యాప్తు సాధ్యం.. అదే సమన్యాయం
- సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్
- సునీల్‌తో ఏకీభవించిన 91 శాతం మంది నెటిజన్లు


PV Sunil Kumar @PV_Sunil... · 11h
దర్యాప్తు సక్రమంగా జరగడం కోసం నన్ను సస్పెండ్ చేశారు. మంచిదే . మరి సమ న్యాయం కోసం రఘురామకృష్ణరాజు గారిని కూడా అన్ని పదవులనుండి సస్పెండ్ చేయాలి కదా CBI దర్యాప్తు సక్రమంగా జరగడానికి ఆయనను పదవుల నుండి తొలగించాలి. చట్టం అందరికీ సమానం అనే మెసేజ్ వెళ్ళాలి

ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాలలో సునీల్‌కుమార్ పోస్ట్

సాక్షి, అమరావతి: బ్యాంకులను మోసం చేసిన కేసులో సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును అన్ని రాజ్యాంగబద్ధ, రాజకీయ పదవుల నుంచి తొలగించాలని సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. సీబీఐ దర్యాప్తు సక్రమంగా జరగాలంటే ఆయన రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉండకూడదన్నారు. సుప్రీంకోర్టు తోసిపుచ్చినప్పటికీ తనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కోసమని ఐపీఎస్ అధికారి అయిన తనను సస్పెండ్ చేసిన విషయాన్ని పీవీ సునీల్ కుమార్ గుర్తు చేశారు. మరి బ్యాంకులను మోసం చేసిన కేసులో రఘురామకృష్ణరాజును విచారించాలని సుప్రీంకోర్టే ఆదేశించింది కదా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సక్రమ దర్యాప్తు కోసం రఘురామకృష్ణ రాజును అన్ని పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అప్పుడే సమన్యాయం పాటించినట్టు అవుతుందని కూడా వ్యాఖ్యానించారు. ఈమేరకు ఆయన ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాలలో బుధవారం పోస్ట్ చేశారు. సీబీఐ సక్రమ దర్యాప్తు కోసం రఘురామకృష్ణరాజును అన్ని పదవుల నుంచి తొలగించాల్సిన అవసరం ఉందా లేదా అనే అంశంపై సోషల్ మీడియాలో ఓ వెబ్‌సైట్ నిర్వహించిన ఓటింగ్‌నూ ఆయన పోస్టు చేశారు. రఘురామకృష్ణ రాజును అన్ని పదవుల నుంచి తొలగించాలని ఏకంగా 91శాతం మంది ఆ ఓటింగ్‌లో అభిప్రాయపడటం గమనార్హం.

లోక్ అదాలత్‌లో రికార్డు

ఒక్క రోజే 3.11 లక్షల కేసులు పరిష్కారం

జస్టిస్ మానవేంద్రనాథ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో కేసులు పరిష్కారమయ్యాయి. ఒక్కరోజే 3,11,230 కేసులు పరిష్కారమవ్వగా.. రూ.400 కోట్లకు పైగా పరిహారాన్ని అందజేశారు. రాష్ట్రంలో లోక్ అదాలత్ నిర్వహించడం మొదలైన తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం కావడం ఇదే తొలిసారి. ఈ మేరకు న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సత్య హిమబిందు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ మార్గదర్శనంలో ఈ లోక్ అదాలత్ జరిగినట్లు తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం కావడంపై జస్టిస్ రాయ్ హర్షం వ్యక్తం చేశారు. లోక్ అదాలత్‌లో పాల్గొన్న అధికారులను ఆయన అభినందించారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కేసులు పరిష్కరించుకోవడం మంచి పరిణామమన్నారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వెనుక
చంద్రబాబు రూ.లక్ష కోట్ల దోపిడీ

కుడిచేత్తో కాలేజీలిచ్చి.. ఎడమ చేత్తో కమీషన్ల వసూలు

- కోటిసంతకాల ఉద్యమానికి ప్రజాస్పందన వెల్లువ
- మా ప్రభుత్వం వచ్చాక విచారణ జరిపించి దోపిడీదారులపై చర్యలు తీసుకుంటాం
- మీడియా సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు గుడివాడ అమర్నాథ్, గోరంట్ల మాధవ్, మొండితోక అరుణ్‌కుమార్

గుడివాడ అమర్నాథ్

గోరంట్ల మాధవ్

అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో సీఎం చంద్రబాబు రూ.లక్షకోట్ల దోపిడీకి పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన కాలేజీలు, ఆస్పత్రులతోపాటు ఆయా ఆస్పత్రుల పరిధిలో ఉన్న రూ.వందల కోట్ల విలువైన భూములను కాజేయాలన్న కుట్రతోనే చంద్రబాబు ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ప్రైవేటువారికి అప్పగించే ఈ వైద్యకళాశాలల సిబ్బందికి జీతాల పేరుతో ఇస్తామంటున్న రూ.వందలకోట్లను కూడా దోచుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్కెచ్ వేశారని విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వేర్వేరుగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశాల్లో మాజీమంత్రి, ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడారు. సంపద సృష్టిస్తానని అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరలో రూ.2.66 లక్షల కోట్ల అప్పుచేసిన చంద్రబాబు మరోవైపు మెడికల్ కాలేజీల రూపంలో వైఎస్ జగన్ సృష్టించిన వేలకోట్ల విలువైన సంపదను ప్రైవేటువారికి ధారాదత్తం చేస్తున్నాడని చెప్పారు. 'ప్రజావైద్య రంగాన్ని బలోపేతం చేసి పేదలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడు కాలేజీలను పూర్తిచేశారు. ఐదు కాలేజీల్లో క్లాసులు కూడా ప్రారంభించారు. అత్యాధునిక వసతులతో ఒక్కో మెడికల్ కాలేజీని 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. మెడికల్ కాలేజీల రూపంలో ప్రభుత్వానికి రూ.వేల కోట్ల విలువైన సంపద సృష్టిస్తే.. ప్రైవేటీకరణ పేరుతో చంద్రబాబు దాన్ని తన బినామీలకు ధారాదత్తం చేసే కుట్రలకు తెరలేపాడు. ఇది చాలదన్నట్టు ఆయా కాలేజీల్లో పనిచేసే స్టాఫ్‌కి రెండేళ్లపాటు జీతాలు చెల్లించే పేరుతో ప్రజాసంపదను దోచిపెడుతున్నాడు. కుడిచేత్తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకి రాసిచ్చి రూ.వందల కోట్లను ఎడమ చేత్తో వారినుంచి లాక్కుంటున్నాడు. తన దోపిడీ కుట్రలను యథేచ్ఛగా అమలు చేయడానికి నిస్సిగ్గుగా పార్లమెంట్ స్థాయీసంఘం నివేదికను కూడా వక్రీకరించేస్తున్నాడు. కిక్ బ్యాక్‌ల కోసం ఎంతకైనా దిగజారుతానని చెప్పకనే చెబుతున్నాడు.

చంద్రబాబుపై ప్రజల్లో వ్యతిరేకతకు అదే నిదర్శనం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ మా పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి విశేష స్పందన వచ్చింది. చంద్రబాబు తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని వర్గాల ప్రజలు ముందుకొచ్చి కోటిసంతకాల ఉద్యమంలో పాల్గొన్నారు. పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేయాలన్న చంద్రబాబు కుట్రలను రాష్ట్ర యువత, మేధావులు, విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చంద్రబాబు పుట్టిన నారావారిపల్లెలో కూడా సగం మందికిపైగా ప్రైవేటీకరణను నిరసిస్తూ సంతకాలు చేశారంటే ఆయనపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత వ్యక్తమవుతోందో అర్థం చేసుకోవచ్చు. మళ్లీ అధికారంలోకి రాలేమని గ్రహించే చంద్రబాబు దర్జాగా దోపిడీకి బాటలు వేసుకుంటున్నాడు..' అని పేర్కొన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణపై విచారణ జరిపిస్తామని, దోపిడీదారుల్ని వదిలే ప్రసక్తేలేదని చెప్పారు. మెడికల్ కాలేజీలపై పీపీపీ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు తమ పార్టీ వెనక్కి తగ్గబోదని వారు స్పష్టం చేశారు.

బాలుడిని చితకబాది బాలికపై అత్యాచారం

రాజమహేంద్రవరం ఎస్పీ బంగ్లా ఎదురుగా ఘటన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో ఎస్పీ బంగ్లా ఎదురుగా ఉన్న సెంట్రల్ జైలు పార్కు వద్ద బాలుడిని చితకబాది, బాలికను ఎత్తుకుపోయిన దుండగులు లైంగిక దాడికి ఒడిగట్టారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొవ్వూరులో ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలికకు అదే ప్రాంతానికి చెందిన బాలుడితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆ బాలిక 10 రోజుల నుంచి స్థానిక రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌కు వచ్చి అక్కడే ఉంటోంది. ఈ నెల 15న ఆ బాలుడు రాజమహేంద్రవరం రావడంతో ఆ రాత్రి బాలిక, బాలుడు ఎస్పీ బంగ్లాకు ఎదురుగా ఉన్న సెంట్రల్ జైలు పార్కులో కలిశారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత మద్యం మత్తులో ఉన్న క్వారీ ప్రాంతానికి చెందిన పెద గంజా, మరో వ్యక్తి అక్కడకు వచ్చారు. బాలుడిని చితకబాదిన తర్వాత పెద గంజా అనే వ్యక్తి బాలికను క్వారీ ప్రాంతంలోని తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేసి వదిలేశాడు. ఆమె 16వ తేదీన తెల్లవారుజామున 3 గంటల సమయానికి ఈట్ స్ట్రీట్‌కు చేరుకుని విషయాన్ని బాలుడికి ఫోన్‌లో చెప్పింది. అనంతరం ఆ బాలుడు వచ్చి 112కు ఫోన్ చేసి విషయం తెలియజేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పెద గంజాతోపాటు బాలుడిని ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలికపై అత్యాచారం చేసిన పెద గంజాపై పలు చోరీ కేసులున్నాయి. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినప్పటికీ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

అక్కడ మ్యారేజ్.. ఇక్కడ నిఖా!

- 1999లో ఆస్ట్రేలియాలో యూరోపియన్ మహిళతో సాజిద్ అక్రమ్ వివాహం
- ఆపై ఆమెతో హైదరాబాద్ వచ్చి మత సంప్రదాయం ప్రకారం నిఖా

సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియాలోని బాండీ బీచ్‌లో యూదులపై కాల్పులు జరిపిన ఐసిస్ ఉగ్రవాది, హైదరాబాదీ సాజిద్ అక్రమ్ రెండుసార్లు వివాహం చేసుకున్నట్టు వెలుగులోకి వచ్చింది. 1998 నవంబర్‌లో స్టూడెంట్ వీసాతో ఆస్ట్రేలియా వెళ్లిన సాజిద్ 1999లో యూరోపియన్ మహిళ వెనెరా గ్రోసోని వివాహం చేసుకున్నాడు. తొలుత అక్కడ అమలులో ఉన్న సాధారణ పద్ధతిలో పెళ్లి చేసుకున్న ఈ జంట 2000 సంవత్సరంలో హైదరాబాద్ వచ్చారు. ఇక్కడ సాజిద్ తల్లిదండ్రుల సమక్షంలో మరోసారి నిఖా జరిగింది. వీరికి 2001 ఆగస్టు 12న నవీద్ జన్మించగా.. అతడి 15వ ఏట తండ్రితో కలిసి హైదరాబాద్ వచ్చాడు. అప్పట్లో కొద్దిరోజులు టోలిచౌకీలో ఉండి దూద్‌బౌలీలో కొన్ని స్థిరాస్తుల్ని విక్రయించి వెళ్లినట్లు తెలిసింది. ఉగ్రవాద బాటపట్టిన సాజిద్, నవీద్ భవిష్యత్తులో ఎదుర్కోబోయే పరిణామాలను ముందే ఊహించి ఉంటారని నిఘా వర్గాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో సాజిద్ ఆస్తిపాస్తుల్లో తనకు ఉన్న వాటాలను గత ఏడాది ఫిబ్రవరిలోనే వెనెరాకు బదిలీ చేసినట్టు తెలుస్తోంది. నవీద్ 2019లో సిడ్నీలోని అల్–మురాద్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి అరబిక్ నేర్చుకున్నాడు. అక్కడే ఇతడికి పరిచయమైన వారి ద్వారా ఐసిస్‌లో చేరాడా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీళ్లు ఫిలిప్పీన్స్‌లో ఉన్న మిండానావో ఐలాండ్‌లోని ఐసిస్ శిబిరంలో శిక్షణ తీసుకున్నట్లు ఆస్ట్రేలియా పోలీసులు అనుమానిస్తున్నారు.

నవీద్‌పై నేరాభియోగాల నమోదు

ఫిలిప్పీన్స్ నుంచి వచ్చినప్పటి నుంచి గత ఆదివారం వరకు వీరి కదలికలను పూర్తిస్థాయిలో తెలుసుకోవడానికి ఆస్ట్రేలియన్ ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయి. ఆదివారం ఉదయం వీళ్లు దాదాపు 20 కిమీ ప్రయాణించి బీచ్ వద్దకు చేరుకున్నట్లు ఆధారాలు సేకరించారు. బాండీ బీచ్ మారణహోమంలో పాల్గొన్న ఇరువురిలో సాజిద్ పోలీసుల కాల్పుల్లో చనిపోగా, నవీద్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతడిపై న్యూ సౌత్ వేల్స్ పరిధిలోని బాండీ బీచ్ పోలీసులు మొత్తం 59 నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు మోపారు. వీటిలో 15 హత్యలు, ఒక ఉగ్రవాద చర్యకు సంబంధించినవీ ఉన్నాయి. సాజిద్, నవీద్‌లు వినియోగించిన కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాజిద్ వినియోగించిన కారులో ఆరు తుపాకులు, రెండు ఐసిస్ జెండాలను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ స్పష్టం చేసింది. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లి రఘురామిరెడ్డి, సభ్యులు కైలే అనిల్ కుమార్, రెడ్డి శాంతి బుధవారం సమావేశం నిర్వహించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై అందిన ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం పరిశీలనలో తేలిన అంశాలతో నివేదికను పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమర్పించారు.

'సింహాచలం' భూములు ఎవరికీ ఇవ్వొద్దు

- విశ్వహిందూ పరిషత్ డిమాండ్
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు లేఖ

మహారాణిపేట (విశాఖపట్నం): రాష్ట్రాభివృద్ధికి విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) వ్యతిరేకం కాదని.. అయితే అభివృద్ధి పేరుతో ఆలయ భూములను పంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వీహెచ్‌పీ విశాఖ మహానగర అధ్యక్షుడు ఆచార్య కందర్ప విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు జిల్లా కలెక్టర్ ద్వారా ఆయన లేఖ రాశారు. ముడసర్లోవ పార్కు ఎదురుగా జైలు పక్కనున్న సింహాచలం దేవాలయానికి చెందిన సుమారు 150 ఎకరాల భూమిని అభివృద్ధి పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ సంస్థకు కేటాయిస్తూ జీఓ విడుదల చేయడం అభ్యంతరకరమని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆలయ భూముల కేటాయింపును వీహెచ్‌పీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, అందుకు సంబంధించిన జీఓను వెంటనే రద్దుచేయాలని విశ్వనాథ్ డిమాండ్ చేశారు. వివిధ రాష్ట్రాల హైకోర్టులు సహా సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో దేవాలయాల ఆస్తులు వాటి అభివృద్ధికి తప్ప ఇతర అవసరాలకు వాడకూడదని అనేక తీర్పులు ఇచ్చాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో.. దేవాలయాల భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని 'హైందవ శంఖారావం' తీర్మానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని వీహెచ్‌పీ కోరుతోందని ఆచార్య కందర్ప విశ్వనాథ్ తెలిపారు.

నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం రాత్రి ఢిల్లీ వెళ్తున్నారు. శుక్రవారం జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీలతో విడివిడిగా భేటీ కానున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కూడా కలిసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

రేపట్నుంచి పీఎస్సీల జాతీయ సదస్సు

తొలిరోజు సదస్సుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల (పీఎస్సీ) జాతీయ సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్ వేదికగా రెండ్రోజుల పాటు పీఎస్సీల జాతీయ సదస్సు జరగనుంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు కొనసాగనుంది. తొలిరోజు సదస్సుకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. పీఎస్సీల సదస్సు ముగింపు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరు కానున్నారు. ఈ సదస్సులో ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు.

శిల్పాశెట్టి పబ్‌పై ఐటీ దాడులు

దొడ్డబళ్లాపురం(బెంగళూరు): బెంగళూరులో ప్రముఖ నటి శిల్పాశెట్టికి చెందిన బ్యాస్టియన్ పబ్‌పై ఐటీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. చర్చి స్ట్రీట్‌లోని ఖరీదైన పబ్‌లలో ఇది ఒకటి. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా పబ్ నడుపుతుండడంతో ఇటీవల బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఐటీ అధికారులు పబ్‌పై దాడులు చేసి రికార్డులను పరిశీలించారు. శిల్పాశెట్టి, ఆమె భర్తపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయి. తాజాగా ఐటీ అధికారుల దాడులు చేయడం చర్చనీయాంశంగా మారింది.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

బొల్లయ్య (ఫైల్)

ఫిరంగిపురం: అప్పుల బాధతో కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లా గొల్లపాలెంలో బుధవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎం.బొల్లయ్య రెండు ఎకరాల్లో మిర్చి, 9 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. పంటలు సరిగా పండకపోవడంతోపాటు ప్రభుత్వం నుంచి కూడా మద్దతు ధర లభించలేదు. దీంతో లక్షలాది రూపాయలు అప్పులపాలయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన బొల్లయ్య పురుగుల మందు తాగి పడిపోయాడు. పొలం పనులకు వచ్చిన వారి ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే బొల్లయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. వీఆర్వో శ్రీనివాసరావు వివరాలు సేకరించారు.

"మనం ఎలా జీవించామన్నది కాదు, ఇతరుల జీవితాల్లో మనం ఎలాంటి మార్పును తీసుకొచ్చాం అన్నదే మన జీవితపు ప్రాముఖ్యాన్ని నిర్ణయిస్తుంది.
– నెల్సన్ మండేలా

సాక్షి
గురువారం, 18 డిసెంబర్ 2025

మళ్లీ కాటేసిన ఉగ్రవాదం

ప్రశాంతంగా ఉన్నంతకాలమూ అంతా సవ్యంగా ఉందనుకోవటమే తప్ప ఉగ్రవాదం తీవ్రత ఎక్కడా తగ్గలేదని గత ఆదివారం ఆస్ట్రేలియాలోని సిడ్నీ బోండీ బీచ్‌లో చోటు చేసుకున్న ఉదంతం తెలియజేస్తోంది. హన్నూక సంబరాల్లో మునిగిన యూదు సమూహంపై తండ్రీకొడుకులిద్దరు తుపాకులతో దాడి చేసి 15 మందిని కాల్చిచంపటం, 40 మందిని గాయపర్చటం గమనిస్తే నిరంతర అప్రమత్తత ఎంత అవసరమో అర్థమవుతుంది. ప్రతిచోటా భద్రత కల్పించటం ప్రభుత్వాలకు సాధ్యం కాకపోవచ్చు. అందుకే వర్తమాన పరిస్థితుల్లో ఎవరికి వారు తమ చుట్టుపక్కల ఏం జరుగుతున్నదో అనునిత్యం గమనించుకోవడం తప్పనిసరి. తుపాకీ చట్టాలు ఎంతో కఠినంగా ఉండే ఆస్ట్రేలియాలో ఈ మాదిరి ఘటన జరిగి మూడు దశాబ్దాలవుతోంది. 1996లో పోర్ట్ ఆర్థర్‌లో ఒక దుండగుడు జరిపిన కాల్పుల్లో 35 మంది మరణించారు. గత రెండేళ్లలో యూదులకు వ్యతిరేకంగా దాదాపు 2,000 ఘటనలు జరిగినట్టు పోలీసు నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుత ఉదంతం కూడా దానికి కొనసాగింపే! ఇలాంటి నేపథ్యంలో నిఘా మరింత పకడ్బందీగా ఉంటే బాగుండేది. ఉన్మాదులు హఠాత్తుగా ఎక్కడైనా దాడులకు తెగబడొచ్చని ఇది రుజువుచేస్తోంది.

ఆస్ట్రేలియా భిన్న జాతుల నిలయం. చాలా దేశాలతో పోలిస్తే అది స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు పెట్టింది పేరు. దేశ జనాభాలో యూదుల శాతం 0.4 శాతం. అంకెల్లో చెప్పుకోవాలంటే అది 1,17,000. అందులో చాలా కుటుంబాలు నాజీ జర్మనీలో హిట్లర్ ఉన్మాదాన్ని అధిగమించి అదృష్టవశాత్తూ బతికి బయటపడినవారివే. ఇజ్రాయెల్ పాలకులు గాజాపై రెండేళ్లపాటు ఎడతెగకుండా సాగించిన హంతకదాడుల్లో వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఇప్పటికీ ఆ దాడులు ఆగింది లేదు. దాన్ని ప్రపంచ దేశాల ప్రజలంతా నిరసించారు. అందులో యూదులు కూడా ఉన్నారు. ఆస్ట్రేలియా సైతం తీవ్రంగా ఖండించింది. అంతేకాదు, మొన్న ఆగస్టులో పాలస్తీనాను గుర్తించింది. ఆస్ట్రేలియాలో ఉంటున్న యూదులంతా ఇజ్రాయెల్ దుండగాన్ని సమర్థించారని కూడా చెప్పలేం. ఉగ్రవాద సంస్థ హమాస్ సాగించిన హత్యాకాండకు ఇజ్రాయెల్ ప్రతీకారం తీర్చుకోవటం సబబేనని భావించేవారు ఉంటే ఉండొచ్చు. అలాంటి వారిని సైతం ఒప్పించేలా, మార్చగలిగేలా ఉద్యమాలు నిర్మించాలి తప్ప సంబంధం లేని అమాయక పౌరుల్ని చంపి ఇలాంటి ఉన్మాదులు ఏం సాధిస్తారు?

ఇప్పుడు దాడికి పాల్పడిన తండ్రీకొడుకులకు గాజా ఉదంతం సాకు మాత్రమే. హైదరాబాద్ పాతబస్తీ నుంచి 27 ఏళ్ల క్రితం సాజిద్ అక్రం వలసపోగా, ఆరేళ్లక్రితమే అతని కుమారుడు నవీద్ ఫిలిప్పీన్స్‌లోని ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)తో సంబంధాలు పెట్టుకున్నాడని, అప్పటినుంచి వారిద్దరికీ ఉన్మాదం తలకెక్కిందని అంటున్నారు. గత నెలలో వారిద్దరూ ఫిలిప్పీన్స్ వెళ్లి సైనిక శిక్షణ తీసుకున్నారని పోలీసుల కథనం. ఆర్నెల్లక్రితం కొడుకుపై అనుమానం వచ్చి నిఘా సంస్థ అధికారులు ప్రశ్నించారట కూడా! కొడుకు పేరుతో రిజిస్టరైన వాహనంలో పేలుడు పదార్థాలు, ఐఎస్ పతాకాలు ఉన్నట్టు పోలీసు సోదాలో బయటపడింది. ఉదంతం జరిగిన రోజే తండ్రిని పోలీసు బలగం కాల్చిచంపగా, కొడుకు సాజిద్‌ను సమీపంలోనే ఉన్న చిరువ్యాపారి అహ్మద్ అల్–అహ్మద్ చాకచక్యంగా పట్టుకోగలిగాడు. మృత్యువుకు ఎదురొడ్డి అతను చేసిన సాహస కార్యం వల్ల అనేకమంది ప్రాణాలు నిలబడ్డాయి. కానీ అహ్మద్ తీవ్రంగా గాయపడ్డాడు.

ఈ ఉదంతంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ విచిత్రంగా స్పందించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ విధానాలు యూదు వ్యతిరేకతను ప్రోత్సహించేవిగా ఉన్నందువల్లే ఈ ఉదంతం జరిగిందని వ్యాఖ్యానించారు. పాలస్తీనా రాజ్యం ఏర్పడాలని కాంక్షించటం యూదు వ్యతిరేక చర్య ఎలా అవుతుందో నెతన్యాహూకే తెలియాలి. హమాస్ ఉగ్రవాదులు 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్ భూభాగంలోకి చొరబడి 1,195 మంది ఆ దేశ పౌరుల్ని, విదేశీయులు కొందరిని చంపేశారు. 251మందిని బందీలుగా తీసుకెళ్లారు. ఆ విషయంలో ప్రభుత్వ భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చటానికి నెతన్యాహూ గాజాపై విరుచుకుపడ్డారు. ఇప్పుడాయన ఆల్బనీస్‌ను తప్పుపట్టేందుకు సిద్ధపడ్డారు! ఏదేమైనా ఆస్ట్రేలియా ఉదంతం ప్రపంచ దేశాల కళ్లు తెరిపించాలి. అత్యంత అప్రమత్తంగా ఉండకపోతే ఉగ్రవాద భూతం ఎక్కడైనా విరుచుకుపడొచ్చని తెలుసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.చతుర్దశి తె.4.24 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి అమావాస్య, **నక్షత్రం:** అనూరాధ రా.8.21 వరకు తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.2.33 నుండి 4.19 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.06 నుండి 10.50 వరకు, తదుపరి ప.2.29 నుండి 3.13 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.46 నుండి 10.35 వరకు,

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం: 5.25
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

చదువు

నేను పోరాడవలసిన యుద్ధాల కోసం నేను చదువుకోవాలి; నా నిశ్శబ్దాన్ని ఛేదించుకోడానికి నేను చదువుకోవాలి; పితృస్వామ్య వ్యవస్థను సవాలు చేయడానికి నేను చదువుకోవాలి; మహిళా ప్రపంచాన్ని సృష్టించడానికి నేను చదువుకోవాలి; అన్నిటికీ ఆయుధం... చదువే!

– కమలాపంథ్, మహిళా హక్కుల కార్యకర్త

మనోబలం

మీరు ఎదురు దెబ్బలు తిన్నప్పుడు – గుర్తుంచుకోండి – తిరిగి పుంజుకోవాలనే దృఢ సంకల్పం మీలో పెరగాలి. వైఫల్యాలను మర్చిపోయి సాధన చేయండి, నేర్చుకోండి, మెరుగుపడండి! మానసికంగా దృఢంగా ఉంటే ఏ సవాలునైనా ఎదుర్కొని, నిలబడవచ్చు.

– లాల్‌చంద్ రాజ్‌పుత్, మాజీ క్రికెట్ కోచ్

విమర్శ

జీవితం ఒడుదొడుకులతో, విమర్శకులతో నిండి ఉంటుంది. కొన్నిసార్లు ప్రపంచం మొత్తం మీకు వ్యతిరేకంగా ఉన్నట్లు అనిపిస్తుంది. మీరు ఎవర్నీ, ఏ విమర్శనూ పట్టించుకోకండి. మీరు వినవలసిన ముఖ్యమైన స్వరం మీ హృదయానిది! దానిని అనుసరించి ముందుకు సాగండి!!

– నీనా వాడియా, బ్రిటిష్ సినీ నటి

నైపుణ్యాలు

శుభవార్త ఏమిటంటే, టెక్నాలజీ ద్వారా గొప్ప అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. మనం దరం నేర్చుకోవడం మాని, నైపుణ్యాలను పెంచుకోవాలి. నైపుణ్యాలను పెంచుకోకుండా, ఊరికే నేర్చుకుంటూ పోతే త్వరలోనే పనికి రానివాళ్లమై పోతాము.

– బర్ఖాదత్, టెలివిజన్ జర్నలిస్ట్

నా వాళ్లు

నాకన్నా కూడా ఎక్కువగా, నేను నా తదుపరి విజయాన్ని సాధించాలని కోరుకునేవాళ్లు నా కుటుంబం, నా స్నేహితులు! వారంతా నా కష్టాల్లో, వైఫల్యాలలో, నిరాశా నిస్పృహల్లో నా వెంటే ఉన్నారు. నన్ను ప్రోత్సహించారు. ఇంత కంటే మంచి ప్రేరణ ఇంకేముంటుంది?

– దవీందర్ సింగ్ కాంగ్, జావెలిన్ అథ్లెట్

అభ్యాసం



మీరు అభ్యాసానికి ఎంత ఎక్కువ ఇస్తే, అంత ఎక్కువగా అది మీకు తిరిగి ఇస్తుంది. ఇది మీరు గడిపే గంటల సంఖ్య గురించి కాదు, ఆ గంటల నాణ్యత గురించి; ఇది కేవలం అడుగుల గురించి కాదు, హృదయ లయల గురించి కూడా!

– శాశ్వత్ జోషీ, ఒడిస్సీ నృత్య కళాకారుడు

దీపం వివాదం ఓట్లు తెచ్చేనా?

విశ్లేషణ

రాధికా రామశేషన్

బిహార్‌లో ఇటీవల ఘన విజయం సాధించిన బీజేపీ, 2026 ఏప్రిల్–మే నెలల్లో అసెంబ్లీ ఎన్నికలకు వెళుతున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో పెను సవాళ్ళనే ఎదుర్కొంటోంది. ప్రాంతీయ పార్టీలు ఆధిపత్యం వహిస్తున్న ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాన పార్టీల ప్రాభవం కనిపించదు. తమిళనాడులో ద్రావిడ మున్నేట్ర కళగం (డీఎంకే), పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఈసారి కూడా తమ సత్తా చాటవచ్చని భావిస్తున్నారు.

తమిళనాట డీఎంకేతో సర్దుబాటు చేసుకుని, సంతృప్తి చెందేందుకే కాంగ్రెస్ సిద్ధమైనట్లు కనిపిస్తోంది. కానీ, బెంగాల్‌లో దానికి ఆ మాత్రం ఊతం కూడా లభించడం లేదు. అందులోనూ బిహార్‌లో ఘోర పరాజయం చవిచూసిన కాంగ్రెస్‌ను తోడు తీసుకెళ్ళేందుకు ఎవరూ సుముఖత చూపడం లేదు. మరోపక్క బీజేపీ ఈ రెండు రాష్ట్రాల్లోనూ సమరానికి సై అంటోంది.

ఒంటరిగానే సై!

అయితే, బెంగాల్‌లో 2019 పార్లమెంటరీ ఎన్నికల్లో సాధించిన అద్భుత ఫలితాలతో, ఇక ఆ తూర్పు రాష్ట్రాన్ని 'జయించడం' తనకు చిటికెలో పనిగా బీజేపీ భావించింది. తీరా, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భంగపాటు ఎదురైంది. మొత్తం 294 స్థానాల్లో 200 కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకోగా, 77 సీట్లతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. కానీ, పోలైన ఓట్లలో 38 శాతం గడించి, ముఖ్య ప్రతిపక్షంగా అవతరించినందుకు కొంత సంతృప్తి చెందింది.

ఈ గణాంకాలు అంత ప్రోత్సాహకరంగా లేకపోయినా, బిహార్‌లో విజయఢంకా మోగించాక ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, ''గంగా నది బిహార్ నుంచి బెంగాల్‌లోకి ప్రవహిస్తుంది'' అని ప్రకటించారు. అది ఏదో ప్రాసంగికంగా దొర్లిన విషయంలా లేదు. బెంగాల్ విపుల ప్రణాళికపై కార్యాచరణకు హోమ్ మంత్రి అమిత్ షా అప్పటికే ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ వ్యూహరచనలో హిందూత్వమే ఇప్పటికీ అగ్ర భాగాన ఉంది. కానీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడుల్లో అది ఆశించినంత ఫలితాలు ఇవ్వలేదు.

దీప ప్రజ్వలన వివాదం

తిరుప్పరన్ కుండ్రంలో దీపం వెలిగించడానికి సంబంధించి ఇటీవల రేగిన వివాదం అంతర్లీనంగా ఆ అంశాన్నే ప్రతిబింబించింది. తమిళులు 'మురుగా!' అంటూ విపరీతంగా ఆరాధించే సుబ్రహ్మణ్య స్వామికి చెందిన ఆరు పవిత్ర క్షేత్రాలలో తిరుప్పరన్ కుండ్రం ఒకటి. అక్కడి ఆలయానికి కొద్ది మీటర్ల దూరంలోనే సుల్తాన్ సికందర్ ఔలియా దర్గా ఉంది. చెదురుమదురు ఘర్షణలను మినహాయిస్తే అక్కడ కార్తీక దీపోత్సవం శాంతియుతంగానే సాగిపోయింది. కాకపోతే, దర్గాకు కేవలం 15 మీటర్ల దూరంలో ఉన్న దీపత్తూన్‌గా పిలిచే ప్రాచీన స్తంభంపై దీపం వెలిగించేందుకు కోర్టు ఉత్తర్వు తెచ్చుకోవలసి వచ్చింది. దీపాన్ని వెలిగించే కార్యక్రమానికి అనుమతి కోరుతూ మద్రాసు హైకోర్టులోని మదురై ధర్మాసనం ముందు ఈసారి పిటిషన్ దాఖలైంది. కోర్టు దీపారాధనకు అనుమతించడంతో బీజేపీ, దాని మిత్రపక్షాలు సంబరం చేసుకున్నాయి. కానీ, జిల్లా పాలనా యంత్రాంగం వెంటనే నిషేధాజ్ఞలు జారీ చేయడంతో, పోలీసులు వాటిని అమలుపరచవలసి వచ్చింది.

◆ 2026 ఏప్రిల్–మే నెలల్లో అసెంబ్లీ ఎన్నికలకు వెళుతున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సంబంధించిన బీజేపీ వ్యూహరచనలో ఇప్పటికీ హిందూత్వమే అగ్ర భాగాన ఉంది. తిరుప్పరన్ కుండ్రంలో దీపం వివాదం అంతర్లీనంగా ఈ అంశాన్నే ప్రతిబింబిస్తోంది.

''ఆశించిన ఫలితం సాధించడానికి హిందువులలో చైతన్యాన్ని రేకెత్తిస్తే చాలు'' అని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్య అవసరమైతే ఘర్షణకు దిగవలసిందని పరోక్షంగా సూచించినట్లయింది. తమిళనాడు సాంస్కృతిక, మత సమ్మేళనాన్ని అర్థం చేసుకోవడంలో బీజేపీకి 'ప్రాథమికమైన లోపం' ఉందని కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడు కార్తీ చిదంబరం వ్యాఖ్యానించారు. ''తమిళనాడు ప్రజానీకానికి దైవభక్తి ఎక్కువ. కానీ, మతాన్ని రాజకీయాలతో మిళితం చేసి చూడరు'' అని ఆయన అన్నారు.

చిన్నాచితక ప్రాంతాల్లో తప్పించి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు తమిళ నాడులో పటిష్ఠమైన స్థానిక వ్యవస్థలు లేవు. అయినా, అవి దీపారా ధనపై వివాదాన్ని నిలకడగా కొనసాగించగలిగితే, ఓటర్ల మనసును కొంత వరకు పట్టుకోవచ్చు. కానీ, తమిళనాడు రాజకీయాలు చాలావరకు ద్రావిడ కళగం నాయకుడు పెరియార్ ఇ.వి. రామస్వామి సిద్ధాంతాలతో ప్రభావితమైనవి. ఆయన చేపట్టిన ఆత్మగౌరవ ఉద్యమంలో ముస్లింలను కూడా దళితులుగా చిత్రించడం ఒక కీలకమైన అంశం. హిందూయిజంలో అంతర్లీనంగా ఉన్న కుల అణచివేత నుంచి తప్పించుకునేందుకు దళితులు ఇస్లాంలోకి మారారన్నది ఆయన సిద్ధాంతాలలో ఒకటి.

ఓటుబ్యాంకుకు దెబ్బ

పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ వరుసగా మూడు విడతలుగా అధికారంలో ఉంది. ఆరోపణల తీవ్రతతో ఈసారి టీఎంసీ దుర్బలమైనదిగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విధేయులు పాల్పడినట్లుగా చెబుతున్న అవినీతి వాటిలో ప్రధానమైనది. అలాగే, కోల్‌కతాలో ఒక యువ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన దారుణ ఘటనపై ఆగ్రహావేశాలు వీధులకెక్కాయి. పాలక పార్టీకి చెందిన గూండాలు, దళారీలకు తృణమో పణమో చెల్లిస్తేనే పనులు అవుతాయనీ, రక్షణ లభిస్తుందనీ ప్రజలు చెబుతున్న దృష్టాంతాలున్నాయి. దాంతో, తాము వామపక్ష కూటమి పాలన నాటి రోజుల్లోకే తిరిగి వెళ్ళినట్లుందని వారు అంటున్నారు.

అయితే, అక్రమ వలసదారుల అంశాన్ని లేవనెత్తిన బీజేపీ ఒక రకంగా తానే చిక్కుల్లో పడింది. పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం వలసదారుల కన్నా హిందూ వలసదారుల సంఖ్యే ఎక్కువగా ఉందని డేటా సూచిస్తోంది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితాల సునిశిత సవరణ (సర్) బీజేపీ ఓటు బ్యాంకు లోపల కూడా ఆందోళనను రేకెత్తించింది. బెంగాలీ భాషను ఢిల్లీ పోలీసులు 'బంగ్లాదేశీ భాష'గా పేర్కొంటూ మరింత అపకీర్తిని తెచ్చిపెట్టారు.

హిందూ పూజారులకు నెలసరి జీతాలు చెల్లించడం, దుర్గా ఉత్సవాలను నిర్వహించడం వంటి చర్యల ద్వారా తనను 'హిందువుల ఆప్తురాలు'గా చిత్రించుకునేందుకు మమత గట్టిగానే కృషి చేస్తున్నారు. కానీ, హిందూత్వపై బీజేపీతో పోటీ పడటం ప్రతి పక్షాలకు ఇప్పటికీ కష్టమవుతోందని ఇతర రాష్ట్రాల్లోని అనుభవాలు వెల్లడిస్తున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాజకీయాలు బలమైన ప్రాంతీయ గుర్తింపుల చుట్టూ కేంద్రీకృతమై ఉన్నాయి. వాటిని ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చడానికి లేదు. అక్కడి ఓటర్లు హిందూత్వతో సునాయాసంగా మమేకమవుతారు. హిందూత్వ థీమ్‌లోకి భాష, సంస్కృతులను కూడా బీజేపీ ఈసారి అంతర్లీనం చేయ గలుగుతుందా? అన్నదే ప్రశ్న.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

బానిసత్వం రూపం మారిందా?!

టైమ్ మిషన్

అమెరికా అధ్యక్షుడు అబ్రహాం 'ఎమాన్సిపేషన్ ప్రొక్లమేషన్' జారీ చేస్తున్న దృశ్యం
(ఇన్‌సెట్‌లో) అమెరికన్ జైళ్ళలోని నల్లజాతి ఖైదీలు

మానవాళి చరిత్రలో బానిసత్వ వ్యవస్థ ఎప్పటికీ మాయని మచ్చే. ఆఫ్రికావాసులను బంధించి నౌకల్లో తరలించి పొలాలు, తదితర ఉత్పత్తి క్షేత్రాల్లో బానిసలుగా పనిచేయించుకుంది అమెరికా. దాదాపు 250 ఏళ్ల తరువాత అది తన 13వ రాజ్యాంగ సవరణ ద్వారా బానిస వ్యవస్థను రద్దు చేసింది. 1865 డిసెంబర్ 18 నుంచి ఆ సవరణ అమలులోకి వచ్చింది. అంత మాత్రాన బానిసత్వం నిజంగా అంతమైందా? లేక రూపం మార్చుకుని కొనసాగిందా?

అప్పట్లో నల్లజాతి బానిసలకు జీతం లేదు, హక్కులు లేవు. వారి జీవితాలు నరకప్రాయం అయ్యాయి. అయితే ఉత్తర రాష్ట్రాల్లో క్రమంగా బానిసత్వం తగ్గి పోయింది, కానీ దక్షిణాదిలో ఆర్థిక వ్యవస్థే దానిపై ఆధారపడేంతగా తయారయ్యింది. ఇంతలో దేశంలో ఉత్తర (యూనియన్) భాగానికీ, దక్షిణ (కాన్ఫెడరసీ) భాగానికీ మధ్య అంతర్యుద్ధం ప్రారంభమయ్యింది. ఈ పరిస్థితుల్లో దక్షిణాది రాష్ట్రాల్లో ప్రబలంగా ఉన్న బానిస వ్యవస్థలో మగ్గుతున్నవారిని దాని నుంచీ బయటపడేయడానికి 1863లో అధ్యక్షుడు అబ్రహం లింకన్ 'ఎమాన్సిపేషన్ ప్రొక్లమేషన్' (దాస్య విమోచన సాధికారిక ప్రకటన) జారీ చేశారు. ఇది యుద్ధ సమయంలో ఒక ఆయుధంలా పనిచేస్తుందని భావించి వేసిన ఎత్తుగడ. ప్రొక్లమేషన్ దక్షిణ రాష్ట్రాల్లోని బానిసలను మాత్రమే స్వతంత్రులుగా ప్రకటించింది. కానీ బోర్డర్ స్టేట్స్ (యూనియన్‌లో ఉన్న బానిస రాష్ట్రాలు)కు వర్తించలేదు. యుద్ధం ముగిస్తే ఇది చట్టబద్ధంగా నిలబడుతుందా అనే అనుమానం ఏర్పడింది.

అందుకే 1865లో 13వ రాజ్యాంగ సవరణ వచ్చింది. ఇది 'నేరానికి శిక్షగా తప్ప అమెరికాలో బానిసత్వం లేదా బలవంతపు పని ఉండకూడదు' అని పేర్కొంది. ఇది మొత్తం దేశానికి వర్తిస్తుంది. 'నేరానికి శిక్షగా' బానిసత్వం ఉండవచ్చు అన్న మినహాయింపు పెద్ద లోపంగా తయారయ్యింది. ఈ మినహాయింపు వల్ల బానిసత్వం కొత్త రూపంలో కొనసాగింది.

బానిసత్వ కొత్త రూపం

అంతర్యుద్ధం ముగిసిన వెంటనే దక్షిణాది రాష్ట్రాలు 'బ్లాక్ కోడ్స్' అనే చట్టాలు తెచ్చాయి. చిన్న చిన్న తప్పుల (వాగ్రన్సీ–ఉద్యోగం లేకపోవడం, ఇల్లు లేకపోవడం)కు నల్లవాళ్లను జైలుకు పంపి, అక్కడ బలవంతంగా పని చేయించారు. ఇది కాన్విక్ట్ లీజింగ్ వ్యవస్థ. అంటే జైలు ఖైదీలను ప్రైవేట్ కంపెనీలకు అద్దెకు ఇవ్వడం. వారు ఇంతకు ముందు బానిసత్వంలో ఉన్నప్పుడు పని చేసిన ప్లాంటేషన్లలోనే పని చేశారు, కానీ ఇప్పుడు 'నేరస్థులు'గా! ఇది బానిసత్వం మరొక రూపమే. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం ఈ మినహాయింపు దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థను కాపాడింది కానీ నల్లవాళ్లను మళ్లీ బానిసలుగా మార్చింది!

పునర్నిర్మాణ కాలంలో (1865–1877) కొంత మార్పు వచ్చింది. 14వ, 15వ సవరణలు నల్లవారికి సమాన హక్కులు, ఓటు హక్కు ఇచ్చాయి. కానీ 1877 తర్వాత ఫెడరల్ ట్రూప్స్ వెనక్కి వెళ్లిపోవడంతో 'జిమ్ క్రో చట్టాలు' వచ్చాయి. విభజన (సెగ్రిగేషన్)... 'వైట్స్ ఓన్లీ', 'కలర్డ్ ఓన్లీ' అనే సైన్ బోర్డులతో బస్సులు, స్కూళ్లు, రెస్టారెంట్లు... అన్నీ వేరు వేరయ్యాయి.

ఈ చట్టాలు 1960ల వరకు ఉన్నాయి. లించింగ్స్ (ఉరి శిక్షలు), షేర్‌క్రాపింగ్ (కౌలుదారీ వ్యవస్థ) లు వారిని చావుకు గురి చేయడమో, అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేయడమో చేశాయి. ఈ మాజీ బానిసలు స్వతంత్రులైనా, ఆర్థికంగా, సామాజికంగా బానిసలుగానే మిగిలారు. 13వ సవరణలోని ఆ మినహాయింపు ఇప్పటికీ ప్రభావం చూపుతోంది. అమెరికాలో జైళ్లలో ఎక్కువ మంది నల్లవాళ్లే ఉంటున్నారు. ప్రిజన్ లేబర్ (ఖైదీలు) తక్కువ జీతంతో లేదా ఉచితంగా పని చేస్తారనేది ఇక్కడ గమనార్హం.

ఏసీఎల్‌యూ, వాక్ ఫ్రీ వంటి సంస్థలు చెబుతున్నదాని ప్రకారం ఈ లోపం వల్ల ప్రైవేట్ కంపెనీలు, ప్రభుత్వం ప్రయోజనం పొందుతున్నాయి. డ్రగ్ వార్, కఠిన శిక్షలు నల్లవాళ్లను ఎక్కువగా టార్గెట్ చేశాయి. ఫలితంగా అమెరికాలో ప్రపంచంలోనే అత్యధిక జైలు జనాభా అవతరించింది! మరి బానిసత్వం అమెరికాలో ఉన్నట్లా, లేనట్లా? ◆

వలసదారులతో అభివృద్ధే!

ఇన్ బాక్స్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో వలసదారుల పాత్ర విస్మరించరానిది. ప్రపంచవ్యాప్తంగా 30 కోట్లకుపైగా అంతర్జాతీయ వలసదారులు ఉన్నారు. సంఘర్షణలు, వాతావరణ మార్పు వంటి వివిధ ఒత్తిళ్ల నుండి తప్పుకోవడానికి దేశాంతరాలకు జనం ఎక్కువగా వలస పోతున్నారు. అంతర్జాతీయ వలసదారులను ఎక్కువగా అమెరికా ఆదుకుంటోంది. ఆ తరువాత స్థానాల్లో జర్మనీ, సౌదీ అరేబియా, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్ ఉన్నాయి. యూరప్ మొత్తంగా ప్రాంతాల వారీగా అత్యధిక వలసదారులకు ఆతిథ్యం ఇస్తోంది. వలసదారులు ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిని గణనీయంగా పెంచుతున్నారు. ఒక అంచనా ప్రకారం 2020లో వారి నికర సహకారం 435 వేల కోట్ల డాలర్లుగా ఉంది.

వలసదారులు నిరుద్యోగం, తక్కువ వేతనాలు, అసురక్షిత పని పరిస్థితులు, సామాజిక భద్రత లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆతిథ్య దేశాలలో వివక్ష, భాషా అడ్డంకులు, సాంస్కృతిక బహిష్కరణలు సరేసరి! అక్రమ వలసదారులు ముఖ్యంగా దోపిడీ, మానవ అక్రమ రవాణా, ప్రాథమిక హక్కుల తిరస్కరణకు గురవుతారు. ఒంటరితనం, కుటుంబాల నుండి వేరుపడటం వలన మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ సవాళ్లను పరిష్కరించడానికి ప్రభుత్వాలు వలసదారులకు అనుకూలమైన విధానాలను బలోపేతం చేయాలి. సురక్షితమైన చట్టబద్ధమైన వలస మార్గాలను నియంత్రించడానికి అంతర్జాతీయ సహకారం అవసరం.

భారతదేశంలో 2025 నాటికి 15 కోట్ల మందిగా ఉన్న అంతర్గత వలస కార్మికులు ఆర్థిక వ్యవస్థను గణనీయంగా ప్రభావితం చేస్తున్నారు. మహారాష్ట్ర 2 కోట్ల మంది వలస కార్మికులతో మొదటి స్థానంలో, ఢిల్లీ ఒకటిన్నర కోట్లతో రెండో స్థానంలో, తమిళనాడు కోటిమందితో మూడో స్థానంలో ఉన్నాయి. భారతదేశ జీడీపీలో వలస కార్మికులు 10% వాటా కలిగి ఉన్నారు.

ప్రపంచ దేశాల మాదిరిగానే, భారతదేశంలోని వలస కార్మికులు బహుళ సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వాటిలో తక్కువ జీతం, ఉద్యోగ అభద్రత ఉన్నాయి. ఆదాయాలు తరచుగా స్థానిక కార్మికుల కంటే 20–30% తక్కువగా ఉంటాయి. బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుండి వచ్చే కార్మికులపై వివక్ష... వారి సామాజిక, ఆర్థిక చలనశీలతను మరింత పరిమితం చేస్తుంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి సమ్మిళిత విధానాలు, రక్షిత హక్కుల ద్వారా మద్దతు ఇచ్చినప్పుడు వలసలు... స్థిరమైన అభివృద్ధికి శక్తిమంతమైన సాధనంగా మారుతాయి.

– డా॥ పి.ఎస్. చారి । కామర్స్, మేనేజ్‌మెంట్ నిపుణులు
(నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం)

డేటా పాయింట్

నష్టం ఎక్కువ... రికవరీ తక్కువ

దేశంలో డిజిటల్ లావాదేవీలతోపాటు సైబర్ మోసాలూ పెరుగుతున్నాయి. 2021–22 నుంచి 2025 సెప్టెంబరు వరకు 5.83 లక్షలకు పైగా మోసాలు జరిగితే నష్టపోయింది రూ. 3,588 కోట్లు. రికవరీ చేసింది రూ. 239 కోట్లు మాత్రమే!

విభాగం	మోసాల సంఖ్య	జరిగిన నష్టం (రూ. కోట్లలో)	రికవరీ (రూ. కోట్లలో)
క్రెడిట్ కార్డులు	2,43,849	1447.27	177.78
డెబిట్ /ఏటీఎం కార్డులు	94,991	401.17	34.91
ఇంటర్నెట్ బ్యాంకింగ్	2,42,562	1730.14	24.83
ఆధార్ సంబంధిత మోసాలు	1,346	1.06	0.76

మంచివాళ్లకు అంతా మంచే...

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఉదార భావాలు గల సజ్జనులు పొరపాటున ఎప్పుడైనా కొంచెం మార్గం తప్పి నడచినా వెంటనే సరిదిద్దుకొని పరోపకార పరాయణులు అవుతారు. అందుకు 'శర్యాతి' మహారాజు కూతురు 'సుకన్య' ఉదంతమే మంచి ఉదాహరణ. సుకన్య ఉత్తమురాలు. ఒకసారి తండ్రితో కలసి ప్రకృతిని తిలకించటానికై అడవికి వెళ్ళింది. ఒక పుట్టలో ఉన్న 'చ్యవన' మహర్షి కళ్ల నుంచి వస్తున్న కాంతిని చూసి, అది మునికళ్ల నుండి వస్తున్న కాంతి అని తెలియక కుతూహలంతో పుట్ట రంధ్రాల్లో గడ్డి పోచలతో పొడిచింది. దీంతో మునికళ్లు గుడ్డివయ్యాయి. రక్తం కారనారంభించింది. మరోపక్క రాజు పరివారానికి మూత్రం బంధించబడి, బాధ ప్రారంభమయ్యింది. శర్యాతి జరిగిన పొరపాటుకు క్షమించమని అర్థించాడు.

'రాజా! నీ కుమార్తె చేసిన తప్పిదం వల్ల నాకిప్పుడు కన్నులు పోయాయి. నేనిప్పుడు నిస్సహాయుణ్ణి. నాకెవరైనా తోడూ నీడ కావాలి. అందుకని ఇంత అనర్థానికి కారణమైన నీ కూతురు నన్ను వివాహం చేసుకుంటే నాకూ, మీ సిబ్బందికీ బాధలు తొలుగుతాయి. మరేమంటావు?' అన్నాడు మహర్షి. చ్యవనుడు సరే అన్నాడు. సుకన్య కూడా ఇష్టంగానే ఒప్పుకొన్నది. తర్వాత సుకన్యా చ్యవనుల వివాహం జరిగింది.

సుకన్య శ్రద్ధాభక్తులతో పతిసేవలో మునిగిపోయింది. ఒకనాడు అశ్వినీ దేవతలు ఆమెను పరీక్షించదలచి ఆశ్రమానికి వెళ్లి తమ ఇద్దరిలో ఒకరిని వివాహమాడమని కోరడంతో ఆమె కోపగించింది. దీంతో సంతసించిన అశ్వినీ దేవతలు ఆమెను వరం కోరుకోమన్నారు. తన భర్తకు కంటిచూపు ప్రసాదించమని కోరుకొంది. అయితే తమ ఇద్దరితో పాటు చ్యవనుడూ నదిలో మునిగి స్నానం చేసి ముగ్గురం చ్యవనుడి రూపంలో బయటికి వస్తామనీ, తమలో అసలైన చ్యవనుని గుర్తిస్తే కంటిచూపు ప్రసాదిస్తామనీ వారన్నారు. ఆమె అంగీకరించింది. తుదకు ఒకే రూపంలో ఉన్న తన భర్తను గుర్తించింది. సంతసించిన అశ్వినీ దేవతలు చ్యవనునికి స్ఫురద్రూపం, యవ్వనాన్ని కూడా ప్రసాదించారు. అలా చేసిన తప్పు దిద్దుకుని ధర్మమార్గాన్ని వీడకుండా నడచిన సుకన్యకు అంతా మేలే జరిగింది.

క్లుప్తంగా...

స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీగా మనీష్‌రాజ్ గుప్తా

ఉక్కునగరం (విశాఖపట్నం): విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీగా సెయిల్ డైరెక్టర్ (టెక్నికల్, ప్రాజెక్ట్స్ అండ్ రా మెటీరియల్స్) మనీష్ రాజ్ గుప్తాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బుధవారం ఉక్కు మంత్రిత్వశాఖ అండర్ సెక్రటరీ సుభేందు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఇన్‌చార్జి సీఎండీ అజిత్ కుమార్ సక్సేనా ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనుండడంతో ఆ పోస్టులో మనీష్‌రాజ్ గుప్తాను నియమించారు.

తిరుపతిలో డెల్లా టౌన్‌షిప్

- టీటీడీ–ఏపీటీడీసీ సౌజన్యంతో ఏర్పాటు
- రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం

సాక్షి, అమరావతి: ప్రపంచంలోనే మొట్టమొదటి '5 వేల ఏళ్ల హిందూ మతం, హిందుత్వం జీవన శైలిని ప్రతిబింబించేలా ఎగ్జిబిషన్ టౌన్‌షిప్'ను తిరుపతిలో నిర్మిస్తున్నట్లు డెల్లా సంస్థ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు టీటీడీ–ఏపీటీడీసీ సౌజన్యంతో పనిచేసేలా రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొంది. ఇందులో భాగంగా 1,400 ఎకరాల్లో 'వాసుదేవ్ కుటుంబం' పేరుతో అంతర్జాతీయ టౌన్‌షిప్‌ను నిర్మించనుంది. దీని స్థూల అభివృద్ధి విలువ రూ.35 వేల కోట్లని సంస్థ తెలిపింది. హిందూ నాగరికత, దీర్ఘకాలిక సంస్కృతిని భావితరాలకు చాటిచెప్పేలా ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ ప్రదర్శన వేదజ్ఞాన వ్యవస్థలు, తత్వశాస్త్రం, శాస్త్రీయ కళలు, ఆలయ నిర్మాణం, ఆచార పద్ధతులు, ప్రాంతీయ సంప్రదాయాలు వంటి ఇతివృత్తాలను ప్రదర్శిస్తుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ తరహా టౌన్‌షిప్‌లను నిర్మించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు డెల్లా సంస్థ వ్యవస్థాపకుడు జిమ్మి మిస్త్రీ తెలిపారు.

టీటీడీకి రూ.1.20 కోట్ల హాఫ్ బ్లేడ్లు విరాళం

బ్లేడ్లను విరాళంగా అందిస్తున్న దాతలు

తిరుమల: హైదరాబాద్‌కు చెందిన వర్టీస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ శ్రీధర్ బోడుపల్లి బుధవారం టీటీడీకి ఏడాదికి సరిపడా రూ.1.20 కోట్ల విలువైన సిల్వర్ మాక్స్ హాఫ్ బ్లేడ్లను విరాళంగా అందించారు. దాత తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడుకు బ్లేడ్లను అందజేశారు.

ఇగ్నో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో జనవరి 2026 నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లమో, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ సైకాలజీ కోర్సుకు కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుకు జనవరి 31 ఆఖరు తేదీ అని ప్రకటించారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, మూడు సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు రీ–రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా జనవరి 15 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ లేదా విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గానీ లేదా 0866–2565253 ఫోన్ నంబర్ ద్వారా గానీ సంప్రదించవచ్చని వివరించారు.

అహోబిలంలో అరాచకం

బీ ట్యాక్స్ గుప్పెట్లో నరసింహ ఆలయం

- ప్రతి టెండర్‌కు ఓ రేటు
- తలనీలాల టెండర్‌కు టెండర్
- టోల్‌గేట్ బీ ట్యాక్స్ రూ.65 లక్షలు
- టెంకాయల వేలంలో రూ.40 లక్షలు
- పవిత్ర పుణ్యక్షేత్రంలో గుప్పుమంటున్న సారా
- సారా బట్టీల నుంచి నియోజకవర్గ నేతకు మామూళ్లు

అడ్డూఅదుపులేని ప్రజాప్రతినిధి భర్త ఆగడాలు

సాక్షి, నంద్యాల: కోట్లాదిమంది హిందువులకు పవిత్ర పుణ్యక్షేత్రమైన అహోబిలం నరసింహక్షేత్రం ఇప్పుడు అధికార పార్టీ నేత అక్రమార్జనకు అడ్డాగా మారింది. కొబ్బరికాయ నుంచి తలనీలాలు.. చివరికి పార్కింగ్ నుంచి కూడా బీ ట్యాక్స్ రూపంలో పిండేస్తున్నారు. నంద్యాల జిల్లాలో ఉన్న ఈ ఆలయంలో ఏ పని చేయాలన్నా ప్రజాప్రతినిధి భర్తకు కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనన్న పరిస్థితి నెలకొంది. టోల్‌గేట్, తలనీలాల టెండర్, టెంకాయల వేలం పాట, బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాలు.. ఇలా అన్నింటినుంచి ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు. తలనీలాల సేకరణకు ఈ ఏడాది మార్చిలో దేవస్థానం అధికారులు టెండర్ పిలిచారు. చాగలమర్రి మండలం గొడిగెనూరు గ్రామానికి చెందిన ఒక మహిళ రూ.1.50 కోట్లకు టెండర్ దక్కించుకున్నారు. ఈ టెండర్ దక్కేలా చేసినందుకు ఆమె బీ ట్యాక్స్ కింద రూ.20 లక్షలు చెల్లించినట్లు తెలిసింది. టెండర్ దక్కించుకున్న తర్వాత పాట మొత్తాన్ని ఆలయానికి చెల్లించాల్సి ఉన్నా.. ఇప్పటివరకు కేవలం రూ.40 లక్షలు మాత్రమే చెల్లించారు. మిగిలిన రూ.1.1 కోట్లలో ఆలయానికి వచ్చేదెంతో, బీ ట్యాక్స్‌కు పోయేదెంతో అన్నది చర్చనీయాంశంగా ఉంది. 2024–25కు సంబంధించి తలనీలాల వేలం పాటనే నిర్వహించలేదు. ఏడాది పాటు పోగైన తలనీలాలను ప్రజాప్రతినిధి భర్త కిలో రూ.3 వేలకు కొని రూ.12 వేలకు విక్రయించారు. సుమారు 700 కిలోల మేర తలనీలాల నుంచి రూ.63 లక్షలు కొల్లగొట్టారు.

టోల్‌గేట్‌లో నిలువు దోపిడీ

అహోబిలం ఆలయానికి వచ్చే ట్రాక్టర్లు, కార్లు, టూరిస్ట్ బస్సుల నుంచి పంచాయతీ అధికారులు టోల్ వసూలు చేస్తారు. ఏటా ఇందుకోసం టెండర్ పిలుస్తారు. ఈ ఏడాది జూన్‌లో టోల్‌గేట్‌కు వేలం పాట నిర్వహించారు. టెండర్‌లో వేరే వ్యక్తులు ఎవరూ పాల్గొనకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. సొక్కం వంశీకృష్ణ అనే వ్యక్తి రూ.20.31 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. వేలం పూర్తయిన వెంటనే ఈ మొత్తాన్ని చెల్లించాలి. కానీ ఇప్పటివరకు ఈ మొత్తాన్ని పంచాయతీకి చెల్లించలేదు. కానీ అతడు బీ ట్యాక్స్ కింద రూ.65 లక్షలు చెల్లించినట్లు సమాచారం. దీంతో రూ.100 వసూలు చేయాల్సినచోట రూ.200 వసూలు చేస్తూ భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు.

కొబ్బరికాయ రూ.70

ఆలయంలో టెంకాయలు విక్రయించుకునేందుకు అధికారులు గతేడాది టెండర్ పిలిచారు. టెండర్‌లో ఎవరూ పాల్గొనకుండా చేసి రూ.35 లక్షలకు స్థానిక టీడీపీ నేత దక్కించుకున్నాడు. తనకు టెండర్ దక్కేలా చేసినందుకు బీ ట్యాక్స్ కింద రూ.40 లక్షలు సమర్పించుకున్నాడు. నియోజకవర్గ నేత అండదండలతో ఒక్కో టెంకాయను రూ.70కి విక్రయించి భక్తులను కొల్లగొట్టారు. రూ.35 లక్షలకు టెండర్ దక్కించుకున్న వ్యక్తి ఆలయానికి రూ.20 లక్షలు మాత్రమే జమచేశారు.

సారా బట్టీలు.. బెల్టుషాపులు

అహోబిలానికి ఏడాది పొడవునా దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ కొండల్లో సారా గుప్పుమంటోంది. 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటోంది. తాళ్లకుంట కొండల్లో ఆరు, ఏడు బట్టీల్లో సారా కాస్తున్నారు. ఒక్కో బట్టీ నుంచి నియోజకవర్గ నేతకు మామూళ్లు వెళుతున్నాయి. సారాతో పాటు 8 మద్యం బెల్ట్ షాప్‌లు వెలిశాయి. పోతురాజు చెరువు, ఛత్రవట గుట్టల కింద మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.500 కమీషన్ వసూలు చేస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని తరలించి సహజ సంపదను కొల్లగొడుతున్నా అధికారులు స్పందించడం లేదు.

రిజిస్ట్రేషన్ చేశాక కేబినెట్ అనుమతా!?

- దేవుడ్ని దోచి.. ఒబెరాయ్‌కు ఖరీదైన భూమి కట్టబెట్టిన చంద్రబాబు ప్రభుత్వం
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మండిపాటు
- టూరిజం భూమి విలువ కేవలం రూ.18 కోట్లు
- అందుకు బదులుగా ఒబెరాయ్‌కు రూ.460 కోట్ల భూ సంతర్పణ
- ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్లో రూ.3 వేల కోట్ల పైనే
- ఇది ముమ్మాటికీ స్వామి వారి ఆస్తులను దోచిపెట్టడమే
- ఇది పరకామణి దొంగతనం కంటే అతి పెద్ద దోపిడీ
- ఈ దందాపై సనాతన ధర్మ పరిరక్షకుడిగా చెప్పుకునే పవన్ నోరు విప్పాలి

టీటీడీ స్థలంలో ఎర్రచందనం చెట్లు, ఔషధ మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, తిరుపతి టీటీడీ పరిరక్షకుడిగా తనను తాను అభివర్ణించుకుంటూనే.. వేల కోట్ల రూపాయల విలువైన భూమిని ప్రైవేటు హోటల్‌కు కేటాయించడం ద్వారా సీఎం చంద్రబాబు స్వామి వారికి తీరని ద్రోహం చేస్తున్నారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం దేవుడ్ని దోచి, ఒబెరాయ్‌కు భూములు కట్టబెట్టడంపై మండిపడ్డారు. ఈ నెల 5వ తేదీనే రిజిస్ట్రేషన్ చేసి.. 11వ తేదీన కేబినెట్ మీటింగ్‌లో ఆ భూమి బదలాయింపును ఆమోదించి, 13వ తేదీన జీవో జారీ చేయడం ప్రభుత్వ దోపిడీ విధానానికి అద్దం పడుతోందన్నారు. తిరుపతిలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం రూ.18 కోట్లు విలువైన టూరిజం భూమికి బదులుగా, రూ.460 కోట్ల విలువైన 20 ఎకరాలు కేటాయించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఇది టీటీడీకి తీరని ద్రోహమని, బహిరంగ మార్కెట్‌లో రూ.3 వేల కోట్ల విలువైన భూమిని.. ఒబెరాయ్‌కి గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేయడం స్వామి వారి ఆస్తులను దోచి పెట్టడమేనని తేల్చి చెప్పారు. దీన్ని పరకామణి దొంగతనం కంటే అతి పెద్ద దోపిడీగా అభివర్ణించారు. ఒబెరాయ్‌కు భూమి కేటాయింపులతో పాటు రూ.2 కోట్ల బిల్డింగ్ ఫండ్, రూ.26 కోట్ల స్టాంప్ డ్యూటీ మాఫీ చేయడాన్ని తప్పు పట్టారు. ఎవరి ప్రయోజనం కోసం ఈ తతంగం నిర్వహిస్తున్నారని నిలదీశారు. ఇది ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అతిపెద్ద అవినీతి అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంకా ఏమన్నారంటే..

తెర వెనుక నడిపించింది చంద్రబాబే

టూరిజం వాళ్లు ఒబెరాయ్ హోటల్‌కు కేటాయించిన దూరం కంటే అలిపిరికి అతి సమీపంలో అత్యంత విలువైన స్థలాన్ని చంద్రబాబు కేటాయించారు. ముందు కేటాయించిన రూ.90 లక్షల ఖరీదు చేసే భూమికి ఎంత లీజు ఇస్తారో.. ఇప్పుడూ అంతే ఇవ్వమని ప్రభుత్వం ఆదేశించింది. టీటీడీ నుంచి టూరిజం, టూరిజం నుంచి టీటీడీకి ఎక్స్ఛేంజ్‌కు సంబంధించిన అమౌంట్ దాదాపు రూ.32.61 కోట్లను కూడా మాఫీ చేసింది. ఈ విలువైన స్థలం అర్బన్ పరిధిలో ఉండగా, ముందు కేటాయించిన పాత స్థలం రూరల్ ఏరియాలో ఉంది. అందువల్ల రిజిస్ట్రేషన్ విలువ మధ్య కూడా చాలా తేడా ఉంది. ఒబెరాయ్ వారి ముంతాజ్ హోటల్ పేరును స్వరా అని పేరు మార్చడం మొదలు.. ఆ హోటల్‌కు విలువైన భూమి కేటాయింపు వరకు తతంగమంతా నడిపించింది చంద్రబాబేనని స్పష్టంగా తెలుస్తోంది.

అనుమతి లేకుండానే నిర్మాణ పనులు

ఆ 20 ఎకరాలలో ఉన్న ఎర్రచందనం ఇతరత్రా వృక్ష సంపదను అటవీ శాఖ అనుమతి లేకుండా ఎలా తొలగించారు? 15 రోజులుగా వర్క్ ఆర్డర్ లేకుండానే పని చేస్తున్నారు. 100 రూముల హోటల్‌కు 20 ఎకరాల స్థలం అవసరమా? ఈ హోటల్ వల్ల 1,500 ఉద్యోగాలు వస్తాయని.. కేబినెట్ మీటింగ్‌లోనే చెబుతున్నారు. హోటల్‌లో, రెస్టారెంట్‌లో భోజనానికి కూడా 1,500 మంది ఉండరు. ఇది పరకామణి దొంగతనం కంటే కొన్ని వందల రెట్లు దోపిడీ కాదా? రూ.2 కోట్ల బిల్డింగ్ ఫీజు కూడా అడ్జెస్ట్ చేశారు. రూ.26 కోట్ల స్టాంపు డ్యూటీ మాఫీ చేశారు. ఇవాళ మీరు ఒబెరాయ్‌కి కేటాయించిన 20 ఎకరాలు వైఎస్సార్ హయాంలో (2007 జూన్ 2వ తేదీ) తిరుమల దివ్య క్షేత్రానికి సంబంధించి ఏడు కొండలతో ఇచ్చిన జీవో పరిధిలోనే ఉన్నాయని తెలియదా? మీరా స్వామి వారి పవిత్రతను కాపాడేది? ప్రభుత్వ భూ దోపిడీపై స్వాములు, పీఠాధిపతులు ప్రశ్నించాలి. ప్రతి హిందువు వ్యతిరేకించాలి. దీనిపై సనాతన ధర్మ పరిరక్షకుడిగా చెప్పుకునే పవన్ కళ్యాణ్ నోరు మెదపక పోవడం నేరం కాదా? మంత్రి కందుల దుర్గేష్ కూడా అభ్యంతరం వ్యక్తం చేయలేదు. దీన్నిబట్టి మీరంతా కుమ్మక్కయ్యారని స్పష్టమవుతోంది.

భూమికి దక్కని పరిహారం.. ప్రభుత్వ భవనం వేలంతో న్యాయం

కోర్టు అనుమతితో ఫలించిన 20 ఏళ్ల న్యాయపోరాటం

కర్నూలు టౌన్: ఓ రైతు 20 ఏళ్ల న్యాయ పోరాటం ఫలించింది. భూమికి పరిహారం దక్కక పోవడంతో న్యాయస్థానం చుట్టూ తిరిగిన అతనికి చివరకు ప్రభుత్వ భవనం వేలం ద్వారా న్యాయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. 2004లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలోని కిష్టదొడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి గుండ్రేవుల గ్రామ పరిధిలోని ఎం.జయరామిరెడ్డికి చెందిన 1.85 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించింది. అప్పట్లో ఎకరాకు రూ.40 వేలు చెల్లిస్తామని రెవెన్యూ డివిజనల్ అధికారి సూర్యప్రకాష్ ప్రకటించారు. పరిహారం చాలా తక్కువగా ఉండటంతో రైతు కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రైతు భూమికి ప్రభుత్వం రూ.2 లక్షలు (ఎకరాకు) చెల్లించాలని తీర్పు చెప్పింది. ఏళ్ల తరబడి రైతు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేక చివరకు తమ భూమిని స్వాధీనం చేసుకున్న ఆర్డీఓపై రైతు ఐపీ(ఎగ్జిక్యూషన్ పిటిషన్) దాఖలు చేశారు. అయినా చలనం లేకపోవడంతో చివరకు కర్నూలు నగరంలోని బి.క్యాంప్‌లో విజ్ఞాన మందిరం సమీపంలోని బి/బి205 నెంబర్ గల ప్రభుత్వ భవనాన్ని వేలం వేసి తనకు రావాల్సిన మొత్తం ఇప్పించాలని కోర్టుకు నివేదించాడు. ఈ మేరకు ఇటీవల న్యాయస్థానం పత్రికా ప్రకటన ఇచ్చి వేలం పాట నిర్వహించింది. దీంతో సదరు ప్రభుత్వ భవనాన్ని రూ.45.80 లక్షలకు వేలం పాటలో బాధిత రైతే దక్కించుకున్నాడు. రైతుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.12.50 లక్షలు బకాయి ఉండడంతో ఆ మొత్తం మినహాయించి మిగిలినది ఈ నెల 26న చెల్లించి ప్రభుత్వ భవనం స్వాధీనం చేసుకునేందుకు బాధిత రైతు సిద్ధమవుతున్నారు.

నల్లబర్లీ నారు లాక్కెళ్లారు

మహిళ కన్నీళ్లు పెట్టుకున్నా వినలేదు

- ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు ఆంక్షలు పెడుతోంది?
- ప్రభుత్వాన్ని ఒక్క ఆకు కూడా కొనమని అడగం.. మా తిప్పలు మేం పడతాం
- గత్యంతరం లేకనే నల్లబర్లీ సాగు చేశాం.. నల్లబర్లీ సాగు చేసిన రైతులు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి పద్మావతిని నిలదీస్తున్న వరగాని రైతులు

ప్రత్తిపాడు: 'మహిళ నల్లబర్లీ నాటుకుంటుంటే పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు నిర్దాక్షిణ్యంగా నారు లాక్కెళ్లిపోయారు. కన్నీళ్లు పెట్టుకున్నా వినలేదు. బ్రిటిష్‌వాళ్ల రాజ్యంలా ఉంది..' అంటూ నల్లబర్లీ సాగు చేసిన రైతులు చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మాటల తూటాలతో గుంటూరు జిల్లా వ్యవసాయశాఖ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు.

ఇదీ విషయం: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం వరగానిలో ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు సాగును నిషేధించినప్పటికీ కొందరు రైతులు సాగు చేశారన్న సమాచారంతో జిల్లా వ్యవసాయాధికారి ఎం.పద్మావతి, గుంటూరు ఏడీఏ ఎన్. శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ మేనేజర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ హేనాప్రియ, ఇతర అధికారుల బృందం బుధవారం గ్రామంలో పర్యటించింది. నల్లబర్లీ పొగాకు సాగు చేసిన వరగాని, గోగులమూడి గ్రామాల రైతులతో మాట్లాడారు. నల్లబర్లీ సాగుపై నిషేధాజ్ఞలున్నాయని, అయినా ఎందుకు సాగు చేశారని రైతులను ప్రశ్నించారు.

మా తిప్పలు మేం పడతాం: 'గవర్నమెంటు మాకు ఏం చేసిందని ఆంక్షలు విధిస్తుంది?. వరగానిలో గతేడాది 4,800 క్వింటాళ్ల పొగాకు ఉంటే రెండు వేల క్వింటాళ్లు కొన్నారు. దాంట్లో కూడా వెయ్యి క్వింటాళ్లు వెనక్కి వచ్చింది. చివరి వరకూ పొగాకును కొంటామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పినా ప్రభుత్వం కొనలేదు' అని రైతులు తెలిపారు. దీనికి స్పందించిన మార్క్‌ఫెడ్ మేనేజర్ 20 వేల టన్నులు కొన్నామని చెప్పగా, రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఎంత ఉంటే అంత కొనమని ప్రభుత్వం చెప్పింది. కానీ కొన్నది ఎంత... 20వేల టన్నులే కదా... దీనికి అంతా కొన్నాం అని చెబితే సరిపోతుందా? అని నిలదీశారు. 'ప్రస్తుతం మేం సాగు చేసిన 50 ఎకరాలకు మా తిప్పలు మేం పడతాం... ప్రభుత్వాన్ని మేం ఏమీ అడగం' అని రైతులు తెగేసి చెప్పడంతో, ఇదే విషయాన్ని కలెక్టర్‌కు చెబుతామని అధికారులు తెలిపారు.

ఇంట్లోకి చొరబడి మహిళపై హత్యాయత్నం

- కారం, క్రికెట్ బ్యాట్, రాళ్లతో హల్‌చల్ చేసిన గంజాయి బ్యాచ్
- భయంతో ఇళ్లల్లోకి పరుగులు తీసిన స్థానికులు
- ఎమ్మెల్యే బొండా అండదండలు ఉన్నాయని హూంకరింపులు
- నిందితులకు కొమ్ముకాస్తున్న టీడీపీ నాయకులు.. కేసు కట్టనివ్వకుండా ఒత్తిడి

బ్యాట్, కారంతో వీరంగం వేస్తున్న గంజాయి బ్యాచ్ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బెజవాడలో గంజాయి బ్యాచ్ మరోసారి రెచ్చిపోయింది. మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే రాళ్లు, క్రికెట్ బ్యాట్‌లు, కారం చేత పట్టుకొని ఏకంగా ఇళ్లల్లోకి చొరబడి ఓ మహిళను హతమార్చేందుకు యత్నించారు. గంజాయి మత్తులో వీరు చేసిన వీరంగంతో స్థానిక ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ లూనాసెంటర్‌లో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గుమ్మళ్ల కుసుమ అనే మహిళ సింగ్‌నగర్‌లోని నార్త్‌జోన్ తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కార్యాలయం సమీపంలో 20 ఏళ్లుగా ఉంటోంది. బుధవారం సాయంత్రం ఆమె ఇంట్లో టీవీ చూస్తుండగా గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు లోనికి ప్రవేశించాడు. చీరను లాగి ఆమెపై హత్యాయత్నానికి యత్నించాడు. దీంతో ఆమె అతడిని బయటకు తోసేసి తలుపులు వేసింది. విషయాన్ని సమీపంలో ఉన్న తన అన్నయ్య శేఖర్‌కు ఫోను చేసి చెప్పింది. ఇంతలో ఆ వ్యక్తితోపాటు మరో ఇద్దరు గంజాయి బ్యాచ్ సభ్యులు, ఓ మహిళ కూడా వారితోపాటు వచ్చి రాళ్లు, బ్యాట్, కారంతో వీరంగం సృష్టించారు. మహిళను, ఆమె కుమారుడిని చంపేస్తామంటూ ఇంటిపైకి రాళ్లు రువ్వారు. అద్దాలు, తలుపులు, కిటికీలు పగలగొట్టి బీభత్సం సృష్టించారు. వీరి చేష్టలకు భయపడి స్థానికులు ఇళ్లల్లోకి పరుగులు తీశారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులపైనా రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్

పోలీసులపైనా గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. తమకు స్థానిక టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా అండదండలు ఉన్నాయని హూంకరించింది. వారు చెప్పినట్లుగానే స్థానిక టీడీపీ నాయకులు కొందరు గొడవ జరిగిన కాసేపటికే అక్కడకు చేరుకొని నిందితులను రక్షించేందుకు యత్నించారు. వారిపై కేసులు పెట్టవద్దంటూ పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. వీడియోల రూపంలో సాక్ష్యాధారాలు ఉన్నా కేసులు కట్టేందుకు పోలీసులు వెనుకాడుతున్నారు. రాజీ పడాల్సిందిగా బాధితులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్టు సమాచారం. విషయం మీడియాకు, పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో హత్యాయత్నం కాకుండా చిన్న చిన్న సెక్షన్ల కింద కేసులు కట్టి చేతులు దులుపుకునేందుకు యత్నిస్తున్నట్టు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.

బెడిసికొట్టిన 'తమ్ముళ్ల' కుట్ర

శింగనమల ఆలయం వివాదంలో టీడీపీ నేతలకు సహకరించని స్థానికులు

- అర్చకుడి దీక్షను భగ్నంచేసి దేవాలయానికి తరలించిన పోలీసులు
- స్థానికులతో అతనిపై నిందలు వేయించాలని ఎల్లో గ్యాంగ్ విశ్వప్రయత్నం
- 'ఉపాధి' సమావేశమంటూ కూలీలను రప్పించిన నాయకులు
- వీరి కుట్ర తెలుసుకుని వెనక్కి వెళ్లిపోయిన కూలీలు
- చివరికి.. అర్చకుడు గుడిలో పూజలు చేసుకోవచ్చని వెల్లడి

శింగనమల: అనంతపురం జిల్లా శింగనమల మండల కేంద్రంలోని శ్రీదుర్గాంజనేయస్వామి ఆలయ అర్చకుడు రమణపై టీడీపీ నాయకుల కుట్రలు బెడిసికొట్టాయి. ఆయన్ను ఎలాగైనా ఆలయం నుంచి తరిమేయాలని.. ఇందు కోసం స్థానికులతో ఆయనపై నిందలు వేయించాలని ప్రయత్నించి విఫలమయ్యారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆ ఆలయ అర్చకుడు రమణను అక్కడి నుంచి తరిమేసి.. ఆలయాన్ని హస్తగతం చేసుకోవాలని పన్నాగం పన్నారు. ఇందుకు నిరసనగా రమణ జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం నుంచి నిరాహారదీక్ష చేపట్టారు. మంచులో తడుస్తూ.. చలిలో వణుకుతూనే దీక్ష కొనసాగించారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ నేతలతో పాటు పలువురు ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. అయితే, పోలీసులు బుధవారం తెల్లవారుజామున దీక్షను భగ్నంచేసి రమణను పోలీసు వాహనంలో తీసుకొచ్చి శింగనమల ఆలయంలో వదిలేశారు.

నిందలు వేయడానికి విఫలయత్నం..

అయితే, ఈ విషయం టీడీపీ నేతలకు తెలిసి స్థానికులతో అర్చకుడిపై నిందలు వేయించాలని తమ కుట్రలకు పదును పెట్టారు. ఉపాధి హామీ పథకం మేట్లను పురమాయించి సమావేశం ఉందంటూ కూలీలను రామాలయం వద్దకు పిలిపించారు. వారికి అక్కడే అల్పాహారం ఏర్పాటుచేశారు. టీడీపీ మండల నాయకులు వచ్చి దుర్గాంజనేయ స్వామి అర్చకులు సరిగా పూజలు చేయడంలేదని, అందరం గుడి వద్దకు వెళ్దామన్నారు. 'తమ్ముళ్ల' కుట్ర తెలుసుకున్న కూలీల్లో చాలామంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో టీడీపీ నాయకులు, వారి అనుచరులు మాత్రమే ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. అర్చకుడు గుడిలో పూజలు చేసుకోవచ్చని, ఆలయాభివృద్ధి మాత్రం తామే చేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ వారు రాజకీయం చేస్తున్నారని.. వారో, తామో తేల్చుకుంటామని హెచ్చరించారు.

రాజకీయాలు చేస్తోంది టీడీపీ వారే..

మరోవైపు.. ఆలయం విషయంలో నీచ రాజకీయాలు చేస్తోంది టీడీపీ వారేనని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. శింగనమలలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు పూల ప్రసాద్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఎన్‌వీ నారాయణ, దుర్గాంజనేయ స్వామి ఆలయ పాత కమిటీ సభ్యులు జెల్లి శ్రీనివాసులు యాదవ్ మాట్లాడుతూ.. వంశపారంపర్యంగా ఎన్నో ఏళ్లుగా అర్చకత్వం చేస్తూ.. ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న వారిపై వేధింపులకు పాల్పడడం తగదన్నారు. అలాగే, అర్చకుడు రమణకు అండగా ఉంటామని బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ చెప్పారు.

ఏఎస్‌ఐ కుమారుడు వాడిన కారు నాదే

నకిలీ నంబర్ తగిలించి తిరుగుతున్నాడని కారు యజమాని ఫిర్యాదు

నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

ఐదుగురు విద్యార్థుల మరణానికి కారణమైన కారు

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా చిలకలూరిపేట హైవేపై ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మరణానికి కారణమైన ఏఎస్సై కుమారుడు, ఇతర నిందితులు వినియోగించిన కారు తనదేనని యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. విజయవాడకు చెందిన పుల్లా శ్రీనివాసరెడ్డి తన ఆర్థిక అవసరాల నిమిత్తం నకరికల్లుకు చెందిన అంజినాయుడు వద్ద ఏపీ40 ఏజెడ్4419 నంబర్ గల స్విఫ్ట్ కారును 2024 ఆగస్టులో రూ.1.50 లక్షలకు తాకట్టు పెట్టాడు. ఆ కారుకు కిస్తీలు ఓ ఫైనాన్స్ కంపెనీలో బకాయిలు ఉండటంతో తప్పించుకునేందుకు టీఎస్08 హెచ్‌వై 3158 నంబర్‌తో ఆ కారును తిప్పుతున్నారు. ఇదే కారుతో ఈ నెల 4న చిలకలూరిపేట హైవేలో వెళ్తున్న కంటైనర్‌ను వెంబడించి డబ్బుల కోసం ఆపడంతో ప్రమాదం జరగ్గా.. ఐదుగురు మరణించారు. సీసీ పుటేజీ ఆధారంగా ఏఎస్ఐ కుమారుడు వెంకట్‌నాయుడుతోపాటు మరో నలుగుర్ని పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో నకిలీ నంబర్‌తో కారు నడిపినట్టు గుర్తించారు. దానిపై ఆరా తీయగా అంజి, భాను తనకు కార్లను తెచ్చి విక్రయిస్తుంటారంటూ చెప్పాడు. ఈ విషయం తెలుసుకున్న కారు యజమాని శ్రీనివాసరెడ్డి రెండు రోజుల క్రితం తాను తాకట్టు పెట్టిన కారును కొందరు వ్యక్తులు మారు నంబర్‌తో నడిపి అక్రమాలకు పాల్పడినట్టు ఫిర్యాదు చేశారు.

కస్టడీకి ఏఎస్ఐ కుమారుడి గ్యాంగ్

ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి కేసులో అరెస్టయి నరసరావుపేట సబ్‌జైలులో ఉన్న ఏఎస్ఐ కుమారుడు వెంకట్‌నాయుడుతో పాటు మరో నలుగుర్ని పోలీసు కస్టడీకి ఇస్తూ చిలకలూరిపేట న్యాయస్థానం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిందితులు నకిలీ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ అవతారమెత్తి నేరాలకు పాల్పడ్డారని.. ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు వారిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ నాదెండ్ల పోలీసులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో వారిని పోలీసు కస్టడీకి ఇస్తూ న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలని కోర్టు ఆదేశించింది.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును
ఇ-టెండరు ప్రకటన నం. 480/ DRM/W/GNT తేది: 16-12-2025
PUB/1615
దిగువ తెలిపిన పనుల కోసం క్రింది సంతకందారు 16-01-2026న 15.30 గం. వరకు ఇ–టెండర్లు కోరుతున్నారు.
క్ర.సం.:1. టెండరు ఐడి: 2830 Sr.DEN/DEN: West. పని వివరణ: గుంటూరు – 30 నెలల కాలవ్యవధి కోసం వాటర్ రీసైక్లింగ్ ప్లాంట్ (400 KLD సామర్థ్యం) నిర్వహణ. సుమారు విలువ: రూ.29,04,510/-. బిడ్ సెక్యూరిటీ : రూ.58,100/-.
1. ఇ-బిడ్స్ ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు ఆఖరి తేది: 16-01-2026న 15.30 గం. వరకు. వివరమైన సమాచారం కోసం వెబ్‌సైట్ www.ireps.gov.inకి లాగిన్ కావలెను.
2. ఏదేని తదుపరి సమాచారం / సవరణ ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడును.
డివిజనల్ రైల్వే మేనేజర్, (వర్క్స్), గుంటూరు
A2049
తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

Government of Andhra Pradesh
Swachha Bharat Mission (Urban)
MA & UD Department
Swachha Andhra Corporation
e-Procurement Tender Notice

S.No.	NIT No.	Name of Work
1.	NIT No. 63/CITIIS 2.0/ Recruitment/PMU/ 2025-26, Dt: 16.12.2025	Swachha Andhra Corporation, invites applications for Selection of Agency for Establishment of PMU under CITIIS 2.0 to support the State Climate Centre for Cities (SC3) visit www.sac.ap.gov.in

The bid can be downloaded start from 18.12.2025, 10:30 AM and due date for submission of Bid is on 24.12.2025 upto 5.00 PM. Bid opening at 24.12.2025, 05.30 PM. Please refer to www.sac.gov.in for further details.
Sd/- Managing Director, SAC, Vijayawada
DIPR RO No.4679PP/CL/Advt/1/1/2021-22, Dt. 17.12.2025

మనది సహజ భాగస్వామ్యం

ఇథియోపియాకు వస్తే సొంత ఇంటికి వచ్చినట్లే..

- కీలక రంగాల్లో రెండు దేశాలు కలిసికట్టుగా పనిచేయాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- ఇథియోపియా పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగం

అడిస్ అబాబా: ప్రాంతీయ శాంతి, భద్రత, అనుసంధానంలో భారత్, ఇథియోపియాలు సహజ భాగస్వామ్య దేశాలు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచ శాంతి, సమానత్వం, ప్రగతి కోసం రెండు దేశాలు కలిసికట్టుగా పని చేస్తున్నాయని ఉద్ఘాటించారు. ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం మంగళవారం ఇథియోపియా చేరుకున్న ప్రధాని మోదీ బుధవారం దేశ పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. 'తేనా ఇస్టిలిన్ సలామ్' అంటూ స్థానిక భాషలో ఎంపీలకు అభివాదం చేశారు. సింహాల గడ్డగా ప్రసిద్ధి చెందిన ఇథియోపియాలో అడుగుపెట్టడం అద్భుతంగా ఉందన్నారు. ఇక్కడికి వస్తే సొంత ఇంటికి వచ్చినట్లే ఉంటుందని, తన సొంత రాష్ట్రం గుజరాత్ కూడా సింహాలకు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ప్రధానమంత్రి హోదాలో మోదీ ప్రసంగించిన విదేశీ పార్లమెంట్లలో ఇది 18వ పార్లమెంట్ కావడం విశేషం. ఆయన మాట్లాడుతుండగా ఇథియోపియా ఎంపీలు 50 సార్లకుపైగా చప్పట్లు కొట్టి హర్షం వ్యక్తంచేశారు.

శుభాకాంక్షలు మోసుకొచ్చా..

''ఆఫ్రికా ఖండంలో ఇథియోపియా కీలక స్థానంలో ఉంది. హిందూ మహాసముద్రంలో భారత్ హృదయ స్థానంలో నిలిచింది. ఇరుదేశాలు సహజ భాగస్వామ్య దేశాలు. ఈ ఏడాది కుదుర్చుకున్న రక్షణ సహకార ఒప్పందంతో పరస్పర భద్రత పట్ల అంకిత భావం మరింత బలపడింది. భారత్, ఇథియోపియాలు ఒక కుటుంబంగా కలిసి ఉంటున్నాయి. ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకోవడంతోపాటు ప్రపంచ సౌభాగ్యం కోసం కృషి చేస్తున్నాయి. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత్‌కు అండగా నిలిచినందుకు ఇథియోపియాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఉగ్రవాదంపై అవిశ్రాంతంగా పోరాటం కొనసాగిస్తున్నాం. ఈ ప్రజాస్వామ్య దేశాలయంలో ప్రసంగించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. 140 కోట్ల మంది భారతీయుల తరఫున శుభాకాంక్షలు మోసుకొచ్చా.

జన్మభూమి మన కన్నతల్లి

ప్రపంచంలో ప్రాచీన నాగరికతల్లో ఇథియోపియా కూడా ఒకటి. ఇది పాత, కొత్తల సమ్మేళనం. ఇక్కడ ప్రాచీన విజ్ఞానం, ఆధునిక ఆకాంక్షల మధ్య సమతూకం కనిపిస్తోంది. ఇదే ఇథియోపియా అసలైన బలం. భారతదేశ నాగరికత అత్యంత ప్రాచీనమైనది. పూర్తి ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తులోకి అడుగులు వేస్తోంది. భారత జాతీయ గీతం, ఇథియోపియా జాతీయ గేయం ఒకే అర్థాన్ని సూచిస్తున్నాయి. జన్మభూమిని కన్నతల్లిగా సంబోధిస్తున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలు, జన్మభూమిని కాపాడుకొనే విషయంలో అవే మనకు స్ఫూర్తిదాయకం. ఇథియోపియా అభివృద్ధిలో వేలాది మంది భారతీయ ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది. అభివృద్ధి చెందుతున్న దేశాలుగా మనం పరస్పరం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. వ్యవసాయమే మనకు వెన్నుముక. మెరుగైన విత్తనాలు, సాగునీటి సరఫరా విధానాలు, భూమిలో సారం పెంచడంపై మనం దృష్టి పెట్టాలి. కలిసికట్టుగా పనిచేయాలి.

ప్రజాస్వామ్యం జీవన విధానం

ఇథియోపియాలోని కీలక రంగాల్లో భారతీయ కంపెనీలు 5 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడి పెట్టాయి. దీంతో స్థానికంగా 75 వేల ఉద్యోగాల సృష్టి జరిగింది. మన భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి ఎన్నో అవకాశాలున్నాయి. ఆ దశగానే రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని నిర్ణయించాం. దీనివల్ల టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలు, మైనింగ్, క్లీన్ ఎనర్జీ, ఆహార భద్రత వంటి రంగాల్లో రెండుదేశాల బంధం బలపడుతుంది. మన ఆర్థిక వ్యవస్థలకు మేలు జరుగుతుంది. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల్లో మేము సాధించిన నైపుణ్యాలు, అనుభవాన్ని ఇథియోపియాతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. భారత్, ఇథియోపియాలు నిఖార్సైన ప్రజాస్వామ్య దేశాలు. ప్రజాస్వామ్యం మన జీవన విధానం. ఇదొక ప్రయాణం. తేనీరు అంటే నాకు ఇష్టం. ఇథియోపియన్ కాఫీ, ఇండియన్ టీ తరహాలోనే మన స్నేహం చక్కటి పరిమళాలు వెదజల్లుతోంది'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన ప్రసంగం ముగిసిన తర్వాత ఇథియోపియా ఎంపీలు మోదీకి 'స్టాండింగ్ ఒవేషన్' ఇచ్చారు. పలువురు మంత్రులు, ఎంపీలతో మోదీ మాట్లాడారు. 'ఏక్ పేడ్ మా కే నామ్ పే' కార్యక్రమంలో భాగంగా మోదీ ఇథియోపియా పార్లమెంట్ ప్రాంగణంలో మొక్క నాటారు.

'నిశాన్ ఆఫ్ ఇథియోపియా' పురస్కారంతో మోదీని సత్కరిస్తున్న దృశ్యం

అడీస్‌అబాబా సిటీలో అద్వా విజయస్మారకం, మ్యూజియంలో భారీ డోలు వాయిస్తున్న మోదీ

మోదీకి అత్యున్నత పౌర పురస్కారం

ఇథియోపియా ప్రభుత్వం భారత ప్రధాని మోదీకి తమ అత్యున్నత పౌర పురస్కారమైన 'నిశాన్ ఆఫ్ ఇథియోపియా'ను ప్రదానం చేసింది. ఈ పురస్కారం అందుకున్న మొట్టమొదటి విదేశీ నాయకుడు మోదీ కావడం గమనార్హం. ఆయనను ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా 28 దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించాయి.

మంత్రముగ్ధులను చేసిన 'వందేమాతరం'

ప్రధాని మోదీ గౌరవార్థం ఇథియోపియా ప్రధానమంత్రి అబీ అహ్మద్ అలీ మంగళవారం ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ముగ్గురు ఇథియోపియా గాయకులు భారత జాతీయ గీతం 'వందేమాతరం'ను శ్రుతిబద్ధంగా ఆలపించారు. ప్రధాని మోదీ సహా భారత ప్రతినిధులు ముగ్ధులయ్యారు. చప్పట్లతో అభినందించారు. ఇథియోపియా గాయకుల ఆలాపన తనను ఎంతగానో ఆకట్టుకుందని ప్రశంసిస్తూ మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. సంబంధిత వీడియోను సైతం షేర్ చేశారు. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సమయంలోనే ఈ గీతాన్ని ఇథియోపియా గాయకుల నోటి వెంట వినడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఒమన్ పర్యటన షురూ

ఒమన్ ఉప ప్రధానమంత్రితో మోదీ భేటీ • నేడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు!

మస్కట్: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒమన్ ఉప ప్రధానమంత్రి సయ్యిద్ షిహాబ్ బిన్ తారిఖ్ అలీ సైద్‌తో సమావేశమయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం మోదీ ఇథియోపియా నుంచి బుధవారం ఒమన్‌కు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆయనకు ఉప ప్రధానమంత్రి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు భేటీ అయ్యారు. భారత్, ఒమన్ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. మోదీ గురువారం ఒమన్ ముఖ్యనేతలతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా కీలకమైన వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాలు సంతకం చేసే అవకాశం ఉంది. భారత్, ఒమన్ మధ్య చరిత్రాత్మకమైన సంబంధాలు ఉన్నాయని పేర్కొంటూ మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. తన పర్యటనలతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలడతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ ఆహ్వానం మేరకు మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఆయన ఇక్కడికి రావడం ఇది రెండోసారి. భారత్–ఒమన్ దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తి కాబోతున్నాయి. ఒమన్‌లోని మస్కట్‌లో తాను బస చేసే హోటల్‌కు చేరుకున్న మోదీకి ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. స్థానిక కళాకారులు సంప్రదాయ నృత్యాలు చేశారు. భారతీయ కళాకారులు సైతం సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించారు. అలాగే భారత్–ఒమన్ సంబంధాలను ప్రతిబింబించే ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఒమన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు భారత ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ గత శుక్రవారమే ఆమోదించింది. దీనిపై 2023 నవంబర్‌లో చర్చలు మొదల య్యాయి. ఈ ఏడాది విజయవంతంగా ముగి శాయి. ఒప్పందంపై సంతకాలు జరిగితే రెండు దేశాల వాణిజ్య సంబంధాల్లో నూతన ఆధ్యాయం ప్రారంభమైనట్లేనని అధికార వర్గాలు పేర్కొన్నాయి. మోదీ ఒమన్ సుల్తాన్‌తో భేటీ కాబోతున్నారు. వ్యూహాత్మక సంబంధాల బలోపేతంపై వారు చర్చించనున్నారు. ప్రవాస భారతీయులను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు.

మోదీకి స్వాగతం పలుకుతున్న ఒమన్ ఉపప్రధాని తారిఖ్

బెడ్ మీదే బేడీలు!

- బాండీ బీచ్ ఘటనతో ఉగ్రవాది నవీద్ అక్రమ్ అరెస్ట్
- కోమాలోంచి తేరుకోగానే అరెస్ట్‌చేసిన ఆస్ట్రేలియా పోలీసులు
- మొత్తం 59 నేరాలు చేసినట్లు కేసు నమోదు

నవీద్ అక్రమ్

సిడ్నీ: ఆస్ట్రేలియాలోని ప్రముఖ బాండీ బీచ్ సమీప ఆర్చర్ పార్క్‌లోని యూదులపై విచక్షణా రహితంగా రైఫిళ్లతో కాల్పులు జరిపి పలువురిని పొట్టనబెట్టుకున్న 24 ఏళ్ల నవీద్ అక్రమ్‌ను పోలీసులు ఆస్పత్రిలోనే అరెస్ట్‌చేశారు. బీచ్‌లో ఇష్టారీతిగా కాల్పులు జరుపుతున్న నవీద్‌పైకి భద్రతాబలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడటంతో అతన్ని సిడ్నీలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యపరిస్థితి విషమించి తర్వాత నవీద్ కోమాలోకి వెళ్లాడు. కోమాలో ఉన్న నవీద్ బుధవారం కళ్లు తెరచి కోలుకోగానే ఆస్ట్రేలియా పోలీసులు అరెస్ట్ చేశారు. 15 మందిని చంపినందుకు 15 నేరాలు, ఉగ్రవాద చర్యతో పలువురిని పొట్టనబెట్టుకోవడం, పలువురిని గాయపర్చడం, అక్రమంగా ఆయుధాలు కల్గి ఉండటం, దుర్వినియోగపర్చడం, ఒక భవంతి సమీపంలో బాంబు అమర్చడం, కారులో పేలుడు పదార్థాలను పెట్టడం వంటి అంశాలపై మరో 40కిపైగా నేరాలను ఆ కేసులో పేర్కొన్నారు. నవీద్ కారులో ఇప్పటికే ఐసిస్ ఉగ్రవాద సంస్థ జెండాలను పోలీసులు గుర్తించడంతో అంతర్జాతీయ ఉగ్రసంస్థతో సంబంధాల నేరాన్ని సైతం కేసుకు జతచేశారు. మొత్తంగా 59 నేరాలు చేసినట్లుగా అతనిపై కేసు నమోదుచేశారు.

వెలుగులోకి మరో జంట సాహసం

50 ఏళ్ల ఉగ్రవాది సాజిద్, అతని కుమారుడు నవీద్ సమీప పార్క్ పాదచారుల వంతెన వద్ద కాల్పులతో తెగబడుతున్నప్పుడు వారిని అడ్డుకునేందుకు ఒక వృద్ధజంట ప్రయత్నించిన వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బోరిస్, సోఫియా గుర్మాన్ అనే వృద్ధ జంట అటుగా వెళ్తున్నప్పుడే ఈ తండ్రీకొడుకులు కాల్పులు మొదలెట్టినట్లు తెలుస్తోంది. వెంటనే వీళ్లను అడ్డుకునేందుకు బోరిస్, సోఫియా విశ్వప్రయత్నంచేశారు. షూటర్ల చేతుల్లోని రైఫిళ్లను లాక్కునే ప్రయత్నంచేశారు. ఈ క్రమంలో దంపతులిద్దరూ కిందపడ్డారు. రైఫిల్ మాత్రం షూటర్ చేతుల్లోనే ఉండిపోయింది. దీంతో షూటర్ జరిపిన కాల్పులకు దంపతులిద్దరూ నేలకొరి వీరమరణం పొందారని ఆస్ట్రేలియా మీడియా వారిని సాహసోపేత చర్యను పొగిడింది. పలువురిని కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టిన దంపతులను కీర్తిస్తూ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు లక్షలాదిగా పోస్టులు పెడుతున్నారు. షూటర్ల మీదకు ఇటుకలు విసిరి, గాయపరిచేందుకు ప్రయత్నించిన 60 ఏళ్ల తన తండ్రి రీవెన్ మోరిస్ సైతం ప్రాణాలు కోల్పోయారని కూతురు వెల్లడించారు.

బీమా బిల్లుకు ఆమోదం

- బీమా రంగంలో ఇక 100 శాతం ఎఫ్‌డీఐలు
- ప్రతిపక్షం సూచించిన సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం

నిర్మల

న్యూఢిల్లీ: దేశంలో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ) 100 శాతం అనుమతిస్తూ కేంద్రం తీసుకొచ్చిన సబ్‌కా బీమా సబ్‌కా రక్షా(బీమా చట్టాల సవరణ) బిల్లు–2025 పార్లమెంట్ ఆమోదం పొందింది. ఈ బిల్లును మంగళవారం లోక్‌సభలో ఆమోదించగా, బుధవారం రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదించారు. బీమా రంగంలో ప్రస్తుతం 74 శాతం ఎఫ్‌డీఐలను ఆమోదిస్తున్నారు. దీన్ని ఇకపై 100 శాతానికి పెంచబోతున్నారు. రాజ్యసభలో బిల్లుకు ప్రతిపక్షం సూచించిన పలు సవరణలు తిరస్కరణకు గురయ్యాయి. సమగ్ర పరిశీలన కోసం బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపించాలని విపక్ష సభ్యులు కోరగా ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిచ్చారు. ప్రజలకు మేలు జరిగేలా బీమా రంగంలో మరిన్ని సానుకూల మార్పులు రాబోతున్నాయని చెప్పారు. ఈ రంగంలో విదేశీ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టబోతున్నాయని వెల్లడించారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచే దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికే పలు కీలక సంస్కరణలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. ప్రజలకు, వ్యాపారాలకు, వ్యవసాయానికి బీమా రక్షణ విస్తృతంగా లభిస్తేనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని తేల్చిచెప్పారు. 100 శాతం ఎఫ్‌డీలతో బీమా సదుపాయం మరింత విస్తరిస్తుందని, చౌకగా పాలసీలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ రంగంలో వృద్ధికి అపరిమిత అవకాశాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. విదేశీ కంపెనీల రాకతో పోటీ పెరిగి, కొత్త పాలసీలు వస్తాయని, ప్రీమియం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా దేశంలో యువతకు మరిన్ని ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు.

'శాంతి' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

అణు ఇంధన రంగంలో ప్రైవేట్ సంస్థల ప్రవేశానికి వీలు కల్పిస్తూ ప్రభుత్వం రూపొందించిన సస్టైనబుల్ హార్నెసింగ్, అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) బిల్లును లోక్‌సభలో బుధవారం మూజువాణి ఓటుతో ఆమోదించారు. బిల్లును వ్యతిరేకిస్తూ విపక్షాలు వాకౌట్ చేశాయి. సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడారు. ప్రైవేట్ కంపెనీల రాకతో అణు ఇంధన రంగం మరింత వేగం పుంజుకుంటుందని చెప్పారు.

'రామ్ జీ' బిల్లుపై చర్చ ప్రారంభం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్–గ్రామీణ(వీబీ–జీ రామ్ జీ) బిల్లుపై లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడారు. ఈ బిల్లుతో కూలీలకు ప్రతిఏటా 125 రోజుల పాటు పని లభిస్తుందన్నారు. గ్రామాలు స్వయం సమృద్ధి సాధించాలన్న జాతిపిత మహాత్మాగాంధీ కల నెరవేరుతుందని వివరించారు. ఉపాధి హామీ పథకం నుంచి గాంధీజీ పేరును తొలగించడం పట్ల కాంగ్రెస్ సభ్యుడు జైప్రకాశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అది అతిపెద్ద నేరమని పేర్కొన్నారు.

71 పాత చట్టాల రద్దు బిల్లుకు సై

కాలం చెల్లిన 71 చట్టాలను రద్దు చేస్తూ ప్రవేశపెట్టిన రిపీలింగ్, అమెండ్‌మెంట్–2025 బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం లభించింది. మంగళవారం లోక్‌సభలో, బుధవారం రాజ్యసభలో ఆమోదించారు.

2026 చివరికల్లా శాటిలైట్ ఆధారిత టోల్‌వ్యవస్థ

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన

గడ్కరీ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది చివరికల్లా దేశవ్యాప్తంగా జాతీయరహదారులపై ఉపగ్రహ ఆధారిత టోల్‌చార్జీల వసూలు వ్యవస్థను అమలుచేస్తామని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ప్రకటించారు. శాటిలైట్ టోల్ విధానం కారణంగా ఇకపై టోల్‌ప్లాజాల వద్ద చాలాసేపు కిలోమీటర్ల పొడవైన క్యూ వరసల్లో వేచి ఉండాల్సిన బాధ వాహనదారులకు తప్పుతుందని మంత్రి గడ్కరీ చెప్పారు. బుధవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ''కొత్త వ్యవస్థ పూర్తిగా కృత్రిమ ఉపగ్రహ, కృత్రిమ మేధ(ఏఐ)తో అనుసంధానమై పనిచేస్తుంది. దీంతో టోల్‌ప్లాజాల వద్ద వెయిటింగ్ పిరియడ్ అనేదే ఉండదు. క్యూ వరసల్లో వేచిఉన్నప్పుడు వాహనం ఇంజిన్ ఆన్‌చేసి ఉండటంతో ఏకంగా రూ.1,500 కోట్ల విలువైన ఇంధనం వృథాగా ఖర్చయిపోతోంది. ఇకపై ఈ వృథా ఉండదు. కేంద్ర ప్రభుత్వానికి సైతం రూ.6,000 కోట్లు పరోక్షంగా ఆదా అవుతాయి. కొన్ని నెలల్లో దేశవ్యాప్తంగా అమలుచేయబోయే మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోల్(ఎంఎల్ఎఫ్ఎఫ్) విధానంతో వాహనదారులకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం. గతంలో టోల్ వద్ద మ్యాన్యువల్ విధానం ఉన్నప్పుడు ఒక్కో వాహనదారుడు టోల్‌ఫీజు చెల్లించేందుకు మూడు నుంచి పది నిమిషాల సమయం పట్టేది. ఫాస్టాగ్ వచ్చాక ఈ సమయం 60 సెకన్లు, అంతకంటే తక్కువకు దిగొచ్చింది. ఇకమీదట ఆ సమయం సున్నాకు చేరుకోబోతోంది. టోల్‌ప్లాజాల వద్ద కార్లు ఏకంగా గంటకు 80 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోవచ్చు. టోల్ వద్ద మిమ్మల్ని ఎవరూ ఆపరు'' అని మంత్రి చెప్పారు.

నంబర్ ప్లేట్‌ను గుర్తుపట్టి..

''నంబర్ ప్లేట్‌ను ఫాస్టాగ్, ఏఐ సాయంతో శాటిలైట్ అనేది గుర్తించి టోల్‌ప్లాజా వద్ద రుసుము చెల్లింపును అత్యంత సులభతరం చేయనుంది. ఇందుకోసం ఏఐ అనలైటిక్స్‌తో పనిచేసే ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్(ఏఎన్‌పీఆర్) వ్యవస్థ, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్(ఫాస్టాగ్)ల కలబోతగా ఎంఎల్ఎఫ్ఎఫ్ విధానాన్ని అమలుచేయబోతున్నాం. దీంతో టోల్‌ప్లాజాల వద్ద బడానేతల పేర్లు చెప్పి రుసుములు చెల్లించకుండా వెళ్లిపోవడం, బెదిరింపులు, చెల్లింపుల్లో సమస్యలు వంటివన్నీ మటుమాయం అవుతాయి. పేమెంట్ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుంది. ఇదంతా 2026 ఏడాది చివరికల్లా 100 శాతం అమల్లోకిరానుంది. ఈ విధానంలో ఏవైనా అవకతవకలు చేయాలని కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తే అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడం. ఇప్పటికే ఇతర పనులు సవ్యంగా చేయని కాంట్రాక్టర్లను రెండేళ్ల పాటు పనుల నుంచి డిబార్ చేస్తాం. మరోదఫా టెండర్లు వేయడానికి కూడా అనుమతించబోం'' అని గడ్కరీ స్పష్టంచేశారు.

ఆ సమస్యలు మావి కాదు

''జాతీయరహదారులపై నిర్వహణ మాత్రమే కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉంటుంది. రాష్ట్రాల రహదారులు, నగర రహదారుల్లో రోడ్ల నిర్వహణ అనేది మా చేతుల్లో ఉండదు. స్టేట్, సిటీ రోడ్ల సంబంధ సమస్యలను సామాజిక మాధ్యమాల్లో కొందరు జాతీయరహదారుల సమస్యగా తప్పుగా చిత్రీకరిస్తున్నారు. వ్యవస్థను పారదర్శకంగా మార్చి అక్రమాలు జరక్కుండా చూస్తాం. పైలట్ ప్రాజెక్ట్‌గా ఇప్పటికే ఎంఎల్ఎఫ్ఎఫ్ అమలవుతోన్న టోల్‌ప్లాజాల్లో ప్రాజెక్ట్ విజయావకాశాలను బేరీజువేసుకుని ఇతర ప్రాంతాల్లో దశలవారీగా ఈ విధానాన్ని విస్తరించుకుంటూ వెళ్తాం. వచ్చే కొన్ని నెలల్లో ఆయా టోల్‌ప్లాజాల్లో భౌతికంగా అక్కడ ఎలాంటి టోల్‌బూత్‌లు, బ్యారియర్లు, మెయిన్‌టెనెన్స్ సిబ్బంది లేకపోవడంతో నిర్వహణ ఖర్చులు సైతం కలిసిరానున్నాయి'' అని మంత్రి చెప్పారు.

వెనిజులాపై ట్రంప్... పూర్తిస్థాయి యుద్ధం?

- చమురు నౌకల అడ్డగింత
- దేశాన్నే దిగ్బంధిస్తామని హెచ్చరిక
- చమురు క్షేత్రాలు, భూములు, ఆస్తులు తమవేనని ప్రకటన
- ఐరాసకు ఫిర్యాదు చేస్తాం: వెనిజులా

వాషింగ్టన్: దక్షిణ అమెరికా దేశం వెనిజులాలోని అపార చమురు నిల్వలపై కన్నేసిన ట్రంప్, వాటిని ఎలాగైనా చేజిక్కించుకునే ప్రయత్నాలకు మరింత పదును పెడుతున్నారు. అందులో భాగంగా ఆ దేశానికి చమురు నౌకల రాకపోకలపై పూర్తి నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించారు. సాగర జలాల్లో భారీగా నేవీ, సైన్యాన్ని మోహరించి ప్రతి చమురు నౌకనూ అడ్డుకుని తీరుతామని సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్'ఖాతాలో మంగళవారం ఆయన పోస్ట్ పెట్టారు. 'వెనిజులాను అన్నివైపుల నుంచి దిగ్బంధించాం. కనీవినీ ఎరగనంతటి సంఖ్యలో సైన్యం ఆ దేశాన్ని చుట్టుముట్టనుంది. వెనిజులా చమురు విక్రయ సొమ్మంతా అమెరికాలోకి డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటివాటికే ఉపయోగపడుతోంది. ఇది మా దేశ భద్రతకే సవాలుగా మారింది. అందుకే ఈ దిగ్బంధం. న్యాయబద్ధంగా అమెరికాకు చెందాల్సిన వెనిజులాలోని అపార చమురు నిల్వలు, భూములు, ఆస్తులు అన్నింటినీ మాకు అప్పగించేదాకా వదలం' అని స్పష్టం చేశారు. గత నెలలో కూడా వెనిజులా తీర సమీపంలో ఆ దేశ చమురు నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. ట్రంప్ తీరుపై వెనిజులా మండిపడింది. 'ఒక సార్వభౌమ దేశంలోని ఆస్తులు, చమురు క్షేత్రాలు తమావేవని అంటారా? అంతర్జాతీయ చట్టాలను, స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలను ట్రంప్ తుంగలో తొక్కుతున్నారు. దీనిపై ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేస్తాం' అని ఒక ప్రకటనలో పేర్కొంది. ట్రంప్ అసలు ఉద్దేశం డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ కట్టడి కాదని స్వయానా ఆయన చీఫ్ ఆఫ్ స్టాఫ్ సుసీ వైల్స్ స్పష్టం చేశారు. మాట వినని ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను గద్దె దింపడమేనని ఆయన అసలు లక్ష్యమని కుండబద్దలు కొట్టారు! ఈ మేరకు వానిటీ ఫెయిర్ వైల్స్‌కు ఇచ్చిన సంచలనాత్మక ఇంటర్వ్యూ మంగళవారం ప్రచురితమైంది. మదురో కాళ్లబేరానికి వచ్చి తప్పుకునేదాకా వెనిజులా చమురు నౌకలను పేల్చేస్తూనే ఉంటామని కూడా ఆయన స్పష్టం చేయడం విశేషం! వెనిజులాలో ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వకున్న విషయం తెలిసిందే. ఆ దేశం ఏకంగా రోజుకు 10 లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తి చేస్తుంది. అక్కడి ఆర్థిక వ్యవస్థకు చమురు ఆదాయమే జీవనాడి.



ట్రంప్

అమెరికాలోకి రాకుండా మరో 20 దేశాలపై నిషేధం

ట్రంప్ నిర్ణయం, ఉత్తర్వులు

వాషింగ్టన్: అమెరికాలోకి ప్రవేశించకుండా నిషేధించిన దేశాల జాబితాను ట్రంప్ యంత్రాంగం మరింత విస్తరించింది. మరో 20 దేశాలను తాజాగా అందులోకి చేర్చింది. అమెరికా జాతీయ భద్రత, ప్రజల భద్రత ప్రయోజనాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. సంబంధిత ఉత్తర్వులపై అధ్యక్షుడు మంగళవారం సంతకం చేశారు. బుర్కినా ఫాసో, మాలీ, నైగర్, దక్షిణ సుడాన్, సిరియాపై పూర్తి ఆంక్షలు, అమెరికాలోకి ప్రవేశంపై నిషేధం విధించారు. మరో 15 దేశాలైన అంగోలా, ఆంటిగ్వా అండ్ బార్బుడా, బెనిన్, కోటె డి ఐవోయిర్, డొమినికా, గాబన్, ద గాంబియా, మలావీ, మార్షియానా, నైజీరియా, సెనెగల్, టాంజానియా, టోంగా, జాంబియా, జింబాబ్వే పాక్షిక నిషేధ పరిధిలోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 'ఈ దేశాలకు అమెరికా చట్టంపై గౌరవం లేదు. తన పౌరుల గురించిన సమగ్ర సమాచారం పొందుపరచడంలో అమెరికా నిఘా, భద్రతా, ఇమ్మిగ్రేషన్ విభాగాలకు అందించడంలో తరచూ విఫలమవుతున్నాయి' అని తెలిపారు. పాలస్తీనా అథారిటీ తాలూకు పత్రాలున్న వారి ప్రవేశాన్ని నిషేధించారు. వెస్ట్ బ్యాంక్, గాజాల్లో పలు ఉగ్రమూకలు చురుగ్గా పనిచేస్తున్నాయి. అమెరికా పౌరులను పొట్టన పెట్టుకున్నాయి. అందుకే ఈ చర్య' అని వైట్ హౌస్ పేర్కొంది.

వాటిపై కొనసాగింపు

అఫ్గానిస్తాన్, బర్మా సహా 12 దేశాలపై ఇటీవలే అమెరికా నిషేధం విధించడం తెలిసిందే. అది ఇకముందు కూడా కొనసాగనుంది. గత నెలలో ఒక అఫ్గాన్ దేశస్తుడు వాషింగ్టన్‌లో ఇద్దరు నేషనల్ గార్డ్ సిబ్బందిని కాల్చి చంపడం తెలిసిందే. ఆ నేపథ్యంలో అఫ్గాన్‌తో పాటు ఇలా పలు మూడో ప్రపంచ దేశాలపై అమెరికా కఠిన నిషేధాలు విధిస్తూ వస్తోంది.

ఢాకాలో భారత హైకమిషన్ వద్ద కలకలం

- ముట్టడించేందుకు దూసుకొచ్చిన వందలాది మంది ఆందోళనకారులు
- భారతవ్యతిరేక నినాదాలిచ్చిన నిరసనకారులు
- బంగ్లాదేశ్ దౌత్యవేత్తను పిలిపించి అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం కల్పిస్తోందన్న అక్కసుతో, ఆమెను తిరిగి అప్పగించాలన్న డిమాండ్‌తో బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వ అనుకూల ఆందోళనకారులు బుధవారం పేట్రేగిపోయారు. ఢాకాలోని ఇండియన్ భారత హైకమిషన్‌ను ముట్టడించేందుకు వందలాది మంది ర్యాలీగా వచ్చారు. బ్యారీకేడ్లను ఏర్పాటుచేసినా వాటిని ధ్వంసంచేసుకుంటూ నిరసకారులు ముందుకొచ్చారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. జూలై ఐక్యత బ్యానర్ పట్టుకుని ఆందోళనకారులు నిరసన కొనసాగించారు. భారత్‌కు పారిపోయిన హసీనా, ఇతర అగ్రనేతలు, ఉన్నతాధికారులను తిరిగి అప్పగించాలని డిమాండ్‌చేశారు. '' మేం ఇండియన్ హైకమిషన్‌పై దాడిచేయబోం .కానీ పరోక్షంగా మా దేశాన్ని ఆధిపత్యం చెలాయించేందుకు యత్నిస్తే చూస్తూ ఊరుకోం'' అని ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అనూహ్య ఘటనతో భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఢిల్లీలోని బంగ్లాదేశ్ దౌత్యవేత్త రియాజ్ హమీదుల్లాహ్‌ను తన కార్యాలయానికి తక్షణం రావాలంటూ ఆయనకు భారతవిదేశాంగ శాఖ సమన్లు జారీచేసింది. ఆఫీస్‌కు వచ్చిన రియాజ్‌పై మోదీ సర్కార్ తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. '' ఇటీవలకాలంలో బంగ్లాదేశ్‌లో భద్రతా పరిస్థితులు అధ్వాన్నంగా తయారవుతున్నాయి. భారత వ్యతిరేక పుకార్లు షికార్లుచేస్తున్నాయి. ఈ తప్పుడు కథనాలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవట్లేదు. బెదిరింపుల వంటి ఘటనలకు సంబంధించిన సాక్ష్యాధారాలు, పత్రాలనూ మాతో పంచుకోవట్లేదు'' అని ఆయనతో కేంద్రప్రభుత్వం తన అభ్యంతరాలను వ్యక్తంచేసింది.

భారత వీసా కేంద్రం మూసివేత

పరిస్థితులు అదుపు తప్పొచ్చనే అంచనాతో ముందస్తు చర్యగా ఢాకాలోని భారత వీసా జారీ కేంద్రాన్ని మోదీ సర్కార్ మూసేసింది. ఢాకాలోని జమునా ఫ్యూచర్ పార్క్‌లో ఈ 'ది ఇండియన్ వీసా అప్లికేషన్ సెంటర్(ఐవీఏసీ)' ఉంది. ఢాకాలోని అన్ని భారతీయ వీసా సేవా సెంటర్లకు ఇదే సమీకృత కేంద్రంగా పనిచేస్తోంది. ఇప్పటికే షెడ్యూల్ చేసిన వీసాల దరఖాస్తుల పరిశీలనను రీషెడ్యూల్ చేస్తున్నట్లు ఐవీఏసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

సాగర్ నీటి మట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 571.40 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 20,654 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల సమాచారం
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడం లేదు. దిగువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నారు. నిల్వ 41.9800 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు
తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.1400, మోడల్ ధర రూ.1200 వరకు పలికింది.

గిట్టుబాటు.. కష్టదాటు

- జిల్లాలో 66,082 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు
- దిగుబడి అంచనా 4,22,928 మెట్రిక్ టన్నులు
- వచ్చింది 3.50 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు ప్రభుత్వం కొనుగోలు చేసింది 26 వేల టన్నులే..
- తేమ శాతం, నిబంధనల పేరుతో కొనని ప్రభుత్వం
- తేమ, నూక పేరుతో మిల్లర్లు, దళారుల దోపిడీ

చేబ్రోలులో రైతులతో మాట్లాడుతున్న అధికారి తులసి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆరుగాలం శ్రమించి తుపాన్లు, భారీ వర్షాలను తట్టుకుని పండించిన రైతులకు గిట్టుబాటు ధర కరువైంది. ప్రభుత్వం ఇస్తున్నట్లు చెబుతున్నా వాస్తవానికి క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది.

తేమ, నూక శాతం పేరుతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోతే, దళారులు ధర తగ్గించి రైతులను నష్టాలపాలు చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో 66,082.46 హెక్టార్లలో వరి సాగు చేశారు. హెక్టారుకు 64 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా. అంటే మొత్తం 4,22,928 మెట్రిక్ టన్నుల దిగుబడి రావాలి. వాస్తవంగా జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల కంటే వచ్చే పరిస్థితులు లేవని రైతు సంఘాలు, నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో 188 రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు సుమారు 26 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రైతుల వద్ద దండిగా ఉన్న సమయంలో తుపాన్లు, తేమ శాతం నిబంధనల పేరుతో సక్రమంగా కొనుగోలు చేయడం లేదు. రైతులు గత్యంతరం లేక దళారులను ఆశ్రయించి, వారు చెప్పిన తక్కువ ధరకే అయిన కాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు లక్ష్యానికి దూరంగానే మిగిలిపోయింది.

కొనుగోలుకు సవాలక్ష నిబంధనలు

ప్రభుత్వం ఏ- గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,389, 75 కిలోల బస్తాకు రూ.1,792 మద్దతు ధర ప్రకటించింది. అయితే, తేమ, నూక పేరుతో మిల్లర్లు, దళారుల దోపిడీకి కొందరు సిబ్బంది సహకరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర పొందడానికి సేకరణ నిబంధనల మేరకు గరిష్ట తేమ 17 శాతం ఉండాలి. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నాలుగు, ఐదు రోజుల పాటు ఆరబోసిన ధాన్యాన్ని మిల్లుకు పంపితే నూక పేరుతో, తేమ అధికంగా ఉందంటూ తరుగు తీస్తున్నారు. ఆరబెట్టినా, పెట్టకపోయినా బస్తాకు మూడు కిలోల కోత మాత్రం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. చిన్న, సన్నకారు రైతులకు చెందిన ధాన్యాన్ని ఒకే లారీలో మిల్లుకు పంపుతుంటారు. వీరు పంపిన లోడులో ఇతరుల పేరుతో కొన్ని బస్తాలు నమోదవుతున్నాయని చెబుతున్నారు. 75 కిలోల బస్తాకు ఒక్కో రైతు రూ.70 నుంచి రూ.100 వరకు నష్టపోతున్నాడు. గత్యంతరం లేక రైతులు, దళారులను ఆశ్రయిస్తూ వారు చెప్పిన తక్కువ రేటుకే అమ్ముకుంటున్నారు. ఇప్పటి దాకా వారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు సమాచారం.

రైతుల సమస్యలు పట్టడం లేదు .

మండలాల్లో అధికార యంత్రాంగం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంను దళారులు నేరుగా రైతుల పేరిట దర్జాగా మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నేరుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే రైతుకు మద్దతు ధర లభిస్తుంది. దీనిపై అవగాహన లేని రైతులు కల్లాల్లోనే వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. ఈ వ్యవహారంలో కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది కమీషన్లకు కక్కుర్తిపడి దళారులకు సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ధాన్యం బస్తా రూ.1400 లకే వ్యాపారులు అడుగుతున్నారని రైతులు చెబుతున్నారు. కూలీ, బాడుగకు రూ. 44 రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా 75 కిలోల బస్తాకు 60 రూపాయలు దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు.

నిలదీస్తే కొర్రీలు

అక్రమ కోత, తరుగును ప్రశ్నిస్తే ధాన్యం సేకరణలో కొర్రీలు వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన మిల్లుల వద్ద రైతులు, నిర్వాహకుల మధ్య నిత్యం వాగ్వాదాలు జరుగుతున్నాయి. 75 కిలోల బస్తాకు మూడు కిలోల తరుగును అనుమతిస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు తెగేసి చెబుతున్నారని సమాచారం. ఇక కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. కౌలుతో పాటు కోత ధరలు అమాంతం పెరగడంతో నష్టాలను ఎదుర్కొంటున్నారు.

అదునుకు కొనుగోలు చేయక..

చేతికి అందివచ్చిన ఖరీఫ్ పంట ఇక నోటికి అందుతుందనుకున్న రైతుల ఆశలపై అధిక వర్షాలు, వరుస తుపాన్లు నీళ్లు జల్లాయి. ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి, తడిసి రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసి, కష్టాల్లో ఉన్న తమను ఆదుకుంటుందని అన్నదాతలు భావించారు. అయితే తేమ శాతం నిబంధనల పేరుతో ప్రభుత్వం వారి ఆశలను అడియాసలు చేసింది. మరో గత్యంతరం లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు చెప్పిన తక్కువ రేటుకే అమ్ముకుంటున్నారు. ఈ విధంగా దళారులు సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు సమాచారం.

ఉప్పలపాడు రైతు భరోసా కేంద్రం నుంచి ధాన్యం తరలింపు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ జరగటం లేదు

గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరణ అరకొరగానే జరుగుతోంది. గోతాలు లేవని,మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీ (బిజీ) పూర్తయింది అని జాప్యం చేస్తున్నారు. 75 కిలోల ధాన్యం బస్తా రూ.1792 కొనుగోలు చేయాల్సి ఉండగా బహిరంగ మార్కెట్లో రూ.1400 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.

– మట్టుపల్లి పోతురాజు, రైతు, సుద్దపల్లి, చేబ్రోలు మండలం.

పది రోజులు ఆరబెట్టినా ఫలితం శూన్యం

నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేసినా ఆశించిన ఫలితంలేదు. ఎకరాకు 40 బస్తాలు ధాన్యం వస్తుందని ఆశిస్తే 28 బస్తాలు మాత్రమే దక్కింది. ఎండలో తిరగబెడుతూ పది రోజులు ఆరబెట్టినా ధర రూ.1520 దాటలేదు.

– వెంకటాద్రి, రైతు, పచ్చలతాడిపర్రు

న్యూస్‌రీల్

పూర్వ విద్యార్థుల రజతోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్ : గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ వేడుకల పోస్టర్‌ను బుధవారం వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996–2000 సంవత్సరాల మధ్య విద్యనభ్యసించిన విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. వేడుకలు విజయవంతం కావడానికి అన్ని సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేసీహెచ్ కావ్య, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు ఇంజనీరింగ్ విభాగం వైస్ ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవస్థానం పరిసరాల్లో ప్లాస్టిక్ నిషేధం

మంగళగిరి టౌన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, ఆలయ ఎగువ దిగువ సన్నిధులు, శ్రీ గండాలయస్వామి పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆలయ పరిసర ప్రాంతాల్లో హెచ్చరిక బ్యానర్లను ఏర్పాటు చేశారు. కొండపై గల శ్రీ గండాలయస్వామి వారిని దర్శించి దీపం పెట్టే భక్తులు వారి వెంట తీసుకువచ్చే ప్లాస్టిక బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లు తిరిగి వారితో పాటే తీసుకువెళ్లాలని సూచించారు. భక్తులు ప్లాస్టిక్ వ్యర్థాలను కొండపై వదిలి వెళ్లరాదని ఆయన కోరారు. దేవాలయ పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పేర్కొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి

పాలేటి సుబ్బారావు

కారంచేడు: బాపట్ల జిల్లా కారంచేడు గ్రామానికి చెందిన 103 సంవత్సరాల శతాధిక వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన మృతితో గ్రామంలోని పాలేటి వారి బజారులో విషాదఛాయలు అలముకున్నాయి. మండల కేంద్రమైన కారంచేడు గ్రామానికి చెందిన పాలేటి సుబ్బారావు (103)కు 92 సంవత్సరాల భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మనవలు, మనవరాళ్లు, ముదిమనవలతో కలిపి సుమారు 20 మందికి పైగా సంతానం ఉన్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన సుబ్బారావు అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు.

నూనె గింజల యాజమాన్య పద్ధతులపై పుస్తకాల విడుదల

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ సమాచార ప్రసార కేంద్రం నేతృత్వంలో నూనె గింజల పంటల్లో కలుపు యాజమాన్యంపై పుస్తకాల విడుదల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీ దేవి మాట్లాడుతూ రైతులు క్షేత్రస్థాయిలో చీడపీడలను గుర్తించి, సరైన యాజమాన్య చర్యలు చేపట్టేటట్లు సరళంగా, పుస్తకాలను రూపొందించినట్లు తెలిపారు. వీటి రూపకల్పనలో భాగస్వాములైన శాస్త్రవేత్తలను ఆమె అభినందించారు. రైతులు ఈ పుస్తకాలను సద్వినియోగించుకుని మంచి దిగుబడులు సాధించాలని శారదజయ లక్ష్మి దేవి కోరారు.

ఉపాధ్యాయులు, జానపద కళాకారులకు సత్కారం

అలరించిన జానపద సాంస్కృతిక సంబరాలు

నగరంపాలెం: భావితరాలకు భారతీయ కళల ప్రాశస్త్యాన్ని తెలియజేయాలని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్ తెలిపారు. మార్కెట్ కూడలిలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం రాత్రి నాట్స్ ఆధ్వర్యంలో జానపద సాంస్కృతిక సంబరాలు, ఉత్తమ ఉపాధ్యాయులు, కవులకు పురస్కారాలు ప్రదానం చేశారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు నిర్వహణలో అతిథులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా నాట్స్ చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్ మాట్లాడుతూ భారతీయ కళలు అంతరించపోకుండా జానపద, సాంస్కృత సంబరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ కళలను ప్రోత్సహించాలని చెప్పారు. జానపద కళలను చిన్నతనంలో తిలకించానని, ప్రస్తుతం నిర్వహించిన ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. నాట్స్ అధ్యక్షుడు మందాడి శ్రీహరి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో సేవా, సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా రాష్ట్రాలలో జానపద కళలను ప్రోత్సహించేందుకు కళాకారులకు ఆర్థికంగా చేయూత అందిస్తున్నామని పేర్కొన్నారు. సంస్కృతీ, సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు నాట్స్ అన్నివేళల్లో ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నాట్కో లక్షలాది రూపాయలతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ప్రజా గాయకుడు పి.వి. రమణ నేతృత్వంలో కళాకారుల విన్యాసాలు అలరించాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలు, అంబేడ్కర్ కోనసీమ, కృష్ణ జిల్లాలతో పాటు మలినేని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల కోలాటం, డప్పు, కొమ్ము కోయి తదితర నృత్యాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మందాడి కిరణ్, వేమూరి శ్రీనివాసరావు, వైద్యులు ఏ.ఆంజనేయులు, జన చైతన్య వేదిక నిర్వాహకులు లక్ష్మణ్‌రెడ్డి, కాకుమాను నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల విన్యాసం

చిన్నారుల కోలాటం

ప్రైవేటు సేవలో సూపర్ స్పెషలిస్టులు

- జీజీహెచ్‌లో జీతాలు తీసుకుంటూ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు
- సూపర్ స్పెషాలిటీ సేవల కోసం వచ్చే పేద రోగులకు తప్పని తిప్పలు ...
- పట్టించుకోని ఆసుపత్రి అధికారులు

గుంటూరు మెడికల్ : సాధారణ వైద్య సేవలు సైతం ఖరీదైపోతున్న నేటి రోజుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు పొందాలంటే పేద రోగులు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది. గుండె, కిడ్నీ, క్యాన్సర్ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు గుంటూరు జీజీహెచ్ పేదలకు పెద్ద దిక్కుగా ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల కంటే మెరుగైన, అధిక సంఖ్యలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే వైద్య విభాగాలు కలిగి ఉన్న గుంటూరు జీజీహెచ్‌లో సూపర్ స్పెషలిస్టుల సేవలు అంతంత మాత్రంగానే లభిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్యులు గుంటూరు జీజీహెచ్‌లో జీతాలు తీసుకుంటూ ఎక్కువ సమయం ప్రైవేటు ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పాటించని సమయవేళలు

- గుంటూరు జీజీహెచ్‌లో న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజి, సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలు ఉన్నాయి.
- గుంటూరు వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న గుంటూరు జీజీహెచ్‌లో సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవల కోసం పలు జిల్లాలకు చెందిన పేద రోగులు ప్రతిరోజూ వేలల్లోనే వస్తున్నారు. అయితే సూపర్ స్పెషలిస్టుల ఓపీ సమయాలు చాలా తక్కువ సమయం ఉంటున్నాయి. ప్రతిరోజూ వైద్య సేవలు లభించడం లేదు.
- వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఓపీ విభాగాల్లో అందిస్తున్నారు. ఓపీ పనివేళలు సైతం చాలా తక్కువ మొత్తంలోనే ఉంటున్నాయి. చెప్పుకోవడానికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ బోర్డులపై పనివేళలు రాసి ఉంచుతారు. నిర్ణీత పనివేళల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలకు తాళాలు

మధ్యాహ్నం వైద్యం నిల్

- సూపర్‌స్పెషాలిటీ వైద్యులు జీజీహెచ్ ఇతర వైద్యుల సమయ పాలన మాదిరిగా మధ్యాహ్నం ఓపీలు నిర్వహించడం లేదు.
- వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంది. ఉదయం ఓపీల అనంతరం మధ్యాహ్నం భోజన సమయం అనంతరం తప్పనిసరిగా మధ్యాహ్నం ఓపీలు నిర్వహించాల్సి ఉంటుంది.
- స్పెషాలిటీ వైద్యులు కొందరు మధ్యాహ్నం భోజనం అనంతరం నాలుగు గంటల వరకు ఓపీలు నిర్వహిస్తున్నారు. కాని, సూపర్‌స్పెషాలిటీ వైద్యులు ఒక్కరు కూడా మధ్యాహ్నం ఓపీలు నిర్వహించడం లేదు.
- ఒక పక్క జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండక, మరోపక్క ప్రైవేటు ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు చెల్లించే స్థోమత లేక పేద, మధ్యతరగతి ప్రజలు రోగాలతో కాలం గడిపేస్తున్నారు.
- ఆసుపత్రి అధికారులు సైతం సూపర్ స్పెషాలిటీ వైద్యుల పనితీరును పర్యవేక్షించకుండా మిన్నకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది.
- జీజీహెచ్ అధికారులు ఇప్పటికైనా సూపర్‌స్పెషాలిటీ వైద్యుల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించి, పేద రోగులకు సత్వర వైద్య సేవలు అందేలా చూడాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

విభాగాధిపతులే అందుబాటులో ఉండటం లేదు

- సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాధిపతులు పలువురు సొంత ప్రాక్టీస్‌లో బిజీగా ఉండి జీజీహెచ్‌లో నిర్ణీత వేళల్లో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు న్నాయి.
- కొన్ని వైద్య విభాగాధిపతులు సొంతంగా ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. కొంత మంది వైద్య విభాగాధిపతులు స్థానికంగా నివాసం ఉండకుండా వారంలో కొద్దిరోజులు జీజీహెచ్‌లో ఉండి, మరికొద్ది రోజులు సొంత ఊర్లకు చెక్కేస్తున్నారు.
- వైద్య విభాగాధిపతుల పర్యవేక్షణ లేకపోవడం, కొంత మంది వైద్య విభాగాధిపతులే ఓపీల్లో నిర్ణీత వేళల్లో ఉండకపోవడంతో కింది స్థాయి సిబ్బంది తూతూమంత్రంగా విధులు నిర్వహిస్తున్నారు.
- కొంత మంది అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సైతం సొంత ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కువ సమయం గడిపేస్తూ జీజీహెచ్‌కు వచ్చే పేద రోగులకు స్పెషాలిటీ వైద్య సేవల కోసం చుక్కలు చూపిస్తున్నారు.
- అధిక శాతం మంది పీజీ వైద్యులపైనే ఓపీలు నడిపించేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి, పొరుగు జిల్లాల నుంచి సూపర్ స్పెషలిస్టుల వైద్య సేవల కోసం వచ్చే పేద రోగులకు అడ్మిషన్ దొరకాలంటే వారాల కొద్ది సమయం పడుతోంది.
- అడ్మిషన్ అయిన తరువాత నుంచి చికిత్స పొందేందుకు మరికొంత సమయం పడుతోంది. ఇలా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కోసం వస్తున్న పేద రోగులకు సకాలంలో సత్వర వైద్యం అందడంలేదు.

మురుగు నీటికి అడ్డు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లి రూరల్ : కుంచనపల్లి బైపాస్ రోడ్డులో గల ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంట కాలువకు అడ్డుకట్ట తొలగించడంతో మురుగునీరు మొత్తం బయటకు వెళ్లిపోయింది. బుధవారం సాక్షిలో ముంచెత్తుతున్న మురుగునీరు, పొంగిపొర్లుతున్న ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కథనం వెలువడింది. దీనికి స్పందించిన కార్పొరేషన్ అధికారులు ప్రాతూరు, కుంచనపల్లి మధ్య కాలువకు రైతులు అడ్డంగా వేసిన కట్టను తొలగించారు.దీంతో ఒక్కసారిగా మురుగు నీరు మొత్తం కిందకు వెళ్లింది. పంపింగ్ స్కీంతో పాటు అపార్ట్‌మెంట్ల వద్ద నిలిచిపోయిన మురుగునీరు కిందకు వెళ్లింది. రైతులు మాత్రం మురుగు నీరు వల్ల చాలా ఇబ్బందులు తలెత్తాయని, కార్పొరేషన్ అధికారులు వెంటనే ప్రత్యామ్నాయం చూసుకుని, పంట కాలువలో మురుగునీరు పారకుండా చూడాలని కోరుతున్నారు.

పంట కాలువలో తగ్గిన మురుగు నీటి మట్టం

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	54,461
అమ్మకాలు	52,190
నిల్వ	13,820

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,000
నంబరు–5	11,500–15,400
273	11,500–14,300
341	10,500–16,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–16,700
నంబరు–5	11,000–15,300
341	11,000–16,500
4884	11,000–14,300
సూపర్–10	12,000–16,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 16,000
బాడిగ–355	10,500 – 16,400
దేవనూరు డీలక్స్	11,000 – 17,200
ఆర్మూర్	10,000 – 12,500
తాలుకాయలు	5,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	11,000–14,800
బాడిగ – 355	10,000–16,300
దేవనూరు డీలక్స్	10,500–15,600
తాలు	5,200 – 6,800

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 812

కొమ్ములు : 574 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	13,100	11,650

కాయలు : 238 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	12,500	11,650

మొత్తం అమ్మకాలు : 609.00 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

రైల్వే క్రికెట్ జట్టుకు మార్గదర్శిగా సీనియర్ డీసీఎం ప్రదీప్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): భారతీయ రైల్వే సీనియర్ పురుషుల క్రికెట్ జట్టుకు మార్గదర్శిగా ఐఆర్‌సీటీసీ అధికారి, గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్ చిలుకను బుధవారం రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్స్ బోర్డు నియమించారు. ఈ నియామకం విజయ్ హజారే ట్రోఫీ 2025లో భారతీయ రైల్వే క్రికెట్ జట్టు పాల్గొనే కాలాన్ని కవర్ చేస్తుంది. డిసెంబర్ 16 నుంచి 23వ తేదీ వరకు బెంగళూరులోని రైల్ వీల్ స్పోర్ట్స్ అసోసియేషన్‌లో నిర్వహించనున్న ప్రీ పార్టిసిపేషన్ కోచింగ్ క్యాంప్‌ను పర్యవేక్షిస్తారు. అనంతరం బెంగళూరులోనే జరగనున్న లీగ్ దశ పోటీల్లో జట్టుకు మార్గదర్శకం వహిస్తారు. ఈ టోర్నమెంట్ జనవరి 2026తో ముగియనుంది. ప్రదీప్‌కుమార్‌ను అధికారులు అభినందించారు.

సావిత్రి భాయి పూలే అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: సావిత్రి భాయి పూలే అవార్డు–2026 ప్రదానం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సావిత్రి భాయ్ పూలే 95వ జయంతి సందర్భంగా బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా, నగర శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న బీసీ మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయుల, వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. గత పది సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని ఈ అవార్డు కోసం ఈ నెల 25వ తేదీలోగా 8985618861, 9440536495 వాట్సాప్ నంబర్లకు బయోడేటా పంపాలని సూచించారు.

ఆటో బోల్తా .. ఒకరి మృతి

నలుగురికి స్వల్ప గాయాలు

మాచవరం: అతివేగంగా వెళుతున్న ఆటో బోల్తా కొట్టడంతో ఒకరు మృతి చెందగా, నలుగురికి స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామం వద్ద చోటు చేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం పిడుగురాళ్ల మండలం కొత్త వెల్లంపల్లి గ్రామానికి చెందిన కొందరు కూలి పనుల నిమిత్తం మండలంలోని వేమవరం గ్రామానికి ఆటోలో బయలుదేరారు. గంగిరెడ్డిపాలెం గ్రామ సమీపానికి రాగానే ఆటో అతివేగంగా ప్రయాణిస్తూ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న చెడపాంగు గురవయ్య (65) కు తీవ్ర గాయాలుగా హాస్పిటల్ కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలు కాగా మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రథమ చికిత్స అందించారు.

తీవ్ర సంక్షోభంలో వ్యవసాయ రంగం

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరులోని ఓ హోటల్‌లో బుధవారం వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని నిలబెట్టుకునేందుకు రైతులను సంఘటిత పరచాలని ఆ దిశగా ఉద్యమాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా గుంటూరులో వచ్చే ఏడాది జనవరి 29, 30, 31, ఫిబ్రవరి ఒకటో తేదీన జరగనున్న అఖిలభారత కిసాన్ సమితి జాతీయ సమావేశాల్లో ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం రైతుల చేతుల్లో నుంచి కార్పొరేట్ శక్తుల్లో చేతుల్లోకి వెళ్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభం వల్ల స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ వాటా తగ్గిపోయిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగంలో ఒక్క పంటకీ గిట్టుబాటు ధరలు లేవన్నారు. గుంటూరులో జరిగే ఏఐకేఎస్ జాతీయ సమావేశాలకు రైతు సంఘం నాయకులు అశోక్ దావాలే, హనన్ మొల్ల విజూ కృష్ణ హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ టి.రత్నారావు, కిసాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు బండ్ల సూరయ్యా చౌదరి, లాం ఫారం మాజీ అసోసియేట్ డైరెక్టర్ ఆర్.అంకయ్య, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ మూర్తి వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ సమావేశాలకు సంబంధించిన ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ ఆందోళన

- నేడు అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, మెడికల్ కళాశాలల వద్ద ధర్నాలు
- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద, రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నామని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసినప్పుడే పాలన విజయవంతమవుతుందని, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సహాయం వంటి 'సూపర్ సిక్స్' హామీలను పక్కన పెట్టి 'సూపర్ సక్సెస్' అని చెప్పుకోవడం ఆత్మ సంతృప్తికి తగదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ. మూడు వేలు ఉపాధి భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం, ఆ హామీ అమలులో ఎందుకు వెనుకంజ వేస్తోందో సమాధానం చెప్పాలని నిలదీశారు. అనంతరం జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగరకార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌కు నిహాల్ ఎంపిక

నిహాల్‌ను అభినందిస్తున్న దుర్గాప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: మణిపూర్‌లో జనవరి 4వ తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌నకు శ్రీచైతన్య జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థి దానియేలు నిహాల్ ఎంపికైనట్లు విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం లక్ష్మీపురంలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడారంగంలో విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పెదకాకాని మండలం వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్లో జరిగిన అండర్–19 రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించిన తమ విద్యార్థి దానియేలు నిహాల్ జాతీయస్థాయికి అర్హత సాధించాడని తెలిపారు. ఈసందర్భంగా నిహాల్‌ను అభినందించారు. కార్యక్రమంలో మహతి క్యాంపస్ ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

తెనాలి నుంచి పెద్దాపురానికి ధాన్యం రవాణా

లోడింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా మేనేజరు తులసి

తెనాలి: రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని తెనాలి నుంచి తొలిసారిగా రైల్వేర్యాక్‌తో 30 వ్యాగన్ల ధాన్యాన్ని బుధవారం సాయంత్రం పెద్దాపురంలోని పట్టాభి ఆగ్రో ఇండస్ట్రీస్‌కు తరలించారు. తెనాలి రైల్వేస్టేషన్‌కు లారీల్లో చేర్చిన ధాన్యాన్ని వ్యాగన్లలో లోడు చేశారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజరు కె.తులసి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జిల్లాలో తొలిగా కొనుగోలు కేంద్రం ప్రారంభించిన నాటి నుంచి నెలరోజుల వ్యవధిలో 26,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించినట్టు తెలియజేశారు. ఇందుకుగాను రూ.63 కోట్లను చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.53 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. తెనాలి నుంచి రైల్వే ర్యాక్‌లో ధాన్యం రవాణా ఇదే ప్రథమంగా చెప్పారు. ఆరు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రోడ్డు మార్గాన తరలివెళ్లినట్టు తెలిపారు. జిల్లాలో 20 మంది రైస్‌మిల్లర్లు సేకరించిన 20 వేల మెట్రిక్ టన్నుల బీపీటీ–5204 ధాన్యాన్ని మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగిస్తామని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు, పెద్దాపురంలోని పట్టాభి ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధులు, తెనాలి, కొల్లిపర మండలాల వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన క్రికెట్ పోటీలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సత్యనారాయణరెడ్డి

విజయవాడరూరల్: మండలంలోని నున్న గ్రీన్ హిల్స్ మైదానంలో 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్ ఏపీ) అండర్–17 బాలుర అంతర జిల్లా క్రికెట్ చాంపియన్‌షిప్ బుధవారం ప్రారంభమైంది. ఈ పోటీలను వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్. సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నీని నున్నలో రెండు మైదానాలు, సూరంపల్లిలో ఒక మైదానంలో లీగ్–కమ్–నాకౌట్ పద్ధతి నిర్వహిస్తారు. కృష్ణా, కడప, గుంటూరు, విశాఖ, తూర్పు గోదావరి జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. ప్రారంభ మ్యాచ్‌లో కడప జిల్లా గుంటూరుపై 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. తూర్పు గోదావరి జిల్లా ప్రకాశంపై 102 పరుగుల భారీ తేడాతో, కృష్ణా జిల్లాపై 35 పరుగుల తేడాతో గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. విజయనగరంపై విశాఖపట్నం పది వికెట్ల తేడాతో, కర్నూలుపై గుంటూరు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచాయి. కడప జిల్లా కర్నూలును 47 పరుగుల తేడాతో ఓడించింది. ఆతిథ్య కృష్ణా జిల్లా ప్రకాశంపై పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు ప్రవేశించింది. కృష్ణా బౌలర్ యశ్వంత్ అద్భుత ప్రదర్శనతో నాలుగు వికెట్లు పడగొట్టి తన జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా కార్యదర్శి ఎం.అరుణ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి టి.శ్రీలత, టోర్నీ పరిశీలకుడు డి.భూపాల్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ టి.విజయవర్మ పాల్గొన్నారు.

కొనసాగిన ఐటీహెచ్‌పీబీఏబీ గ్లోబల్ కాన్ఫరెన్స్

అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం గ్రామంలోని చలపతి ఫార్మశీ కళాశాలలో జరుగుతున్న గ్లోబల్స్ కాన్ఫరెన్స్ రెండవ రోజు బుధవారం కొనసాగింది. రెండవ రోజు కార్యక్రమాల్లో భాగంగా అవార్డు ఉపన్యాసాలు, పరిశోధనలపై సదస్సు నిర్వహించారు. ఇంటిగ్రేటింగ్ టెక్నాలజీ విత్ హెల్త్‌కేర్ ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, అగ్రికల్చర్, బయోమెడికల్ సైన్సెస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ (ఐటీహెచ్‌బీఏబీ–2025) గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో జపాన్ దేశానికి చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు ప్రొఫెసర్ మసాకో కినోషితా న్యూరాలజీ రంగంలో విశేషమైన పరిశోధనా, వైద్య అనుభవాన్ని వివరించారు. ఫార్మసీ రంగంలో జీవితకాల సేవలకు ప్రొఫెసర్ జి.నరహరిశాస్త్రికి, బయోటెక్నాలజీ రంగంలో జీవితకాల కృషికి డాక్టర్ శ్రీనివాసులుకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేశారు. పరిశ్రమలలో బయోటెక్నాలజీ అభివృద్ధికి కృషిచేసిన డాక్టర్ కె.సురేష్‌బాబుకు టాలెంటెడ్ ఇండస్ట్రియల్ బయోటెక్నాలజిస్ట్ అవార్డు అందించారు. ఏబీఏపీ సీనియర్ సైంటిస్ట్ అవార్డులు డాక్టర్ బిపిన్‌నాయర్, డాక్టర్ వెంకటదాసు వీరంకి, డాక్టర్ లతారంగన్‌లకు అందించి సత్కరించారు. యువ పరిశోధకుల ప్రతిభను గుర్తిస్తూ ఏబీఏపీ టాలెంటెడ్ ఇన్నోవేటివ్ సైంటిస్ట్ అవార్డులు డాక్టర్ శ్రీకాంత్‌గడాడ్, డాక్టర్ బృందా గన్నేరు, డాక్టర్ శ్రీనివాస్ పెంట్యాలాలకు అవార్డులు అందజేశారు. నానో సైన్స్, టెక్నాలజీ రంగంలో ఉన్నత పరిశోధనలకు డాక్టర్ శ్రీనివాసరెడ్డి బోనం, ఏబీఏపీ గోల్డ్ మెడల్‌ను, పరిశ్రమలలో వినూత్న ఆవిష్కరణలకు డాక్టర్ జి.వివేకానందన్‌కు ఏబీఏపీ ఇండస్ట్రీ ఇన్నోవేటివ్ అవార్డు ప్రదానం చేశారు. మొత్తం 161 ఒరల్ ప్రెజెంటేషన్లు 104 పోస్టర్ ప్రెజెంటేషన్లు జరిగాయి. చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ రామారావు నాదెండ్ల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డి నళినిదేవిలు రచించిన ఎమ్‌సీక్యూస్ ఇన్ పార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అనే పుస్తకాన్ని జపాన్‌కు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు ప్రొఫెసర్ మసాకో కినోషితా ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధికారులు ఇతర దేశాలకు చెందిన ప్రొఫెసర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీఎస్ నకార సేవలు చిరస్మరణీయం

ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నకార విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మంగళగిరి టౌన్: విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేసిన డీఎస్ నకార సేవలు చిరస్మరణీయమని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని పెన్షనర్స్ హోమ్‌లో జాతీయ పెన్షనర్ల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ పితామహులు డీఎస్ నకార విగ్రహాన్ని ఆవిష్కరించారు. అసోసియేషన్ సభ్యులు నకార విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం ప్రభుత్వానికి సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడంతో డీఎస్ నకార తన కర్తవ్యంగా న్యాయస్థానానికి వెళ్లారని గుర్తుచేశారు. దీంతో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చారిత్రాత్మక తీర్పు వెలువరించారని.. ఆనాటి నుంచి పెన్షనర్ దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటగా మంగళగిరిలో నకార విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు సీనియర్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాసు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిచ్చయ్య, కృష్ణయ్య, మంగళగిరి శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో పరిశోధనలకు పెద్దపీట

ఈడీ డాక్టర్ అహంతం శాంతసింగ్

వైద్యురాలికి షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డాక్టర్ శాంతసింగ్

మంగళగిరి టౌన్: వైద్య రంగంలో మంగళగిరి ఎయిమ్స్ గణనీయమైన పరిశోధనలు చేపడుతోందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతం శాంతసింగ్ పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో బుధవారం అనుసంధాన దివస్–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నాల్గవ వార్షికోత్సవ పరిశోధన దినోత్సవాన్ని డాక్టర్ అహంతం శాంతసింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాలుగు రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ గురువారంతో ముగియనుంది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైద్యవిద్య, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు ప్రధాన అంశాలపై ఎయిమ్స్ పనిచేస్తోందని పేర్కొన్నారు. క్యాన్సర్ వంటి రంగాల్లో పరిశోధనలు చేపడుతోందని, రక్తహీనత, సికెల్ సెల్ వ్యాధి వంటి సాధారణ, సంబంధిత ప్రజా సవాళ్లపై కూడా దృష్టి పెడుతోందని తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాపులో వివిధ విభాగాల వైద్య విద్యార్థులు పలు అంశాలపై రీసెర్చ్ చేశారని చెప్పారు. ఎయిమ్స్‌లో పేషెంట్ కేర్, మెడికల్ స్టూడెంట్స్, రీసెర్చ్ యాక్టివిటీ చక్కగా జరుగుతోందని ఇందుకు నాలుగు రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ నిదర్శనమన్నారు. మెడికల్, సర్జికల్, డెంటల్, నర్సింగ్ డిపార్ట్‌మెంట్లతో పాటు ఇతర డిపార్ట్‌మెంట్లలో 40 సెక్షన్లలో రీసెర్చ్ యాక్టివిటీ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పలు కేటగిరీల కింద రీసెర్చ్ చేసిన వారికి బహుమతులు అందించడంతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజ్ చైర్‌పర్సన్, డీన్ (రీసెర్చ్) డాక్టర్ జాయ్ ఎ.గోషల్, అసోసియేట్ డీన్ (రీసెర్చ్) డాక్టర్ మాధవరావు, అసిస్టెంట్ డీన్ (రీసెర్చ్) ఆర్తి గుప్త, ఆంధ్రప్రదేశ్ మాజీ డీఎంఈ, ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కె.బాబ్జీ, ఏపీఎంసీ అబ్జర్వర్ డాక్టర్ గోపాలన్, శోద్ క్లినికల్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మోనికా బహల్, నోవార్టిస్‌కు చెందిన డాక్టర్ అరుణ్‌భట్‌తో పాటు పలువురు ప్రతినిధులు, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

కారు డ్రైవింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో 2026 మార్చి 1వ తేదీ నుంచి కారు డ్రైవింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ, వెలుగు సౌజన్యంతో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కారు డ్రైవింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే జనవరి 22 వరకు మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరగుతోందని, జూట్ ప్రొడక్ట్స్‌లో వచ్చే జనవరి 22వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఉచిత శిక్షణకు 19 నుంచి 50 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అర్హులని స్పష్టం చేశారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనంతో పాటు, వసతి కల్పించడం జరుగుతోందని వివరించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్‌క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు, 0863–2336912, 8125397953, 9700687696 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు

జిల్లాలో 474 మందికి కౌన్సెలింగ్

నగరంపాలెం: జిల్లాలో ఈవ్‌టీజింగ్, ఇష్టానుసారంగా మోటారు సైకిళ్లను నడిపే వారిని గుర్తించే ప్రత్యేక డ్రైవ్ బుధవారం కూడా కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈవ్‌టీజింగ్‌కి పాల్పడిన 260 మంది, బైక్ పోటీలు, బైక్‌లపై వంకర్లుగా వెళ్తూ మిగతా చోదకులను ఇబ్బందులకు గురిచేసే 214 మందిని గుర్తించారు. ఈ మేరకు వారికి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని పోలీస్ అధికారులు హెచ్చరించారు. స్కూళ్లు, కళాశాలలు, ప్రధాన రహదారులు, జనసంచారం రద్దీగా ఉండే ప్రాంతాలు, దుకాణాల సముదాయాలు, మార్కెట్‌లు, థియేటర్లు, రైల్వే/బస్టేషన్లు వద్ద డ్రైవ్ కొనసాగింది. ఈవ్‌టీజింగ్, బైక్ పోటీలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేదిలేదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి డీడీఓలను ఆశ్రయించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్ పరిధిలోని జిల్లా విద్యాశాఖాధికారులతో పాటు ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, హెచ్ఎంలు, బోధన, బోధనేతర సిబ్బంది వ్యక్తిగత, సర్వీసు రూల్స్, ఫిర్యాదులను డ్రాయింగ్ అండ్ డిస్‌బర్సింగ్ అధికారి (డీడీవో) ద్వారా పరిష్కరించుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీడీవో స్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు, ఫిర్యాదులను డీఈవో, ఆర్జేడీకి రాతపూర్వకంగా తెలియజేయాలని ఆయన సూచించారు. సంబంధిత అధికారుల వద్ద సమస్య పరిష్కారం కాని పక్షంలో అప్పీల్స్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, ఉన్నతాధికారులను సంప్రదించిన పక్షంలో సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

21,22 తేదీల్లో వివా వీవీఐటీయా 2కే25-26

వివరాలు వెల్లడిస్తున్న చాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రొ చాన్స్‌లర్ వాసిరెడ్డి మహదేవ్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో డిసెంబర్ 21, 22 తేదీల్లో జాతీయస్థాయి యువజనోత్సవం వివా వీవీ 2కే25–26 నిర్వహించనున్నట్లు వీవీఐటీ విశ్వవిద్యాలయం ప్రో–చాన్స్‌లర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోత్సహిస్తూ వారిలో ఉన్న అపరిమిత సామర్థ్యాలు, అంతర్గతశక్తిని గ్రహించాలని తెలియపరిచే విధంగా యువర్ పొటెన్షియల్ ఈజ్ ఎండ్ లెస్ ద మ్యాజిక్ ఈజ్ ఇన్ యు అనే నినాదంతో యానిమి ఇన్ ద స్ట్రీట్ ఆఫ్ చైనా నేపథ్యంలో ఈ యువజనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (శాక్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకత, నైపుణ్యం, కళాత్మకతను వెలికితీసే విధంగా సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక విభాగాలలో 93 అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ యువజనోత్సవానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను బుధవారం విద్యార్థులతో కలసి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రో–చాన్స్‌లర్ వాసిరెడ్డి మహదేవ్, రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి విడుదల చేశారు. శాక్ విద్యార్థి తనువృద్ధి నవ్య మాట్లాడుతూ, వీవీఐటీ నిర్వహించే యువజనోత్సవం వివా వీవీఐటీయా కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. యువజనోత్సవంలో పాల్గొనే విద్యార్థులు వివావీవీఐటీ.కామ్ వెబ్‌సైట్ నందు వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిషన్ డైరెక్టర్ డాక్టర్ సి.ఉదయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ కొల్లిపర గ్రామం, ఆలపాటి రాజా కళ్యాణ మండపం దగ్గరలో 225 స్థలం అందు గల ఇల్లు SBI వేలం ద్వారా అమ్మకం రిజర్వు ధర: 17.5 లక్షలు. 96030 61724

SERVICES

BUSINESS OFFER

■ చిన్న వ్యాపార యజమానులకు మంచి అవకాశం. ZED MSME ప్రభుత్వ పథకంలో RSJతో భాగస్వామ్యం చేయండి. ఈ అవకాశాన్ని మిస్ కావద్దు. ✆ 8595924917

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 8333833368

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. ✆ 87907 41166

WANTED

■ గుంటూరుసిటీ ప్రముఖ హోటల్ నందు హౌస్‌కీపింగ్ స్టాఫ్, రూమ్ బాయ్స్ కావలెను. (హోటల్ మేనేజ్మెంట్ వారికి ప్రాధాన్యత) 8185826270, 8247814976

■ నరసరావు పేట ఊర్లో ప్రముఖ హాస్పిటల్ లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8గం॥డ్యూటీ, జీ: 11 వేలు, ESI, PF కలదు ✆ 7386688787

■ సె॥ గార్డ్స్ అమరావతి కొత్త CRDA ప్రాంతంలో 12 గం కావలెను. వ: 45 Q: 10 P/F, జీ: 17 వేలు + PF, ESI. సంప్ర: 94903 80213, 94902 48039

■ ఉద్యోగ అవకాశం డిగ్రీ పూర్తిచేసిన వారికి ఫీల్డ్‌వర్క్ (Field Work) కోసం అవకాశం, వయస్సు : 30 సం॥లోపు. ✆ +91 88006 29648. RSJ Inspection Service Ltd.

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Senior Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 50000/- నుండి 60000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: Civil Diploma మరియు Civil Engineering, వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ కేర్‌టేకర్ కావలెను. గుంటూరులో ఇంట్లోనే ఉండి పెద్ద వయస్సు గల మగవారిని చూసుకోవలెను. ఏ బాదరాబందీ లేకుండా ఉన్న మగవారు మాత్రమే కావలెను. 10వ తరగతి చదివి ఉండవలెను. జీతము: నెలకు 12000/- రూ॥లు, సంవత్సరమునకు బోనస్: 40000/- రూ॥లు మరియు భోజనం, వసతి కల్పించబడును. వివరములకు ఫోన్ నెంబర్: 90102 99252

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475/-

ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే

ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు

గుంటూరు

7075167663

7075167541

గమనిక

[illegible]

క్లుప్తంగా

ప్రమాదకర ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలి

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ యేసుబాబు

తెనాలిటౌన్: ప్రమాదకర ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ముvvా యేసుబాబు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛంద్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో వేస్ట్ పీకర్స్, సెప్టిక్ ట్యాంక్ క్లినర్లకు వర్క్‌షాపు నిర్వహించారు. పనిచేసే ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాద బీమా వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం కార్మికులకు పీపీఈ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ సెక్రటరీలు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

రామేశ్వరస్వామికి రూ.4,57,671 ఆదాయం

తెనాలిటౌన్: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ పర్వతవర్ధిని సమేత శ్రీ రామేశ్వరస్వామి దేవాలయంలో (పాత శివాలయం) బుధవారం కానుకల లెక్కింపు నిర్వహించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఆలయ కార్య నిర్వహణాధికారి రమణకుమారి పర్యవేక్షణలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ లెక్కింపు చేపట్టారు. భక్తుల నుంచి కానుకల రూపంలో రూ.4,57,671 ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. కార్తికమాసం రద్దీ కారణంగా ఆదాయం పెరిగినట్లు తెలిపారు. కానుకుల లెక్కింపులో పురుషులను మాత్రమే అనుమతించినట్లు వివరించారు.

119 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలి రూరల్: వేర్వేరు ఘటనల్లో 119 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కఠెవరం గ్రామం వద్ద ఓ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు వాహన తనఖీ చేయగా 100 రేషన్ బస్తాలను గుర్తించి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అలానే పెదరావూరు గ్రామంలో రేషన్ దుకాణం వద్ద రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులతో కలసి దాడులు నిర్వహించి 19 బస్తాలు తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి స్టేషన్‌కు తరలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంగంజాగర్లమూడిలో ఫొటోగ్రాఫర్స్ భేటీ

తెనాలి రూరల్: ది తెనాలి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ తెనాలి వన సమారాధన కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని సంగం జాగర్లమూడి నిమ్మ తోటల్లో నిర్వహించారు. వేంపటి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు కె.మాధవరావు, కార్యదర్శి మురళీకృష్ణ, తెనాలి ప్రసాద్ ల్యాబ్ అధినేత ప్రసాద్, గట్టా ఫొటో స్టోర్స్ అధినేత శ్రీనివాస రావు(చిన్న) పాల్గొన్నారు. ప్రభాకర్, రఘు, రవిశంకర్, చిరంజీవి, గిరీష్, వసంతు, శివ, క్రాంతి, భరత్, నాని, వినోద్ పర్యవేక్షించారు.

నాంది ఫౌండేషన్ సర్టిఫికెట్ కోర్సుకు ఏఎస్ఎన్ విద్యార్థులు

తెనాలి: ప్రముఖ కార్పొరేట్ కంపెనీ మహేంద్ర వారి నాందీ ఫౌండేషన్ సర్టిఫికెట్ ప్రోగ్రాంను స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఫైనలియర్ విద్యార్థులు విజయవంతంగా ముగించారు. ఈ సందర్భంగా ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహేంద్ర కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా నాందీ ఫౌండేషన్‌ను ఏర్పాటుచేసి కంపెనీలకు అవసరమైన స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణనిస్తోందని శివకుమార్ తెలిపారు. ఎంపిక చేసిన డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలకు మాత్రమే నాంది ఫౌండేషన్ శిక్షణ లభిస్తోందని చెబుతూ, ఆ కంపెనీ శిక్షణకు ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీని ఎంపిక చేసుకోవటం విశేషమన్నారు. మొత్తం 200 మంది డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు ఈనెలలో శిక్షణనిచ్చి, పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసినట్టు వివరించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూర, కంపెనీల్లో ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్‌ను మహేంద్ర కంపెనీ నాంది ఫౌండేషన్ శిక్షణనిచ్చినట్టు తెలియజేశారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులను అభినందించారు.

వెంటాడుతున్న ట్రాఫిక్ కష్టాలు!

ఫ్లైఓవర్‌పై భారీగా నిలిచిన ట్రాఫిక్

భారీ వాహనాలతో నిలిచిన ట్రాఫిక్

- కనిపించని సంబంధిత సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మంగళగిరి టౌన్: మంగళగిరిలో రోజురోజుకి పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. రోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో మంగళగిరి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో మంగళగిరి విజయవాడ పాత జాతీయ రహదారిలో బుధవారం రాత్రి భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మంగళగిరి నుంచి విజయవాడ వెళ్లే రైల్వే ఓవర్ బ్రిడ్జిపై సుమారు కిలోమీటరు పైగా వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అతి భారీ వాహనాలు, పెట్రోల్ ట్యాంకులు సైతం ఈ మార్గంలో ప్రయాణించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

నానాటికీ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య..

మంగళగిరి నుంచి విజయవాడకు ప్రజలు రోజూ వివిధ పనుల నిమిత్తం వెళుతూ.. వస్తూ ఉంటారు. విద్యార్థులు, మహిళలు సైతం ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగిస్తున్నారు. ఫలితంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లపై రాకపోకలు పెరిగాయి. దీంతో మంగళగిరి పట్టణ పరిధిలోని మిద్దె సెంటర్, తెనాలి రోడ్డు సెంటర్, పాతబస్టాండ్, మెయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నానాటికీ పెరిగిపోతోంది. కనీసం ఫ్లైఓవర్‌పై ఆగిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సంబంధిత అధికారులు లేదా సిబ్బంది కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శాశ్వత పరిష్కారం ఎప్పుడో..

రాజధాని ప్రాంతమైన మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం తాజా ఘటనే నిదర్శనం. ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నియంత్రణ కోసం పోలీసులు చేపట్టాల్సిన చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో సిగ్నల్స్, మైకుల ద్వారా ప్రయాణికులకు సూచనలు ఇచ్చేందుకు ఒకరు లేదా ఇద్దరిని నియమిస్తున్నారు తప్ప ట్రాఫిక్ సమస్య నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపడంలేదు. సిబ్బంది కొరత అధికారంగా ఉందని.. తగిన సిబ్బంది లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తినప్పుడు ఏమీ చేయలేకపోతున్నామని పోలీస్ అధికారులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

పేదల పెన్నిధి జగనన్న

సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఫిరంగిపురం: పేదల పెన్నిధి జగనన్న అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెంలో పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం, సెమీ క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకల గురించి పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) ఆదేశాల మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం ఈనెల 21న అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిరంగిపురంలోని అనాథ శరణాలయంలో కేక్ కటింగ్, పిల్లలు, వృద్ధులకు అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో కొమ్మారెడ్డి, చిన్నప్పరెడ్డి, దాసరి సురేష్, దాసరి మెల్కియా, టి.కృష్ణ, కె.ప్రవీణ్‌రెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, పెరికల చిన్నా, షేక్.మస్తాన్‌వలి, పి.వెంకట్రామిరెడ్డి, ఇ.హేమలతారెడ్డి, జి.ప్రతాప్‌రెడ్డి, జె.ఆనంద్, బి.అంజిరెడ్డి, కె.అప్పిరెడ్డి, వై.ఆశీర్వాదం, ఎస్.చిన్నప్ప, జె.రవి, జె.ఆనంద్. షేక్.సుభానీ, ఇస్మాయిల్, వెంకట్రావు, శివాజి, మోరంరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఇజ్రాయిల్, పి.శ్రీనివాసరెడ్డి, కె.రాజు, ఆర్.రత్నబాబు, తిరుపతిరెడ్డి, రామిరెడ్డి, జోసఫ్, డి.నరేంద్రకుమార్, టి.వీరాస్వామి, మల్లికార్జున్, జె.రవి, ఫ్రాన్సిస్, కృష్ణమోహన్, పలు విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లికి ముగ్గురు నూతన ఎస్ఐలు

సీఐ వీరేంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన ఎస్ఐలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ముగ్గురు నూతన ఎస్ఐలను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల గుంటూరు జిల్లాలో శిక్షణ పూర్తిచేసుకున్న పీఎస్ఐలను వివిధ పోలీస్‌స్టేషన్లకు నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా నార్త్‌సబ్ డివిజన్ పరిధిలోని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు ముగ్గురు ఎస్ఐలను నియమించారు. వారిలో తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లోనే పీఎస్ఐగా శిక్షణలో భాగంగా విధులు నిర్వర్తించిన అపర్ణ, వట్టిచెరుకూరులో పీఎస్ఐగా విధులు నిర్వర్తించిన వెంకటసాయి కుమార్, గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో పీఎస్‌గా పనిచేసిన ప్రదీప్‌లు ఉన్నారు. వీరు బుధవారం ఉదయం విధులకు హాజరై సీఐ వీరేంద్రకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ వీరేంద్ర మాట్లాడుతూ.. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు మొట్టమొదటి మహిళా ఎస్ఐగా అపర్ణ రావడం అభినందనీయమని అన్నారు. విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ఎక్కడా రాజీపడకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు.

రైతుకూలీ పెన్షన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లి రూరల్: అమరావతి రాజధాని గ్రామాల్లోని సీఆర్డీఏ కార్యాలయంలో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సభల్లో రైతు కూలీ పెన్షన్ల మంజూరు నిమిత్తం అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తాడేపల్లి మండల పరిధి ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో జరిగిన గ్రామ సభలో రైతుకూలీ పెన్షన్ల కోసం ఉండవల్లిలో 1,100 దరఖాస్తులు, పెనుమాకలో 1,125 దరఖాస్తులు స్వీకరించారు. ఆయా గ్రామ సభల్లో డిప్యూటీ కలెక్టర్ చిన్ని కృష్ణ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పుష్కర కాలనీ, బోటు యార్డు, కేఎల్‌రావు కాలనీల ఇళ్లస్థలాల బాధితులతో కలిసి ఉండవల్లి సెంటర్ సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 2016 కృష్ణా పుష్కరాల సందర్భంగా ఇల్లు తొలగించిన 247 మందికి 2 సెంట్ల చొప్పున నివాస స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించాలని కోరుతున్నామన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని.. లేకుంటే ప్రజలకు సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొంతిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, కె.మేరి, గంగాభవాని, రాజు, సీహెచ్ సోమేశ్వరి, మరియమ్మ, కొండలు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి సమావేశం

ప్రజా విచారణ నిర్వహిస్తున్న కాలుష్య నియంత్రణాధికారులు

తుళ్లూరు: తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో కుర్ర జోగేశ్వరరావు (విస్తీర్ణం: 6.0 హెక్టార్లు), పూష్యా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (విస్తీర్ణం: 8.160 హెక్టార్లు) ప్రతిపాదనలకు సంబంధించిన పర్యావరణ ప్రజా విచారణను బుధవారం నిర్వహించారు. ఈ ప్రజా విచారణకు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌కే ఖాజావలి అధ్యక్షత వహించగా శ్రీమతి ఎండీ నజీనా బేగం, పర్యావరణ ఇంజినీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సమక్షంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామ అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ మైనింగ్ నిర్వహిస్తామని ఆయా కంపెనీలు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. గ్రామస్తులు ప్రతిపాదనలకు తమ సమ్మతిని వ్యక్తపరుస్తూ ప్రజా విచారణకు ఆమోదం తెలిపారన్నారు. వారి అభిప్రాయాలు, సూచనలు, అభిమతాలను విచారణ సందర్భంగా నమోదు చేశామని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ ఎండీ నజీనా బేగం తెలిపారు.

రైతులు విజ్ఞాన ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి

తెనాలిటౌన్: వ్యవసాయ విజ్ఞాన ప్రదర్శనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ శివన్నారాయణ సూచించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో బుధవారం బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన సీనియర్ విద్యార్థులు రైతు విజ్ఞాన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ శివన్నారాయణ పాల్గొని తిలకించారు. ఆధునిక యాజమాన్య పద్ధతులు, యంత్ర పరికరాల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులు వంటి విషయాలపై ప్రదర్శన నిర్వహించారు. ఉదయగిరి, మార్కాపురం, పీఎస్‌పురం, బాపట్ల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొని నేర్చుకున్న విద్యను మోడల్స్, చార్టులతో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏడీఏ ఆర్.విజయబాబు, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలు వినియోగించుకోవాలి

తెనాలిటౌన్: పట్టణ పరిధిలోని పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు.. 22 నుంచి 24వ తేదీ వరకు వివిధ పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాల్లో ఆధార్ సేవలు కొనసాగుతాయని వివరించారు.

రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

రక్తదానం చేస్తున్న కేఎల్‌యూ విద్యార్థిని

తాడేపల్లి రూరల్: రక్తదానం చేయడానికి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కేఎల్‌యూ అసోసియేట్ డీన్ డాక్టర్ శాంతిశ్రీ పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధి వడ్డేశ్వరంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన శాంతిశ్రీ మాట్లాడుతూ.. కేఎల్ యూనివర్సిటీ యూత్ రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రమాదాలు, శస్త్ర చికిత్సలు, తలసేమియా, క్యాన్సర్ వంటి పలు అత్యవసర సందర్భాల్లో సమయానికి రక్తం అందక ప్రాణనష్టం జరుగుతుందని.. రక్తదాన ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని అన్నారు. రెడ్‌క్రాస్ గుంటూరు, అమెరికన్ క్యాన్సర్ కేర్ బ్లడ్ సెంటర్, విజయవాడ వైద్యులు, సిబ్బంది రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. అనంతరం దాతలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ ఐ.సత్యనారాయణ శర్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఆర్సీ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.సుప్రియ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రక్తదాతలను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ వి.రాజేష్, డాక్టర్ జి.చక్రవర్తి, శాక్ డైరెక్టర్ పి.సాయివిజయ్, ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్ తదితరులు అభినందించారు.

379 రోజులుగా కార్మికుల దీక్షలు

కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను తక్షణం యాజమాన్యం పరిష్కరించాలని యూనియన్ నాయకులు కె.స్టీవెన్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, సుభాని, అంకయ్య, మాణిక్యరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు 379 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ స్పందించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల ముందు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. దీక్షల్లో సుబ్బారావు, యహోషువా, హగ్గయ్య, పిచ్చయ్య, సూర్యప్రకాష్ కూర్చొన్నారు. కార్యక్రమంలో మహిళలు రమాదేవి, శారమ్మ, శారద, సువర్ణ, దుర్గాభవాని, రమణమ్మ, రిబ్కా, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థులకు నగదు బహుమతి

విద్యార్థులను అభినందిస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులకు జాతీయ స్థాయిలో నగదు బహుమతి లభించినట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ పేర్కొన్నారు. బుధవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025లో విద్యార్థులు విజేతలుగా నిలిచి రూ.1.5 లక్షల నగదు బహుమతిని పొందాని తెలిపారు. కేఎల్‌యూ జీఎన్‌యూ లీనక్స్ యూజర్స్ గ్రూప్ (కేఎల్‌జీఎల్‌యూజీ) ఎక్స్‌పెరిమెంటల్ లెర్నింగ్ విభాగానికి చెందిన పి.వంశీకృష్ణ, వరుణ్‌శర్మ, వి.జశ్వంత్, మధుహన్ శేఖర్, అంకిత బెహరా, ప్రభిఘరత్ కౌర్ విద్యార్థులు బృందంగా ఏర్పడి ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించేలా వర్సిటీ విద్యార్థుల బృందం ఆర్ఎఫ్ఐడీ ఫేస్ డిటెక్షన్ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేశారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సంబంధిత డేటాను ఎలా వీక్షించవచ్చో విద్యార్థుల మెంటార్ డాక్టర్ శ్రీపతిరాయ్ వివరించారు. విద్యార్థులను అభినందించిన వారిలో రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, హెచ్‌టీఐ విభాగాధిపతి డాక్టర్ కె.నరసింహరాజు, డాక్టర్ డి.అశ్వనికుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ ప్రార్థనలు

దుగ్గిరాల: క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, మానవత్వం వంటి విలువలను అందరికీ చాటి చెప్పే పండుగ అని ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టరు ఉండవల్లి శ్రీదేవి అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో సెమీ క్రిస్మస్ ప్రార్థనలకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఇటువంటి వేడుకలు సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం బ్రదర్ ఐజాక్ విల్సన్, పాస్టర్ మేతుషలా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉండవల్లి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో చైర్మన్ చందు రామారావు, కార్యదర్శి విజయలక్ష్మీ, వైస్ చైర్మన్ రోహిత్, విజయదుర్గ, వెంకటేశ్వరరావు, కేసంనేని శ్రీఅనిత తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాచరణతోనే కుటుంబ అనుబంధం

గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి

నివాళులర్పిస్తున్న రామలింగాచారి

తెనాలిటౌన్: సనాతన ధర్మాలు కుటుంబ అనుబంధానికి దోహదపడతాయని గాంధీ హృదయదారి శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమం నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి పేర్కొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో బుధవారం స్వర్ణ శిల్పి, కళాకారుడు కాకుమాను సుబ్బారావు 33వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకుడు వజ్రాల రామలింగాచారి పాల్గొని సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన తాతాగారైన సుబ్బారావు ఉన్నత విద్యతోపాటు నైతిక బాధ్యతతో సమాజ సేవ చేసినట్లు వెల్లడించారు. నేటి తరం యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆశ్రమవాసులకు పండ్లు పంపిణీ చేసి అన్నప్రసాదం వితరణ గావించారు. కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

[illegible] తేది 10.12.2025న [illegible]

రేలా యువరాజు
[illegible], గుంటూరు జిల్లా, పిన్ 522501
సెల్: 98499 82387
Email: relayuvaraju@gmail.com

అర్హులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రవి

మంగళగిరి టౌన్: రాజధాని గ్రామాల్లోని అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. మంగళగిరి మండలం యర్రబాలెంలో బుధవారం ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. అర్హులకు రెండు సెంట్ల స్థలం, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబరు నెలలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి అధికారులకు అర్జీలు అందజేసినా నేటికీ పట్టించుకోలేదని విమర్శించారు. ఉపాధి లేక ఇంటి అద్దెలు చెల్లించలేక పేదలు అనేక అవస్థలు పడుతున్నారని, చంద్రబాబు సర్కార్ ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లిట్రసీపై అవగాహన

మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు మేనేజర్ మహేష్

తెనాలిటౌన్: మహిళలు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లిట్రసీపై అవగాహన పెంపొందించుకోవాలని డిజిటల్ మేనేజర్ మహేష్ సూచించారు. స్థానిక కొత్తపేటలోని స్త్రీ శక్తి భవనంలో బుధవారం ఐటీసీ ఫినిష్ సొసైటీ, మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లిట్రసీ పై అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ మహేష్, ఫుడ్ ప్రాసెస్ నుండి డీఆర్పీ సాయికృష్ణ, ఐటీసీ నుండి యశ్వంత్ శ్రీనివాస్, రాజశేఖర్‌బాబు పాల్గొని బ్యాంకు ఖాతా, నామినీ, సైబర్ క్రైమ్స్, డిజిటల్‌లిట్రసీ, ఫుడ్ ప్రాసెసింగ్, పీఎంఎఫ్ఎంఈ రుణాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం విజయకుమారి, ఆర్పీలు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

స్టాఫ్ నర్స్ పోస్టు @ రూ.1.50 లక్షలు!

- రూ.5వేలు చెల్లిస్తే ప్రక్రియ ప్రారంభిస్తాం
- సీహెచ్‌వోలకు ఎన్‌హెచ్‌ఎం అధికారుల పేరిట ఫోన్లు
- బయటకు వచ్చిన ఆడియోలు

సాక్షి, అమరావతి: 'రూ.1.50 లక్షలు కట్టండి. ప్రభుత్వాస్పత్రుల్లో స్టాఫ్ నర్స్‌గా ఉద్యోగం ఇప్పిస్తాం.. కన్ఫర్మేషన్ కోసం రూ.5 వేలు కడితే ప్రక్రియ మొదలు పెట్టి, మీ పేరు మెరిట్ లిస్ట్‌లో చేరుస్తాం' అంటూ రాష్ట్ర వ్యాప్తంగా విలేజ్ క్లినిక్స్‌లో పనిచేస్తున్న పలువురు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)లకు కొందరు ఫోన్లు చేస్తున్నారు. గొల్లపూడిలోని వైద్య శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) అధికారిని అంటూ స్టాఫ్ నర్స్ ఉద్యోగం ఆఫర్ చేస్తున్నట్టు తెలిసింది. కాల్స్ వస్తున్న నంబర్లు ట్రూ–కాలర్‌లో ఎన్‌హెచ్‌ఎం ఆఫీసర్ అని చూపిస్తోందని సీహెచ్‌వోలు వెల్లడించారు. ఫోన్ చేసిన వ్యక్తులతో సంభాషణ ఆడియోలు బయటకు వచ్చాయి. 'నెలకు రూ.55 వేల వేతనం, ఉద్యోగ భద్రత ఉంటుంది. రూ.1.50 లక్షలు ఖర్చు అవుతుంది. తొలుత రూ.5 వేలు కట్టి కన్ఫర్మేషన్ చేసుకుంటే ప్రాసెస్ మొదలు పెడతాం. వివరాలు చిత్తూరు జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపుతాం.. అక్కడి ఎన్‌హెచ్‌ఎం అధికారులు మెరిట్ లిస్ట్‌లో పేర్లు చేరుస్తారు.' అని ఫోన్ చేస్తున్న వ్యక్తులు సీహెచ్‌వోలకు వివరిస్తున్నారు. ఇప్పటికే కొందరు డబ్బు చెల్లించి కన్ఫర్మేషన్ చేసుకున్నారు.. మీరూ త్వరగా చెల్లించాలంటూ నమ్మిస్తున్నారు.

చంద్రబాబు కేసుల మూసివేత కాపీలు కోరుతూ రీపిటిషన్

విజయవాడ లీగల్: సీఎం చంద్రబాబుపై నమోదైన కేసులను ఏకపక్షంగా ఉపసంహరించుకున్న అంశానికి సంబంధించి పోలీసులు ఫైల్ చేసిన ఫైనల్ రిపోర్ట్, కోర్టు ఆర్డర్ కాపీ ఇప్పించాలని మాజీ రైల్వే ఉద్యోగి వేము కొండలరావు తరఫున సీనియర్ న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ బుధవారం ఏసీబీ కోర్టులో రెండోసారి పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి తిరస్కరించడంతో, పిటిషన్‌లోని అభ్యంతరాలను సరిచేస్తూ రెండోసారి పిటిషన్ దాఖలు చేశారు. క్రిమినల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీస్ అండర్ 12 కింద వాదనలు వినేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అయితే థర్డ్ పార్టీకి అప్పీలు చేసుకునే అవకాశం లేదని ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించారు. విచారణార్హతను బట్టి గురువారం వాదనలు వినేందుకు అవకాశం కల్పించాలని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోరారు.

సర్కారు తీరుపై గురువులు గుర్రు!

'మేము సర్వీసులోకి వచ్చిన కొత్తలో ఏడాదికి రెండు డీఏలు వచ్చేవి. ఇప్పుడు ఏడాదికి రెండు మెగా పీటీఎంలు వస్తున్నాయి'.

మా సర్వీసులో విద్యార్థులు నోట్సులు సరిగా రాశారో లేదో చెక్ చేసేవాళ్లం.., ఇప్పుడు చిక్కీలు, కోడిగుడ్ల లెక్కలు చూడడం, యాప్‌ల్లో వివరాల నమోదుకే సమయం సరిపోవడం లేదు'..

ఉపాధ్యాయుల సోషల్ మీడియా గ్రూపుల్లో సర్క్యులేట్ అవుతున్న ఇలాంటి పోస్టులు చంద్రబాబు పాలనపై గురువుల ఆగ్రహానికి అద్దం పడుతున్నాయి.

ఇతర శాఖల అధికారుల పెత్తనంపై ఆగ్రహం

- ఇన్ సర్వీస్ టెట్, సెలవు రోజుల్లో అదనపు తరగతులపై అసంతృప్తి
- పోరుబాటకు సిద్ధమైన ఉపాధ్యాయులు
- నేడు కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా

సాక్షి, అమరావతి: అధికారంలోకి రాగానే ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలన్నీ చెల్లిస్తామన్న హామీని చంద్రబాబు ప్రభుత్వం గాలికి వదిలేసింది. టీచర్లకు యాప్‌ల భారం ఉండదు, కేవలం బోధనకే పరిమితం చేస్తామన్న మాట నీటి మూటైంది. మరోపక్క ఇన్ సర్వీస్ టెట్ రద్దు చేస్తామని, దీనిపై తమ ఎమ్మెల్సీల విజ్ఞప్తి మేరకు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేస్తామన్న హామీని సైతం అమలు చేయకపోవడంపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యాప్ సోపాలు

ప్రతిరోజూ పాఠ్యాంశాలకు సంబంధం లేని వివరాలు పదుల సంఖ్యలో యాప్‌ల్లో నమోదు చేయడంతో బిజీబిజీగా గడుపుతున్నారు. తీరా అవి సరిగా లేవని రాష్ట్ర కార్యాలయం నుంచి అభ్యంతరాలు వస్తే ఒకటికి పదిసార్లు అప్‌లోడ్స్‌తో ఉపాధ్యాయులు నానా అగచాట్లు పడుతున్నారు.

బడుల నిర్వహణపై ఇతర శాఖల పెత్తనం

పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల కనీస సామర్థ్యాలు పెంచడానికి 75 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇందుకోసం రెండో శనివారం, ఆదివారాలు, పండగ సెలవుల్లో సైతం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ తరగతులను పరిశీలించే బాధ్యతను ఎంపీడీవోలు, మండల వ్యవసాయశాఖ అధికారులకు అప్పగించింది. వాస్తవానికి మండలానికి ఇద్దరు ఎంఈవోలు, డీవైఈవోలు, జిల్లా స్థాయిలో డీఈవో ఉన్నారు. వీరిని కాదని ఇతర శాఖలకు పెత్తనం అప్పగించడంపై టీచర్లు మండిపడుతున్నారు. గతేడాది మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు, విద్యార్థుల రేషనలైజేషన్ వంటి విధులకు రెవెన్యూ సిబ్బందిని ప్రభుత్వం వినియోగించింది.

ఒత్తిడి పెంచి.. ప్రయోజనాలు ఎగ్గొట్టాలని..

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటినా ఉపాధ్యాయులకు ఒక్క ఆర్థిక ప్రయోజనం చేకూర్చలేదు. ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తామన్న హామీని కూడా విస్మరించింది. నాలుగు డీఏలకు కేవలం ఒక్క డీఏతో సరిపెట్టింది. పదవీ విరమణ పొందినవారికి ఏడాదిన్నరగా గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వలేదు. ప్రతి నెలా మెడికల్ బీమా డబ్బులు చెల్లిస్తున్నా ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందడం లేదు. అప్పుచేసి బిల్లులు చెల్లించినా తర్వాత రీయింబర్స్‌మెంట్ చేయడం లేదు. దీంతో ఆర్థిక బకాయిల కోసం ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయి. ఈ తరుణంలో సర్కారు రివర్స్ గేర్ వేసింది. ఒత్తిడి పెంచితే ఆర్థిక అంశాలు తెరపైకి రావనే భావనతో వ్యవహరిస్తోంది. ఇందులో ఇన్ సర్వీస్ టెట్ అంశం కీలకంగా మారింది. దేశంలోని చాలా రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశాయి. రాష్ట్రంలో మాత్రం టెట్ నిర్వహించడం, ప్రత్యేక శిక్షణ, నివేదికల పేరుతో ఇబ్బంది పెట్టడం వేధింపుల్లో భాగమేనని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బకాయిలతో పాటు ఇతర శాఖల అధికారుల పెత్తనంపై గురువులు పోరుబాటకు సిద్ధమయ్యారు.

రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా నేడు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గురువారం కలెక్టరేట్ల వద్ద ధర్నాలకు యూటీఎఫ్‌తో పాటు పలు సంఘాలు పిలుపునిచ్చాయి.బదిలీ అయి పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్న ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, బోధనేతర పనులు అప్పగించవద్దని.. టీచర్లపై ఇతర శాఖల పెత్తనం ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు.

బేరం కుదిరితేనే బిల్లు!

▶ మొదటి పేజీ తరువాయి

ఏజెన్సీలకు నిధులు ఆగిపోయాయి. ఇక ఈ బిల్లుల విడుదలకు ఏజెన్సీల యజమానులతో టీడీపీ నాయకులు రాయ'బేరాలు' మొదలుపెట్టారు. వీరు డిమాండ్ చేసినంత కమీషన్లు ఇవ్వడానికి సిద్ధమైన వారి బిల్లులే విడుదల చేయాలంటూ అధికారులకు సిఫార్సు చేస్తున్నారు. విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి, ఎన్టీఆర్, గుంటూరు సహా పలు జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఆప్షన్–3 ఇళ్ల పెండింగ్ బిల్లుల మంజూరుకు ఏకంగా 20 శాతానికి పైగా కమీషన్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది.


MD, Housing
Date: 08/12/2025
To,
Sri Kolusu Parthasarathi Garu,
The Hon'ble Minister for Housing,
Amaravati.
Please examine and release payments as per eligibility and if can not be paid, Please circulate the ... Please sort out the issue to take the programme forward
Subject: Regarding the payments of option-3 houses ...
Respected Sir,
I hope this letter finds you in good health. I am writing this letter to bring to your kind notice that the payment for the work completed is still pending.
...
Due to this delay, we are facing financial difficulties in managing our operational expenses and labor payments. We kindly request your good office to please look into the matter and arrange for the release of the pending payment at the earliest.
We shall be highly grateful to you for your kind cooperation and support.
KOLUSU PARTHASARATHY

ఆప్షన్ 3 ఇళ్లు నిర్మిస్తున్న ఓ ఏజెన్సీకి బిల్లులు ఇవ్వాలంటూ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు చేసిన సిఫార్సు

బెదిరించడమే ఆ సీనియర్ ఎమ్మెల్యే పని..

మరోవైపు.. నెల్లూరు జిల్లాలో టీడీపీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ప్రభుత్వంలో వివిధ కాంట్రాక్టులు చేస్తున్న వారిని టార్గెట్ చేసి, బెదిరించి డబ్బు వసూలుచేయడమే పనిగా పెట్టుకున్నారు. ఈ పరంపరలో భాగంగా ఆ జిల్లాలో ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణ ఏజెన్సీలపై అనేక ఆరోపణలు చేసి, చివరకు వాటితో డీల్ కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే, ఉత్తరాంధ్రకు చెందిన ఇంకో టీడీపీ నాయకుడికి గృహ నిర్మాణ శాఖలో నామినేటెడ్ పోస్టుని కట్టబెట్టారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆయన కూడా ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఉత్తరాంధ్రతో పాటు, ఇతర జిల్లాల్లోని ఏజెన్సీల యజమానులతో ఆయన డీల్ కుదుర్చుకుని వారికి బిల్లులు మంజూరుచేయాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

మంత్రి పార్థసారథి సిఫార్సులు..

నిజానికి.. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా గృహ నిర్మాణ శాఖ దశల వారీగా బిల్లులు చెల్లిస్తుంది. ఆప్షన్–3కు సంబంధించి లబ్ధిదారులు, నిర్మాణ ఏజెన్సీ, బ్యాంకు కలిపి త్రైపాక్షిక (ట్రై పార్టీ బ్యాంకు) అకౌంట్లు తెరిచారు. పునాది, లెంటెల్, శ్లాబ్ ఇలా వివిధ దశల నిర్మాణం ఆధారంగా స్థానిక గృహ నిర్మాణ సిబ్బంది బిల్లు మంజూరుకు ప్రతిపాదిస్తారు. వివిధ దశల్లో స్క్రూటినీ అనంతరం ఆటోమేటిక్‌గా బిల్లులు బ్యాంకు ఖాతాలో జమకావాలి. గత ప్రభుత్వంలో ఇదే విధానం కొనసాగింది. అయితే, చంద్రబాబు ప్రభుత్వం రాగానే కొత్త సంస్కృతికి తెరలేపారు. ఏజెన్సీల నిర్వాహకులు నాయకులను ప్రసన్నం చేసుకుని మంత్రిని కలిస్తే ఆయన బిల్లుల మంజూరుకు సిఫార్సు చేస్తున్నారు. ఇలా తనను కలిసిన వారికి వెంటనే బిల్లులు మంజూరు చేయాలంటూ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశిస్తున్నారు. లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా ఆన్‌లైన్‌లో నిష్పక్షపాతంగా జరగాల్సిన బిల్లింగ్ ప్రక్రియకు కూడా ఓ మంత్రి సిఫార్సు చేయడం చూస్తుంటే చంద్రబాబు ప్రభుత్వంలో కమీషన్ల బాగోతం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది.

జగన్ విజన్‌కే బాబు సర్కార్ జై..!

- కర్నూలులోనే హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త
- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- విజయవాడకు తరలిస్తామన్న గత వైఖరి నుంచి యూటర్న్
- జగన్ ప్రభుత్వ నిర్ణయంపై గతంలో నానా యాగీ



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ), లోకాయుక్తను కర్నూలులో ఏర్పాటు చేయడంపై నానా యాగీ చేసి హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేయించిన టీడీపీ.. ఇప్పుడు జగన్ విజన్‌కే జై కొట్టింది. హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్తలను విజయవాడకు తరలించాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని గతంలో హైకోర్టుకు నివేదించిన చంద్రబాబు ప్రభుత్వం వాటిని కర్నూలులోనే కొనసాగిస్తామని తాజాగా హైకోర్టుకు వివరించింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ప్రభుత్వ విధాన నిర్ణయంలో తామెలా జోక్యం చేసుకోగలమని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో 2021లో ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ రికార్డుల్లో లేకపోవడంతో హైకోర్టు తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయాలన్న గత ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ మద్దిపాటి శైలజ 2021లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గతంలో విచారణకు వచ్చిన సందర్భంలో లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీలను కర్నూలు నుంచి విజయవాడకు తరలించాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని చంద్రబాబు ప్రభుత్వం పేర్కొంది. తాజాగా ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతి వాదనలు వినిపిస్తూ లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగిస్తామని చెప్పారు.

పొలంలో ప్రైవేట్ 'పవర్'!

వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్ పేరుతో దోపిడీకి రంగం సిద్ధం

సాక్షి, అమరావతి: సెకీ నుంచి అతి తక్కువ ధరకే యూనిట్ కేవలం రూ.2.49కే కొనుగోలుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒప్పందం కుదుర్చుకుంటే అదేదో నేరం, ఘోరం అన్నట్లు చిత్రీకరించిన చంద్రబాబు ఇప్పుడు అదే సౌర విద్యుత్ కోసం యూనిట్‌కు ఏకంగా రూ.3.09 ప్రైవేట్ సంస్థలకు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలను ఇంకా తగ్గిస్తానని ఎన్నికల ముందు నమ్మబలికిన చంద్రబాబు ఇప్పటికే కరెంట్ చార్జీల బాదుడుతో షాకులిస్తుండగా తాజాగా వ్యవసాయానికి సౌర విద్యుత్ పేరుతో ప్రైవేటు సంస్థలకు ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకు ఉపక్రమించారు. రైతులకు మేలు చేస్తున్నామనే ముసుగు వేసి, కమీషన్ల కోసం అడ్డగోలుగా విద్యుత్ ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఒకవైపు కేంద్ర పథకాల ద్వారా రాయితీలు పొంది మరోవైపు అన్నదాతలకు ఇవ్వాల్సిన రాయితీని దారి మళ్లించేందుకు ప్రణాళిక రచించారు. ఈ క్రమంలో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) నుంచి ఆమోదాన్ని సాధించారు. ప్రైవేటు సౌర విద్యుదుత్పత్తి సంస్థలకు డిస్కమ్‌లు చెల్లించాల్సిన ధరలను నిర్ణయిస్తూ ఏపీఈఆర్‌సీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఫీడర్లు దగ్గరే ఉన్నా... గ్రిడ్ నుంచే విద్యుత్

రాష్ట్రంలో దాదాపు 19 లక్షల వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు ఏటా డిస్కమ్‌లకు సుమారు రూ.12,500 కోట్లు రాయితీగా అందించాల్సి ఉంది. గత ప్రభుత్వంలో ఉచిత విద్యుత్తు పథకం ఆటంకం లేకుండా ముందుకు సాగింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతుల ఉచిత విద్యుత్‌ను ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. అందుకు 'పీఎం కుసుమ్' పథకాన్ని అడ్డుపెట్టుకుంది. రాయితీలు వస్తాయని, సరఫరా నష్టాలు తగ్గుతాయంటూ 'అగ్రికల్చర్ ఫీడర్స్ సోలరైజేషన్' విధానాన్ని తెరపైకి తెచ్చింది. తద్వారా వ్యవసాయ విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఫీడర్లకు అవసరమైన కరెంట్‌ను సమీపంలో నెలకొల్పే సోలార్ ప్యానళ్ల ప్రాజెక్టు ద్వారా అందిస్తామని చెబుతోంది. దీనికోసం మూడు డిస్కమ్‌ల పరిధిలో తొలుత కొన్ని పంపుసెట్లను ఎంపిక చేశారు. కుప్పం రెస్కోతో కలిపి మూడు డిస్కంల పరిధిలో మొత్తం 1,162.8 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యంతో 2,93,587 పంపుసెట్ల సోలరైజేషన్‌కు ప్రణాళిక సిద్ధమైంది. దీని ప్రకారం 1162.8 మెగావాట్లకు యూనిట్ రూ.3.09 చొప్పున ఏడాదికి రూ.600 కోట్లు ప్రైవేటు సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది. అదే సెకీ నుంచి అయితే యూనిట్ రూ.2.49కే వస్తున్నందున ఆ వ్యయం రూ.482 కోట్లు మాత్రమే అవుతుంది. అంటే ఏటా అదనంగా దాదాపు రూ.116 కోట్లను ప్రైవేటు సంస్థలకు పాతికేళ్ల పాటు దోచిపెట్టనున్నట్లు స్పష్టమవుతోంది.

ప్రైవేటు సంస్థల నుంచి టెండర్లు..

ప్రైవేటు సంస్థలు సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయని, ఆ విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేస్తాయని, దానికి చెల్లించాల్సిన యూనిట్ ధరలను నిర్ణయించాలంటూ ఏపీఈఆర్‌సీని డిస్కంలు కోరాయి. ఏపీఈపీడీసీఎల్‌లో యూనిట్‌కు రూ.3.18, ఏపీఎస్పీడీసీఎల్‌లో యూనిట్‌కు రూ.3.16, ఏపీసీపీడీసీఎల్‌లో యూనిట్‌కు రూ.3.19 చొప్పున చెల్లిస్తామని తెలిపాయి. అయితే జీఎస్టీ భారం తగ్గుతున్నందున సోలార్ ప్యానెళ్ల ధరలు కూడా తగ్గాయి. దీంతో ప్రైవేటు సంస్థలకు చెల్లించాల్సిన ధరను కూడా తగ్గించాలని కమిషన్ సూచించింది. ఈ క్రమంలో డిస్కంలు మళ్లీ ప్రతిపాదనలు తయారు చేసి పంపించాయి. వాటి ప్రకారం యూనిట్‌కు రూ.3.09 చొప్పున ప్రైవేటు సంస్థలకు చెల్లించి సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ఏపీఈఆర్‌సీ అనుమతినిచ్చింది. మరోవైపు ప్రైవేటు సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించారు. అయితే టెండర్ దక్కించుకున్న సంస్థలతో ఈ నెలాఖరులోగా విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంటేనే కేంద్ర ప్రభుత్వం పీఎం కుసుమ్ పథకానికి అర్హత పొందినట్లుగా పరిగణిస్తుంది. అప్పుడే రాయితీ వర్తిస్తుంది.


ANDHRA PRADESH ELECTRICITY REGULATORY COMMISSION
Vidyut Niyantrana Bhavan,
Adjacent to 220/132/33/11 KV AP Carbides Sub-Station,
Dinnedevarapadu Road, Kurnool-518002, Andhra Pradesh
***
FRIDAY, THE 2nd DAY OF MAY
TWO THOUSAND AND TWENTY FIVE
***
Present
Sri P.V.R.Reddy, Member & Chairman(i/c)
***
O.P.No.91 of 2024
In the matter of granting consent under Section 86(1)(b) of the Electricity Act, 2003 read with Section 21 of the Andhra Pradesh Electricity Reform Act, 1998 to the amended Power Purchase Agreements (4 Nos) dated 12.03.2025 entered into by Southern Power Distribution Company of Andhra Pradesh Limited (APSPDCL) with the following entities: 1. Axis Renewable Energy Park (Penna) Private Limited, 2. Axis Renewable Energy Park (Krishna) Private Limited, 3. Axis Renewable Energy Park (Andhra Pradesh) Private Limited, and 4. Axis Renewable Energy Park (Tungabhadra) Private Limited, for procuring 100 MW of power each from their Wind-Solar Hybrid Pilot Projects.
A. The proposed tariff of Rs. 4.60/kWh for these projects is lower than the rate of Rs. 5.12/kWh originally proposed. It is also anticipated to be considerably lower than the APPC rate that will be in effect when these projects are commissioned.
B. While the APPC rate under the 'Pooled Cost Power Purchase' mechanism will continue to increase every year due to the rising cost of power purchases, particularly from thermal stations, the rate proposed for these projects will be frozen for the next 25 years. Freezing the rate for 25 years, i.e. the duration of PPAs is economically beneficial to the DISCOMs due to the falling value of the Rupee.

యాక్సిస్ నుంచి యూనిట్ విద్యుత్ ఏకంగా రూ.4.60 చొప్పున 25 ఏళ్లపాటు కొనుగోలు చేసేందుకు అనుమతిస్తూ ఏపీఈఆర్సీ ఇచ్చిన ఆదేశాలు

యాక్సిస్ నుంచి యూనిట్ రూ.4.60 కి కొనుగోలు

వ్యవసాయానికి 30 ఏళ్ల పాటు ఉచిత విద్యుత్‌ను హక్కుగా అందించాలనే సంకల్పంతో పాటు భవిష్యత్తులో రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా, పవర్ గ్రిడ్‌ను సమతూకం చేయాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సెకీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది. అది కూడా రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని అతి తక్కువ ధర యూనిట్ రూ.2.49కే కొనేందుకు పీపీఏ చేసుకుంది. ఇలా తీసుకునే 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌కు పాతికేళ్ల పాటు ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు ఇస్తామంటూ సెకీ స్వయంగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. సెకీ ఒప్పందం వల్ల రాష్ట్రానికి దాదాపు రూ.లక్ష కోట్ల ప్రయోజనం సమకూరుతుంది. ఇంత మంచి ఒప్పందాన్ని చేసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభినందించాల్సింది పోయి కూటమి నేతలు, ఎల్లో మీడియా, టీడీపీ కరపత్రికలు విషం గగ్గాయి. సెకీ విద్యుత్ లాభం కాదంటూ పచ్చి అబద్ధాలను ప్రచారం చేశాయి. కానీ తర్వాత యాక్సిస్ ఎనర్జీతో యూనిట్ రూ.4.60 చొప్పున 400 మెగావాట్ల విద్యుత్ కొనేందుకు చంద్రబాబు ప్రభుత్వం పీపీఏ చేసుకుంది. సెకీ ధరతో పోల్చితే యూనిట్‌కు రూ.2.11 అదనంగా చెల్లిస్తోంది. తద్వారా దాదాపు రూ.11 వేల కోట్ల భారీ కుంభకోణానికి నిస్సిగ్గుగా తెరదీశారు. అది చాదస్తున్నట్టు ఇప్పుడు సౌర విద్యుత్‌ను యూనిట్‌కు రూ.3.09 కొంటామంటోంది.


First page of power supply arrangement with SECI (GOI undertaking)
BUYING ENTITY PSA (Rev. 00) INDIA NON JUDICIAL
Government of National Capital Territory of Delhi
e-Stamp

Certificate No.	IN-DL57486054022086T
Certificate Issued Date	30-Nov-2021 07:00 PM
Account Reference	SELFPRINT (PU)/ dl-self/ NEHRU/ DL-DLH
Unique Doc. Reference	SUBIN-DLDL-SELF07497908814200T
Purchased by	SOLARENERGYCORPORATIONOFINDIA LIMITED
Description of Document	Article 5 General Agreement
Property Description	NOT APPLICABLE
Consideration Price (Rs.)	0 (Zero)
First Party	SOLAR ENERGY CORPORATION OF INDIA LIMITED
Second Party	NOT APPLICABLE
Stamp Duty Paid By	SOLAR ENERGY CORPORATION OF INDIA LIMITED
Stamp Duty Amount(Rs.)	100 (One Hundred only)

SELF PRINTED CERTIFICATE TO BE VERIFIED BY THE RECIPIENT AT WWW.SHCILESTAMP.COM
This Power Sale Agreement is made on the 1st day of December of 2021 at Velagapudi, Andhra Pradesh
Between
Solar Energy Corporation of India Limited, a company incorporated under the Companies Act 1956, having its registered office at 6th Floor, Plate-B, NBCC Office Block Tower-2, East Kidwai Nagar, New Delhi-110023 (hereinafter referred to as "Buyer" or "SECI" as the case maybe, which expression shall, unless repugnant to the context or meaning thereof, be deemed to include its successors and permitted assigns) as a Party of the first part;
Page 2 of 56
Deputy Secretary to Government, Energy Department, A.P. Secretariat, Velagapudi, Amaravati

ARTICLE 5: APPLICABLE TARIFF
5.1.1 From SCD and subject to the provision of the Article 6.7, the Buying Entity shall pay the fixed tariff of Rs. 2.42/kWh plus trading margin of Rs. 0.07/ kWh for the entire term of this agreement.

2021 డిసెంబర్ 1న సెకీతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ సరఫరా ఒప్పందంలో యూనిట్ రూ.2.49 పడుతుందని స్పష్టంగా పొందిపరిచిన భాగం

'సెకీ' విద్యుత్ చౌకగా తీసుకుంటే తప్పన్నారు..

గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ నుంచి 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను యూనిట్ రూ.2.49కే కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంటే ఇదే చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించారు. రూ.లక్ష కోట్ల భారం పడుతుందంటూ పచ్చ పత్రికల్లో పుంఖాను పుంఖాలుగా తప్పుడు వార్తలు రాయించారు. మరి ఇప్పుడు అంతకు మించి అధిక ధర చెల్లించి విద్యుత్ కొనుగోలు చేసేందుకు సిద్ధం కావడం గమనార్హం. నాడు సెకీతో ఒప్పందం పాతికేళ్లుకాగా, ఇప్పుడు ప్రైవేటు సంస్థలతో చేసుకునే ఒప్పందం కూడా అన్నే ఏళ్లు కావడం అనుమానాలు రేకెత్తిస్తోంది. దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల నేరుగా డిస్కంలపైనా, పరోక్షంగా ప్రజలపైనా ఆర్థిక భారం పడుతుందని వాదించిన చంద్రబాబు ఇప్పుడెందుకు అదే మార్గంలో నడుస్తున్నారనేదానికి ఆయనే సమాధానం చెప్పాలి.

ఏఎన్‌ఆర్ కళాశాలకు రూ.2 కోట్ల నిధులు

సినీ నటుడు నాగార్జున వెల్లడి

అక్కినేని జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగార్జున

మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్

గుడివాడటౌన్: ''నాన్న చదువుకోలేదు.. ఆయనకు చదువంటే ఎంతో ఇష్టం. అందుకే వేలాది మంది చదువుకుని ఉన్నత స్థితికి చేరతారనే సంకల్పంతో ఆయన ఈ కళాశాల నిర్మాణంలో ఆయన వంతు కృషిచేశారు'' అని సినీ నటుడు, అక్కినేని నాగార్జున తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు(ఏఎన్‌ఆర్‌ని) గుర్తు చేసుకున్నారు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కృష్ణాజిల్లా గుడివాడ వచ్చారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ నాన్న కృషికి ఫలితంగా కళాశాల కూడా ఎంతోమంది ప్రతిభావంతులను ఈ సమాజానికి అందించిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్యాభివృద్ధి) కోర్సులు ప్రవేశ పెడతామనడం శుభసూచకమని ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థుల ప్రోత్సాహకాల కోసం తన కుటుంబ సభ్యులందరం రూ.2 కోట్ల నిధులు సమకూరుస్తున్నామన్నారు. ఇంత ఉన్నత కార్యక్రమానికి ఒట్టి చేతులతో వెళ్లడం సరికాదని తన భార్య సూచన మేరకు ఈ చిన్న మొత్తాలను కళాశాల యాజమాన్యానికి అందజేస్తామన్నారు. వజ్రోత్సవాలలో భాగంగా రెండో రోజు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పార్లమెంట్ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ రచించిన అక్కినేని జీవిత చరిత్ర పుస్తకాన్ని నాగార్జున ఆవిష్కరించారు. కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థులైన హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్, మాజీ ఎంపీలు కావూరి సాంబశివరావు, యలమంచిలి శివాజి తదితరులు హాజరయ్యారు.

సామాన్యులను ఉన్నత స్థితికి చేర్చిన ఏఎన్నార్ కళాశాల: హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్

అతి సామాన్యులను ఉన్నత స్థితికి చేర్చిన విద్యా సంస్థ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల అని హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ కొనియాడారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో బుధవారం ఆయన మాట్లాడారు. విద్య అవసరం, గొప్పతనాన్ని గుర్తించి అలనాటి పెద్దల ఆలోచన అమలు నేడు తమవంటి వారికి భవిష్యత్‌నిచ్చిందని పేర్కొన్నారు. 75 ఏళ్ల క్రితం పరిసర ప్రాంతాల్లో ఎక్కడా కళాశాలలు లేని రోజుల్లో ఈ ప్రాంత యువత భవితను దృష్టిలో పెట్టుకుని కళాశాల ఏర్పాటు చేయాలనుకోవడం అందుకు రైతులు భూమి విరాళంగా ఇవ్వడం వారి గొప్పదనానికి విద్య పట్ల వారికున్న శ్రద్ధకు నిదర్శనం అన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థి ఆ రైతులకు రుణపడి ఉంటారన్నారు. తనతో, తనకు ముందు, తన తర్వాత ఈ కళాశాలలో విద్య నేర్చుకున్న ప్రముఖులు ఎందరో దేశవిదేశాలలో ఉన్నత శిఖరాలు అధిరోహించారంటే కళాశాల ఏర్పాటు చేసిన వారి ముందు చూపే కారణమన్నారు.

అమిత్‌షాతో ఏపీ బీజేపీ నేతల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ భవనంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం సమావేశమయ్యారు. ఏపీ బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'అటల్ మోదీ సుపరిపాలన యాత్ర'కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని అమిత్‌షాకు వివరించారు.

వచ్చే గురువారం క్రిస్మస్...
ధనుర్మాసం ఆరంభమయింది.
ఈ సందర్భంగా ప్రత్యేక కథనాలు
'సన్నిధి' 'సాక్షి ప్లస్' ఈ పేపర్‌లో

● న్యూస్‌మేకర్

గోరంత సేవైనా గౌరవమే!

అది... రెండేళ్ల కిందటి సంఘటన. హైదరాబాద్ నగరంలో ప్రజాదర్బార్. పదుల కొద్దీ వీల్ చెయిర్‌లలో దివ్యాంగులు. వారి కష్టాన్ని సీయంకి వివరిస్తోందో మహిళ. అందరూ రోడ్డు పక్కన అడుక్కునే వాళ్లే. ప్రభుత్వం పెన్షన్ ఇస్తే అడుక్కోవడం మానేస్తారు. పెన్షన్ రావాలంటే ఆధార్ కార్డు ఉండాలి. ఆధార్ కార్డు రావాలంటే వారికో అడ్రస్ ఉండాలి. ఉండడానికి ఇల్లులేక, తినడానికి తిండి లేక రోడ్డు పక్కన భిక్షమెత్తుకుంటున్న వారిని అడ్రస్ అడిగితే ఏం చెప్పగలుగుతారు? ప్రభుత్వ వైఫల్యమే వీరి అడ్రస్, ఈ ప్రజాభవనే వీరి అడ్రస్... అని వాదించింది. సీయం పక్కనే రెవెన్యూ మినిస్టర్ కూడా ఉన్నారు. అడ్రస్ అవసరం లేకుండా ఆధార్ కార్డులు జారీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ నియమావళికి, ఆపన్నుల అవసరానికి మధ్య ఉన్న అగాధం తొలగిపోయింది. దిక్కులేని వారికి ఆధారం దొరికింది. సమస్య ఉంది అంటే పరిష్కారం కూడా ఉంటుంది.

అయితే సమస్యను సింపతీతో చూసినంత కాలం పరిష్కార మార్గం కనిపించదు, ఎంపతీతో చూసినప్పుడే ఆ దారి గోచరమవుతుంది. బాధితుల కష్టాన్ని తన కష్టంగా భావించి స్పందించే మనసు ఉండడంతోనే ఆమెకు పరిష్కార మార్గం కనిపించింది. ఆమె సోషల్ యాక్టివిస్ట్ **శ్రీలక్ష్మి రెడ్డి.**

'నాకు వందమంది శక్తిమంతులైన యువతను ఇవ్వండి, భారతదేశాన్ని మార్చి చూపిస్తాను' అన్న వివేకానందుడే తనకు స్ఫూర్తి అంటారు సోషల్ యాక్టివిస్ట్ శ్రీలక్ష్మిరెడ్డి. భర్త, ముగ్గురు పిల్లలతో గృహిణిగా ఖమ్మంజిల్లా నుంచి హైదరాబాద్ నగరానికి వచ్చిన ఆమె రామకృష్ణ మఠం బోధనలతో స్ఫూర్తిపొందారు. తొంభయ్యవ దశకం మొదట్లోనే లయన్స్ క్లబ్ సభ్యురాలిగా సేవాపథంలో నడిచారు. చదువంటే ఆమెకు తీరని దాహం. ముగ్గురు పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయడంతోపాటు పెళ్లి కారణంగా ఆగిపోయిన తన చదువును కొనసాగించారు. ఇప్పుడామె ఎల్‌ఎల్‌బి స్టూడెంట్. 'మహిళలు కుటుంబ సమస్యలతో వస్తుంటారు. వారి కాపురం నిలబెట్టడానికి లోకజ్ఞానంతో కౌన్సెలింగ్ ఇచ్చేదాన్ని. న్యాయపరమైన సలహా కోసం తరచూ మా వారిని విసిగించాల్సి వస్తోంది. నా ఫ్రీ సర్వీస్ కోసం ఇంట్లో వాళ్లను ఇబ్బంది పెట్టడం ఎందుకు? ఆ కోర్సు నేనే చేస్తే మంచిది కదా అని చదువుతున్నాను' అంటూ తన జీవితాన్ని సేవాపథంలోకి నడిపించిన సంఘటనను గుర్తు చేసుకున్నారామె.

మహిళా ఖైదీ వార్త

''న్యూస్‌పేపర్‌లో 'అత్త తల పగుల కొట్టిన మహిళ' అనే వార్త నన్ను కదిలించి వేసింది. ఆ మహిళది సత్తుపల్లి. మా మండలమే. ఎందుకిలా చేసి ఉంటుంది... ఒకసారి మాట్లాడదాం అని చంచల్‌గూడ జైలుకెళ్లి ఆమెను కలిశాను. వ్యభిచారం చేసి డబ్బు సంపాదించమని ఒత్తిడి చేయడం, భర్త ముందు దోషిగా నిలబెట్టడం వంటి బాధలు తట్టుకోలేకపోయింది. మనసు చంపుకుని బతకలేక, పట్టలేని కోపంలో రోకలితో తల మీద మోదింది. చట్టపరంగా ఆ మహిళ చేసింది తప్పే కాబట్టి న్యాయస్థానం శిక్ష విధించింది. ఆమెకు చదువు లేదు. శిక్ష పూర్తయి జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆమె ఎలా బతకాలి అనే ప్రశ్న చాలారోజులు నన్ను తొలిచేసింది.

> ### ఆటా సభల్లో కొత్త భారతం
> జీవితం అంటేనే సవాళ్లమయం. కష్టం వచ్చిందని ఏ ఆడపిల్లా చనిపోకూడదు... తమ కాళ్ల మీద తాము నిలబడాలి, కష్టపెట్టిన వాళ్లు తలదించుకునేలా జీవించి చూపించాలనేదే నా సందేశం. అందుకే నా సర్వీస్‌లో హెల్త్, ఎడ్యుకేషన్, ఎకనమిక్ ఎంపవర్‌మెంట్ మీద దృష్టి పెట్టాను. సివిల్స్ ప్రిపరేషన్ కోసం హైదరాబాద్‌కు వచ్చిన పేదింటి ఆడపిల్లలకు ఉచితంగా బస, భోజనం అందిస్తున్నాను. మా తరంలో మహిళలకు అందని అభివృద్ధిని ఈ తరం యువతుల్లో చూస్తున్నాను. అయితే మనదేశంలో ఆడవాళ్లు ఎంత చదివినా, ఎంత పెద్ద బాధ్యతలు నిర్వర్తిస్తున్నా సరే... ఇంటికి వచ్చే టప్పటికి ఆమె గృహిణిగా మారిపోవాల్సిందే. గరిట ఆమె కోసం చూస్తూ ఉంటుంది. 2012లో ఆటా సభలకు యూఎస్‌లోని అట్లాంటాకు వెళ్లినప్పుడు మనం కోరుకుంటున్న స్త్రీ సమానత్వాన్ని అక్కడ చూశాను. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటారు, ఇంటిపనులను పంచుకుంటారు. యువతరం ఆలోచనలు సున్నితత్వాన్ని సంతరించుకుంటున్నందుకు సంతోషం కలుగుతోంది.
>
> – శ్రీలక్ష్మి రెడ్డి, సోషల్ యాక్టివిస్ట్

జైలు శిక్షణ

జైలు శిక్ష కోసం మాత్రమే కాదు శిక్షణ కూడా ఇవ్వాలని మహిళా ఖైదీలకు ఫినాయిల్ మేకింగ్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సులు నేర్పించడం మొదలుపెట్టాను. డ్వాక్రా గ్రూపు లీడర్ల కు ట్రెనింగ్ ఆఫ్ ట్రైనర్స్ ప్రోగ్రామ్‌లో వందలాది మహిళలకు శిక్షణనిచ్చాను. సమాజంలో నేను చూసిన సమస్యలు, నాకు ఎదురైన సవాళ్ల నుంచి పాఠాలు నేర్చుకున్నాను. ఆ పాఠాలే నా సేవకు సోపానాలు. మా ఉమ్మడి కుటుంబంలో ఏడాది బిడ్డ కంటిని కోల్పోయింది. ఇంటిల్లిపాదీ అనుభవించిన మానసిక క్షోభను దగ్గరగా చూశాను. అందుకే కంటి ఆపరేషన్‌ల మీద ఎక్కువ దృష్టి పెట్టాను. ఖైదీలకు కంటి ఆపరేషన్‌లు చేయించడానికి హోమ్ మంత్రి దగ్గర పర్మిషన్ తీసుకోవాల్సి వచ్చింది. 'జైలు నుంచి సరోజినీదేవి కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి, ఆపరేషన్ చేయించి కోలుకున్న తర్వాత తిరిగి జైల్లో దించడంలో ఏ మాత్రం తేడా జరిగినా నువ్వు జైల్లో ఉండాల్సి వస్తుందమ్మా జాగ్రత్త' అని హెచ్చరించారు అప్పటి హోమ్ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి. విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత ప్రశంసల వర్షం కురిపిస్తుంటే కానీ నేను చాలా పెద్ద సాహసం చేశానని తెలియలేదు. నిస్వార్థంగా గోరంత సేవ చేస్తే ఆకాశమంత గౌరవం దక్కుతుందని తెలిసింది. పాతికేళ్ల నిండిన సామాజిక సేవలో వర్మీ కంపోస్ట్ సర్వీస్‌కు రాష్ట్రపతి నుంచి పురస్కారం అందుకోవడం, రామకృష్ణ మఠం నుంచి మదర్ థెరిస్సా పురస్కారం నా మది నిండిన జ్ఞాపకాలు'' అన్నారీ సామాజిక ఉద్యమకారిణి.

– వాకా మంజులారెడ్డి
'సాక్షి' స్టేట్ బ్యూరో
ఫొటో: నోముల రాజేశ్‌రెడ్డి

● మన(సు)లో మాట

మా అమ్మాయి ధోరణి మారేదెలా?

మా అమ్మాయికి నాలుగేళ్ల వయసున్నప్పుడు నా భార్య చనిపోయింది. అప్పటి నుంచి అన్నీ నేనే అయి మా అమ్మాయిని గారాబంగా పెంచుకున్నాను. ఇప్పుడు మా అమ్మాయికి 19 ఏళ్లు. హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ ఇంజినీరింగ్ చేస్తోంది. అక్కడ తను చదువుకునే కాలేజీ లెక్చరర్‌తో రెండు సంవత్సరాలుగా ప్రేమలో ఉందని, ఆ లెక్చరర్‌కి ఇప్పటికే పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారని, అతను తన భార్యకు విడాకులు ఇచ్చి నా కూతుర్ని పెళ్లి చేసుకుంటానని చెబుతున్నాడని తెలిసింది. అంతేకాదు, నేను కనక తన మాట కాదంటే ఆత్మహత్య చేసుకుంటానని చెబుతోందని కూడా తెలిసింది. నాకు నా కూతురు తప్ప వేరే లోకం లేదు. ఈ పరిస్థితులలో నేను ఏం చేయాలో అర్థం కావడం లేదు. దయచేసి సలహా చెప్పగలరు.

– రామరాజు, భీమవరం

మీ సమస్య చదువుతుంటే మనసు కలచి వేస్తోంది. మీరు వయసులో ఉన్నప్పుడే భార్య చనిపోయినా మళ్లీ పెళ్లి చేసుకోకుండా మీ కూతురే ప్రపంచంగా బతికారు. అలాంటి అమ్మాయి ఈ రోజు ఇలా ప్రవర్తిస్తుంటే జీర్ణించుకోవడం కష్టమే. అయితే ముందుగా మీరు తెలుసుకోవాల్సింది ఏమిటంటే ఇటువంటి సందర్భాలలో మీరు భావోద్వేగానికి లోనై అమ్మాయి మీద అరవడం, కోప్పడి మీవైపు లాక్కోవాలనుకోవడం సరైన పద్ధతి కాదు. మీరు ఎంత బలంగా తనని మీవైపు లాక్కోవాలనుకుంటే తను అంతకన్నా బలంగా మీకు దూరంగా జరిగే ప్రమాదం ఉంది. ఆ వయసులో ఆకర్షణలు, ప్రేమ భావాలు సహజం. కానీ ఇప్పటికే వివాహమై, కుటుంబ బాధ్యతలతో ఉన్న వ్యక్తితో జీవితం ప్రారంభించాలనుకోవడం ఆమె అపరిపక్వతను సూచిస్తుంది. ముందుగా మీ కుమార్తెను నిందించకుండా ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా మాట్లాడండి. ఆమెను మీరు అర్థం చేసుకున్నారు అన్న భావన కలిగేలా నెమ్మదిగా విషయాలను వివరించండి. సాధ్యమైనంత వరకు మూడోవ్యక్తి ద్వారా ప్రొఫెషనల్ కౌన్సెలింగ్ చేయించడం మంచిది. క్లినికల్ సైకాలజిస్టులు ఎలాంటి పక్షపాతం లేకుండా వాస్తవాలు చూపించి ఆమెకు స్వతంత్రంగా ఆలోచించడానికి దారి చూపగలరు. అదే సమయంలో మీరు మీ అమ్మాయి ప్రేమించిన వ్యక్తి చెడ్డవాడని ఆమెతో పదే పదే అనడం వల్ల ఆమె మిమ్మల్ని అపార్థం చేసుకుని మీకు మరింత దూరం అవుతుంది. వీలయితే ఆ కాలేజీ యాజమాన్యంతో మాట్లాడండి. ఒకవైపు ఇవన్నీ చేస్తూనే మీ అమ్మాయిని జాగ్రత్తగా చూసుకోండి. తను ఆత్మహత్య ఆలోచనలు చేస్తోంది కాబట్టి అసలు ఒంటరిగా వదలకండి. జీవితంలో ఒకోసారి అన్ని సమస్యలకు పరిష్కారాలు మన చేతిలో ఉండచకపోవచ్చు. కాలాన్ని మించిన వైద్యుడు, అనుభవాన్ని మించిన గురువు లేడనే సత్యాన్ని గ్రహించండి. మనసు కవి ఆత్రేయ గారన్నట్టు ''అనుకున్నామని జరగవు అన్నీ.. అనుకోలేదని ఆగవు కొన్ని. జరిగేవన్నీ మంచికని అనుకోవడమే మనిషి పని'' అన్న తాత్త్విక ధోరణి ఇలాంటి పరిస్థితుల్లో తప్పనిసరి అనిపిస్తుంది. మీరు మనసు గట్టి చేసుకుని ధైర్యంగా ఉండండి.

డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ. మీ సమస్యలు,
సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

యూట్యూబ్ పేరెంటింగ్ ఎంతవరకు?



డిజిటల్ లెర్నింగ్ అనివార్యంగా పిల్లల జీవితంలో భాగమైన రోజులొచ్చాయి. ఒకప్పుడు పాఠ్యపుస్తకాలు, నోట్సులతో విద్య సాగితే ఇప్పుడు స్కూలు, కాలేజీలకు సమాంతరంగా పిల్లలు ఇంట్లో యూ ట్యూబ్ పాఠాలతో చదువుతున్నారు. అయితే ఈ చదువు ఎంత వరకు ఉండాలి? ఈ చదువును పిల్లలకు ఎంత మేరకు తల్లిదండ్రులు అనుమతించాలి? పరీక్షలు దగ్గర పడుతున్న సమయం ఇది.

పలకా బలపం పట్టి అక్షరాలు దిద్దే కాలం నుంచి డిజిటల్ స్లేట్ మీద అక్షరాలు రాసే కాలం దాకా చిన్నారులు ఎదిగారు. ఒకప్పుడు పాఠాలంటే పుస్తకాల్లో చూసి చెప్పేవే. కానీ మారిన కాలంలో పాఠం డిజిటలైజ్ అయిపోయింది. అచ్చయిన అక్షరం కన్నా కంటి ముందు కనిపించే రూపాలను చూపిస్తూ పాఠం చెప్తున్నారు టీచర్లు. ఈ ట్రెండ్ మరింత ముందుకు వెళ్లి, యూట్యూబ్ సరికొత్త టీచర్‌గా మారిపోయింది. ఏ అంశమైనా అర్థం కాకపోతే విద్యార్థులు అందులో సెర్చ్ చేసి తెలుసుకుంటున్నారు. కేవలం పుస్తకాలనే నమ్ముకోకుండా టెక్నాలజీ ద్వారా పాఠాలు నేర్చుకుంటున్నారు. ఇది మంచా, చెడా, దీనివల్ల కలిగే ఫలితాలు ఏమిటనేది ప్రస్తుతం చర్చగా మారింది.

వ్యూస్ ప్రభావితం చేస్తున్నాయి

గతంలో పిల్లలు టీచర్ పాఠం చెప్తున్నప్పుడు అర్థం కాకపోతే లేచి అడిగేవారు. సందేహాలు తీర్చేందుకు ఇంట్లో పెద్దలు, ట్యూషన్ టీచర్లు ఉండేవారు. ఈ రెండు విషయాలు ఇప్పుడు వెనుక స్థానం తీసుకున్నాయి. ఓపిక లేని టీచర్లు, తీరిక లేని తల్లిదండ్రులు యూట్యూబ్‌ను పిల్లల చేతుల్లో పెట్టారు. అందులో అనేకమంది ఎడ్యుకేషన్ కంటెంట్ క్రియేట్ చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. పిల్లలకు అర్థమయ్యే సులభరీతిలో అంశాలను బోధిస్తున్నారు. అవన్నీ ఉచితం కావడంతో చిన్నారులు వాటిపై ఆధారపడుతున్నారు. దీంతో కొన్ని వీడియోలకు లక్షల కొద్దీ వ్యూస్ ఉంటున్నాయి. వ్యూస్‌ను చూసి పిల్లలు మరింతగా ఆ వీడియోస్‌ను ఫాలో అవుతున్నారు.

ఎందుకీ మార్పు?

ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ విప్లవం మొదలైంది. రానురానూ అది మరింత పెరుగుతుందని అందరూ భావిస్తున్నారు. ఇటువంటి సమయంలో చిన్నారులకు సాంకేతిక అనుభవం అవసరం అనేది తల్లిదండ్రుల వాదన. ఈ సమయంలో పాఠాలకు కేవలం పుస్తకాల మీద, టీచర్ల మీద మాత్రమే ఆధారపడితే కష్టమని, యూట్యూబ్ ద్వారా నేర్పే పాఠాలు చిన్నారులకు చేరాలని వారి మాట. పైగా పుస్తకాల్లోని అంశాలు పేరాల కొద్దీ రాసినా అవి చిన్నారులకు అనుభవపూర్వకమైన జ్ఞానం అందించలేవు. వీడియోలో అయితే వారి కంటికి అన్నీ కనిపిస్తూ వివరించడం వల్ల మరింత స్పష్టంగా నేర్చుకునే అవకాశం ఉందని అంటున్నారు.

చెడు ప్రభావాల మాటేమిటి?

యూట్యూబ్ పాఠాలు మంచివే అని అంటున్నా, దానివల్ల కలిగే చెడు ప్రభావాల మాటేమిటని విద్యావేత్తల ప్రశ్న. ఏదైనా అంశం గురించి చెప్పే వీడియోలను ఏ మేరకు నమ్మాలి, అందులోని అంశాలలో వాస్తవికత అనేది ఎవరు నిర్ణయిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఏది తప్పు, ఏది ఒప్పో తెలియని చిన్నారులు వాటినే నమ్మితే రాబోయే కాలంలో అది ప్రమాదకరంగా మారుతుందని అంటున్నారు. దీంతోపాటు యూట్యూబ్ అలవాటైన చిన్నారులకు బడి మీద అయిష్టత పెరుగుతుందని, రోజంతా నెట్‌లో గడిపేందుకు ఆసక్తి చూపుతారని అంటున్నారు. ఇది వారి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందంటున్నారు. పుస్తకాల్లో ఉన్నది చదవడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి పెరుగుతుందని, అన్నీ కంటి ముందు చూపించే వీడియోల వల్ల వారు సొంత బుర్ర వాడటంలో శ్రద్ధ పెట్టలేకపోతున్నారని అంటున్నారు.

ఇలా చేస్తే మేలు..

- ఏ ఛానెల్ అయితే మేలైన, నిజమైన కంటెంట్ అందిస్తుందో ముందుగా తల్లిదండ్రులు తనిఖీ చేయాలి. అందులోని పాత వీడియోలు, దాని కింద కామెంట్లు పరిశీలించాలి. అది నమ్మదగినది అనిపిస్తేనే పిల్లలకు చూపించాలి.
- యూట్యూబ్ పాఠాలను కొందరు నిపుణులకు పంపి, అవి సరైనవని నిర్ధారణకు వచ్చాకే పిల్లలకు సూచించడం మరింత మేలు.
- స్కూల్లో టీచర్లు చెప్పిన విషయాలు అర్థం కాలేదని పిల్లలు అంటే, ముందుగా ఆ విషయాలేమిటో తల్లిదండ్రులు కనుక్కోవాలి. దాని గురించి వారికి వివరించి, ఆ తర్వాత వారి పక్కనే కూర్చుని యూట్యూబ్ వీడియోలు చూడాలి. అందులోని చెప్పేదానికి తోడు మీరూ కొన్ని అంశాలు జతచేయాలి.
- యూట్యూబ్ పాఠాలకు టైం కేటాయించాలి. ఎక్కువ సమయం పిల్లలు అవే చూడకుండా, వారికి ఇతర పనులూ కేటాయించాలి.
- పిల్లలు ఏమేం వీడియోలు చూస్తున్నారు, ఎంతసేపు చూస్తున్నారు, ఎందుకు చూస్తున్నారు వంటి విషయాలు పెద్దలు గమనిస్తూ ఉండాలి.
- కావాలని స్కూల్ మానేసి, పిల్లలు పాఠాల కోసం ఈ వీడియోల మీద ఆధారపడటాన్ని ఏమాత్రం ప్రోత్సహించకూడదు.
- వీడియోల మధ్యలో సినిమాలు చూడటం, ఇతర అంశాలను చూడటం వంటివి పెద్దలు నిరోధించాలి.
- వీడియోలు చూసి ఆగకుండా, అందులోని పాయింట్లను నోట్ చేసుకోమని సూచించాలి. వాటిని పాఠ్యపుస్తకాల్లోని అంశాలతో సరిచూసుకోమని చెప్పాలి.
- యూట్యూబ్‌లో చూపించిన అంశాల గురించి పిల్లలతో చర్చించాలి. అవి వారికి ఎలా అర్థమవుతున్నాయో అంచనా వేసి, మార్పు చేర్పులు చెప్పాలి.

● ఫస్ట్ టైమ్

చరిత్ర సృష్టించిన సాయి జాదవ్

డెహ్రాడూన్‌లోని ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ మిలిటరీ అకాడమీ(ఐఎంఎ) తొలి మహిళా ఆఫీసర్‌గా 23 సంవత్సరాల సాయి జాదవ్ చరిత్ర సృష్టించింది. 1932లో ప్రారంభమైన ఈ అకాడమీ నుంచి 67,000 మంది ఆఫీసర్ క్యాడెట్‌లు పాసవుట్ పరేడ్ చేశారు. అందులో ఒక్కరు కూడా మహిళ లేరు. సాయి ముత్తాత బ్రిటిష్ సైన్యంలో, తాత భారత సైన్యంలో పనిచేశారు. నాన్న సందీప్ జాదవ్ ప్రస్తుతం సైన్యంలో పనిచేస్తున్నారు. ఆ కుటుంబం నుంచి నాలుగో తరం సైనిక అధికారిగా ప్రయాణం మొదలుపెట్టింది సాయి జాదవ్. ఆరు నెలల కఠిన సైనిక శిక్షణ పూర్తి చేసుకొని 'ఐఎంఎ' నుంచి పట్టభద్రురాలైన తొలి మహిళా సైనిక అధికారిగా చరిత్ర సృష్టించింది.

మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన సాయి కర్నాటకాలో బెల్గాంతో సహా అనేక రాష్ట్రాలలో చదువుకుంది. గ్రాడ్యుయేషన్ తరువాత సర్వీసెస్ సెలెక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) పరీక్ష రాసి తన ప్రతిభతో అన్ని దశల స్క్రీనింగ్‌లలోనూ అర్హత సాధించింది.

ఇండియన్ మిలిటరీ అకాడమీలో అందరూ పురుషులే కావడంతో అందులో శిక్షణ పొందిన వారిని 'జెంటిల్‌మెన్ క్యాడెట్స్' అని పిలిచే వారు. ఇప్పుడది 'ఆఫీసర్ క్యాడెట్స్'గా మారనుంది.

'ఐఎంఎ'లో నిర్వహించిన వేడుకలో సైనిక ఉన్నతాధికారులు సాయి జాదవ్ యూనిఫామ్‌పై నక్షత్రాల బ్యాడ్జీని పిన్ చేశారు. టెరిటోరియల్ ఆర్మీ ఆఫీసర్‌గా ర్యాంకింగ్‌ను కేటాయించారు.

చారిత్రక ఘనత సాధించిన సాయి గురించి తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు. 'ఇండియన్ మిలిటరీ అకాడమీ నుంచి ఉత్తీర్ణత సాధించి టెరిటోరియల్ ఆర్మీలో చేరిన తొలి మహిళగా సాయి గుర్తింపు తెచ్చుకోవడం గర్వంగా ఉంది' అంటున్నారు ఆమె తల్లిదండ్రులు.

జూన్ 2026లో డెహ్రాడూన్ 'ఇండియన్ మిలిటరీ అకాడమీ'లో జరగనున్న పాసింగ్ ఔట్ పరేడ్‌ను పూర్తిగా మహిళలతో కూడిన తొలి ప్రత్యేక బ్యాచ్ నిర్వహించనుంది. ఇది చారిత్రక మలుపు అని చెప్పుకోవచ్చు.

● సమ్‌థింగ్ స్పెషల్

ఒట్టు... ఇలాంటి పెళ్లి చూసి ఉండరు!

'ఇది పెళ్లి వేడుకా? పాన్ ఇండియా సినిమానా?' అని ఆశ్చర్యపోయారు అతిథులు. వేడుకలో అడుగడుగునా సినిమాటిక్ ట్రిక్స్‌ను ఉపయోగించడమే దీనికి కారణం.

వేదికపై రైలు పట్టాలు కనిపిస్తాయి. అయితే ఆ పట్టాల మీది నుంచి రైలు కాదు... అటు నుంచి హంసతూలికా వాహనంలో వధువు, ఆమెకు ఎదురుగా మరో హంసతూలికా వాహనంలో వరుడు వస్తుంటాడు.

బ్యాక్‌గ్రౌండ్‌లో అలనాటి 'మహాభారత్' టీవీ సీరియల్‌లోని పాటలు వినిపిస్తుంటాయి.

వధూవరుల చేతిలో స్పార్క్–షూటింగ్ గన్స్ ఉంటాయి. ఇద్దరూ ఒకే చోటుకి రాగానే పూల వెలుగు వాన కురుస్తుంది. బాణసంచా పేలుతుంది.

ఒక్కటా రెండా... ఈ పెళ్లి వేడుకలో ఎన్నో వింతలు.

'ఎంత గొప్ప క్రియేటివిటో... ఆహా!' అని ఆకాశానికెత్తారు కొందరు. చాలామంది మాత్రం...

'ఎవరి పిచ్చి వారికి ఆడంబరం' అన్నట్లుగా కామెంట్స్ పెట్టారు. అయినప్పటికీ ఈ వీడియో వైరల్ అయింది. రాబోయే కాలంలో ఇదొక ట్రెండ్‌గా కూడా మారవచ్చు!

● ముగ్గు ముచ్చట



సుజాతి పి.వి.ఎల్.
యాప్రాల్,
సికింద్రాబాద్

18 చుక్కలు,
2 వరసలు
2 వచ్చేవరకు
సరిచుక్కలు



టి.డి. శిరీష
అనంతపురం

13 చుక్కలు,
సరిచుక్క
1 వచ్చేవరకు





ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
డిసెంబర్ 17న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,33,410	1,36,660	1,34,510	1,36,660	1,32,250	1,35,270
బంగారం (22 క్యారెట్లు)	1,22,110	1,23,300	1,23,300	1,27,000	1,21,670	1,24,000
వెండి	1,98,000	2,05,000	2,22,000	2,05,000	1,97,000	2,22,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్: వరుణ్ చక్రవర్తి అగ్రస్థానం మరింత పదిలం

దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో రాణిస్తున్న భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. తన కెరీర్‌లో అత్యుత్తమంగా 818 పాయింట్లతో 'టాప్' ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. తాజా సిరీస్‌లో 6 వికెట్లు ఖాతాలో వేసుకున్న వరుణ్... రెండో స్థానంలో ఉన్న జాకబ్ డఫీ (699 పాయింట్లు; న్యూజిలాండ్) కంటే 119 పాయింట్లు ముందు ఉండటం విశేషం. అక్షర్ పటేల్ 13వ స్థానంలో కొనసాగుతుండగా... అర్ష్‌దీప్ సింగ్ నాలుగు స్థానాలు మెరుగు పరుచుకొని 16వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ 909 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సఫారీలతో సిరీస్‌లో నిలకడగా రాణిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ ఠాకూర్ తిలక్ వర్మ రెండు స్థానాలు ఎగబాకి 4వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా (222 పాయింట్లు) భారత్ తరఫున అత్యుత్తమంగా నాలుగో స్థానంలో ఉండగా... పాకిస్తాన్ ప్లేయర్ సయీమ్ అయూబ్ (295 పాయింట్లు) 'టాప్'లో కొనసాగుతున్నాడు.

మ్యాచ్‌కు 'పొగ'బెట్టిన 'మంచు'

భారత్, దక్షిణాఫ్రికా మధ్య నాలుగో టి20 రద్దు

పొగమంచు కారణంగా పడని టాస్ ● గాయంతో సిరీస్ నుంచి గిల్ అవుట్ ● రేపు అహ్మదాబాద్‌లో ఆఖరి టి20

వర్షం కారణంగా... మైదానం చిత్తడిగా ఉండటం మూలంగా... ప్రమాదకర పిచ్‌లు రూపొందించినందుకు... తమ జట్ల పేలవ ప్రదర్శనకు నిరసనగా అభిమానుల ఆగ్రహంతో... అంతర్జాతీయ క్రికెట్‌లో అర్ధంతరంగా మ్యాచ్‌లు రద్దయిన సంఘటనలు చూశాం. కానీ బుధవారం భారత్–దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరగాల్సిన టి20 మ్యాచ్‌కు పైవేవీ ఆటంకం కలిగించలేదు. ఊహించని విధంగా మితిమీరిన పొగమంచు అడ్డంకిలా మారింది. దాంతో కనీసం టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. ఫలితంగా దక్షిణాఫ్రికాపై టి20 సిరీస్ నెగ్గాలంటే రేపు అహ్మదాబాద్‌లో జరిగే చివరి మ్యాచ్‌లో భారత్ గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

లక్నో: ఇక ఈ టి20 సిరీస్ భారత్ గెలవొచ్చు. లేదంటే పర్యాటక దక్షిణాఫ్రికాతో పంచుకోవచ్చు. ఎందుకంటే ఆఖరి పోరులో గెలిస్తే సిరీస్ 3–1తో టీమిండియా వశమవుతుంది. కానీ ఓడితే 2–2తో సమమవుతుంది. మొత్తానికి పొగమంచు సిరీస్ ఫలితాన్ని సైతం అటుఇటూ కాకుండా చేసేసింది. బుధవారం భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఇక్కడి ఎకానా స్టేడియంలో జరగాల్సిన నాలుగో టి20 మ్యాచ్ రద్దయ్యింది. పొగమంచు, ప్రతికూల వాతావరణం మ్యాచ్‌కు అవరోధంగా నిలిచింది. మొదట టాస్ ఆలస్యం అని టీవీల్లో బోర్డు కనిపించింది. సమయం గడుస్తున్నకొద్దీ ఫీల్డ్ అంపైర్లు అనంత పద్మనాభన్, రోహన్ పండిట్‌లు మ్యాచ్ నిర్వహణ కోసం మైదానాన్ని, మంచు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నారు. కనీసం 6 ఓవర్ల చొప్పున మ్యాచ్ నిర్వహించాలని వేచి చూశారు. చివరకు రాత్రి 9 గంటల 25 నిమిషాలకు ఆరోసారి మైదానాన్ని సమీక్షించి మ్యాచ్ నిర్వహించడం సాధ్యపడదని ప్రకటించారు.

మంచు దుప్పటి కప్పేసింది!

భారత్‌లో శీతాకాలం సీజన్ ఇది. పైగా డిసెంబర్ మధ్య నుంచి జనవరి అసాంతం చలి పులిలా పంజా విసురుతుంది. ఇక ఉత్తర భారత మైతే సూర్యుడు ఉదయించాక కూడా వణుకు తప్పదు. ఉదయం, రాత్రి పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుంది. పొగమంచు కమ్ముతుంది. కంటికేది కనిపించదు. బుధవారం రాత్రి కూడా సరిగ్గా ఇదే జరిగింది. గరం గరం చేసే హైమాస్ట్ ఫ్లడ్‌లైట్లు అన్నీ వెలిగించినా కూడా మంచుదుప్పటి ముందు ఆ వెలుగు కూడా దిగదుడుపే అయ్యింది. పొగమంచు మ్యాచ్ జరగకుండా మైదానాన్ని కప్పేయడంతో ఫీల్డు అంపైర్లు పలుమార్లు సమీక్షించి మ్యాచ్ రద్దుకు నిర్ణయించారు. చివరిసారిగా రాత్రి 9.25 గంటలకు మైదానంలోని పరిస్థితిని సమీక్షించాక ఇక మ్యాచ్ జరిగే అవకాశం లేదని ఫీల్డ్ అంపైర్లు తేల్చారు. ఇంతటి చలిని లెక్కచేయకుండా, మంచు కురిసే వేళలో మ్యాచ్ కోసం నిరీక్షిస్తున్న ప్రేక్షకుల్ని ఏ మాత్రం ఇబ్బంది పెట్టకూడదని నిర్ణయించుకున్న అంపైర్లు అనంత పద్మనాభన్, రోహన్‌లు ఆలస్యం చేయకుండా మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అప్పటివరకు జెండాలు, అభిమాన క్రికెటర్ల ఫొటోలు, 4, 6 బోర్డులను ఊపుతూ ఉత్సాహంగా కనిపించిన ప్రేక్షకులు నిరాశగా వెనుదిరగడం మొదలు పెట్టారు.

మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్, హెడ్ కోచ్ గంభీర్, దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్క్‌రమ్‌తో అంపైర్ల చర్చలు

గిల్ అవుట్

భారత టెస్టు, వన్డేల కెప్టెన్ శుబ్‌మన్ గిల్ కూడా ప్రస్తుత సిరీస్‌కు దూరమయ్యాడు. అసలే ఈ ఓపెనర్ ఫామ్‌లేమీతో తంటాలు పడుతున్నాడు. ట్రెయినింగ్ సెషన్‌లో అతని బొటనవేలికి గాయమైంది. దీంతో ఈ నాలుగో టి20తో పాటు రేపు అహ్మదాబాద్‌లో జరిగే ఆఖరి మ్యాచ్‌కూ అందుబాటులో లేకుండా పోయాడు. ఇతని స్థానంలో సంజూ సామ్సన్ బరిలోకి దిగుతాడు. ఇప్పటికే పేస్ ఎక్స్‌ప్రెస్ బుమ్రా, స్పిన్నర్ అక్షర్ పటేల్ సైతం ఈ సిరీస్‌కు దూరమైన సంగతి తెలిసిందే.

టిక్కెట్ల డబ్బులు తిరిగి చెల్లింపు

మ్యాచ్ మొదలవకుండానే రద్దయ్యింది. కనీసం టాస్‌కు కూడా నోచుకోలేదు. దీంతో నిబంధనల ప్రకారం టిక్కెట్లకు ప్రేక్షకులు వెచ్చించిన రుసుమును తిరిగి చెల్లించే ఏర్పాట్లు చేస్తామని స్టేడియం వర్గాలు వెల్లడించాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మ్యాచ్ పాయింట్ కాపాడుకొని...

తొలి మ్యాచ్‌లో గెలిచిన సాత్విక్–చిరాగ్ జోడీ

హాంగ్జౌ: బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నమెంట్ ప్రతిష్టాత్మక వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ శుభారంభం చేసింది. బుధవారం మొదలైన ఈ టోర్నీలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్–8లో ఉన్న వాళ్లు మాత్రమే పాల్గొనేందుకు అర్హులు. పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మ్యాచ్‌లను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. భారత్ నుంచి పురుషుల డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం మాత్రమే ఈ టోర్నీకి అర్హత సాధించింది. గ్రూప్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ మూడో ర్యాంక్ జంట సాత్విక్–చిరాగ్ 12–21, 22–20, 21–14తో ప్రపంచ ఐదో ర్యాంక్ జోడీ లియాంగ్ వె కెంగ్–వాంగ్ చాంగ్ (చైనా)పై విజయం సాధించింది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం గెలిచిన లియాంగ్–వాంగ్ చాంగ్ ద్వయం ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌ను అలవోకగా నెగ్గింది. అయితే రెండో గేమ్‌లో భారత జోడీ పుంజుకుంది. 18–12తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ దశలో చైనా జంట అనూహ్యంగా విజృంభించి వరుసగా ఏడు పాయింట్లు గెలిచి 19–18తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత 20–19తో విజయానికి పాయింట్ దూరంలో నిలిచింది. మరో పాయింట్ కోల్పోతే ఓడిపోయే స్థితిలో సాత్విక్–చిరాగ్ ద్వయం ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడి వరుసగా మూడు పాయింట్లు గెలిచి రెండో గేమ్‌ను 22–20తో సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో ఒక దశలో 7–9తో వెనుకబడిన సాత్విక్–చిరాగ్ జంట తమ లోపాలను వెంటనే సరిచేసుకొని వరుసగా ఐదు పాయింట్లు సాధించి 12–9తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని భారత జోడీ విజయాన్ని ఖరారు చేసుకుంది. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో ఫజర్ అల్ఫియాన్–షోహిబుల్ ఫిక్రి (ఇండోనేసియా) జంటతో సాత్విక్–చిరాగ్ ద్వయం తలపడుతుంది.

యువెక్–వెంకట్‌లక్ష్మి జోడీకి పసిడి పతకం

న్యూఢిల్లీ: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు స్వర్ణ పతకం లభించింది. బుధవారం జరిగిన షాట్‌గన్ ఈవెంట్‌లో స్కీట్ మిక్స్‌డ్ జూనియర్ టీమ్ విభాగంలో తెలంగాణకు చెందిన యువెక్ బత్తుల–వెంకట్ లక్ష్మి లక్కు జోడీ విజేతగా నిలిచింది. క్వాలిఫయింగ్‌లో యువెక్–వెంకట్ లక్ష్మి ద్వయం 141 పాయింట్లు స్కోరు చేసి... వన్షిక–జ్యోతిరాదిత్య సింగ్ (మధ్యప్రదేశ్) జంట 140 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించాయి. స్వర్ణ–రజత పతక మ్యాచ్‌లో యువెక్–వెంకట్ లక్ష్మి జోడీ 38–37తో వన్షిక–జ్యోతిరాదిత్య జంటను ఓడించి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. క్లే పీజియన్ స్కీట్ సీనియర్ మాస్టర్ వ్యక్తిగత విభాగంలో తెలంగాణ షూటర్ గుస్తీ నోరియా అగ్రస్థానంలో నిలిచారు. ఫైనల్లో గుస్తీ నోరియా 41 పాయింట్లు సాధించి విజేతగా నిలిచారు.

సాక్షి సినిమా

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో హోమ్ బౌండ్

జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హోమ్ బౌండ్'. నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' విభాగంలో 98వ ఆస్కార్ అవార్డ్స్ కోసం భారతదేశం తరఫున అధికారిక ఎంట్రీ సాధించిన సంగతి తెలిసిందే. నామినేషన్ పోటీలో నిలవడానికి ఇది తొలి అడుగు. షార్ట్ లిస్ట్‌లో చోటు దక్కించుకోవడం రెండో దశ. ఇప్పుడు ఆ దశలో కూడా విజయం సాధించింది. తాజాగా 12 విభాగాల్లో పోటీ పడుతున్న సినిమాల షార్ట్ లిస్ట్‌ని అవార్డు కమిటీ ప్రకటించింది. 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' విభాగంలో ఆస్కార్ నామినేషన్‌కి పోటీ పడే 15 చిత్రాల జాబితాలో 'హోమ్ బౌండ్'కి స్థానం దక్కింది. తుది జాబితాలో ఐదు చిత్రాలను నామినేట్ చేస్తారు. ఆ నామినేషన్ దక్కించుకున్న చిత్రాలను జనవరి 22న ప్రకటిస్తారు. ఇక ఈ చిత్ర కథ విషయానికొస్తే... పోలీసు కావాలనుకునే ఇద్దరు స్నేహితులు తమ కలను సాకారం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కుల, మత వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేయడం అనే అంశంతో 'హోమ్ బౌండ్'ను తెరకెక్కించారు. సెప్టెంబరు 26న ఈ చిత్రం విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 15న లాస్ ఏంజిల్స్‌లో ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది. మరి... 'హోమ్ బౌండ్' నామినేషన్ దక్కించుకుని, హోమ్ కంట్రీకి ఆస్కార్ అవార్డును కూడా తెస్తుందా? అనేది వేచి చూడాల్సిందే.

చంద్రకళ మనసుల్లో నిలిచిపోతుంది

''చాంపియన్' కథ విన్నప్పుడు ఎమోషనల్‌గా అనిపించింది. - అనస్వరా రాజన్

సినిమాలో నేను చేసిన చంద్రకళ పాత్ర చాలా బాగుంటుంది. డైరెక్టర్ ప్రదీప్‌గారి సపోర్ట్‌తో నా క్యారెక్టర్‌కి ఏం కావాలో అన్నీ పర్ఫెక్ట్‌గా చేశాను. నా పాత్ర ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుంది'' అని మలయాళ భామ అనస్వరా రాజన్ చెప్పారు. రోషన్, అనస్వరా రాజన్ జోడీగా నటించిన చిత్రం 'చాంపియన్'. ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా అనస్వరా రాజన్ మాట్లాడుతూ – ''వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్‌లాంటి సంస్థలు నిర్మించిన సినిమాతో తెలుగులో పరిచయం కావడం నా అదృష్టం. తెలుగు ప్రేక్షకులు నేను వేరే భాషలో చేసిన సినిమాలు చూసి, ఎన్నో అద్భుతమైన మెసేజ్‌లు పంపారు. తెలుగులో నా తొలి సినిమాని కూడా అంతే గొప్పగా ఆదరిస్తారని నమ్ముతున్నాను. తెలుగు సినిమా చాలా గ్రాండ్‌గా ఉంటుంది. ఇక్కడ ఫిల్మ్ మేకర్స్, ప్రొడ్యూసర్స్ సపోర్టివ్‌గా ఉంటారు. ఒక్కసారి ఇక్కడ పని చేస్తే మళ్లీ మళ్లీ తెలుగు సినిమాలు చేయాలనిపిస్తుంది. ప్రస్తుతం తెలుగులో 'ఇట్లు మీ అర్జున' సినిమా చేస్తున్నాను. 'చాంపియన్' మూవీ కంటే ముందే నేను ఒప్పుకున్న సినిమా ఇది'' అని పేర్కొన్నారు.

దర్శకుడు కిరణ్ కుమార్ హఠాన్మరణం

నాగార్జున హీరోగా నటించిన 'కేడీ' (2010) సినిమాతో దర్శకుడిగా పరిచయమైన కిరణ్ కుమార్ (కేకే) హఠాన్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆయన కన్నుమూశారు. 'కేడీ' తర్వాత కొంతకాలం దర్శకత్వానికి విరామం ఇచ్చారాయన. ఆ సమయంలో ప్రముఖ దర్శకుడు మణిరత్నం దగ్గర దర్శకత్వ శాఖలో పని చేశారు. కిరణ్ కుమార్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కింగ్ జాకీ క్వీన్'. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల హీరోలుగా, యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోన్న వేళ ఆయన మృతి చెందడం విషాదకరం. విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'భద్రకాళి' సినిమాలో సీబీఐ ఆఫీసర్ పాత్రలో కనిపించారు కేకే. ఆయన మృతి పట్ల పలువురు సినిమా రంగ ప్రముఖులు సంతాపం తెలిపారు.

మనసే నీకే రాశానా...

● నిధీ అగర్వాల్, ప్రభాస్

'సహనా సహనా నా సఖి సహనా... కళలో నిన్నే చూశానా, సహనా సహనా... అతిశయ సుగుణ మనసే నీకే రాశానా...' అంటూ నిధీతో ఆడి పాడారు ప్రభాస్. ఆయన హీరోగా రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 9న రిలీజ్ కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'సహనా సహనా...' అంటూ సాగే రెండో పాటని హైదరాబాద్‌లో ఫ్యాన్స్ మధ్య రిలీజ్ చేశారు. మారుతి మాట్లాడుతూ– ''ఈ సంక్రాంతి 'ది రాజా సాబ్'తో రెబల్ సంక్రాంతి అవుతుంది '' అని తెలిపారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ప్రభాస్‌గారు వస్తారు. జనవరి 8న ప్రీమియర్స్‌లో కలుద్దాం'' అని చెప్పారు. ''రాజా సాబ్'లో సాంగ్స్ సూపర్బ్‌గా వచ్చాయి'' అన్నారు తమన్. నిధీ అగర్వాల్, రిద్ధీ కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్వెల్ చూసి షాక్ అవుతారు

''మా డైరెక్టర్ మురళీ మనోహర్ చెప్పిన 'గుర్రం పాపిరెడ్డి' కథ బాగా నచ్చింది. నేను గతంలో నటించిన చిత్రాల్లో నా క్యారెక్టర్స్ సెటిల్డ్‌గా ఉంటాయి. అయితే 'గుర్రం పాపిరెడ్డి'లో నా పాత్ర కొంచెం ఎనర్జిటిక్‌గా నేనే లీడ్ తీసుకునేలా ఉంటుంది. ఇప్పటివరకూ నేను ఇలాంటి మూవీ చేయలేదు. మా సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని నరేశ్ అగస్త్య తెలిపారు. - నరేశ్ అగస్త్య

ఆయన హీరోగా ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. బ్రహ్మానందం, యోగిబాబు ఇతర పాత్రలు పోషించారు. మురళీ మనోహర్ దర్శకత్వంలో డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ మూవీ ఈ నెల 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నరేశ్ అగస్త్య విలేకరులతో మాట్లాడుతూ–''ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే ఎదుటివాళ్లకు నవ్వొస్తుంది. అదే డార్క్ కామెడీ. 'గుర్రం పాపిరెడ్డి' లోని పాత్రలు ఇబ్బంది పడుతుంటే ప్రేక్షకులు నవ్వుకునేలా ఉంటాయి. సన్నివేశాలు వినోదంతో వెళుతున్నా బలమైన కథ ఉంటుంది. ఇంటర్వెల్ చూసి ఆడియన్స్ షాక్ అవుతారు. ఈ చిత్రంలో నేనొక పని కోసం వస్తాను. ఆ పని చేసేందుకు నాకు తెలిసిన వాళ్లలో కొందరు తెలివిలేని వాళ్లను సెలెక్ట్ చేసుకుంటాను. తెలివైనవాడు తెలివి తక్కువ పని చేస్తే, తెలివి లేని వాళ్లు తెలివైన పని చేస్తే వాళ్ల జీవితాల్లో వచ్చిన పరిణామాలు ఏంటి? అనేది కథ. నాకు ట్రావెలింగ్ అంటే ఇష్టం. ఫ్రీ డైవింగ్ చేస్తుంటా. అంటే ఒక్కసారి ఊపిరి పీల్చి సముద్రంలో ఎంత లోతు వెళ్లగలమో అంత లోతు వెళ్లాలి. ఇప్పటివరకు సముద్రంలో 3 నిమిషాల 40 సెకండ్స్‌లో 80 అడుగుల లోతుకు వెళ్లాను. ఇక నేను హీరోగా నటిస్తున్న ఓ తెలుగు సినిమా 70 శాతం షూటింగ్ పూర్తి అయింది. తమిళంలో హీరోగా ఓ చిత్రం ఒప్పుకున్నాను'' అని చెప్పారు.

ప్రేక్షకులకు థ్రిల్

● నిఖిల్

''జిన్' సినిమాను థియేటర్లో చూస్తున్నప్పుడు ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. ఇందులో కొత్త ప్రపంచాన్ని చూపించాం'' అన్నారు నిర్మాత నిఖిల్ ఎం. గౌడ. అమిత్ రావ్, పర్వేజ్ సింబా, ప్రకాష్ తుమినాడ్, రవి భట్, సంగీత ముఖ్య తారలుగా చిన్మయ్ రామ్ దర్శకత్వంలో నిఖిల్ ఎం. గౌడ నిర్మించిన చిత్రం 'జిన్'. శుక్రవారం ఈ చిత్రం రిలీజ్ కానుంది. నిఖిల్ గౌడ మాట్లాడుతూ– ''చిన్మయ్ రావ్ చెప్పిన 'జిన్' కథ కొత్తగా అనిపించి, నిర్మించాను. థ్రిల్‌కి గురి చేయడంతో పాటు భయపెట్టేలా ఉంటుంది. న్యూ కాన్సెప్ట్‌తో తెరకెక్కించిన ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఇక నుంచి కన్నడ, తెలుగు భాషల్లో వరుసగా సినిమాలు నిర్మించాలనుకుంటున్నాను'' అని చెప్పారు.



వారణాసి సెట్‌కి రావచ్చా? - జేమ్స్ కామెరూన్

మీరు వస్తే ఇండస్ట్రీ థ్రిల్ అవుతుంది - రాజమౌళి

హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్, తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయికి తీసుకెళ్లిన డైరెక్టర్ రాజమౌళి చిట్‌చాట్ చేసుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది. జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన 'అవతార్' (2009), 'అవతార్: ది వే ఆఫ్ వాటర్'(2022) చిత్రాలు సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ ఫ్రాంచైజీలో కామెరూన్ రూపొందించిన తాజా చిత్రం 'అవతార్: ఫైర్ అండ్ యాష్'. ఈ సినిమా ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ముందుగానే చూశారు రాజమౌళి. ఈ సినిమా ప్రదర్శన అనంతరం రాజమౌళి, జేమ్స్ కామెరూన్ వీడియో కాల్‌లో మాట్లాడుకున్నారు. జేమ్స్ కామెరూన్ మాట్లాడుతూ– ''ఫిలిం మేకర్స్ క్రియేటివ్ ప్రాసెస్ గురించి చర్చించుకోవడం చాలా అవసరం. నేను ఏదో ఒక సమయంలో 'వారణాసి' (మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం) సెట్‌కి రావాలనుకుంటున్నాను... రావచ్చా?'' అని అడిగారు. ఇందుకు రాజమౌళి స్పందిస్తూ– ''అంతకి మించిన గౌరవం మరొకటి లేదు. మీ కోసం నా సినిమా యూనిట్ మాత్రమే కాదు, తెలుగు చిత్ర పరిశ్రమ మొత్తం ఎదురు చూస్తోంది... మీరు వస్తే ఘనస్వాగతం లభిస్తుంది'' అన్నారు. ''వారణాసి' షూటింగ్‌లో ఏదైనా ఫన్ ఉంటే చెప్పండి... పులులతో సన్నివేశాలుంటే చెప్పండి.. నేను వస్తాను'' అని కామెరూన్ సరదాగా అడగడంతో రాజమౌళి నవ్వుకున్నారు. ఇంకా రాజమౌళి మాట్లాడుతూ– ''అందరి కంటే ముందు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చూడటం సంతోషంగా ఉంది. సీక్వెన్స్, విజువల్స్, పాత్రలు తీర్చిదిద్దిన విధానానికి హ్యాట్సాఫ్. మూవీ చూస్తున్నప్పుడు చిన్న పిల్లాడిలా అయిపోయాను. బయటకు వచ్చాక అవే ఆలోచనలు వెంటాడాయి. జేక్ నైతికంగా డైలమాలో పడే సీన్స్, అతడు తీసుకునే నిర్ణయాలు అద్భుతంగా చూపించారు. ఈ 'అవతార్' ఫ్రాంచైజీ వెండితెరకు ఒక బెంచ్ మార్క్'' అని పేర్కొన్నారు.

నన్ను ఎవరూ ఏమీ చేయలేరు - మంచు మనోజ్

● భరత్ మోటుకూరి, వెంకట్ రెడ్డి, మంచు మనోజ్, హనుమ రెడ్డి

''నేను సపోర్టింగ్ రోల్స్, విలన్ రోల్స్ చేసినప్పుడు నాకు సపోర్ట్‌గా ఉన్నారు నా ఫ్యాన్స్. వాళ్లకు 'డేవిడ్ రెడ్డి' ఫుల్ మీల్స్ లాంటి సినిమా అవుతుంది. చరిత్రలో బయటకు రాని కొన్ని ఘటనలు, దారుణాలను ఎదుర్కొనేందుకు ఒక వ్యక్తి నిలబడితే ఎలా ఉంటుంది? అనేది మా మూవీలో చూస్తారు'' అని మంచు మనోజ్ తెలిపారు. ఆయన హీరోగా, మారియా ర్యాబోషప్క హీరోయిన్‌గా నటిస్తున్న సినిమా 'డేవిడ్ రెడ్డి'. హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నిర్మిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 'డేవిడ్ రెడ్డి' గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో మంచు మనోజ్ మాట్లాడుతూ– ''మీ అభిమానం (ఫ్యాన్స్‌ని ఉద్దేశించి) ఉన్నంతవరకు నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. నేను ఎలాంటి సినిమాతో మళ్లీ హీరోగా రావాలా అనుకుంటున్న టైమ్‌లో నా మిత్రుడు రామ్ ఫోన్ చేసి, 'డేవిడ్ రెడ్డి' కథ వినమన్నాడు. హనుమ చెప్పిన కథ నచ్చింది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో జరిగే పీరియాడిక్ యాక్షన్ మూవీ ఇది. మా చిత్రంలో రామ్ చరణ్, శింబు అతిథులుగా కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే అతిథి పాత్రల కోసం ఇప్పటివరకు మేం ఏ హీరోనూ కలవలేదు'' అని చెప్పారు. ''మనోజ్‌గారిని ఎప్పుడూ చూడని విధంగా ఈ సినిమాలో చూస్తారు'' అన్నారు వెంకట్ రెడ్డి. ''ఈ సినిమాకు ఎలాంటి టెక్నీషియన్స్ కావాలో అలాంటి వారినే పర్ఫెక్ట్‌గా సెలెక్ట్ చేసుకున్నాం'' అని భరత్ మోటుకూరి పేర్కొన్నారు. హనుమ రెడ్డి యక్కంటి మాట్లాడుతూ– ''భైరవం' సినిమా చూసి మనోజ్‌గారిని సంప్రదించాను. కథ విన్న వెంటనే 'మనం ఈ సినిమా చేస్తున్నాం' అని చెప్పారాయన'' అని తెలిపారు. మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్, స్టంట్ కొరియోగ్రాఫర్ సుప్రీమ్ సుందర్ మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
120	42
84,560	25,819

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,809	▽	320
డోజోన్స్	48,002	▽	110
ఎఫ్‌టీఎస్ఈ 100	9,773	△	88
డాక్స్	24,047	▽	29
షాంఘై	3,870	△	45
నికాయ్	49,562	△	178

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	88.57	91.34
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	118.08	112.24
€	యూరో	థామస్‌కుక్	103.75	107.49
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	47.00	60.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	57.45	61.02
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.63	71.12
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.21	24.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.72	25.00
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.96	13.79

ఆకాశాన వెండి ధర

- రూ. 2,05,800 వద్ద కొత్త రికార్డు
- ఢిల్లీలో కిలోకి రూ.7,300 పెరుగుదల
- రూ. 600 లాభపడిన పసిడి

న్యూఢిల్లీ: వెండి ధరలు రాకెట్ వేగంతో పరిగెడుతున్నాయి. దేశీ మార్కెట్లో బుధవారం కిలోకి రూ.2,05,800 వద్ద కొత్త గరిష్ట రికార్డు నమోదైంది. ఒకే రోజు రూ.7,300 పెరిగింది. ఫ్యూచర్స్ మార్కెట్ ఎంసీఎక్స్‌లో అయితే కిలోకి రూ.8,356 ర్యాలీ చేసి రూ.2,06,111 వద్ద కొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. దేశీయంగా, అంతర్జాతీయంగా బలమైన డిమాండ్‌కు తోడు వెండి సరఫరాపై ఏర్పడిన ఆందోళనలు, యూఎస్ ఫెడ్ వచ్చే ఏడాది కూడా తన రేట్ల తగ్గింపును కొనసాగిస్తుందన్న అంచనాలు వెండి, బంగారం ధరల ర్యాలీకి ప్రేరణనిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 1న వెండి కిలో ధర రూ.90,500గా ఉండగా, అక్కడి నుంచి చూస్తే నికరంగా 1,15,300 (127 శాతం) పెరిగింది. మరోవైపు బంగారం ధర (99.9 శాతం స్వచ్ఛత) 10 గ్రాములకు రూ.600 పెరిగి రూ.1,36,500కు చేరుకుంది. అంతర్జాతీయంగా చూస్తే వెండి ధర స్పాట్ మార్కెట్లో ఔన్స్‌కు మొదటిసారి 66 డాలర్ల మార్క్‌ను అధిగమించింది. నికరంగా 2.77 డాలర్లు పెరిగి (4.35%) 66.52 డాలర్ల మార్క్‌ను నమోదు చేసింది. అంతర్జాతీయంగా స్పాట్ బంగారం ధర ఔన్స్‌కు 18 డాలర్లకు పైగా పెరిగి 4,321 డాలర్లకు చేరుకుంది. రిటైల్, ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ బలంగా కొనసాగుతోందని, వెండి, బంగారం ధరలు మరింత ర్యాలీకి ఇది దారితీ యొచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌కు చెందిన దిలీప్ పార్మర్ పేర్కొన్నారు.

స్వయం శక్తిమాన్ జొమాటో గోయల్

- హురున్ లిస్టులో టాప్
- రెండో స్థానంలో దమానీ
- తొలిసారిగా ఇండిగో ప్రమోటర్ల ఎంట్రీ



గోయల్ | దమానీ

ముంబై: దేశీయంగా స్వయం శక్తితో ఎదిగిన వ్యాపార దిగ్గజాల జాబితాలో ఎటర్నల్ (జొమాటో మాతృ సంస్థ) వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ తొలిసారిగా అగ్రస్థానంలో నిల్చారు. ఆయన నిర్మించిన వ్యాపార సామ్రాజ్యం విలువ గతేడాదితో పోలిస్తే 27 శాతం పెరిగి రూ. 3.2 లక్షల కోట్లకు ఎగిసింది. డీమార్ట్ మాతృ సంస్థ ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ విలువ 13 శాతం తగ్గి రూ. 3 లక్షల కోట్లకు పరిమితం కావడంతో దాని అధినేత రాధాకిషన్ దమానీ రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్, హురున్ ఇండియా టాప్ 200 ఎంట్రప్రెన్యూర్స్ జాబితాకు సంబంధించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 25 నాటికి అందుబాటులో గల గణాంకాల ఆధారంగా దీన్ని రూపొందించారు. విమానయాన దిగ్గజం ఇండిగో ప్రమోటర్లయిన రాహుల్ భాటియా, రాకేష్ గంగ్వాల్ తొలిసారిగా టాప్ 10 జాబితాలో చోటు దక్కించుకుని, మూడో స్థానంలో నిల్చారు. రూ. 2.2 లక్షల కోట్ల విలువ, దేశీ ఏవియేషన్ మార్కెట్లో 65 శాతం పైగా మార్కెట్ వాటాతో ఇండిగో అగ్రగామిగా నిలుస్తోందని నివేదిక పేర్కొంది. అటు అంతర్జాతీయంగా కూడా వేగవంతంగా కార్యకలాపాలను విస్తరిస్తూ, బయోఫ్యూయల్స్ వినియోగంలాంటి వినూత్న ప్రయోగాలు చేస్తోందని తెలిపింది. జొమాటో 800 పైగా నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. దాని పోటీ సంస్థ స్విగ్గీ సహ–వ్యవస్థాపకులు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి ఈ జాబితాలో అయిదో స్థానంలో నిల్చారు. స్విగ్గీ ఎంటర్‌ప్రైజ్ విలువ 5 శాతం పెరిగి రూ. 1.06 లక్షల కోట్లుగా ఉంది.

మరిన్ని విశేషాలు..

- పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ ఎనిమిదో స్థానం దక్కించుకున్నారు. సంస్థ విలువ రూ. 72,900 కోట్లుగా ఉంది.
- ఇటీవలే లిస్టయిన లెన్స్‌కార్ట్ విలువ 60 శాతం పెరిగి రూ. 67,000 కోట్లకు చేరడంతో దాని సహ వ్యవస్థాపకులు పీయూష్ బన్సల్, అమిత్ జౌతరి, నేహా బన్సల్, సుమీత్ కపాహీ లిస్టులో 10వ స్థానంలో నిల్చారు.
- స్వయం శక్తితో ఎదిగిన ఎంట్రప్రెన్యూర్ల సారథ్యంలో బిలియన్ డాలర్ల సంస్థలుగా ఎదిగిన వాటి సంఖ్య 128కి చేరింది. గతేడాది ఇది 121గా ఉంది.
- రూ. 4,300 కోట్లకు పైగా వేల్యుయేషన్ గల సంస్థలను జాబితాలో పరిగణనలోకి తీసుకున్నారు.

ఆయుధాలుగా మారుతున్న వాణిజ్య సుంకాలు

అంతర్జాతీయ వర్తకంపై ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వాణిజ్యం టారిఫ్‌లు, ఇతర రూపాల్లో ఆయుధాలుగా మారుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. భారత్ కేవలం టారిఫ్‌లను ఎలా ఎదుర్కోవాలన్న దానికే పరిమితం కాకుండా, ఈ విషయమై జాగ్రత్తగా సంప్రదింపులు కొనసాగించాల్సి ఉంటుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండడం మనకు అనుకూలమని ఒక జాతీయ దినపత్రిక నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పేర్కొన్నారు. ''స్వీయ ప్రయోజనాల ధోరణితో ఉందంటూ భారత్‌కు పాఠాలు బోధించొచ్చు. సుంకాల రాజుగా అభివర్ణించొచ్చు. కానీ, టారిఫ్ ఆయుధంగా మారిపోయింది. వీటిని ఆయుధాలుగా మార్చు కోకూడదన్నది భారత్ ఉద్దేశం. పోటీ దేశాల నుంచి పెద్ద ఎత్తున ఉత్పత్తులు వరుస కట్టినప్పుడే దేశీ పరిశ్రమను కాపాడుకునేందుకు భారత్ రక్షణాత్మక చర్యలను అనుసరిస్తుంది''అని మంత్రి స్పష్టం చేశారు.

'సాక్షి ప్లస్'	ఈ-పేపర్‌లో ..
ఐవోబీ ఆఫర్ ఫర్ సేల్ షురూ	ఎన్‌పీఎస్ నుంచి 80% ఉపసంహరణ

ఖర్చులు కట్... లాభాలకు బూస్ట్

- మ్యూచువల్ ఫండ్ రూల్స్‌లో భారీ మార్పులు
- ఇన్వెస్టర్లకు సెబీ గుడ్ న్యూస్
- బ్రోకరేజీ చార్జీలపై పరిమితులు

ముంబై: మార్కెట్లో పెట్టుబడులపై వ్యయాల భారం తగ్గి, లాభాలు పెరిగేలా ఇన్వెస్టర్లకు మరింత ప్రయోజనం చేకూర్చే దిశగా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పలు సంస్కరణలకు తెరతీసింది. బోర్డు సమావేశంలో నిబంధనల్లో పారదర్శకతను పెంచేందుకు వ్యయ నిష్పత్తి ఫ్రేమ్‌వర్క్, బ్రోకరేజీ చార్జీల పరిమితుల్లో మార్పులతో పాటు అనేక చర్యలు తీసుకుంది. కొత్త నిబంధనలు వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. వీటి ప్రకారం వ్యయ నిష్పత్తి పరిమితుల నుంచి ఎస్‌టీటీ, జీఎస్‌టీ, సీటీటీ, స్టాంప్ డ్యూటీలాంటి లెవీలను తొలగించినట్లు సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే తెలిపారు. ఇకపై వ్యయ నిష్పత్తి పరిమితులను బేస్ ఎక్స్‌పెన్స్ రేషియోగా పరిగణిస్తారని పేర్కొన్నారు. వివిధ స్కీములపై అదనంగా 5 బేసిస్ పాయింట్ల (బీపీఎస్) వ్యయాలను విధించేందుకు అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకి ఇస్తున్న వెసులుబాటును తొలగించారు. 2018లో ప్రవేశపెట్టిన 0.05 శాతం ఎగ్జిట్ లోడ్ నిబంధనను సెబీ తొలగించింది. 1963లో ప్రారంభమైన మ్యుచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో ప్రస్తుతం రూ. 80 లక్షల కోట్ల పైగా ఆస్తులు (ఏయూఎం) ఉన్నాయి.

మరిన్ని నిర్ణయాలు...

- బ్రోకరేజీ చార్జీలు క్యాష్ మార్కెట్ లావాదేవీలపై 12 బీపీఎస్ నుంచి 6 బీపీఎస్‌కి, డెరివేటివ్ లావాదేవీలపై 5 బీపీఎస్ నుంచి 2 బీపీఎస్‌కి తగ్గింపు.
- స్కీము పనితీరు ఆధారంగా వ్యయ నిష్పత్తి అమలు. ఏఎంసీలు దీన్ని స్వచ్ఛందంగా అమలు చేయొచ్చు.
- ట్రస్టీలు సమావేశం కావాల్సిన ఫ్రీక్వెన్సీ తగ్గింపు. స్కీముల్లో మార్పులను తెలియజేసేలా పత్రికా ప్రకటనలు ఇవ్వాలన్న నిబంధన తొలగింపు. ప్రకటనల స్థానంలో ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరిస్తే సరిపోతుంది.
- రియల్ ఎస్టేట్ మ్యూచువల్ ఫండ్స్, ఇన్‌ఫ్రా డెట్ ఫండ్ స్కీముల్లో పునరావృతమయ్యే చాప్టర్ల తొలగింపు. దీనితో నిబంధనల పరిమాణం 162 పేజీల నుంచి 88 పేజీలకు తగ్గింది. పదాల సంఖ్య కూడా 67,000 నుంచి 54 శాతం తగ్గి 31,000 పదాలకు పరిమితమవుతుంది.
- డెట్ మార్కెట్‌పై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెంపొందించే దిశగా సీనియర్ సిటిజన్లు, మహిళలు, రిటైల్ ఇన్వెస్టర్స్‌లాంటి వారికి ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు డెట్ ఇష్యూయర్లను అనుమతించే ప్రతిపాదనకు ఆమోదముద్ర.
- రిటైల్ ఇన్వెస్టర్ల సౌలభ్యం కోసం కంపెనీలు.. డీఆర్‌హెచ్‌పీ దశలో కీలక వివరాలతో కూడుకున్న సంక్షిప్త ప్రాస్పెక్టస్‌ను కూడా అందుబాటులో ఉంచాలి.
- ఇతరత్రా ఆర్థిక రంగ నియంత్రణ సంస్థల పరిధిలోని ఆర్థిక సాధనాలకు కూడా రేటింగ్స్ సేవలను అందించేందుకు వెసులుబాటు కల్పించేలా క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల నిబంధనల్లో మార్పులు.
- సెబీ (స్టాక్ బ్రోకర్స్) రెగ్యులేషన్స్ 1992 స్థానంలో కొత్తగా సెబీ (స్టాక్ బ్రోకర్స్) రెగ్యులేషన్స్ 2025 (ఎస్‌బీ రెగ్యులేషన్స్) అమల్లోకి వస్తుంది. కొత్త ఫ్రేమ్‌వర్క్‌లో పదకొండు చాప్టర్లు ఉంటాయి. పాతబడిన కొన్ని షెడ్యూల్స్‌ను, పునరావృతమయ్యే నిబంధనలను సెబీ తొలగించింది. కొన్నింటిని సమగ్రపర్చింది. మరింత స్పష్టతను ఇచ్చే విధంగా క్లియరింగ్ మెంబర్, ప్రొప్రైటరీ ట్రేడింగ్ మెంబర్‌లాంటి కీలక నిర్వచనాలను సవరించింది. సులభతరంగా అర్థం చేసుకునేలా నిబంధనలకు సంబంధించిన పేజీల సంఖ్యను 59 నుంచి 29కి, పదాల సంఖ్యను 18,846 నుంచి 9,073కి తగ్గించినట్లు సెబీ తెలిపింది.

నష్టాల్లోనే మార్కెట్లు

సెన్సెక్స్ 120 పాయింట్లు మైనస్; 26,850 దిగువకు నిఫ్టీ

ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల వరుస అమ్మకాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ మూడో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 120 పాయింట్లు పతనమై 84,560 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 42 పాయింట్లు నష్టపోయి 25,819 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 474 పాయింట్ల పరిధిలో 84,416 వద్ద కనిష్టాన్ని, 84,890 గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 25,770 – 25,929 శ్రేణిలో ట్రేడైంది.

- పార్క్ మెడి వరల్డ్ షేరు ఇష్యూ ధర(రూ.162)తో పోలిస్తే బీఎస్ఈలో 4% డిస్కౌంటుతో రూ.156 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో కనిష్టంగా 9% క్షీణించి రూ.147కు చేరింది. చివరికి 8.50% నష్టంతో రూ.148 వద్ద ముగిసింది.
- నెఫ్రోకేర్ హెల్త్ ఇష్యూ ధర(రూ.460)తో పోలిస్తే బీఎస్ఈలో 7% ప్రీమియంతో రూ.492 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 8.50% ఎగసి రూ.499 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 2.50% పెరిగి రూ.460 వద్ద ముగిసింది.

రూపాయి రికవరీ

జీవితకాల కనిష్ట స్థాయి(91.14) నుంచి 55 పైసలు కోలుకున్న రూపాయి చివరికి 90.38 వద్ద ముగిసింది. దేశీయ కరెన్సీ వేగంగా పతనమవుతున్న తరుణంలో ఆర్‌బీఐ జోక్యం చేసుకొని డాలర్ దూకుడుకు కళ్లెం వేసి ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 91.05 వద్ద ట్రేడింగ్ మొదలైంది. ఒక దశలో 97 పైసలు(దాదాపు 1%) ర్యాలీ చేసి 89.96 స్థాయికి రికవరీ అయ్యింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: మెంటల్ ఎబిలిటీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: రీజనింగ్

ఏఓ కొలువు.. వేలల్లో వేతనం

» 300 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి
» ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ నోటిఫికేషన్
» ఎంపికైతే నెలకు రూ.85 వేల వేతనం
» డిగ్రీ, పీజీ అర్హతతో పోటీ పడే అవకాశం
» ఈ నెల 18 వరకు దరఖాస్తుకు అవకాశం

దేశంలో బీమా రంగం విస్తరిస్తోంది. ఇన్సూరెన్స్ సంస్థలు తమ కార్యకలాపాలు విస్తృతం చేస్తున్నాయి. అందుకు అనుగుణంగా మానవ వనరుల నియామకాలు చేపడుతున్నాయి. తాజాగా ప్రముఖ ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ.. 300 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు దశల రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.85 వేల వేతనంతో కొలువు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఓరియెంటల్ ఇన్సూరెన్స్ ఏఓ పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

మొత్తం పోస్టులు 300

తాజా నోటిఫికేషన్ ద్వారా ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ రెండు కేడర్లలో 300 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ) పోస్టులను భర్తీ చేయనుంది. వీటిల్లో జనరలిస్ట్ కేడర్‌లో 285 పోస్టులు, హిందీ (రాజ్‌భాష) ఆఫీసర్స్ కేడర్‌లో 15 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- **జనరలిస్ట్ ఏఓ పోస్టులు:** 2025, నవంబర్ 30 నాటికి కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- **రాజ్ భాష అధికారి(హిందీ):** కనీసం 60 శాతం మార్కులతో పీజీ (హిందీ) లేదా ఇంగ్లిష్ ఉత్తీర్ణత ఉండాలి. డిగ్రీ స్థాయిలో ఈ రెండు సబ్జెక్టులలో ఏదో ఒక సబ్జెక్టును ఎలక్టివ్‌గా లేదా కంపల్సరీ సబ్జెక్టుగా చదివి ఉండాలి.
- రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు 5 శాతం మార్కుల మినహాయింపు కల్పించారు.

వయసు

2025, నవంబర్ 30 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి మొత్తం మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.

100 మార్కులకు ప్రిలిమినరీ పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలి దశగా ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. మొత్తం మూడు విభాగాలు (ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు), రీజనింగ్ ఎబిలిటీ (35 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (35 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఒక్కో విభాగానికి 20నిమిషాలు చొప్పున పరీక్షకు మొత్తం గంట సమయం అందుబాటులో ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది. ప్రతి సెక్షన్‌కు నిర్దిష్ట సమయం నిబంధన అమలు చేస్తారు. ఆ సమయం పూర్తయ్యాకే మరో సెక్షన్ ప్రశ్నలకు సమాధానానికి అవకాశం కల్పిస్తారు.

మెయిన్ ఎగ్జామ్ ఇలా

ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. రెండో దశ మెయిన్‌కు ఒక్కో పోస్టుకు 15 మంది చొప్పున ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షలో జనరలిస్ట్ కేడర్‌కు, రాజ్‌భాష ఆఫీసర్ పోస్టులకు వేర్వేరుగా పరీక్ష ఉంటుంది.

జనరలిస్ట్ ఏఓ మెయిన్ ఎగ్జామ్

జనరలిస్ట్ ఏఓ మెయిన్ ఎగ్జామ్ అయిదు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్ (45 ప్రశ్నలు), టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు), టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ (40 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (40 ప్రశ్నలు), టెస్ట్ ఆఫ్ కంప్యూటర్ నాలెడ్జ్ (35 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. దీంతోపాటు మరో 30 నిమిషాల వ్యవధిలో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఎస్సేకు 20 మార్కులు,ప్రెసిస్ రైటింగ్‌కు 10 మార్కులు కేటాయిస్తారు.

రాజ్ భాష ఆఫీసర్ ఏఓ మెయిన్ పరీక్ష

రాజ్ భాష ఆఫీసర్ పోస్టులకు టెస్ట్ ఆఫ్ రీజనింగ్ (25 ప్రశ్నలు), టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ (25 ప్రశ్నలు), ప్రొఫెషనల్ నాలెడ్జ్ (50 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్ (25 ప్రశ్నలు), టెస్ట్ ఆఫ్ కంప్యూటర్ నాలెడ్జ్ (25 ప్రశ్నలు) విభాగాల్లో ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహిస్తారు. ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగంలో ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు; మిగతా విభాగాల్లో ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. మొత్తం 200 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. దీంతోపాటు ఇంగ్లిష్, హిందీ లాంగ్వేజ్‌లలో డిస్క్రిప్టివ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ ఎస్సే–10 మార్కులు, హిందీ ఎస్సే–10 మార్కులు, హిందీ లెటర్ రైటింగ్–10 మార్కులు, ఇంగ్లిష్ నుంచి హిందీ అనువాదం -10 మార్కులు, హిందీ నుంచి ఇంగ్లిష్ అనువాదం–10 మార్కులు ఉంటాయి. మొత్తం 50 మార్కులకు ఉంటుంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మెయిన్ ఎగ్జామ్, డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూలో అభ్యర్థులకు బీమా రంగంపై ఉన్న అవగాహన, తాజా పరిణామాలపై అవగాహనను పరిశీలిస్తారు. దీంతోపాటు వారు దరఖాస్తు చేసుకున్న పోస్ట్, అర్హతలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.

వెయిటేజీ విధానంతో మెరిట్ జాబితా

మూడు దశల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత నియామకాలు ఖరారు చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. మెయిన్ ఎగ్జామ్‌లో పొందిన మార్కులకు 80 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూలో పొందిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తారు. అభ్యర్థులు పొందిన మార్కులను ఈ వెయిటేజీకి అనుగుణంగా క్రోడీకరించి తుది జాబితా రూపొందించి నియామకం ఖరారు చేస్తారు.

ఏడాది ప్రొబేషన్

అన్ని దశల్లో విజయం సాధించి నియామకం ఖరారు చేసుకున్న వారు ఏడాది పాటు ప్రొబేషన్ పిరియడ్‌లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ సమయంలో అభ్యర్థులు తమ విభాగానికి సంబంధించిన కార్యకలాపాలు చేపట్టాల్సి ఉంటుంది. అంతేకాకుండా ప్రొబేషన్ పిరియడ్‌లోనే ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించే నాన్–లైఫ్ లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ప్రొబేషన్ పూర్తయినట్లుగా పరిగణిస్తారు. లేదంటే మరో ఆరు నెలలు పొడిగిస్తారు. దీంతో పాటు అభ్యర్థులు కనీసం నాలుగేళ్ల పాటు సంస్థలోనే పని చేస్తామని సర్వీస్ బాండ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఒక ఏడాదికి అందే మూల వేతనానికి సమానమైన మొత్తం విలువతో కూడిన బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.

నెలకు రూ.85 వేల వేతనం

ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కొలువు సొంతం చేసుకున్న వారు నెలకు రూ.85 వేల వేతనం పొందొచ్చు. స్కేల్–1 ఆఫీసర్ హోదాలో రూ.50,925–రూ.96,765 వేతన శ్రేణితో ప్రారంభ వేతనం ఉంటుంది.

జీఎం స్థాయికి చేరుకునే అవకాశం

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన వారు భవిష్యత్తులో ఆయా విభాగాల్లో ఉన్నత హోదాలకు చేరుకునే అవకాశం ఉంది. తొలుత అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నాక.. పదోన్నతికి అర్హత లభిస్తుంది. అసిస్టెంట్ మేనేజర్/బ్రాంచ్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్/డివిజనల్ మేనేజర్, సీనియర్ డివిజనల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, రీజనల్ మేనేజర్, డీజీఎం, జీఎం వంటి హోదాలకు చేరుకోవచ్చు. సీఏఐఐబీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత పొందితే వేగంగా పదోన్నతులు పొందే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, డిసెంబర్ 18
- **ప్రిలిమినరీ (ఫేజ్–1) రాత పరీక్ష తేదీ:** 2026, జనవరి 10
- **మెయిన్ (ఫేజ్–2) రాత పరీక్ష తేదీ:** 2026 ఫిబ్రవరి 28
- **తెలుగు రాష్ట్రాల్లో ఫేజ్–1 ప్రిలిమినరీ రాత పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఒంగోలు, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్
- **తెలుగు రాష్ట్రాల్లో ఫేజ్–2 మెయిన్ రాత పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/careers**

రాత పరీక్షలో రాణించేలా

టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

టెస్ట్ ఆఫ్ రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో ప్రధానంగా భావించే రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా బాగా ప్రాక్టీస్ చేస్తే ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగం కోసం అభ్యర్థులు మరింత ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలి. ఇన్సూరెన్స్, ఆర్థిక రంగంలో మార్పులు, ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి బేసిక్ కంప్యూటర్ ఆపరేషన్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్ టూల్స్, కీ బోర్డ్ షార్ట్ కమాండ్స్ తదితర అంశాలపై ప్రాక్టీస్ చేయాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

బిట్‌శాట్-2026 ప్రవేశాలు

పిలానీ(రాజస్థాన్)లోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) బీఈ, బీటెక్, బీఫార్మసీ, ఎంఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అడ్మిషన్ టెస్ట్(బిట్‌శాట్)–2026 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **కోర్సుల వివరాలు:** బీఈ, బీఫార్మసీ, బీటెక్, ఎంఎస్సీ.
» **అర్హత:** అభ్యర్థులు 75% మార్కులతో (గ్రూపు సబ్జెక్టుల్లో ఒక్కోదానిలో కనీసం 60% మార్కులు) ఇంటర్మీడియట్/పన్నెండో తరగతి(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్‌మేటిక్స్/బయాలజీ) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** బిట్‌శాట్–2026 పరీక్ష మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** బిట్‌శాట్–2026 పరీక్ష రెండు సెషన్‌లలో జరుగుతుంది. అభ్యర్థులు రాసిన రెండు సెషన్‌లలో బెస్ట్ స్కోరునే పరిగణనలోకి తీసుకుంటారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **సెషన్–1 దరఖాస్తు ప్రారంభతేది:**15.12.2025
» **సెషన్–1 దరఖాస్తులకు చివరితేది:**16.03.2026
» **బిట్‌శాట్ ఆన్‌లైన్ టెస్ట్ సెషన్–1:** 15.04.2026 నుంచి 17.04.2026 వరకు
» **సెషన్–2 దరఖాస్తు ప్రారంభతేది:**20.12.2025
» **సెషన-2 దరఖాస్తులకు చివరితేది:**02.05.2026
» **బిట్‌శాట్ ఆన్‌లైన్ టెస్ట్ సెషన్–2:** 24.05.2026 నుంచి 26.05.2026 వరకు
» **వెబ్‌సైట్: https://admissions.bits-pilani.ac.in**

ఎన్టీపీసీ లిమిటెడ్‌లో 15 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఎన్టీపీసీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్(కంబైన్డ్ సైకిల్ పవర్ ప్లాంట్–ఓ అండ్ ఎం) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ(ఎలక్ట్రికల్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.90,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/సీబీటీ, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.12.2025
» **వెబ్‌సైట్: http://careers.ntpc.co.in**

క్లుప్తంగా...

నౌకా స్థావరంలో చైనా గూఢచార పక్షి

దొడ్డబళ్లాపురం: కర్ణాటకలోని కార్వార్‌లో అరేబియా సముద్ర తీరంలోని భారతీయ నౌకాదళ స్థావరంలో ఓ పక్షి అనుమానాస్పదంగా కనిపించింది. కదంబ నేవీ బేస్ పరిధిలో మంగళవారం జీపీఎస్ ట్రాకర్ కలిగిన సీగల్ బర్డ్‌ను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. పక్షికి జీపీఎస్ ట్రాకర్ అమర్చి ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. ఇది చైనాకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. చైనా భాషలో ఎకో ఎన్విరాన్మెంట్ అని రాసి ఉంది. చైనాలోని ఆ సంస్థతో సంప్రదించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. కార్వార్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. గూఢచర్య పక్షిగా అనుమానాలను వ్యక్తం చేశారు.

క్రికెటర్ శ్రీచరణికి రూ.2.50 కోట్ల చెక్ అందజేత

సాక్షి అమరావతి: అంతర్జాతీయ మహిళా క్రికెటర్ శ్రీచరణికి రూ.2.50 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ మంత్రి లోకేశ్, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి సచివాలయంలో చెక్‌ను శ్రీచరణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శాప్ చైర్మన్ రవినాయుడు, ఎండీ భరణి పాల్గొన్నారు.

పొగమంచు కారణంగా రెండు విమానాలు రద్దు

గోపాలపట్నం (విశాఖపట్నం)/శంషాబాద్ (హైదరాబాద్): పొగమంచు కారణంగా బుధవారం ఉదయం విశాఖకు రావాల్సిన రెండు విమానాలు విజయవాడకు మళ్లించి, అనంతరం వాటిని రద్దు చేశారని ఎయిర్‌పోర్టు అధికారులు ప్రకటించారు. ఉ.7.20 గంటలకు రావాల్సిన ముంబై–విశాఖ–ముంబై విమానం (6ఇ 5248/6585) విజయవాడ మళ్లించిన తర్వాత రద్దుచేశారు. అలాగే ఉ.7 గంటలకు రావాల్సిన హైదరాబాద్–విశాఖ–హైదరాబాద్ (6ఇ 618/307) వెనక్కి మళ్లింది. తర్వాత దాన్నీ రద్దు చేశారు. ఇందులో వచ్చిన క్రికెటర్లు విజయవాడలో దిగి వేరే విమానంలో విశాఖ చేరుకున్నారు.

శంషాబాద్‌లో ఇండిగో విమానాల రద్దు

నిర్వహణపరమైన సమస్యల కారణంగా పలు ఇండిగో విమానాల రాకపోకలు మరోసారి నిలిచిపోయాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీ, పట్నా, అహ్మదాబాద్, బెంగళూరు, గోవా, రాజ్‌కోట్ వెళ్లాల్సిన ఏడు విమానాలు రద్దు కాగా.. వివిధ నగరాల నుంచి రావలసిన నాలుగు విమానాలు కూడా రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

శ్రీపురం గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ధ్యాన మండపానికి ప్రారంభోత్సవం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేస్తున్న పీఠాధిపతి శక్తిఅమ్మ

వేలూరు/రేణిగుంట: తమిళనాడులోని వేలూరు శ్రీపురంలో బంగారు గుడి (గోల్డెన్ టెంపుల్)ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సందర్శించారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటనకు వచ్చిన ఆమె బుధవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక ఆర్మీ హెలికాప్టర్ ద్వారా వేలూరు శ్రీపురంలోని బంగారు గుడి ఆవరణలో ఉన్న హెలిప్యాడ్‌కు మ.11.15 గంటలకు చేరుకున్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్, తమిళనాడు ప్రభుత్వం తరఫున మంత్రి ఆర్. గాంధీ, కలెక్టర్ సుబ్బలక్ష్మి, ఎస్పీ మయిల్‌వాగనన్ రాష్ట్రపతి ముర్ముకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 1,700 కిలోల వెండితో ప్రతిష్ఠించిన వినాయకుడిని, 70 కిలోల బంగారంతో ప్రతిష్ఠించిన మహాలక్ష్మిని దర్శించుకున్నారు. అనంతరం.. శ్రీనివాస సన్నధిని దర్శించుకుని స్వర్ణలక్ష్మి అమ్మవారికి అభిషేకం చేశారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో భక్తులకు నూతనంగా నిర్మించిన ధ్యాన మండపాన్ని రాష్ట్రపతి ప్రారంభించారు. అనంతరం బంగారు గుడిని పరిశీలించారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లారు.

రాష్ట్రపతికి గవర్నర్ జస్టిస్ నజీర్ స్వాగతం

అంతకుముందు.. రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సాదర స్వాగతం పలికారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎండోమెంట్ రెవెన్యూ సెక్రటరీ ఎం. హరి జవహర్‌లాల్, అనంతపురం రేంజ్ డీఐజీ షేమూసి, జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాశ్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు బయల్దేరిన రాష్ట్రపతికి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ రేణిగుండ విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు.

హైదరాబాద్ శీతాకాల విడిదికి రాష్ట్రపతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. హకీంపేటలోని ఎయిర్ ఫోర్స్ విమానాశ్రయంలో దిగిన ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పలువురు మంత్రులు ఘనస్వాగతం పలికారు. ఈ నెల 22 వరకు ఆమె బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారు.

దేశం కోసం భూములిస్తే.. కనీస మానవత్వం చూపరా?

- రేడియేషన్ కోరల్లో బతుకుతున్నా యూసీఐఎల్‌కు చీమకుట్టినట్టయినా లేదు
- కేకే కొట్టాల గ్రామాన్ని ఖాళీచేయించి ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలి
- లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: జాతి అవసరాల కోసం, దేశప్రగతి కోసం రేడియేషన్ రక్కసిని సైతం లెక్కచేయకుండా భూములిచ్చిన కడప రైతుల త్యాగాలను యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) విస్మరిస్తోందని వైఎస్సార్‌సీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి భూములిచ్చిన అన్నదాతల పట్ల సంస్థ అధికారులకు కనీస సానుభూతి, గౌరవం లేవని చెప్పారు. లోక్‌సభలో బుధవారం అణు ఇంధన బిల్లు–2025పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కడప జిల్లాలోని యురేనియం ప్రభావిత ప్రాంతాల ప్రజల దుస్థితిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల పక్షాన నిలబడి అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. తుమ్మలపల్లెలో యూసీఐఎల్ ప్లాంట్ కోసం ఆరు గ్రామాల ప్రజలు తమ భూములను ధారాదత్తం చేశారని గుర్తుచేశారు. రేడియేషన్ వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిసినప్పటికీ, దేశ ప్రయోజనాలే పరమావధిగా భావించి చేసిన వారి త్యాగానికి యూసీఐఎల్ ఇస్తున్న విలువ ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. అధికారుల తీరు ప్రజల్లో అభద్రతా భావాన్ని పెంచుతోందన్నారు. టైలింగ్ పాండ్‌లోని ప్రమాదకర రసాయన వ్యర్థాల వల్ల కేకే కొట్టాల గ్రామస్తులు నరకం చూస్తున్నారని చెప్పారు. ఆ గ్రామాన్ని తక్షణమే తరలించి, నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ (ఆర్ అండ్ ఆర్) ఇవ్వాలని తాను అనేకసార్లు కోరినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్రం జోక్యం చేసుకుని భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని, భూ నిర్వాసితుల కోటాలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. కొత్త బిల్లులో అణు భద్రత గురించి చెబుతున్నారే తప్ప, అణువ్యర్థాల నిర్వహణపై స్పష్టత లేదని చెప్పారు. ప్లాంట్లు మూతపడ్డాక పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఎవరిదో చట్టంలో స్పష్టంగా లేదని, దీనివల్ల భవిష్యత్ తరాలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అణు ప్రమాదాలు జరిగితే ఎదుర్కోవడానికి స్థానిక యంత్రాంగాన్ని సిద్ధం చేయడంలో బిల్లు విఫలమైందని పేర్కొన్నారు. బిల్లులో ఈ లోపాలను సవరించాలని ఆయన కేంద్రప్రభుత్వానికి సూచించారు.

ప్రైవేటుకు లాభాలు.. ప్రభుత్వానికి నష్టాలు.. ఇదేం విధానం?

- వందశాతం ఎఫ్‌డీఐలతో విదేశీ కంపెనీలు ప్రజలను దోచుకునే ప్రమాదం
- ఐఆర్‌డీఏఐకి పగ్గాలు లేకపోతే సామాన్యుడు మునుగుతాడు
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: మనదేశంలో బీమా రంగం ప్రైవేటు శక్తులకు, విదేశీ కంపెనీలకు కాసులు కురిపించే యంత్రంలా మారిందని, అదే సమయంలో ప్రభుత్వరంగ బీమాసంస్థలు మాత్రం నష్టాల్లో కూరుకుపోతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. లాభాలన్నీ ప్రైవేటు పరం, నష్టాలన్నీ ప్రభుత్వం పరమవడం ఆందోళనకరమన్నారు. క్లెయిమ్ చెల్లింపుల విషయంలో ప్రైవేటు కంపెనీలు ప్రజలను నిలువునా మోసం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. రాజ్యసభలో బుధవారం బీమా చట్టాల సవరణ బిల్లు–2025పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బీమా కంపెనీలు కాగితాల మీద చూపిస్తున్న క్లెయిమ్ సెటిల్మెంట్ రేషియోలకు, వాస్తవాలకు పొంతనలేదని చెప్పారు. 'చిన్నచిన్న క్లెయిమ్‌లను పరిష్కరించి రికార్డులు గొప్పగా చూపిస్తున్నారు. కానీ పెద్దమొత్తంలో క్లెయిమ్ వస్తే మాత్రం సాకు చెప్పి తిరస్కరిస్తున్నారు. లేదా సగం డబ్బులు కోసేసి మిగిలినది చేతిలో పెడుతున్నారు. బాధితులకు న్యాయం జరగనప్పుడు ఈ గణాంకాలు ఎందుకు? బీమా రంగంలో భారీ అనుభవంతో, పెద్ద బ్యాలెన్స్ షీట్లతో వచ్చే విదేశీసంస్థలు దేశీయ మార్కెట్‌ను శాసించే ప్రమాదం ఉంది. రెగ్యులేటరీ సంస్థ (ఐఆర్‌డీఏఐ)ని నిద్రలేపాలి. దానికి పదునైన అధికారాలు ఇవ్వకపోతే సామాన్యులను దోచుకుంటూనే ఉంటాయి. ఈ సంస్కరణల పేరుతో బీమారంగ ఉద్యోగుల పొట్టకొట్టొద్దు. వారికి ఉద్యోగ భద్రత, రీ–స్కిల్లింగ్ అవకాశాలు కల్పించాలి..' అని పేర్కొన్నారు. ఉద్యోగుల రక్షణ, పటిష్టమైన నియంత్రణ ఉంటేనే బిల్లుకు మద్దతు ఇస్తామని ఆయన చెప్పారు.

క్లాట్ ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) 2026 ఫలితాలు విడుదలయ్యాయి. యూజీ, పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలను కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్ బుధవారం విడుదల చేసింది. క్లాట్ యూజీ టాప్–100లో ఆరుగురు హైదరాబాద్ విద్యార్థులున్నారు. వీరిలో అమ్మాయిలు ఇద్దరుండగా, అబ్బాయిలు నలుగురున్నారు. క్లాట్ పీజీ ఫలితాల్లో టాప్–100లో ముగ్గురు హైదరాబాద్ విద్యార్థులున్నారు. వీరిలో ఇద్దరు అమ్మాయిలుండగా, ఒక అబ్బాయి ఉన్నారు. క్లాట్ పరీక్షను ఈనెల 7న నిర్వహించిన విషయం తెలిసిందే. ఫలితాలను https://result1.-consortiumofnlus.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అడ్మిషన్స్‌కౌన్సెలింగ్ ఈనెల 17 నుంచి ప్రారంభమైనట్లు కన్సార్షియం వెల్లడించింది.

మద్దతిస్తున్నాం..

- ఉపాధి హామీ కొత్త బిల్లుపై లోక్‌సభలో టీడీపీ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు
- ఏపీ 40 శాతం వాటా భరించలేదు.. కేంద్రమే ఆదుకోవాలి
- రెవెన్యూ లోటుతో రాష్ట్రం సతమతం..

సాక్షి, న్యూఢిల్లీ: ఉపాధి హామీ చట్టంలో మార్పులు తేవటాన్ని స్వాగతిస్తున్నామని తెలుగుదేశం పార్టీ స్పష్టం చేసింది. బుధవారం లోక్‌సభలో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ బిల్లు–2025'పై జరిగిన చర్చలో పాల్గొన్న ఆ పార్టీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బిల్లులో మార్పులకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అయితే ఉపాధి హామీ చట్టం కొత్త బిల్లులో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం నిధులు భరించాలన్న నిబంధనపై మాత్రం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అభ్యంతరం తెలిపారు. రెవెన్యూ లోటులో ఉన్న ఏపీకి తన వంతుగా 40 శాతం నిధులను చెల్లించడం సాధ్యం కాదన్నారు. రాష్ట్ర విభజన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్ తీవ్ర రెవెన్యూ లోటుతో సతమతమవుతోందని, ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర వాటాగా 40 శాతం నిధులను భరించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టంలో మార్పులు తేవటాన్ని స్వాగతిస్తూనే, నిధుల విషయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఏపీకి వెసులుబాటు కల్పించాలని కోరారు. పథకం అమలులో అవకతవకలను ప్రస్తావిస్తూ.. గత పదేళ్లలో ఒక్క ఏపీలోనే లక్షకు పైగా మోసం కేసులు నమోదయ్యాయని, రూ.82 కోట్లు దుర్వినియోగం కాగా సగం మాత్రమే రికవరీ చేశారన్నారు. నిధులు పక్కదారి పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాన్ని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వేతనాలను వ్యవసాయ వినియోగదారుల సూచీతో కాకుండా, గ్రామీణ వినియోగదారుల సూచీతో అనుసంధానించాలన్నారు. ప్రతి రాష్ట్రం తప్పనిసరిగా స్వతంత్ర సంస్థలతో సోషల్ ఆడిట్ జరిపేలా చూడాలని కోరారు.

కేంద్రం ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం: జనసేన ఎంపీ బాలశౌరి

ఉపాధి హామీ పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం పేదలకు ఆహార భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని ఇస్తుందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. జనసేన తరఫున బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపారు. రాష్ట్రాలు కూడా కొంత మేర నిధులు భరించాలన్న ప్రతిపాదనను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇది రాష్ట్రాల బాధ్యతను పెంచుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉపాధి హామీ పెండింగ్ నిధులు రూ.988 కోట్లు విడుదల చేసినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

చట్టాల రద్దు సరే.. ప్రత్యామ్నాయాలు అవసరం

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

సాక్షి, న్యూఢిల్లీ: కాలం చెల్లిన చట్టాలను రద్దు చేస్తూ, న్యాయవ్యవస్థను సరళీకృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ది రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్లు–2025 ఉద్దేశం మంచిదే అయినా.. దీని అమలులో అత్యంత జాగ్రత్త అవసరమని వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ చెప్పారు. రాజ్యసభలో బుధవారం ఈ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. పాత చట్టాలను తొలగించే క్రమంలో సామాన్యులకు రక్షణగా ఉన్న అంశాలు దెబ్బతినకుండా చూడాలని, స్పష్టత లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. 'చట్టాలను సరళీకృతం చేయడం స్వాగతించదగ్గ పరిణామమే. అయితే కొన్ని చట్టాలు పాతవి అయినప్పటికీ.. వాటిస్థానంలో వచ్చిన కొత్త నిబంధనలు లేదా సబార్డినేట్ రూల్స్ ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చు. లైసెన్సింగ్, రిజిస్ట్రేషన్ లేదా భూ రికార్డులకు సంబంధించిన పాత చట్టాలు రాష్ట్ర, స్థానిక పాలన వ్యవస్థలో అంతర్భాగంగా ఉన్నాయి. ఇప్పుడు అకస్మాత్తుగా ఆ పాత చట్టాలను రద్దుచేస్తే.. పరిపాలన పరమైన గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉంది. స్పష్టమైన ప్రత్యామ్నాయాలు లేదా పరివర్తన యంత్రాంగం లేకుండా చట్టాలను రద్దుచేస్తే.. పాలనలో ప్రతిష్టంభన నెలకొంటుంది. తద్వారా ప్రభుత్వ సేవలకు అంతరాయం కలుగుతుంది..' అని పేర్కొన్నారు. బిల్లు అమలు విషయంలో సానుకూల అంశాలున్నప్పటికీ, అనుకోని పర్యవసానాలను కూడా ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. చట్టాల రద్దు ప్రక్రియలో సరైన సంప్రదింపులు జరపాలని, సేవల పంపిణీకి ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని ఆయన కోరారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి

హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

సాక్షి, అమరావతి: మావోయిస్టు అగ్ర నేత హిడ్మాతో పాటు మడ్వి తదితరుల ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ విచారణ కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పీపుల్స్ యూనిటీ ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరం అధ్యక్షురాలు జయ వింధ్యాల ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి వాదనలు వినిపిస్తూ.. హిడ్మా తదితరులను భద్రతా బలగాలు గత నెలలో అదుపులోకి తీసుకుని.. చిత్రహింసలు పెట్టి.. ఎన్‌కౌంటర్ చేశాయన్నారు. ఇది పూర్తిగా బూటకపు ఎన్‌కౌంటర్ అని.. జ్యుడీషియల్ విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. ఈ వ్యాజ్యానికి విచారణ అర్హతే లేదన్నారు. మెజిస్టీరియల్ విచారణపై అభ్యంతరం ఉంటే సంబంధిత సెషన్స్ కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పరిశీలించి రావాలని పిటిషనర్ తరఫు న్యాయవాదికి స్పష్టం చేసింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

ఉపాధి హామీ సవరణలపై 19న నిరసనలు: సీపీఎం

సాక్షి, అమరావతి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా ఈనెల 19న అన్ని జిల్లా, పట్టణ కేంద్రాల్లో గాంధీ విగ్రహాల వద్ద సత్యాగ్రహ మౌనదీక్షలతో నిరసన తెలియజేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వికసిత్ భారత్–గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (విబి–జి–రాం–జీ) పేరుతో ఉపాధి హామీ పథకానికి ''రాంరాం'' పలుకుతోందన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా మారుస్తున్నారని తెలిపారు. ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని శ్రీనివాసరావు పేర్కొన్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి మహాత్మాగాంధీ పేరునే కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య వేరొక ప్రకటనలో డిమాండ్ చేశారు.

హజ్ యాత్రకు రూ.లక్ష సాయం

సాక్షి, అమరావతి : విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి ప్రభుత్వం ఇస్తున్న రూ.లక్ష సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాజ్య విధానం – 2025ను సమీక్షించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు తనతోపాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్య కుమార్ యాదవ్‌తో ప్రభుత్వం కమిటీ వేసినట్లు తెలిపారు. సకాలంలో వివాదాల పరిష్కారం, పారదర్శకత, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, జవాబుదారీతనం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు ఫరూక్ వెల్లడించారు.

ఎగుమతులకు కస్టమ్స్ కత్తెర!



నిపుణుల బృందం లేక ఎగుమతిదారుల ఇక్కట్లు

- నాణ్యత ధ్రువీకరణకు పరికరాలు, నైపుణ్యం కొరత
- సౌకర్యాల లేమితో సరుకు రవాణాకు అంతరాయం
- చెన్నై, ముంబయి వైపు మళ్లుతున్న ఎగుమతులు
- ధ్రువీకరించే బృందాలు లేక.. విశాఖ మందులు హైదరాబాద్‌కు తరలింపు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరంలోని ప్రధాన ఫర్నిచర్ షోరూమ్‌లలో విక్రయించే ఫర్నిచర్ అధిక భాగం చైనా నుంచి దిగుమతి అవుతుంటుంది. ఇక్కడ కంటైనర్ టెర్మినల్, పోర్టులు ఉన్నప్పటికీ వ్యాపారులు చైనా నుంచి సరుకును నేరుగా విశాఖకు రప్పించడం లేదు. కోల్‌కతా లేదా చెన్నై పోర్టులకు తీసుకొచ్చి.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విశాఖకు తీసుకురావాల్సిన పరిస్థితి దాపురించింది. ఎందుకంటే.. పదేళ్ల కిందట ఓ వ్యాపారి చైనా నుంచి నేరుగా ఇక్కడికి ఫర్నిచర్ తీసుకురాగా.. దాని ధ్రువీకరించి క్లియరెన్స్ ఇచ్చేందుకు కస్టమ్స్ వారికి ఏడాది సమయం పట్టింది. ఆ అనుభవంతో అప్పటి నుంచి ఏ వ్యాపారీ ఫర్నిచర్‌ను నేరుగా విశాఖకు తీసుకురాకూడదని నిర్ణయించుకున్నారు. కేవలం ఫర్నిచర్ మాత్రమే కాదు.. అనేక ఉత్పత్తుల విషయంలో విశాఖ కస్టమ్స్ నుంచే ప్రధాన అవరోధాలు ఎదురవుతున్నాయని తెలుస్తోంది.

విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్

అన్నీ ఉన్నా.. అవే లేవు

'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లుగా ఉంది విశాఖపట్నం కార్గో ఎగుమతి, దిగుమతుల పరిస్థితి. సామర్థ్యానికి తగ్గట్లుగా సరుకు నిర్వహణలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో, ఏళ్ల తరబడి ఇక్కడ వృద్ధి స్తంభించిపోయింది. విశాఖ పరిధిలో తయారవుతున్న ఉత్పత్తులు కూడా హైదరాబాద్ మీదుగా ముంబయి వెళ్తున్నాయి. సర్టిఫైడ్ ఏజెన్సీల కొరత ఓవైపు వేధిస్తుండగా, ఎగుమతులకు 'కస్టమ్స్' తీరు ప్రధాన అవరోధంగా మారింది. వచ్చే కార్గో నాణ్యతను పరీక్షించి, ధ్రువీకరించేందుకు అవసరమైన నిపుణుల బృందాలు విశాఖ కస్టమ్స్ వ్యవస్థలో లేకపోవడం వల్లే ఈ అంతరాయాలు ఏర్పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

200 ఉత్పత్తులకే పరిమితం!

విశాఖ కస్టమ్స్ హౌస్‌లో నాణ్యత పరిశీలన నిపుణులు లేరనే వాదన బలంగా ఉంది. సరుకు రవాణా అభివృద్ధికి ఇదే ప్రధాన ఆటంకమని వాణిజ్య ప్రతినిధులు చెబుతున్నారు. ముంబయిలో 2000కి పైగా, చెన్నైలో 1500 వరకు కార్గో ఉత్పత్తులను కస్టమ్స్ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. వచ్చే ప్రతి సరుకు ఏ గ్రేడ్‌లో ఉంది? ఎంత నాణ్యమైనది? దానికి ఎంత పన్ను వేయాలి? అనే విషయాలను అక్కడి నిపుణులు క్షణాల్లో చెప్పగలరు. తక్కువ వ్యవధిలోనే ధ్రువీకరించి క్లియరెన్స్ ఇస్తారు. కానీ, విశాఖలో ఆ పరిస్థితి లేదు. ఉదాహరణకు పసుపు కొమ్ముల ఎగుమతి కోసం వ్యాపారులు విశాఖకు వస్తే, వాటి నాణ్యత పరిశీలనకే రోజుల సమయం తీసుకుంటున్నారు. ఫలితంగా సరుకు ఇక్కడే పాడైపోతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే చాలావరకు ఉత్పత్తులను చెన్నై లేదా ముంబయికి తరలిస్తున్నారు. ఇక విశాఖలో తయారయ్యే మందుల నాణ్యతను ధ్రువీకరించి, క్లియరెన్స్ ఇచ్చే నిపుణులు ఇక్కడ లేరు. వీటి కోసం ప్రత్యేక ఏజెన్సీలు ఉన్నా, అవి విశాఖలో అందుబాటులో లేకపోవడంతో సరుకును హైదరాబాద్‌కు తరలించి, అక్కడ సర్టిఫికెట్లు తీసుకొని ముంబయి ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేయాల్సి వస్తోంది. ఈ కారణంగా విశాఖలో కార్గో హ్యాండ్లింగ్ కేవలం 200 ఉత్పత్తులకే పరిమితమైపోయింది. ముంబయితో పోలిస్తే 20 శాతం, చెన్నైతో పోలిస్తే 25 శాతం ఉత్పత్తులు మాత్రమే విశాఖ నుంచి ఎగుమతి, దిగుమతులవుతున్నాయి.

కొత్త ఉత్పత్తులకు అవకాశం లేదా?

కస్టమ్స్ మదింపు కోసం ప్రత్యేక శిక్షణ ఉంటుంది. వైజాగ్ కస్టమ్స్ హౌస్‌కు వచ్చే అప్రైజర్లు కేవలం ఈ ప్రాంతంలో రవాణా అయ్యే పరిమిత సరుకులపైనే పట్టు సాధిస్తున్నారు. కొత్తగా ఏదైనా సరుకు వస్తే, దాని నాణ్యతను పరిశీలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ఉత్పత్తులకు తగ్గట్టుగా కస్టమ్స్ హౌస్ తమ బృందాలను సిద్ధం చేయలేకపోతోంది. ఏవో కొర్రీలు వేసి వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. తాము సిద్ధంగా ఉన్నామని స్టేక్‌హోల్డర్స్ చెబుతున్నా, కస్టమ్స్ నుంచి స్పందన లేకపోవడంతో పరిమిత కార్గోను మాత్రమే హ్యాండిల్ చేయగలుగుతున్నారు. కొన్ని ఉత్పత్తులను ఉత్తరాది నుంచి విశాఖ తీసుకొచ్చి, నేరుగా సింగపూర్, ఈశాన్య ఆఫ్రికా దేశాలకు పంపించేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నా.. ఇక్కడ సరైన పరిశీలన బృందాలు లేక వెనకడుగు వేస్తున్నారు. ఫలితంగా.. కార్గో ఎగుమతులు ముందుకు కదలక.. కొత్త ఉత్పత్తుల హ్యాండ్లింగ్‌కు అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. కస్టమ్స్ విభాగంలో మార్పులు వస్తేనే విశాఖలో ఎగుమతులు ఊపందుకుంటాయని వ్యాపార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉల్లి సేకరణకు రూ.7.56 కోట్లు

సాక్షి, అమరావతి : ఉల్లి కొనుగోలు కోసం ధరల స్థిరీకరణ నిధి నుంచి రూ.7.56 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులను కర్నూలు జిల్లాలో క్వింటా రూ.1200 చొప్పున ప్రభుత్వానికి ఉల్లి విక్రయించిన రైతులకు చెల్లించనున్నట్టు ప్రకటించారు.

ఫిబ్రవరిలో 'ఏడీటీవోఐ నేషనల్ టూరిజం మార్ట్'

సాక్షి, అమరావతి : అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా (ఏడీటీవోఐ) సహకారంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 13, 14న విశాఖపట్నం వేదికగా 'ఏడీటీవోఐ నేషనల్ టూరిజం మార్ట్ 2025'ను నిర్వహించనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో ఏడీటీవోఐ ప్రతినిధులతో ఈ మేరకు బుధవారం ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మార్ట్‌లో ప్రముఖ టూర్ ఆపరేటర్లు, హోటల్ యజమానులు, డెస్టినేషన్ ప్రమోటర్లు, పర్యాటక రంగ వాటాదారులు, ట్రావెల్ నిపుణులు పాల్గొంటారన్నారు.

చైల్డ్ కేర్ లీవ్‌లో విడతల నిబంధన ఎత్తివేయాలి

ఏపీటీఎఫ్ అమరావతి

సాక్షి, అమరావతి: ఉద్యోగుల చైల్డ్ కేర్ లీవ్‌ల వినియోగంలో గరిష్ట విడతల నిబంధనను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. మొత్తం సెలవులను అవసరమైనప్పుడు వినియోగించుకునేలా మార్గదర్శకాలు ఇవ్వాలని బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఎండీఎం యాప్‌లో మార్పులు చేయండి: ఆప్టా

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ఎండీఎం యాప్‌లో ఇండెంట్లు నమోదు చేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) తెలిపింది. యాప్‌లో మార్పులు చేయాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంజీ మెహది బుధవారం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంత్రి లోకేశ్‌తో పాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలిచ్చారు.

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నిందితులకు కస్టడీ

విజయవాడలీగల్: గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పనిచేసే సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించారనే ఆరోపణలపై రిమాండ్‌లో వున్న కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కోట్లు, యర్రంశెట్టి రామాంజనేయులు, వజ్రకుమార్, తేలప్రోలు రాములను రెండు రోజులపాటు కస్టడీకి అనుమతిస్తూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు బుధవారం ఆదేశాలు జారీచేశారు. గురు, శుక్రవారాలలో పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించాలని సూచించారు. ఇదే కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అరెస్టుకు వారం రోజుల ముందు పటమట పోలీసుస్టేషన్ పరిసరాలలోని సీసీ ఫుటేజీ ఇవ్వాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది దేవీ సత్యశ్రీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈనెల 18వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

హాజరు సడలింపు కోరుతూ సంజయ్ పిటిషన్

అగ్నిమాపక శాఖలో నిధుల దుర్వినియోగం ఆరోపణలపై నమోదైన అక్రమ కేసులో బెయిల్ పొందిన ఐపీఎస్ సంజయ్‌కుమార్ విచారణాధికారి ముందు హాజరు నుంచి సడలింపు కోరుతూ ఏసీబీ న్యాయస్థానంలో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ షరతుల ప్రకారం ప్రతి శుక్రవారం విచారణాధికారి ముందు హాజరుకావాల్సి ఉందని, అయితే ఈనెల 26వ తేదీ శుక్రవారం కావడంతో వ్యక్తిగత కారణాల వల్ల ఆ ఒక్కరోజు మినహాయింపు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు అధికారులు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రస్థాయిలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు 2026–27 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో భాగంగా రాష్ట్రస్థాయి మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ / కమిషనర్ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే), ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్), ఏపీ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్), ఏపీ జర్నలిస్ట్స్ ఫోరమ్(ఏపీజేఎఫ్), జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్), స్మాల్ అండ్ మీడియా డెయిలీ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎస్ఎండీఎన్ఎ), స్మాల్ అండ్ మీడియా న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎస్ఎంఎన్ఎఏపీ), ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీఈఎంజేఏ), ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీబీజేఏ), ఏపీ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నుంచి ఒక్కొక్కరు చొప్పున ప్రాతినిధ్యం వహిస్తారు. మెంబర్ కన్వీనర్‌గా సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు డైరెక్టర్/జాయింట్ డైరెక్టర్ వ్యవహరిస్తారు.

నేటి నుంచి యువజనోత్సవాలు

సాక్షి,అమరావతి: రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలను గురువారం నుంచి ఈ నెల 20 వరకు నిర్వహించనున్నట్టు యువజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భరణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీ వేదికగా జానపద నృత్యాలు, జానపద గీతాలు, శాస్త్రీయ నృత్యాలు, చిత్రలేఖనం, కవిత్వం, కథా రచన, ప్రసంగం, క్విజ్, ఫొటోగ్రఫీ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

కొత్తగా రెండు ఎంఎస్ఎంఈ విస్తరణ కేంద్రాలు

సాక్షి, అమరావతి : అనంతపురం, విజయనగరంలో ఎంఎస్ఎంఈ విస్తరణ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ కేంద్రాలు అభివృద్ధికి బాటలు వేస్తాయని, సాంకేతిక సహాయం, నైపుణ్యాభివృద్ధి, ఇంక్యుబేషన్, కన్సల్టెన్సీ సేవలు అందిస్తాయన్నారు. కొత్త సంస్థల ఏర్పాటును ప్రోత్సహించి, స్థానికంగా ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని తెలిపారు.

నూనెగింజల యాజమాన్య విధానాలపై పుస్తకాలు

సాక్షి, అమరావతి: నూనెగింజల పంటలైన పొద్దుతిరుగుడు, కుసుమ, నువ్వులు, ఆముదం, ఆవాలు, సోయాబీన్ పంటలను ఆశించే చీడపీడలు, వివిధ పంటలలో సమగ్ర కలుపు యాజమాన్యంపై రూపొందించిన మూడు పుస్తకాలు(బులెటిన్ల)ను ఏన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ శారదా జయలక్ష్మి బుధవారం విడుదల చేశారు.

పట్టు రైతులకు అండగా ఉంటాం..

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: పట్టు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సిల్క్ సమగ్ర–2 పథకం కింద గడిచిన రెండేళ్లకు సంబంధించి వివిధ పథకాల కింద మ్యాచింగ్ స్టేట్ షేర్‌గా ఇవ్వాల్సిన రూ.14 కోట్లను బుధవారం ఆయన విడుదల చేశారు. ఈ నిధుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 13,663 మంది సిల్క్ రైతులు లబ్ధి పొందారన్నారు. భవిష్యత్తులో కూడా పట్టు రైతులకు, పట్టు డీలర్లకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

కుంకీలొచ్చేనా? కరి కలత తీర్చేనా..?

సంక్రాంతి నాటికి 'మన్యం' జిల్లాకు కుంకీ ఏనుగులు వస్తాయన్న ఇన్‌చార్జి మంత్రి

ఏనుగుల కోసం నిర్మించిన నీటి కొలను

ఏనుగులు ఉంచేందుకు నిర్మించిన క్రాల్

- గుచ్చిమి వద్ద సిద్ధమవుతున్న ప్రత్యేక కేంద్రం
- ఏనుగులు తరలిస్తేనే రైతులు ఊపిరిపీల్చుకునేది
- ఇప్పటికీ పంట పొలాల్లోనే సంచరిస్తున్న ఏనుగులు
- ఎదురుపడేవారిపై దాడిచేస్తున్న వైనం

సాక్షి, పార్వతీపురం మన్యం: ఒడిశా నుంచి అటవీ ప్రాంతం మీదుగా మన్యం భూభాగంలోకి వచ్చిన గజరాజులు.. దాదాపు రెండు దశాబ్దాలుగా ఇక్కడే తిష్ట వేశాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు ఏనుగుల గుంపులు నాగావళి, వంశధార తీర ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. పార్వతీపురం, కొమరాడ, జియ్యమ్మవలస, భామిని పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం 12 ఏనుగులు తిరుగుతున్నాయి. వీటివల్ల అటు ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లడమే కాక.. సమీప గ్రామాల ప్రజలకు కంటిమీద నిద్ర కరవవుతోంది. వీటిని దారిలోకి తెచ్చేందుకు కుంకీ ఏనుగులను తీసుకొస్తామని ఏళ్లుగా చెబుతున్న మాట నేటికీ కార్యరూపం దాల్చలేదు. వచ్చే సంక్రాంతినాటికి జిల్లాకు కుంకీలొస్తాయని ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల డీఆర్‌సీలో చెప్పారు. ఆ మాట.. ఈసారైనా అమలవుతుందో లేదో చూడాలి.

తరలింపా.. ఇక్కడే ఉంచుతారా?

ఎలిఫెంట్ జోన్, కుంకీలు.. తరలింపు ఇలా రకరకాల ఆలోచనల్లో అధికార యంత్రాంగం ఉంది. అందుకు కొన్ని ప్రాంతాలనూ గుర్తించారు. ఏదీ ముందుకు సాగడం లేదు. పునరావాస కేంద్రం కోసం స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు జోన్ అయితే రూ.30 కోట్ల వరకు అవసరం అవుతుంది. పెద్దమొత్తంలో ఆహారం తీసుకునే ఏనుగులకు.. ఇక్కడ ఉంచిన తర్వాత ఆ స్థాయిలో ఆహారం కల్పించడమూ కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో తాత్కాలిక కేంద్రంవైపే అధికారులు మొగ్గు చూపుతున్నారు. కుంకీలొచ్చాక వాటి ద్వారా జిల్లాలోని ఏనుగులను కొన్నాళ్లు గుచ్చిమి కేంద్రం వద్ద ఉంచి.. అనంతరం శేషాచలం అడవులకు తరలించే యోచన చేస్తున్నారు. లేకుంటే ఒడిశా ప్రభుత్వం, అధికారులను సమన్వయం చేసుకుని అక్కడి లఖేరి ప్రాంతానికి తరలించాలని భావిస్తున్నారు. కుంకీలు రాగానే.. భామిని వైపు ఉన్న గుంపును తొలుత కేంద్రానికి తరలించాలని చూస్తున్నారు.

ఏనుగుల దాడితో ప్రాణ నష్టం ఇలా..

- జిల్లాలో గజరాజులు కలిగిస్తున్న నష్టం అంతాఇంతా కాదు. ఇప్పటి వరకు 13 మందిని పొట్టనపెట్టుకున్నాయి. అటవీశాఖకు సంబంధించిన ఇద్దరు ట్రాకర్స్ కూడా చనిపోవడం గమనార్హం. పార్వతీపురం మండలం పెదబొండపల్లిలో జరిగిన ఒక మరణానికి సంబంధించి బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు, మిగిలిన వారికి రూ.5 లక్షలు చొప్పున అటవీశాఖ పరిహారం అందించింది.
- అటు ఆహారం కోసం వివిధ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. సాధారణంగా రాత్రి వేళల్లో 60 నుంచి 70 కిలోమీటర్ల మేర దూరం ప్రయాణించే ఏనుగులు.. ఆ సమయంలోనే పంటలపై పడుతున్నాయి. ఇప్పటి వరకు 700 హెక్టార్లలో వెయ్యిమందికి సంబంధించిన వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. సుమారు రూ.68 లక్షల మేర నష్టపరిహారం అందించారు. 60 మందికి రూ.7.73 లక్షల మేర పెండింగ్‌లో ఉంది.

రూ.3 కోట్ల వ్యయంతో కేంద్రం

కుంకీలొచ్చాక.. వాటి ద్వారా జిల్లాలో ఉన్న ఏనుగులను మచ్చిక చేసుకుని, ఒకచోటకు తరలించేందుకు సీతానగరం మండలం గుచ్చిమి వద్ద 'టెంపరరీ ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియా'ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు 80 శాతం పూర్తయ్యాయి. ఏనుగులు, వాటి సంరక్షకులు ఉండేలా ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. గజరాజుల కోసం మూడు షెడ్లు, రెండు క్రాల్స్ నిర్మాణం జరుగుతున్నాయి. కరిరాజులు ఆహారానికి ఇబ్బందులు పడకుండా ఉండేలా వివిధ పంటలు వేస్తున్నారు. ఇందులో ప్రధానంగా జొన్న, ఎలిఫెంట్ గ్రాస్, అరటి, పనస, మర్రి, రావి వంటివి ఉన్నాయి. ఇవేకాక.. వాటికి స్నానానికి, తాగడానికి వీలుగా రెండు పరిమాణాల్లో కొలనులు నిర్మిస్తున్నారు. సోలార్ ఫెన్సింగ్, ట్రెంచ్ వంటివాటితో కాంపా నిధులు రూ.3 కోట్ల వ్యయంతో దాదాపు 400 హెక్టార్ల బ్లాక్‌లో పనులు సాగుతున్నాయి.

ఏనుగులు సేదతీరేందుకు ఏర్పాటుచేసిన షెడ్



పసుకుడి చెరకు తోటల సమపంలో ఏనుగుల గుంపు

పసుకుడి చేరిన ఏనుగులు

భామిని: మండలంలోని పసుకుడి గ్రామ సమీపంలోకి నాలుగు ఏనుగుల గుంపు మంగళవారం చేరింది. వంశధార నది ఆవల ఒడిశా గ్రామాల నుంచి ఏనుగులు తరలివచ్చాయి. పంటపొలాల్లో సంచరిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. పంటలకు నష్టం చేకూర్చుతున్నాయంటూ గగ్గోలుపెడుతున్నారు.

పనులు చేపడుతున్నాం..

త్వరలోనే కుంకీలొచ్చే అవకాశం ఉంది. అవి రాగానే.. జిల్లాలో ఉన్న గుంపును గుచ్చిమి వద్ద నిర్మిస్తున్న టెంపరరీ ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాకు తరలిస్తాం. కేంద్రం నిర్మాణ పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. ఏనుగుల కదలికలను నిత్యం గమనిస్తూ.. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. పంట నష్టపోయిన రైతులకు పరిహారం కూడా జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు అందిస్తున్నాం.

– జీఏపీ ప్రసూన, జిల్లా అటవీశాఖాధికారిణి

సెమీ క్రిస్మస్

అద్వితీయ సత్య దేవునికి చేసే సత్యారాధనలో 'క్రీస్తు మహిమపరచబడు విధానం' మన స్పష్టమైన గమనించదగ్గది. నిజానికి తండ్రియైన దేవుని మహిమార్థం ప్రతి వాని మోకాలు యేసు నామమున వంగుట ద్వారా, ప్రతివాని నాలుక యేసు క్రీస్తు ప్రభువని ఒప్పుకొనుట ద్వారా దేవుడు ఆరాధించబడుతున్నాడు.

అద్వితీయ సత్యదేవుని ఆరాధన

లేఖనానుసార సంఘములో ఆదివారంనాడు క్రమం తప్పకుండా ఇది జరుగుతూ ఉంటే అదే దేవుని ఆరాధన. నిజానికి పైన కింద మధ్య అనే మూడు లోకాలలో ఉన్నవారంతా క్రీస్తుకు విధేయత చూపేలా క్రీస్తు దేవుని చేత ఉన్నతంగా హెచ్చించబడ్డాడు (ఫిలిప్పీ 2:9–11). ఇలా జగాలన్నీ అనాదిలో సంకల్పం చేసిన మాత్రం ఇది ప్రత్యక్షంగా తేటగా కనుగొంటాము. తిరుగులేని విధంగా పాపానికి ప్రాయశ్చిత్తం క్రీస్తు రక్తం ద్వారా జరిగింది. ఆ తదుపరి కేవలం క్రీస్తును బట్టి దేవుని ఆరాధించే సంకల్పం తప్పక పరిశుద్ధులు పుట్టుకొచ్చారు.

మా ఏలికకు అంటూ క్రీస్తుకు మొక్కవచ్చు. మా రాజువు మా ప్రభువైన క్రీస్తువు నీవే అంటూ కీర్తించి కొనియాడుతూ భయభక్తులతో క్రీస్తు పాదాల ముంగిట సాగిలపడవచ్చు. ధైర్యం తెచ్చుకొని వణుకుతో ఆయన పట్ల గౌరవంతో పూజ్యభావంతో ఆయనకు సాష్టాంగపడవచ్చు.

రాజు పట్ల ఇట్టి విధేయతను వ్యక్తిగతంగా ఎప్పుడైనా ఎక్కడైనా ప్రదర్శించవచ్చు. అయితే ఇది క్రీస్తు ఆరాధన కాదు. తన రాకను, తన పుట్టుకను సార్థకం చేసుకొన్న ప్రాణ స్నేహితుడైన క్రీస్తుకు జై కొట్టవచ్చు. జైజైలు పలకవచ్చు.

జై జై నినాదాలు మిన్నంటేలా చేయవచ్చు. జైజైల స్వరాలతో భూమ్యాకాశాల పునాదులు కదిలే పాటలతో ఎలుగెత్తి పాడుతూ ఆయన్ను ఈ ప్రపంచానికి పరిచయం చేయవచ్చు. అయితే ఇది క్రీస్తు ఆరాధన కాదు. బైబిలులో క్రిస్మస్ అన్న పదమే లేదు. నిజానికి క్రీస్తు ఆరాధనే బైబిలులో లేదు. అధికారికంగా, ఆజ్ఞపూర్వకంగా దేవుని ఆరాధన తప్ప ప్రత్యేకంగా క్రీస్తు ఆరాధన అంటూ ఏది లేదు. ఒక్క దేవుణ్ణి మాత్రమే ఆరాధించమని క్రీస్తు, క్రీస్తు వారి శిష్యులైన అపొస్తలులు తమ అధికారం, బోధలను బట్టి అజ్ఞాపించడం గమనించదగ్గది.

తల్లియైన మరియను శిశువైన యేసును చూచిన జ్ఞానులు పూజించి ప్రణమిల్లారు. అయితే ఇది ఆరాధన అని బైబిలు చెప్పుట లేదు. ఇది జ్ఞానుల వ్యక్తిగత విషయం. వారు భయంతో చేశారు. వారు ఆరాధించుట అనేది మనకు స్ఫూర్తి కాదు. కానుకలు ఇచ్చుటలో కూడా వారు ఆదర్శప్రాయులుగా స్ఫూర్తిగా లేరు. ఎందుకంటే నీ కొరకు ప్రాణం పెట్టిన క్రీస్తు కొరకు నీవు ఎంతటి గొప్ప కార్యాలు చేయాలో సాధించాలో నీవే లోతుగా ఆలోచిస్తే ఘనమైన సాహస కార్యాలు చేపడితే జ్ఞానులు నీకు సాటిరారు. దేవుని కుమారునికి మొక్కమని ఎవరిచేత వారు ఆదేశించబడలేదు. ఈ జ్ఞానులు కూడా మాదియ పారశీక బబులోను దేశపు జ్ఞానులు అనేది సమాచారం.

వీరు దేవుని, దేవుని ధర్మశాస్త్రాన్ని ఎరుగని అన్య జనులు. పామరులైన గొల్లలు కూడా భయపడ్డారు గానీ పూజించినట్టు వ్రాయబడలేదు. దేవుని దృష్టిలో పండితులైన జ్ఞానులు, అమాయకులైన గొర్రెల కాపరులూ దేవుని ఆరాధకులు కాదు. గొఱ్ఱెల కాపరులు యాకోబు వంశస్తులనబడే యూదులైతే, వారాంతా ఇశ్రాయేలీయులైతే వారికి ఎవరిని ఆరాధించాలో బహు బాగా తెలుసు. దేవున్ని ఎలా ఎక్కడ ఆరాధించాలో కనీస జ్ఞానం, సంబంధిత మర్యాద తప్పనిసరి. ఆత్మ జ్ఞానాన్ని బట్టి ఆత్మ నడిపింపుతో మరి ముఖ్యంగా దేవుని ఆజ్ఞలు అనుసరించే దేవుని ఆరాధించే వీలుంటుంది.

ఇప్పుడు క్రీస్తును ధరించుకొన్న క్రీస్తును శిరస్సుగా హత్తుకొన్న క్రీస్తును తమ ప్రభువుగా ప్రతిష్ఠించుకొన్న నూతన సృష్టి సంబంధులైన వారే దేవుని ఆరాధించుటకు అర్హులు, యోగ్యులు. దేవుని కొరకు జనమును కొని అనగా వారిని పరిశుద్ధపరచి దేవున్ని ఉన్నతంగా ఆరాధించుటకు యోగ్యులుగా వారిని తీర్చిదిద్దే పని క్రీస్తుదైతే సత్య లేఖనాలు ఎరుగని వారంతా క్రీస్తు ఆరాధన అంటూ కొత్త కొత్త సిద్ధాంతాలతో భక్తుల మనస్సులను కలుషితం చేస్తున్నారు. తన విలువైన రుధిరంతో పాపులను పరిశుద్ధపరుస్తూ ఇట్టి పరిశుద్ధ హృదయాలతో దేవున్ని ఆరాధించమని ఓ పక్క క్రీస్తు బోధిస్తూ ఉంటే మరోపక్క క్రీస్తు ఆరాధన కోరుకుంటూ ఉన్నాడని అది అంగీకరిస్తున్నాడని ఇట్టి లేఖన విరుద్ధ దుష్ప్రచారం ఎంతవరకు సమంజసం? (యోహాను 4:20–24).

సత్యం ఏమంటే, ఆరాధనీయుడు అనగా పూజలందుకొనే ఆరాధ్య దైవం ఎవరు? ప్రధానంగా ఆరాధన కోరుకొన్నది ఎవరు? ఎవరికి ఆరాధన చేయాలి? ఎవరి ద్వారా ఆరాధించబడ్డాలుము? ఎలా ఆరాధించాలి? ఎక్కడ ఆరాధించాలి? ఎందుకు ఆరాధించాలి? నిజమైన ఆరాధకులు ఎవరు... ఇత్యాది ప్రశ్నలకు లేఖన పద్ధతులలో జవాబులు రాబట్టుకోగలిగితే దేవున్ని మెప్పించే సర్వ సత్యం మన సొంతమవుతుంది. తన మహిమను ఎవరికీ ఇవ్వ లేని తండ్రి యైన దేవుడు పౌరుష వంతుడు. ఆయన చిత్తమే అంతటా నెరవేరాలి. దేవుడు ఘనపరచి గొప్ప చేసిన ఉపదేశ క్రమం అనుసరించి చూసినా, సత్యవాక్యాన్ని సరియైన రీతిలో విభజించి చూసినా ఆరాధన సమాచారం పుష్కలంగా మనకు అందుతుంది. ధర్మశాస్త్ర కాలంలో యేసు శరీరధారిగా ఇలకు వచ్చి ఈ భూమి మీద ఆయన దేవుని ఆరాధించాడు. అప్పటి కాల సమాచారం తెలుసుకొని ఆ తరువాత క్రొత్త నిబంధన ఆరాధన గూర్చి తెలుసుకోక తప్పదు.

తండ్రియైన అద్వితీయ సత్యదేవుని ఆరాధించాలి. ప్రభువైన క్రీస్తును సేవించాలి. ఇది క్రొత్త నిబంధన సమాచారం. అపొస్తలుల ఉపదేశం.

స్తుతులు, సంస్తుతులు స్తోత్రములు సంకీర్తనల గానాలాపనాలు, ఘనతలు, హెచ్చింపులు అన్నీ క్రీస్తుకు చెందుతాయి ఒక్క ఆరాధన తప్ప! అయితే దేవునికి చేసే ఆరాధనలో దేవుని కుడి పార్శ్వమున క్రీస్తు ఉండడం విశేషం.

కొత్త నిబంధన ఆరాధనకు పాత నిబంధన కాలపు ఆరాధన మార్గదర్శకంగా ఉంది. (2దిన 29: 20 – 30).

అయితే అది భౌతిక సంబంధ ఆరాధన. ఇది ఆత్మ సంబంధ ఆరాధన. పాత నిబంధన శ్రేష్ఠమైనది. కొత్త నిబంధన మరీ శ్రేష్ఠమైనది. అదే విధంగా క్రొత్త నిబంధన ఆరాధన ఉన్నతమైనది. అత్యున్నతమైనది. ఎందుకంటే ఇది క్రీస్తు ద్వారా అనగా క్రీస్తు రాజు సమక్షంలో ప్రధాన యాజకుడైన క్రీస్తు పర్యవేక్షణలో ఈ ఆరాధన కార్యక్రమం జరుగుతుంటుంది, ప్రతి ఆదివారం నాడు.

ఇప్పుడు క్రొత్త నిబంధన పద్ధతులను అనుసరించి చూస్తే ఆత్మ సంబంధ ఆరాధన చిత్రరూపంలో ఉంది. దేవుడు ఆకాశ సింహాసనం మీద ఆసీనుడై ఉన్నాడు. ఆయన కుడి పార్శ్వమున పరలోక పక్షపు రాజుగా ప్రధాన యాజకుడుగా క్రీస్తు ఉన్నాడు. ఇప్పుడు ప్రభువు దినమున అనగా వారపు ప్రప్రథమ దినమనే ఆదివారం నాడు, దేవదేవుడు ఘనంగా ఏర్పాటు చేసిన దినమున ఆత్మ సంబంధ ఆరాధన ఆరంభమవుతుంది. దీనియందు ఆత్మ సంబంధంగా ఉత్సహించి సంతోషించాలి (కీర్తన 118:24). అక్షయుడైన రాజు ఆత్మ సంబంధ రాజైన క్రీస్తు సమక్షంలో క్రీస్తు తన విలువైన రక్తంతో పరిశుద్ధపరచిన ఆయన పరిశుద్ధుల సమూహం ఆత్మతో సత్యంతో దేవునికి చేసే ఆరాధన చాలా చాలా ఉన్నతం. ఇది అద్వితీయ దేవునికి చాలా ప్రత్యేకం. ఇట్టి వైవిధ్య ఉన్నత ఆరాధననే దేవుడు కోరుకుంటున్నాడు. (యోహాను 4:20–24).

నేటి శ్రేష్ఠమైన క్రొత్త నిబంధన ఆరాధనను గూర్చి మరింత తేటగా పరిశీలన చేస్తే, ఆరాధనలో అపొస్తలుల బోధ తప్పక ఉండాలి. అది పెద్దగా చదివే పఠన రూపంలో, వాక్య వివరణ రూపంలో భక్తులకు నేరుగా అందుతుండాలి. అపొస్తలుల పరిశుద్ధ బోధలు ఉన్న సంకీర్తనలతో ఆత్మ సంబంధ పద్యాలతో దేవున్ని కీర్తించి మెప్పించగలగాలి. పరిశుద్ధులంతా ఒకచోట చేరి సహవాసంతో ఏక మనస్సు తో ఏకాత్మతో ముందుకు సాగాలి. నీతి, సమాధానం, పరిశుద్ధాత్మయందలి ఆనందం కొరకు, క్రీస్తు జ్ఞాపకార్థ ప్రార్థనలతో దేవున్ని వేడుకుంటూ ఆధ్యాత్మికంగా ఎదగాలి. ఇలా అపొస్తలుల బోధ, సహవాసం, రొట్టె విరుచుట, ప్రార్థనలయందు ఎడతెగక ఉంటూ ఆరాధన విషయంలో, మాదిరి విషయంలో ఆదిమ సంఘపు అడుగు జాడలలో నడవాలి. వీటికి చోటిచ్చి ఆదివారపు పరిశుద్ధ దినాన ఘనంగా ఆచరణలో పెట్టుటే ఆరాధన.

ఈ సారవంత సమగ్ర సమాచారం మొత్తం, ఇంతటి సువిశేష ప్రక్రియ యావత్తూ ఆరాధన. దేవునికి లేదా ప్రభువుకు మొక్కితే అది ఆరాధన కాదు. ఒంటరిగా ఏ ఒక్కడూ దేవుని ఆరాధించలేడు. అతనికి ఇద్దరు ముగ్గురూ పరిశుద్ధుల సహవాసంతో పనిపడుతుంది.

విశ్వాసం గలవారితో కలిసి ఉండుట భక్తి తాలూకు భావి జీవితానికి ఎంతో ఉపయుక్తం. ఆత్మ సంబంధిత సత్సంబంధాల బాంధవ్యం యెడతెగక కొనసాగించుట అనేది ఆరాధన యుక్తంగా చేయుటకు దోహదపడుతుంది. పరిశుద్ధుల సహకారం, సహవాసం దేవుని ఆరాధించే వ్యక్తికి తప్పనిసరి. సంఘము ఆరాధననే దేవుడు ఇష్టపూర్వకంగా వెదకుతున్నాడు. సంఘానికి కావలసిన ప్రారంభ కనీస సభ్యుల సంఖ్య ఇద్దరు లేదా ముగ్గురు కాబట్టి సంఘం ద్వారానే దేవునికి ఆరాధన, ఘనత, మహిమలు. అప్పుడు యెరూషలేము లోని సొలొమోను దేవాలయం. ఇప్పుడు స్థానికంగా ఉన్న క్రీస్తు ప్రభువు వారి సంఘమే దేవుని ఆరాధనకు కేంద్రం.

క్రీస్తుకు ఒక్కడూ మొక్కినా, సంఘమంతా కలిసి మొక్కినా, వేలాదిగా తరలి వచ్చి జనం పూజించి మొక్కినా అది ఆరాధన కాదు. అది క్రిస్మస్ అనే క్రీస్తు ఆరాధన కాదు.

క్రీస్తు మీద గల భయభక్తులు, గౌరవాలు అనుటకు సంకేతమే ఈ మొక్కడం. క్రీస్తు ద్వారా దేవునికి చేసేదే ఆరాధన అని హుందాగా చెప్పవచ్చును. దేవుని సంకల్పం సదా గుర్తుకు వచ్చేలా దానికి విధేయంగా లోబడిన విధంగానే అపొస్తలుల బోధను అనుసరించి జరిగేదే ఆత్మ సంబంధ సత్యారాధన. మనుష్యులను కాక దేవున్ని సంతోషపెట్టే లేఖనానుసార ఆత్మ సంబంధ ఆరాధనకు ఇలలో ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. ప్రభువైన క్రీస్తు ద్వారానే దేవునికి ఆరాధన అనేది లేఖనానుసారం.

ఆరాధనకు యోగ్యుడు, పాత్రుడుగా అనాది నుండి అద్వితీయ సత్య దేవుడు పూజలందుకుంటూ ఉన్నాడు. ఇప్పుడైతే ఆయన క్రమంతో కూడిన ఒక ప్రత్యేక వైవిధ్య విధానాన్ని సత్యారాధనలో ప్రవేశపెట్టాడు.

సత్యాన్ని తోసివేస్తూ క్రీస్తు ఆరాధనలతో ప్రపంచం మార్మోగిపోతోన్న ఈవేళ – ఒకవేళ క్రీస్తును పక్కనపెట్టినా కలిపినా ఆదివారం పరిశుద్ధుల సహవాసం కోరుకోక, సమాజంగా కూడక, ఇంట్లో ఒంటరిగా ఒక్కరే కూర్చుని లేదా కుటుంబ సభ్యులతో కలిసి పదే పదే దేవునికి మొక్కినా అది ఆరాధన కాదు. చేతులెత్తి మొక్కడం సాగిలపడి మొక్కడం ఒక్కటే ఆరాధన కాదు. సంపూర్ణ ఆరాధనే ఆరాధన. ఆరాధన ప్రాముఖ్యతను లోతుగా ఎరిగి దాని విధి విధానాలలోకి చొచ్చుకుపోయి అందు నిండా తలమునకలై బహు శ్రద్ధాసక్తులతో ఆత్మ సంబంధంగా తన్మయత్వం చెందేలా ఆత్మతో సత్యంతో చేసే ఈ మొత్తం ప్రక్రియ యావత్తూ ఆరాధన అనబడుతుందనేది రాజ గ్రంథ సమాచారం.

– జేతమ్

ఆనాడు పండుగలనేవి దేవుని ఆరాధనలో భాగంగా ఉండేవి. భౌతిక ఆచార వ్యవహారాలతో ముడిపడిన పండుగల స్థానంలోకి క్రీస్తు ద్వారా దేవున్ని ఆత్మతో సత్యంతో ఆరాధించే ఆత్మ సంబంధ సత్యారాధన పండుగ వచ్చి చేరింది. పండుగలు అన్నీ ఆత్మ సంబంధ విధానంలోకి మారిపోయి వాటి ఉనికిని మరింత ఉన్నతం చేసుకోవడం విశేషం. ఇలా ఉన్నతోన్నతంగా మార్పులు జరిగాయి.

ఆధ్యాత్మికతకు ఆవాసం... ధనుర్మాసం!

సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించడంతో ధనుర్మాసం మొదలవుతుంది. తిరిగి సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే సంక్రాంతితో ఈ ధనుర్మాసం ముగుస్తుంది. ధనుర్మాసం ప్రారంభాన్నే గ్రామీణ ప్రాంతాలలో పండుగ నెల పెట్టడం అంటారు. భక్తవత్సలుడైన శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికమైన ఈ ధనుర్మాసం 16, మంగళవారం ప్రారంభమైన సందర్భంగా ఆ మాస విశిష్టతలను తెలుసుకుందాం...

ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం ఇంటిని శుభ్రం చేసి రెండు పూటలా దీపారాధన చేయడం వల్ల శ్రీమహాలక్ష్మి కరుణ, కటాక్షాలు సిద్ధిస్తాయని శాస్త్రవచనం. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే వరకు అంటే సంక్రాంతి పండుగ రోజు ఉత్తరాయణం పెట్టే వరకు విష్ణు ఆలయాల్లో పండుగ వాతావరణం నెల కొని ఉంటుంది.

ఆధ్యాత్మిక ప్రయోజనాలకు ఆవాసం

ధనుర్మాసం విశేషమైన ఆధ్యాత్మిక ప్రయోజనాలు కలిగిన మాసం. ధనుర్మాసంలో స్నానం, దానం, హోమం, వ్రతం పూజలు చేయడం అత్యంత శుభప్రదం.

సుప్రభాతానికి బదులు తిరుప్పావై

ధనుర్మాసం విష్ణు పూజకు అత్యంత విశేషమైనదిగా భావిస్తారు. తిరుమలలో అయితే ఈ ధనుర్మాసం నెల రోజులు సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై గానం చేస్తారు. అలాగే మిగిలిన విష్ణు ఆలయాల్లో కూడా ఉదయం అర్చనలు చేసి నివేదనలు సమర్పించి వాటిని పిల్లలకు పంచుతారు. ఇలా పిల్లలకు ప్రసాదం పంచడాన్ని బాలభోగం అంటారు. అలాగే ధనుర్మాసం అనేది దేవతలకు బ్రాహ్మీ ముహూర్తం లాంటిదని పండితులు చెబుతారు.

అలక్ష్మిని ఆవలకు నెట్టే లక్ష్మీ పూజ

పవిత్రమైన ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా దీపారాధన చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహంతో దరిద్రాలన్నీ దూరమవుతాయని విశ్వాసం. ముఖ్యంగా గురు, శుక్రవారాల్లో శ్రీమహావిష్ణువును, లక్ష్మీదేవిని పూజిస్తారు.

ధనుర్మాసంలో ప్రతి ఇంటి ముందు తెల్లవారుజామునే అందమైన ముగ్గులు వేసి ఆ ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలు, గుమ్మడి పూలు ఉంచి.. వాటిని బియ్యపు పిండి, పసుపు, కుంకుమ, పువ్వులతో అలంకరించి పూజిస్తారు. మహాలక్ష్మీ రూపంలో ఉన్న గొబ్బెమ్మలను పూజించడం సకల శుభదాయకం.

గోదా రంగనాథుల కల్యాణం

గోదా కళ్యాణం అనేది వైష్ణవ దేవాలయాల్లో ధనుర్మాసం సమయంలో నిర్వహించే అతి ముఖ్యమైన ఆచారం. సాధారణంగా శ్రీ గోదాదేవి శ్రీ రంగనాథ స్వామి వారి వివాహం ధనుర్మాసం చివరి రోజున అంటే భోగి నాడు జరుగుతుంది.

ధనుర్మాస వ్రతాన్ని ఆచరించే వారు గోదా దేవి, శ్రీ కృష్ణుడు లేదా శ్రీరంగనాథ స్వామి వారిని పూజించాలి. తిరుప్పావై పాశురాలను రోజుకు ఒక్కటి గానం చేయాలి. స్వామివారికి, అమ్మవారికి పొంగలి నివేదించాలి. ధనుర్మాసంలో ఒక్కపూట భోజనం, బ్రహ్మచర్యం పాటించడం అత్యంత శ్రేష్ఠం. గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం చేయడం పరమ విశిష్టం. మనసు, వాక్కు, శరీరం ఈ త్రికరణాలను అత్యంత పరిశుద్ధంగా ఉంచుకున్న వారికి లక్ష్మీ నారాయణుల అనుగ్రహంతో సకల సంపదలూ చేకూరతాయని శాస్త్ర వచనం.

నిర్మల వాణి

ఆత్మసాక్షాత్కార సాధన

జనకుడు తాను మహారాజు కాబట్టి ఆభరణాలు, అందమైన వస్త్రాలు ధరించి హుందాగా ఉండేవాడు. నచికేతుడనే ముని ఆయన్ను చూసి ఆశ్చర్యపడి 'వివిధ అలంకారాలు, ఆభరణాలతో ఉన్న ఈ మహారాజుని కలవమని నా గురువుగారు నాకెందుకు చెప్పాడు. ఈ జనకుని గమనిస్తే తన స్వపరివారంతో నాట్య ప్రదర్శన యందు నిమగ్నమై ఉన్నాడు. ఈయన భాగవతోత్తముడు కానే కాదు. అయితే, నా గురువెందుకు ఈ రాజు పాదాలకు ప్రణమిల్లుతున్నాడో అర్థం కావడం లేదు. ఈయన కేవలం ఒక సాధారణమైన రాజు మాత్రమే' అని భావించాడు.

శ్రీ మాతాజీ నిర్మలాదేవి

జనక మహారాజు నచికేతుని మనోభావాలను చదవగలిగాడు. అప్పుడాయన 'నచికేతా! నీవు ఇక్కడకెందుకొచ్చావు?' అని ప్రశ్నించాడు. అప్పుడు నచికేతుడు ఆత్మసాక్షాత్కారం పొందటానికని సమాధానం చెప్పాడు. కాని జనకుడు ''చూడు నచికేతా, కావలిస్తే నా సమస్త రాజ్యాన్ని నీవు తీసుకో, కాని ఆత్మసాక్షాత్కారం కలుగజెయ్యడం అంత సులభం కాదు' అని హెచ్చరించాడు. అయినా నచికేతుడు 'ఆత్మసాక్షాత్కార సాధనకు మీరేమి చెబితే ఆ విధంగా చేస్తాను' అని పట్టుబట్టాడు. ఆ తర్వాత జనకుడు నచికేతుని ఒక నది వద్దకు తీసుకొని వెళ్ళి'నచికేతా, నీవు నీళ్ళలోనికి ప్రవేశించు, స్నానం చేద్దాం' అని అన్నాడు. వారు నదిలోనికి ప్రవేశించిన తర్వాత కొంతమంది రాజభటులు ఆ వైపుగా వచ్చి అగ్ని ప్రమాదం మూలంగా మంటలు అంతటా వ్యాపిస్తున్నాయని, ప్రజలందరూ పారిపోతున్నారని చెప్పారు. జనకుడు తన ధ్యాన ప్రపంచంలో ప్రశాంతంగా ధ్యానావస్థలో ఉన్నాడు. నచికేతుడు మాత్రం అందోళనకు లోనయ్యాడు. వెనువెంటనే ఎవరో వచ్చి మంటలు అక్కడకు కూడా వ్యాపిస్తున్నాయని, దుస్తులు కాలిపోతాయని హెచ్చరించారు. వెంటనే నచికేతుడు తన స్వీయ రక్షణార్థం దూరంగా పరుగెత్తాడు. ఇంత జరుగుతున్నా కూడా జనకమహారాజు తన ధ్యానంలో కూర్చునే ఉన్నాడు. నది బయటకు వచ్చిన నచికేతుడు అక్కడ ఏ విధమైన మంటలూ లేనట్లుగా గ్రహించాడు. అదంతా రాజభటులచే కల్పించబడిన మాయాజాలంగా గుర్తించి, ఎంతో ఆశ్చర్యపోయాడు. తనలోని లోపమేమిటో గుర్తించాడు. తాను జనకుని భగవత్ శక్తులను అనుమానించాడు. కాని జనకుడు, తాను మహారాజైనా కూడా, తన రాచరికపు అధికార శక్తుల గురించి పట్టించుకోలేదు. కారణం ఆయన పరమభాగవతోత్తముడు కాబట్టే ఆ విధంగా ఉన్నాడు. అంతర్గతంగా ఆయనొక పుణ్యపురుషుడు, ఆత్మజ్ఞాని.

రాజ్యలక్ష్మిని పూజించినట్లయితే అహంకారాన్ని సులభంగా అదుపులో ఉంచుకొనవచ్చును. ఆమె సమతుల్యాన్ని ప్రసాదిస్తుంది. మర్యాదస్తునిగా మారుస్తుంది. హుందాతనాన్ని ఇస్తుంది. అలాంటి వ్యక్తిత్వం ఇతరుల యెడ ప్రేమ, కనికరాలను మాత్రమే ప్రసరిస్తుంది. ఇతరులనుంచి ఏదీ ఆశించదు. అది ఒక మహారాణీ తత్వం లాంటిది. భౌతిక వస్తువులకు ఆశపడే వారెవ్వరూ కూడా అందుకు అర్హులు కారు. ఇతరుల క్షేమాన్ని ఆకాంక్షించడం, తన దగ్గరకు వచ్చే ప్రతి వ్యక్తి యెడల శ్రద్ధ వహించడం లాంటి గుణాలన్నీ చాలా ముఖ్యం. మీకు ఆర్థిక సమస్యలు, వసతి సమస్యలు అలాంటి వాటినన్నింటినీ రాజ్యలక్ష్మియే సమకూరుస్తుంది. రాజ్యలక్ష్మీ తత్వం ప్రజలయొక్క కార్య శీలత ద్వారానే వస్తుంది. అలా కాక మీరు బద్ధకస్తులుగా ఉంటే రాజ్యలక్ష్మి నిలబడదు.

– డా. రాకేశ్, (పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచన సారాంశం ఆధారంగా)

ఇస్లాం వెలుగు

గ్రహాంతర వాసులున్నారా?

అల్లాహ్ నిదర్శనాలలో భూమి ఆకాశాల సృష్టి కూడా ఒకటి. ఆ రెండింటి లోనూ జీవరాశులను వ్యాపింపజేసి ఉంచాడు. తాను తలుచుకున్నప్పుడు వాటిని పరలోకంలో ఒక చోట సమీకరించగలడు. ఖుర్ఆన్ భావామృతం: 42:28–29 **వివరణ:** ఈ సూక్తిని బట్టి జీవరాసులలో మన భూమి పైననే గాక ఇతర గ్రహాలలో కూడా జీవరాసులు ఉన్నాయని తెలుస్తోంది. ఆ దేవుడే ఏడు ఆకాశాలు సృష్టించాడు. అలాంటివే భూమిని పోలిన వాటిని కూడా సృష్టించాడు. వాటిపై కూడా ఆయన ఆజ్ఞలు అవతరిస్తూ ఉంటాయి. దేవుడు ప్రతిదానిపై అదుపు ,అధికారం గల సమర్థుడు. సర్వశక్తిమంతుడని ఆయన జ్ఞానం ప్రతి వస్తువుని ప్రతి విషయాన్ని పరివేష్టించి ఉందని మీరు తెలుసుకోవడానికే ఈ సంగతి తెలియజేయబడుతోంది. (ఖుర్ఆన్ భావామృతం:65:12) **వివరణ:** ఇలాంటివే మీ భూమిని పోలిన వాటిని కూడా సృష్టించాడు అంటే ఏడు ఆకాశాల్లో ఏడు భూములు మాత్రమే సృష్టించాడని కాదు. ఇది అరబీ భాషలో పెద్ద సంఖ్యను కూడా సూచిస్తుంది. భూమిని పోలిన వాటిని అంటే బుద్ధి జీవులు గల మన భూమిని పోలిన భూములు అని అర్థం. దీన్నిబట్టి మన విశ్వంలో మనలాంటి బుద్ధి జీవులు ఉండే అనేక గ్రహాలు ఉన్నాయని తెలుస్తోంది. హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ రజి ఈ సూక్తి గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: వాటిలోని ప్రతి భూమండలంలో ముహమ్మద్ ప్రవక్తను పోలిన ప్రవక్తలు ఉన్నారు; ఆదం అలైను పోలిన ఆదంలు ఉన్నారు; నూహ్ అలైను పోలిన నూహ్ లు ఉన్నారు. ఇబ్రాహీం అలైను పోలిన ఇబ్రాహీంలు ఉన్నారు; ఈసా అలై ను పోలిన ఈసాలు ఉన్నారు. క్వాంటం సిద్ధాంతం ఆధారంగా హ్యూగ్ ఎవరెట్ ప్రతిపాదించిన మల్టీ యూనివర్స్ సిద్ధాంతం ప్రకారం మన భూమండలానికి ఇక్కడున్న సృష్టి రాశులకు నకళ్లు ఉంటాయట! ఎకానమిస్ట్ (లండన్) అనే పత్రిక 26 –7 –1969 సంచిక ప్రకారం అమెరికాకు చెందిన ర్యాండ్ కార్పొరేషన్ సంస్థ ఇతర గ్రహాలలో బుద్ధి జీవుల ఉనికిని గురించి పరిశోధన జరిపింది. దాని ప్రకారం మన పాలపుంతలో మన భూమి వాతావరణాన్ని పోలిన అరవై కోట్ల గ్రహాలు ఉన్నాయి. ఈ గ్రహాలలో జీవరాసులు ఉండవచ్చని కూడా ఈ పరిశోధన ద్వారా తెలుస్తోంది. ఈ యథార్థాన్ని 1400 సంవత్సరాల క్రితమే ముస్లిం పండితులు తెలియజేశారు. (ఖుర్ ఆన్ భావామృతం 65:12).

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

బిజినెస్ రీల్

ఎస్‌బీఐ ఎండీగా తివారీ పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ ఎండీ అశ్విని కుమార్ తివారీ పదవీ కాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగింపునకు కేంద్రం ఆమోదం తెలిపింది. ప్రస్తుత పదవీ కాలం 2026 జనవరి 27తో ముగుస్తుండగా, 2027 డిసెంబర్ 31 (పదవీ విరమణ) వరకు తిరిగి ఎండీగా కేంద్ర ప్రభుత్వం పునర్నియమించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎస్‌బీఐ సమాచారం ఇచ్చింది. తివారీ పదవీకాలం పొడిగించడం ఇది రెండోసారి. 2021 జనవరిలో ఆయన ఎస్‌బీఐ ఎండీగా మూడేళ్ల కాలానికి నియమితులు కాగా, 2024లో రెండేళ్ల పొడిగింపును పొందారు.

హ్యుందాయ్ ఎండీ, సీఈఓగా తరుణ్ గార్గ్

నియామకానికి షేర్‌హోల్డర్ల ఆమోదం

న్యూఢిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్(హెచ్‌ఎంఐఎల్) మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా తరుణ్ గార్గ్ నియామకానికి షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపారు. ఈ–వోటింగ్ ద్వారా నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్‌లో 99.75% మద్దతు లభించినట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. వచ్చే ఏడాది(2026) జనవరి 1 నుంచి ఈ నియామకం అమల్లోకి రానుంది. ఇప్పటికే చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసరుగా బాధ్యతలు నిర్వహిస్తున్న తరుణ్ గార్గ్‌ను ఎండీ, సీఈఓగా నియమిస్తూ హెచ్‌ఎంఐఎల్ బోర్డు ఈ ఏడాది అక్టోబర్‌లో నిర్ణయం తీసుకుంది.

ఫ్లిప్‌కార్ట్ పునర్వ్యవస్థీకరణకు ఓకే

ఎన్‌సీఎల్‌టీ అనుమతితో ఐపీవోకు దారి

న్యూఢిల్లీ: ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో ఎనిమిది సంస్థల విలీనానికి తాజాగా జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) అనుమతించింది. సింగపూర్‌లో ఏర్పాటైన 8 కంపెనీలను ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్ ప్రయివేట్ లిమిటెడ్‌లో విలీనం చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు ఫ్లిప్‌కార్ట్‌కు దారి ఏర్పడింది. అయితే ఈ అంశాలను కంపెనీల రిజిస్ట్రార్(ఆర్‌వోసీ) పరిశీలించేముందుగా సింగపూర్ కోర్టు నుంచి ఇందుకు అనుమతి పొందవలసి ఉంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం రిటైల్ రంగ గ్లోబల్ దిగ్గజం వాల్‌మార్ట్ గ్రూప్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్ పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు ఎన్‌సీఎల్‌టీ తాజా అనుమతి వీలు కల్పించనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-12-2025

విశాఖ	675–00
చిత్తూరు	688–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	675–00
విజయవాడ	700–00
రిటైల్ ధర (డజను)	96.00
హైదరాబాద్	671–00
వరంగల్	673–00
రిటైల్ ధర	7.31

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	866	2.07
SBIN	976.35	1.58
HINDALCO	848	1.3
EICHERMOT	7,143.00	1.15
TATACONSUM	1,180.00	0.86

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MAXHEALTH	1,033.20	-3.71
APOLLOHOSP	6,912.00	-1.98
TRENT	4,040.30	-1.66
BAJAJ-AUTO	8,868.00	-1.55
HDFCLIFE	752.95	-1.49

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,840
ఎన్‌ఎస్‌ఈ	85,180
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,19,728
ఎఫ్‌ఐఐ	+ 1,172
డీఐఐ	+ 769

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	55.94	$	55.13
బ్రెంట్	59.75	$	58.92

స్టీల్ డిమాండ్ 8% అప్

- పోటీధరలతో మార్జిన్లపై ఒత్తిడి
- రేటింగ్ దిగ్గజం ఇక్రా అంచనాలు
- చైనా నుంచి భారీగా ఎగుమతులు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో స్టీల్‌కు డిమాండ్ 8 శాతం పుంజుకోనున్నట్లు రేటింగ్ దిగ్గజం ఇక్రా అంచనా వేసింది. అయితే పోటీధరల కారణంగా స్టీల్ తయారీ కంపెనీల మార్జిన్లపై ఒత్తిళ్లకు అవకాశమున్నట్లు ఒక నివేదికలో పేర్కొంది. స్టీల్ పరిశ్రమ నిర్వహణలాభ మార్జిన్ నిలకడగా 12.5 శాతం స్థాయిలో నమోదుకావచ్చని అభిప్రాయపడింది. వెరసి మార్జిన్లు మెరుగుపడనున్నట్లు గతంలో వేసిన అంచనాలను సవరించింది. కాగా.. ఈ ఏడాది స్టీల్ డిమాండ్ 8 శాతం స్థాయిలో పటిష్టంగా నమోదుకావచ్చని అంచనా వేస్తున్నట్లు ఇక్రా కార్పొరేట్ రంగ రేటింగ్స్ గ్రూప్ హెడ్ గిరీష్‌కుమార్ కడమ్ తెలియజేశారు. అయితే సరఫరాలు పెరగనుండటంతో తాత్కాలికంగా డిమాండును మించి సరఫరాకు వీలున్నట్లు పేర్కొన్నారు. ఫలితంగా స్టీల్ ధరలపై ఒత్తిళ్లు కొనసాగవచ్చని తెలియజేశారు.

సేఫ్‌గార్డ్ డ్యూటీ రక్షణ

ఇక్రా నివేదిక ప్రకారం దేశీయంగా హాట్‌రోల్డ్ కాయిల్(హెచ్‌ఆర్‌సీ) ధరలు 2025 ఏప్రిల్‌లో టన్నుకి రూ. 52,850కు ఎగశాయి. సేఫ్‌గార్డ్ డ్యూటీ విధింపు ఇందుకు సహకరించింది. ఆపై నవంబర్‌కల్లా టన్ను ధర తిరిగి రూ. 46,000కు దిగివచ్చింది. దిగుమతి ధరలకంటే దిగువకు చేరింది. వ్యవస్థాగత అంశాల కారణంగా ప్రస్తుత కేలండర్ ఏడాది(2025) తొలి 9 నెలల్లో చైనా స్టీల్ ఎగుమతులు 8.8 కోట్ల టన్నులను తాకాయి. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. దీంతో ప్రపంచ స్టీల్ ధరలపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ ఏప్రిల్–సెప్టెంబర్‌లో చైనా హెచ్‌ఆర్‌సీ ఎగుమతి ధరలు సగటున టన్నుకి 465 యూఎస్ డాలర్లుగా నమోదయ్యాయి. ఏడాదిక్రితం నమోదైన 496 డాలర్లతో పోలిస్తే 6 శాతం తగ్గాయి. కాగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా ఫినిష్డ్(తుది ఉత్పత్తి) స్టీల్ దిగుమతులు వార్షికంగా 33 శాతం క్షీణించాయి. దీంతో చౌక దిగుమతులను అడ్డుకునేందుకు సేఫ్‌గార్డ్ డ్యూటీ కొనసాగింపు కీలకమని ఇక్రా పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం దేశీ హెచ్‌ఆర్‌సీ ధరలు 2026 మార్చివరకూ సగటున టన్నుకి రూ. 50,500గా కొనసాగే వీలున్నట్లు అంచనా వేసింది. ఫలితంగా టన్ను స్టీల్ ఉత్పత్తిపై నిర్వహణ లాభం గతేడాది(2024–25)లో నమోదైన 110 డాలర్ల నుంచి 108 డాలర్లకు నీరసించవచ్చని తెలియజేసింది. వెరసి స్టీల్ రంగానికి నిలకడతోకూడిన ఔట్‌లుక్ ప్రకటించింది.

సామర్థ్య విస్తరణ ఎఫెక్ట్

దేశీయంగా స్టీల్ పరిశ్రమలో భారీ సామర్థ్య విస్తరణ ప్రణాళికలు అమలవుతున్న కారణంగా రిసు్కలు పెరగవచ్చని ఇక్రా తాజా నివేదికలో పేర్కొంది. దీని ప్రకారం 2026–31 మధ్య కాలంలో దేశీ స్టీల్ పరిశ్రమలు 8–8.5 కోట్ల టన్నుల స్టీల్ తయారీ సామర్థ్యాన్ని అదనంగా జత కలుపుకునే ప్రణాళికలు అమలు చేయనున్నాయి. ఇందుకు 4.5–5 బిలియన్ డాలర్ల(దాదాపు రూ. 45,000 కోట్లు) పెట్టుబడులు వెచ్చించనున్నాయి. అయితే తగినస్థాయిలో విక్రయాలు, ఆర్జన మెరుగుపడకపోతే భారీ పెట్టుబడుల కారణంగా మధ్యకాలానికి స్టీల్ పరిశ్రమ రుణభారం పెరిగిపోయే అవకాశముంది.

ఇక మరోపక్క దేశీయంగా మొత్తం డిమాండ్‌లో గ్రీన్ స్టీల్ వాటా 2029–30కల్లా 2 శాతానికి(4 మిలియన్ టన్నులు) బలపడవచ్చని గ్రీన్ స్టీల్‌పై గిరీష్‌కుమార్ స్పందించారు. ఈ బాటలో 2049–50కల్లా దాదాపు 40 శాతానికి(150 ఎంటీ)కి చేరవచ్చని అంచనా వేశారు. గ్రీన్ హైడ్రోజన్ ధరలు కేజీకి 1.5–1.6 డాలర్లకు క్షీణిస్తేనే గ్రీన్ స్టీల్ తయారీ ఊపందుకుంటుందని తెలియజేశారు. అయితే సమీప భవిష్యత్‌లో గ్రీన్ హైడ్రోజన్ ధరలు దిగిరాకపోవచ్చని అభిప్రాయపడ్డారు.

ఐవోబీ ఆఫర్ ఫర్ సేల్ షురూ

- ఫ్లోర్ ధర షేరుకి రూ. 34
- నేడు రిటైలర్లకు విండో ఓపెన్

న్యూఢిల్లీ: పీఎస్‌యూ సంస్థ ఇండియన్ ఓవర్‌సీస్ **బ్యాంక్(ఐవోబీ)**లో ప్రభుత్వ వాటా విక్రయం(ఓఎఫ్‌ఎస్) బుధవారం ప్రారంభమైంది. ఇందుకు ఫ్లోర్ ధర షేరుకి రూ. 34కాగా.. రిటైల్ ఇన్వెస్టర్లకు నేడు(గురువారం) విండో ఓపెన్ కానుంది. ఓఎఫ్‌ఎస్‌లో భాగంగా బ్యాంక్‌లో ప్రభుత్వం 3 శాతం వాటాను విక్రయించనుంది. తద్వారా రూ. 1,960 కోట్లు సమకూర్చుకునే వీలుంది. సంస్థాగత ఇన్వెస్టర్లకు 34.66 కోట్ల షేర్లు ఆఫర్ చేయగా.. 41 కోట్ల షేర్లకు బిడ్స్ లభించాయి. కాగా.. ప్రభుత్వం ప్రాథమికంగా 2 శాతం వాటా(38.51 కోట్ల షేర్లు) ఆఫర్ చేస్తోంది. డిమాండ్‌నుబట్టి అదనంగా 1 శాతం వాటా(19.25 కోట్ల షేర్లు) సైతం విక్రయించనుంది. ఈ బాటలో బ్యాంక్ ఉద్యోగులకు సైతం నిబంధనలను అనుసరించి మరో 1,50,000 షేర్లు ఆఫర్ చేయనుంది. అర్హతగల ఉద్యోగులు రూ. 5 లక్షల విలువవరకూ షేర్ల కొనుగోలుకి దరఖాస్తు చేసుకునేందుకు వీలుంటుంది.

94.61 శాతం వాటా

చెన్నై కేంద్రంగా ఏర్పాటైన బ్యాంక్‌లో ప్రస్తుతం ప్రభుత్వానికి 94.61 శాతం వాటా ఉంది. నిజానికి లిస్టెడ్ కంపెనీలు పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా నిబంధన అమలు చేయవలసి ఉంటుంది. అయితే ఈ నిబంధనల అమలులో కేంద్ర ప్రభుత్వ సంస్థ(సీపీఎస్‌ఈ)లకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 2026 ఆగస్ట్‌వరకూ గడువిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఐవోబీలో ఓఎఫ్‌ఎస్‌కు తెరతీసింది. ఇదేవిధంగా పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్(93.9 శాతం), యుకో బ్యాంక్(91 శాతం), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(89.3 శాతం)లోనూ ప్రభుత్వం ఓఎఫ్‌ఎస్‌ను చేపట్టే అవకాశముంది.

ఓఎఫ్‌ఎస్ నేపథ్యంలో ఐవోబీ షేరు బీఎస్‌ఈలో 1.1 శాతం నీరసించి రూ. 36.57 వద్ద ముగిసింది.

మారుతీ వేగన్‌ఆర్‌లో స్వివల్ సీట్ ఆప్షన్

న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు వాహనంలోకి సులువుగా ఎక్కడానికి, దిగడానికి వీలుగా తమ వేగన్‌ఆర్ కారులో స్వివల్ సీట్ ఆప్షన్‌ని అందుబాటులోకి తెచ్చినట్లు ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా వెల్లడించింది. రోజువారీ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ఇది ఉపయోగపడుతుందన కంపెనీ ఎండీ హిసాషి తకెయుచి తెలిపారు. వేగన్‌ఆర్ స్వివల్ సీటు .. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ (ఏఆర్‌ఏఐ) భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని వివరించారు. అసమానతలను తొలగించే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన పర్యావరణహిత అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా ఇది ముందడుగని పేర్కొన్నారు.

విదేశీ మార్కెట్లో పెట్టుబడుల విస్తరణ

ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో యూఎస్ ఈక్విటీలు, ఇండెక్స్, థిమాటిక్, ఈటీఎఫ్‌లు

న్యూఢిల్లీ: దేశీ ఇన్వెస్టర్లు విదేశాలలో చేపడుతున్న పెట్టుబడుల పరిధి భారీగా విస్తరిస్తోంది. కేవలం స్టాక్స్‌లోనేకాకుండా యూఎస్ ఈక్విటీలు, ఇండెక్స్, థిమాటిక్‌సహా గ్లోబల్ ఫండ్స్, ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు. వీటి పరిధి ప్రయివేట్ మార్కెట్ అవకాశాలకు సైతం విస్తరిస్తున్నట్లు వెస్టెడ్ ఫైనాన్స్ నివేదిక పేర్కొంది. 2025లో ప్రపంచవ్యాప్త భారత పెట్టుబడులు పేరుతో విడుదలైన నివేదిక పలు అంశాలను ప్రస్తావించింది. దీని ప్రకారం పోర్ట్‌ఫోలియో నిర్మాణంలో మరింత నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తున్నారు. విస్తారిత పరిధిలో ప్రపంచవ్యాప్త పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారు. రీసెర్చ్, డిజిటల్ టూల్స్, ఎడ్యుకేషన్ తదితర అంశాలు ఇందుకు కీలకపాత్ర పోషిస్తున్నాయి. మెట్రోలనుదాటి పట్టణాలకూ విస్తరిస్తోంది. దేశీ కరెన్సీ రూపాయి క్షీణత ప్రపంచ పెట్టుబడులకు ప్రోత్సాహాన్నిస్తోంది. ఈ నేపథ్యంలో విదేశాలలో ఈక్విటీ, డెట్ మార్కెట్ పెట్టుబడులు 2018–19తో పోలిస్తే నాలుగు రెట్లు ఎగశాయి. వెరసి 2019లో 42.2 కోట్ల డాలర్ల పెట్టుబడులు 2024–25కల్లా 170 కోట్ల డాలర్లకు జంప్‌చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో విదేశాలలోని ఈక్విటీ, డెట్ సాధనాలలో పెట్టుబడులు 1.01 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ కాలంలో పెట్టుబడులు పెరగడమేకాకుండా వీటి పరిధిసైతం విస్తరిస్తోంది. పెట్టుబడులను వైవిధ్యంగా విభిన్న ఆస్తులకు మళ్లిస్తున్నట్లు వెస్టెడ్ ఫైనాన్స్ సీఈవో విరమ్ షా తెలియజేశారు.

ఇండిగో సంక్షోభం.. తగ్గిన ఏటీఎఫ్ విక్రయాలు

- డిసెంబర్ 1 నుంచి 15 మధ్య 4 శాతం తక్కువ
- 5 శాతం పెరిగిన డీజిల్ అమ్మకాలు

న్యూఢిల్లీ: ప్రముఖ ఎయిర్‌లైన్స్ ఇండిగోలో తలెత్తిన సంక్షోభంతో విమానయాన ఇంధన (ఏటీఎఫ్) విక్రయాలపై ప్రభావం పడింది. సాంకేతిక సమస్యలు, సిబ్బంది విధులకు సంబంధించి కొత్త నిబంధనల అమలు కారణంగా ఇండిగో ఈ నెల మొదట్లో పెద్ద ఎత్తున విమాన సేవలను రద్దు చేయడం తెలిసిందే. సుమారు 5,000 ఫ్లయిట్ సేవలను రద్దు చేసింది. దీని కారణంగా డిసెంబర్ మొదటి పక్షం రోజుల్లో ఏటీఎఫ్ అమ్మకాలు 4 శాతం తగ్గాయి. గత రెండేళ్ల నుంచి ఏటీఎఫ్‌కు డిమాండ్ క్రమంగా పెరుగుతుండగా, ఇండిగో సంక్షోభంతో ఈ నెలలో మొదటిసారి క్షీణతను ఎదుర్కొన్నది. డిసెంబర్ 1 నుంచి 15 వరకు ఏటీఎఫ్ అమ్మకాలు 3,31,400 టన్నులుగా ఉన్నాయి. ఏడాది క్రితం ఇదే కాలంలో అమ్మకాలు 3,45,400 టన్నులుగా ఉండడం గమనార్హం. ఇక నెలవారీగా చూసుకున్నా (అక్టోబర్ మొదటి 15 రోజులు) విక్రయాలు 7.2 శాతం తగ్గాయి. ఇక దేశ ఇంధన వినియోగంలో 40 శాతం వాటా కలిగిన డీజిల్ అమ్మకాలు డిసెంబర్ మొదటి 15 రోజుల్లో 5 శాతం పెరిగి 3.3 మిలియన్ టన్నులకు చేరాయి. పెట్రోల్ విక్రయాలు సైతం 7.7 శాతం పెరిగి 1.33 టన్నులకు చేరాయి. ఎల్‌పీజీ అమ్మకాలు 15 శాతం వృద్ధితో 1.55 మిలియన్ టన్నులుగా ఉన్నాయి.

ఏజెస్ ఫెడరల్ లైఫ్ కొత్త లోగో

న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ సంస్థ ఏజెస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ కొత్త లోగోను ఆవిష్కరించింది. రక్షణ, మార్గనిర్దేశాన్ని సూచించే విధంగా దీన్ని రూపొందించినట్లు సంస్థ ఎండీ జ్యూడ్ గోమ్స్ తెలిపారు. కొత్త లోగో వాగ్దానాలను నెరవేర్చడంలో కంపెనీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ పేర్కొన్నారు. అత్యుత్తమ పనితీరుతో కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు గోమ్స్ వివరించారు. 2025 మార్చి ఆఖరు నాటికి 270 శాతం సాల్వెన్సీ నిష్పత్తితో ప్రైవేట్ లైఫ్ ఇన్సూరర్స్‌లో మెరుగైన స్థానంలో నిల్చినట్లు చెప్పారు.

ఓలా ప్రమోటర్ తనఖా వాటా రిలీజ్

తనఖా వాటా విలువ రూ. 260 కోట్లు

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ ప్రమోటర్ భవీష్ అగర్వాల్ తాజాగా తనఖాలోని వాటాను పూర్తిగా విడిపించుకున్నట్లు తెలుస్తోంది. కంపెనీలో స్వల్ప ప్రమోటర్ వాటా విక్రయం(మానిటైజేషన్)తోపాటు.. ఇతర వ్యక్తిగత ఆదాయాలను వినియోగించడం ద్వారా రూ. 260 కోట్ల విలువైన వాటాను తనఖానుంచి తప్పించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వెరసి ఇంతక్రితం తనఖాలో ఉంచిన 3.93 శాతం వాటా విడుదలైనట్లు తెలియజేశాయి. ఫలితంగా కంపెనీ వ్యవస్థాపకుడు, ప్రమోటర్ రుణరహితంగా అవతరించినట్లు వివరించాయి. ఈ లావాదేవీల తదుపరి కంపెనీలో ప్రమోటర్ వాటా 34 శాతానికి ఎగువనే ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇంతక్రితం ఏఐ స్టార్టప్ కృత్రిమ్ సీడ్ ఫండ్ కోసం వాటా తనఖాలో ఉంచినప్పటికీ భవిష్యత్‌లో నిధుల ఆవశ్యకత ఉండబోదని తెలియజేశాయి. క్లౌడ్ ఇన్‌ఫ్రా సంస్థగా ఆవిర్భవించిన కృత్రిమ్ సానుకూల నగదు ఆర్జన సాధిస్తున్నట్లు పేర్కొన్నాయి.

హెల్త్‌కేర్, వ్యవసాయంలో ఏఐకి గూగుల్ దన్ను

న్యూఢిల్లీ: ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో కృత్రిమ మేథ (ఏఐ) వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా టెక్ దిగ్గజం గూగుల్ 8 మిలియన్ డాలర్ల మద్దతు ప్రకటించింది. ఆరోగ్యం, సాగుకి సంబంధించిన సొల్యూషన్స్ రూపొందించేందుకు వాధ్వానీ ఏఐకి 4.5 మిలియన్ డాలర్లు, భారతీయ భాషల్లో సొల్యూషన్స్ రూపకల్పన కోసం జ్ఞానిడాట్‌ఏఐ, కోరోవర్‌డాట్‌ఏఐ, భారత్‌జెన్‌కి తలో 50,000 డాలర్ల గ్రాంట్లు అందిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. మెడ్‌జెమాను ఉపయోగించి దేశీ హెల్త్ ఫౌండేషన్ మోడల్స్ రూపకల్పనకు 4,0,000 డాలర్లు అందిస్తున్నట్లు పేర్కొంది. హెల్త్‌కేర్ ప్రొవైడర్ల సామర్థ్యాలను, చికిత్స ఫలితాలను మెరుగుపర్చేందుకు ఇవి తోడ్పడగలవని వివరించింది. డెర్మటాలజీ తదితర విభాగాల్లో భారత్‌కి పరిమితమైన ప్రత్యేక కేసుల్లో ఉపయోగపడే మోడల్స్‌ను నిర్మించేందుకు ఎయిమ్స్ (ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) నిపుణులతో కలిసి 'ఆజ్ఞ లెన్స్' పని చేస్తుందని గూగుల్ పేర్కొంది.

ప్రస్తుత చట్టాల పరిధిలోనే ఏఐ నియంత్రణ

ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి కృష్ణన్

న్యూఢిల్లీ: కృత్రిమ మేథ (ఏఐ)కు సంబంధించి కొత్త చట్టాలను తీసుకురావడానికి బదులు.. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) తదితర ప్రస్తుత చట్టాల పరిధిలో నియంత్రణకు ప్రభుత్వం మొగ్గు చూపిస్తుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ తెలిపారు. అసోచామ్ ఏఐ లీడర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. టెక్నాలజీ రంగంలో కొత్త నియంత్రణల పరంగా ప్రభుత్వ విధానం ఆలోచనాత్మకంగా.. ఆవిష్కరణలకు విఘాతం కలగకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. మేథో సంపత్తి చట్టం, కొత్తగా నోటిఫై చేసిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం కింద ఏఐకి సంబంధించి తగినంత రక్షణ ఉన్నట్టు చెప్పారు.

ఎగుమతులు, దిగుమతుల పర్యవేక్షణకు కమిటీ

సభ్యులుగా వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులు

న్యూఢిల్లీ: ఎగుమతులు, దిగుమతుల తీరును పర్యవేక్షిస్తూ, అవసరమైనప్పుడు దిద్దుబాటు చర్యలను సూచించేందుకు కేంద్ర ప్రభుత్వం అంతర్ మంత్రిత్వ కమిటీని ఏర్పాటు చేసింది. వాణిజ్య శాఖ, రెవెన్యూ, పారిశ్రామిక ప్రోత్సాహక–అంతర్గత వాణిజ్య శాఖలతోపాటు, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ లోక్‌సభకు వెల్లడించారు. చైనాతో వాణిజ్య లోటు 2024 ఏప్రిల్–అక్టోబర్ కాలంలో 58.09 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2025 ఏప్రిల్–అక్టోబర్ కాలంలో 10 శాతం పెరిగి 63.97 బిలియన్ డాలర్లకు చేరినట్టు చెప్పారు. ముడి సరుకులు, ఆటో విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు, అసెంబ్లీలు, మొబైల్ ఫోన్ల విడిభాగాలు, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియెంట్స్‌ను చైనా నుంచి దిగుమతి చేసుకోవడం వల్లే వాణిజ్య లోటు పెరిగిపోయిందని, వీటితో తయారు చేసిన ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నట్టు వివరించారు. చైనాకి ఎగుమతులు ఇదే కాలంలో 8.04 బిలియన్ డాలర్ల నుంచి 10.02 బిలియన్ డాలర్లకు పెరిగినట్టు తెలిపారు.

చిన్న సంస్థల కోసం డెల్ ల్యాప్‌టాప్‌లు

ధర రూ. 31,999 నుంచి ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డెల్ టెక్నాలజీస్ తాజా గా హైదరాబాద్‌లోని చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల (ఎస్‌ఎంబీ) అవసరాల కోసం సరికొత్త డెల్ ప్రో ఎజెన్షియల్ ల్యాప్‌టాప్‌లను రూపొందించింది. డెల్ ప్రో 14 ఎజెన్షియల్, డెల్ ప్రో 15 ఎజెన్షియల్ ధర రూ. 31,999 నుంచి ప్రారంభమవుతుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ ఉత్పత్తుల ఆవిష్కరణ కార్యక్రమంలో 315 మంది పైగా కస్టమర్లు పాల్గొన్నట్లు సంస్థ తెలిపింది. ఎస్‌ఎంబీలకు ఐటీ కార్యకలాపాలను సులభతరం చేసే విధంగా ఇవి అధునాతన టెక్నాలజీలతో ఉంటాయని సీనియర్ డైరెక్టర్ ఇంద్రజిత్ బెల్గుండి తెలిపారు.

అక్జోనోబెల్‌లో 9% వాటా సేల్

విలువ రూ. 1,296 కోట్లు

న్యూఢిల్లీ: పెయింట్ల రంగ గ్లోబల్ దిగ్గజం ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ దేశీ కంపెనీ అక్జోనోబెల్ ఇండియాలో 9 శాతం వాటా విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 3,163.5 సగటు ధరలో 40.97 లక్షల షేర్లు విక్రయించింది. ఎన్‌ఎస్‌ఈ బల్క్ డీల్ వివరాల ప్రకారం వీటి విలువ రూ. 1,296 కోట్లుకాగా.. వివిధ ఫండ్స్ ద్వారా గోల్డ్‌మన్ శాక్స్ ఏఎంసీ 0.74 శాతం వాటాకు సమానమైన 3.35 లక్షల అక్జోనోబెల్ షేర్లు కొనుగోలు చేసింది. ఇందుకు దాదాపు రూ. 106 కోట్లు వెచ్చించింది. దీంతో పెయింట్ల కంపెనీలో గోల్డ్‌మన్ శాక్స్ ఏఎంసీ వాటా 1.05 శాతం నుంచి 1.79 శాతానికి పెరిగింది. అయితే అక్జోనోబెల్ వాటాలను సొంతం చేసుకున్న ఇతర కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. కాగా.. ఇంపీరియల్ కెమికల్స్ నుంచి అక్జోనోబెల్ ఇండియాను గత వారమే జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ పూర్తిగా సొంతం చేసుకుంది. అక్జోనోబెల్ ఇండియాలో 60.7 శాతం వాటాను జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. వెరసి అక్జోనోబెల్ ఇండియాకు మాతృ సంస్థగా జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ ఆవిర్భవించింది.

బల్క్ డీల్ నేపథ్యంలో అక్జోనోబెల్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 14% పతనమై రూ. 3,130 వద్ద ముగిసింది.

ఎన్‌పీఎస్ నుంచి 80 శాతం ఉపసంహరణ

- 85 ఏళ్ల వరకూ ఫండ్ కొనసాగింపు
- కీలక మార్పులు తెచ్చిన పీఎఫ్‌ఆర్‌డీఏ

న్యూఢిల్లీ: జాతీయ పింఛను వ్యవస్థ (ఎన్‌పీఎస్) సభ్యులకు హర్షానిచ్చే మార్పులకు పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి మండలి (పీఎఫ్‌ఆర్‌డీఏ) శ్రీకారం చుట్టింది. పదవీ విరమణ నాటికి సమకూరిన మొత్తం నిధిలో 60 శాతం ఉపసంహరణకు ప్రస్తుతం అనుమతి ఉండగా, ఇకపై 80 శాతం వెనక్కి తీసుకోవచ్చు. మిగిలిన 20 శాతంతో యాన్యూటీ ప్లాన్ (క్రమానుగతంగా పింఛను చెల్లించే) కొనుగోలు చేస్తే సరిపోతుంది. ప్రస్తుతం గరిష్ఠంగా 70 ఏళ్ల వయసు వరకే ఎన్‌పీఎస్‌లో కొనసాగేందుకు అనుమతి ఉంది. దీన్ని ఇప్పుడు 85 ఏళ్లకు పెంచారు. ఇందుకు సంబంధించి కొత్త నిబంధనలను పీఎఫ్‌ఆర్‌డీఏ ప్రకటించింది. గెజిట్ ప్రకటించిన తేదీ నుంచి ఇవి అమల్లోకి వస్తాయని తెలిపింది.

- పథకం నుంచి వైదొలిగే నాటికి పింఛను నిధి రూ.8లక్షల్లోపు ఉంటే ఆ మొత్తాన్ని సభ్యులు ఒకే విడత, లేక సిస్టమ్యాటిక్ యూనిట్ రిడెంప్షన్ రూపంలో (క్రమానుగతంగా/ఫండ్స్‌లో ఎస్‌డబ్ల్యూపీ మాదిరి) వెనక్కి తీసుకోవచ్చు.
- నాలుగేళ్ల విరామంతో సభ్యులు ఇకపై నాలుగు పర్యాయాలు పాక్షిక ఉపసంహరణ చేసుకోవచ్చు. ప్రస్తుతం 3 సార్లకు అనుమతి ఉంది.
- 60 ఏళ్ల రిటైర్మెంట్ వయసు తర్వాత కొనసాగే వారు మూడేళ్ల విరామంతో మూడు పాక్షిక ఉపసంహరణలే చేసుకోగలరు.
- ఎన్‌పీఎస్‌లో ప్రభుత్వ చందాదారులు సైతం 85 ఏళ్ల వరకు కొనసాగొచ్చు. అంటే 85 ఏళ్లు వచ్చే వరకు పెట్టుబడులను సైతం కొనసాగించుకోవచ్చు. వీరు పథకం నుంచి వైదొలిగే సమయంలో కనీసం 40 శాతంతో యాన్యూటీ ప్లాన్ తీసుకోవాల్సి ఉంటుంది. మిగిలిన 60 శాతాన్ని ఒకే విడత లేదా క్రమానుగతంగా వెనక్కి తీసుకోవచ్చు.
- రాజీనామా లేక తొలగింపు కారణంగా పథకం నుంచి ముందుగా వైదొలిగే ప్రభుత్వ చందాదారులు.. పింఛను నిధి నుంచి 20 శాతాన్నే వెనక్కి తీసుకోగలరు. మిగిలిన 80 శాతంతో యాన్యూటీ ప్లాన్ తీసుకోవడం తప్పనిసరి.
- పింఛను నిధి రూ.5 లక్షల్లోపే ఉంటే.. సాధారణ వైదొలగడం, ముందస్తుగా వైదొలగడం లేదా సభ్యుడు మరణించిన సందర్భాల్లో పూర్తి మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు.

శ్రీలంక ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీధర్

కొలంబో: భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్‌ను శ్రీలంక జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా నియమించుకుంది. వచ్చే ఏడాది ఆరంభంలో జరగనున్న ఐసీసీ టి20 ప్రపంచకప్ వరకు అతడి సేవలు వినియోగించుకోనున్నట్లు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2014 నుంచి 2021 వరకు టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించిన శ్రీధర్... ఈ ఏడాది ఆరంభంలో లంకలో 10 రోజుల ప్రత్యేక ఫీల్డింగ్ క్యాంప్ నిర్వహించాడు.

'శ్రీధర్‌ను ఫీల్డింగ్ కోచ్‌గా నియమించాం. టి20 వరల్డ్‌కప్ వరకు అతడు ఈ బాధ్యతలు నిర్వర్తిస్తాడు. 300కు పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లకు శ్రీధర్ ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. బీసీసీఐ లెవల్–3 అర్హత ఉన్న శ్రీధర్ అనుభవం మా జట్టుకు ఎంతో ఉపయోగపడుతుంది. మా ఆటగాళ్ల ఫీల్డింగ్ ప్రమాణాలు పెంచేందుకు అతడు సహకరిస్తాడు. పాకిస్తాన్, ఇంగ్లండ్ పర్యటనల్లోనూ అతడి సేవలు వినియోగించుకుంటాం' అని ఎస్ఎల్‌సీ తెలిపింది. దీనిపై శ్రీధర్ స్పందిస్తూ లంక జట్టుతో కలిసి పనిచేయనున్నట్లు వెల్లడించాడు. 'ఆటగాళ్ల తీరుకు తగ్గట్లు కోచింగ్ ఉంటుంది. సహజంగా లంకేయులు క్యాచ్‌లు పట్టడంలో చురుకుగా వ్యవహరిస్తారు. ఇక ఫీల్డింగ్ నైపుణ్యాలను మెరుగు పరచడం అనేది ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటుంది. ఎవరి శరీర తీరును బట్టి వాళ్ల ప్రయత్నం ఉంటుంది. దానికి అవసరమైన తోడ్పాటు అందించేందుకు ప్రయత్నిస్తా' అని శ్రీధర్ అన్నాడు.

అజేయంగా కెరీర్‌కు వీడ్కోలు

- రిటైర్మెంట్ ప్రకటించిన అమెరికా బాక్సర్ టెరెన్స్ క్రాఫోర్డ్
- కెరీర్‌లో పోటీపడ్డ 42 బౌట్‌లలోనూ విజయం

న్యూయార్క్: అమెరికా ప్రొఫెషనల్ బాక్సర్ టెరెన్స్ క్రాఫోర్డ్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ప్రొఫెషనల్ కెరీర్‌లో పోటీపడిన 42 బౌట్‌లలోనూ విజయాలు సాధించిన 38 ఏళ్ల క్రాఫోర్డ్... ఈ ఏడాది సెప్టెంబర్‌లో చివరిసారి బరిలోకి దిగాడు. నాలుగు వేర్వేరు విభాగాల్లో టైటిల్స్ నెగ్గిన ఈ అమెరికా బాక్సర్... అపజయమన్నదే లేకుండా బుధవారం కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 'ప్రతి బాక్సర్‌కు ఇలాంటి ఒక సమయం వస్తుంది. కెరీర్‌లో ఎన్నో సాధించా. ఏమీ లేకుండా రింగ్‌లో అడుగుపెట్టా. ఒక దశలో కేవలం గ్లౌవ్స్ ఉంటే చాలు అనే దగ్గరి నుంచి అన్నీ సమకూరే స్థాయికి చేరుకున్నా. మొదట్లో కుటుంబం కోసం బాక్సింగ్‌ను ఎంచుకున్నా... ఆ తర్వాత అంచెలంచెలుగా ఈ స్థాయికి చేరుకున్నా. బాక్సింగ్ నాకు అన్నీ ఇచ్చింది. ఇప్పుడు వీడ్కోలు పలకాల్సిన సమయం వచ్చింది' అని క్రాఫోర్డ్ వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు. 2008లో ప్రొఫెషనల్‌గా మారిన క్రాఫోర్డ్... కెరీర్‌లో 31 నాకౌట్ విజయాలు సాధించడం విశేషం. చివరగా కానెలో అల్వారెజ్‌పై విజయం సాధించిన క్రాఫోర్డ్ కెరీర్‌లో లైట్ వెయిట్, సూపర్ లైట్ వెయిట్, వెల్టర్ వెయిట్, సూపర్ వెల్టర్ వెయిట్ విభాగాల్లో పోటీ పడి విజయాలు సాధించాడు.

కేరీ సూపర్ సెంచరీ

ఆస్ట్రేలియా 326/8 ● రాణించిన ఉస్మాన్ ఖ్వాజా
కామెరాన్ గ్రీన్ 'డకౌట్' ● ఇంగ్లండ్‌తో 'యాషెస్' మూడో టెస్టు

కేరీ

ఖ్వాజా

అడిలైడ్: వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (143 బంతుల్లో 106; 8 ఫోర్లు, 1 సిక్స్) చక్కటి సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా ఇంగ్లండ్‌తో ప్రతిష్టాత్మక 'యాషెస్ సిరీస్' మూడో టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే తొలి రెండు టెస్టులు గెలిచి 2–0తో ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా... సిరీస్ చేజిక్కించుకునే దిశగా కీలక పోరులోనూ మంచి ప్రదర్శన చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా... బుధవారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. అలెక్స్ కేరీ 'శత'క్కొట్టగా... ఉస్మాన్ ఖ్వాజా (126 బంతుల్లో 82; 10 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. గాయం కారణంగా గత రెండు టెస్టులకు దూరమైన ఆస్ట్రేలియా రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఈ మ్యాచ్ బరిలోకి దిగగా... టాస్ వేయడానికి 45 నిమిషాల ముందు స్టీవ్ స్మిత్ అనూహ్యంగా జట్టు నుంచి తప్పుకున్నాడు. అనారోగ్యం కారణంగా అతడు ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) వెల్లడించింది. ఐపీఎల్–2026 మినీ వేలంలో రికార్డు ధర దక్కించుకున్న పేస్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లు పడగొట్టగా... కార్స్, జాక్స్ చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు.

కేరీ కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్

బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై భారీ జన సందోహం మధ్య తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో జేక్ వెదరాల్డ్ (18)ను ఆర్చర్ అవుట్ చేయగా... మరుసటి ఓవర్‌లో ట్రావిస్ హెడ్ (10) కూడా వెనుదిరిగాడు. తన శైలికి భిన్నంగా నెమ్మదిగా ఆడిన హెడ్‌ను కార్స్ బుట్టలో వేసుకున్నాడు. ఈ దశలో లబుషేన్ (19)తో కలిసి ఉస్మాన్ ఖ్వాజా కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. స్మిత్ గైర్హాజరీతో చివరి నిమిషంలో జట్టులో చోటు దక్కించుకున్న ఖ్వాజా చక్కటి షాట్‌లతో ఆకట్టుకున్నాడు. అయితే లంచ్ అనంతరం ఆర్చర్ మూడు బంతుల వ్యవధిలో రెండు వికెట్లు పడగొట్టి మరోసారి ఆసీస్‌ను కష్టాల్లోకి నెట్టాడు. అతడి ధాటికి లబుషేన్, హెడ్ పెవిలియన్ బాటపట్టారు. దీంతో ఆసీస్ 94/4తో నిలిచింది. ఈ దశలో అడిలైడ్ 'లోకల్ బాయ్' కేరీ గొప్ప సంయమనం కనబర్చాడు. మరో ఎండ్‌లో ఖ్వాజా కూడా పట్టువదలకుండా ప్రయత్నించాడు. ఈ జంట ఐదో వికెట్‌కు 91 పరుగులు జత చేసింది. తొలి రోజు ఆటకు రికార్డు స్థాయిలో 56,298 మంది అభిమానులు హాజరయ్యారు. అడిలైడ్ మైదానంలో ఇదే అత్యధికం. 'ఈ రోజుల్లో ఇంత పెద్ద సంఖ్యలో అభిమానులు టెస్టు మ్యాచ్ చూసేందుకు తరలి రావడం అద్భుతంగా ఉంది. సొంత మైదానంలో 56 వేల పైచిలుకు జనం ముందు సెంచరీ చేయడం ఎంతో ప్రత్యేకం' అని కేరీ అన్నాడు. జోష్ ఇన్‌గ్లిస్‌తో ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించిన కేరీ... ఎనిమిదో వికెట్‌కు మిచెల్ స్టార్క్ (63 బంతుల్లో 33 బ్యాటింగ్; 4 ఫోర్లు)తో కలిసి 50 పరుగులు జోడించాడు. 135 బంతుల్లో 'యాషెస్ సిరీస్'ల్లో తొలి సెంచరీ పూర్తి చేసుకున్న కేరీ... కాసేపటికే పెవిలియన్ చేరాడు. స్టార్క్‌తో పాటు లయన్ (18 బంతుల్లో 0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. తొలి రోజు అడిలైడ్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా... నేడు మరింత ఎండ తీవ్రత ఉండనుంది. **సిడ్నీ బాండీ బీచ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపంగా ఇరు జట్ల ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో చేతికి నల్ల రిబ్బన్‌లతో బరిలోకి దిగారు.**

బొన్మాటి

'ఉత్తమ ఫుట్‌బాలర్లు'గా బొన్మాటి, డెంబెలె

దోహా: అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణించిన ఫ్రాన్స్ స్టార్ ఉస్మాన్ డెంబెలె... స్పెయిన్ క్రీడాకారిణి ఐతానా బొన్మాటి 2025 సంవత్సరానికిగాను ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ అసోసియేషన్స్ (ఫిఫా) ఉత్తమ ఫుట్‌బాలర్లుగా ఎంపికయ్యారు. బుధవారం జరిగిన 'ఫిఫా' వార్షిక అవార్డుల్లో పురుషుల విభాగంలో డెంబెలె.. మహిళల విభాగంలో బొన్మాటి ఈ పురస్కారాలు అందుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జాతీయ జట్ల కెప్టెన్‌లు, కోచ్‌లు, మీడియా ప్రతినిధులు, అభిమానులు ఓటింగ్ ద్వారా విజేతలను నిర్ణయించారు. పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ) జట్టుకు తొలిసారి చాంపియన్స్ లీగ్ టైటిల్ దక్కడంతోపాటు మరో మూడు టైటిల్స్ సాధించడంలో డెంబెలె కీలక పాత్ర పోషించాడు. ఈ సీజన్‌లో డెంబెలె మొత్తం 51 గోల్స్ సాధించాడు. మరోవైపు బొన్మాటి వరుసగా మూడో ఏడాది ఈ అవార్డును కైవసం చేసుకుంది. ఈ ఏడాది స్పెయిన్ జట్టు 'యూరో' టోర్నీలో రన్నరప్‌గా నిలవడంలో... తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బార్సిలోనా జట్టు మహిళల చాంపియన్స్ లీగ్‌లో రెండో స్థానంలో నిలవడంలో బొన్మాటి ముఖ్యపాత్ర పోషించింది.

డెంబెలె

ఢిల్లీలోని హుమాయూన్ దర్వాజా వద్ద అడిడాస్ ఫొటో షూట్‌లో నిఖత్ జరీన్, నిశాద్ కుమార్, రోడ్రిగో పాల్, మెస్సీ, కుల్దీప్ యాదవ్, సుమిత్ అంటిల్, రేణుక సింగ్

భారత ఫుట్‌బాల్‌కు ఉజ్వల భవిత: మెస్సీ

ఈ పర్యటన, మీ ఆదరణ అద్భుతం ● ఏదో రకంగా భారత్‌కు మళ్లీ వస్తానన్న అర్జెంటీనా దిగ్గజం

న్యూఢిల్లీ: భారత్‌లో ఫుట్‌బాల్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లయోనల్ మెస్సీ అన్నాడు. 'మీ ఆదరణ, మీరు పంచిన ప్రేమాభిమానాలను నాతోపాటు తీసుకెళ్తున్నా. మ్యాచ్ ఆడేందుకైనా... మరో కార్యక్రమానికైనా ఇంకోసారి భారత్‌కు రావాలని గట్టిగా కోరుకుంటున్నాను. కచ్చితంగా తిరిగి వచ్చే ఆలోచనైతే నాకుంది' అని మెస్సీ అన్నాడు. తను సందర్శించిన ప్రాంతాల్ని, కలుసుకున్న భారత దిగ్గజాలతో ఉన్న ఒక నిమిషం నిడివిగల వీడియోను మెస్సీ తన సోషల్ మీడియా అకౌంట్‌లో పంచుకున్నాడు. ఈ వీడియోలో భారత ప్రముఖ క్రీడాకారులు, సినీ స్టార్లు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తదితరులెందరో ఉన్నారు. కానీ... హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలతో ఉన్న ఫుటేజీ మాత్రం క్షణమైనా కనిపించలేదు. భారత్‌లో తన ఐదు రోజుల పర్యటన అద్భుతంగా సాగిందన్నాడు. బుధవారం ముంబై నుంచే మయామికి బయలుదేరాడు. 38 ఏళ్ల అర్జెంటీనా స్ట్రయికర్ తన మయామి క్లబ్ జట్టు సహచరులు స్వారెజ్, రోడ్రిగో డి పాల్‌లతో కలిసి 13, 14, 15 తేదీల్లో మూడు రోజుల పర్యటన నిమిత్తం వచ్చాడు. అయితే మరో రెండు రోజులు పొడిగించాడు. భారత్‌లోని వివిధ రంగాల ప్రముఖులను, క్రికెట్, ఫుట్‌బాల్, సినీ స్టార్లను కలుసుకున్నాడు. ముంబైలో సచిన్, మెస్సీల భేటీ వాంఖెడే మైదానానికే వన్నె తెచ్చింది. బాలీవుడ్ స్టార్లు షారుక్ ఖాన్, కరీనా కపూర్, భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రి తదితరులు మెస్సీని కలిసిన వారిలో ఉన్నారు. మంగళవారం దేశీ కార్పొరేట్ సంస్థ రిలయన్స్ యాజమాన్యం వంతారాలో అచ్చెరువొందే సదుపాయాలతో ఏర్పాటు చేసిన వన్యప్రాణుల సంరక్షిత ప్రాంతాన్ని సందర్శించాడు. ఈ సందర్భంగా పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ... మెస్సీకి ఆత్మీయ స్వాగతం పలికి ఆతిథ్యమిచ్చాడు. ప్రముఖ క్రీడా ఉపకరణాల సంస్థ అడిడాస్ నిర్వహించిన ఫొటో షూట్‌లోనూ పాల్గొన్నాడు. ఈ ఫొటో షూట్‌లో మెస్సీతోపాటు తెలంగాణ స్టార్ బాక్సర్, ప్రపంచ మాజీ చాంపియన్ నిఖత్ జరీన్, క్రికెటర్లు కుల్దీప్ యాదవ్, రేణుక సింగ్, పారాథ్లెట్స్ నిశాద్ కుమార్, సుమింత్ అంటిల్ పాల్గొన్నారు.

కొత్త అధ్యాయానికి నాంది: సర్ఫరాజ్

న్యూఢిల్లీ: తన కెరీర్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైందని టీమిండియా క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ అన్నాడు. తాజా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలంలో సర్ఫరాజ్ ఖాన్‌ను ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు కొనుగోలు చేసుకుంది. వేలం ఆరంభంలో సర్ఫరాజ్‌ను తీసుకునేందుకు ఏ జట్టూ ఆసక్తి చూపకపోగా... ఆఖర్లో చెన్నై రూ. 75 లక్షల కనీస ధరకు అతడిని దక్కించుకుంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో దంచికొట్టిన సర్ఫరాజ్... చెన్నై జట్టుకు కృతజ్ఞతలు తెలిపాడు. 'నా కెరీర్‌కు కొత్త జీవితాన్నిచ్చిన సీఎస్‌కే యాజమాన్యానికి ధన్యవాదాలు. వచ్చే ఏడాది చెన్నై జట్టు టైటిల్ గెలిచేందుకు నా శాయశక్తులా కృషి చేస్తా' అని సర్ఫరాజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు. సర్ఫరాజ్ చివరిసారిగా 2023లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఐపీఎల్ ఆడాడు. ఆ తర్వాత గత రెండేళ్లుగా అతడిని ఏ జట్టూ కొనుగోలు చేసుకోలేదు. దేశవాళీల్లో భారీగా పరుగులు చేసిన సర్ఫరాజ్... ఐపీఎల్‌ల్లో ఇప్పటి వరకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, ఢిల్లీ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. టీమిండియా తరపున 6 టెస్టు మ్యాచ్‌లాడిన సర్ఫరాజ్ 37.10 సగటుతో 371 పరుగులు చేశాడు. తాజా ముస్తాక్ అలీ ట్రోఫీలో అతడు 204.34 స్ట్రయిక్ రేట్‌తో 329 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు.

అంధుల మహిళల క్రికెట్ జట్టుకు సచిన్ అభినందన

ముంబై: అంధుల మహిళల టి20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టును క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అభినందించాడు. తొలిసారి నిర్వహించిన ఈ మెగాటోర్నీలో భారత జట్టు అజేయంగా ట్రోఫీ చేజిక్కించుకుంది. తాజాగా వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టు... మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సచిన్‌ను కలిసింది. ఈ సందర్భంగా ప్రపంచకప్‌లో మన అమ్మాయిలు చూపిన ప్రతిభాపాటవాలను మాస్టర్ బ్లాస్టర్ కొనియాడాడని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. 'కఠోర శ్రమ, అకుంఠిత దీక్షతోనే మన జట్టు ప్రపంచకప్ గెలిచింది. ఇది ఆరంభం మాత్రమే. ముందు కూడా ఇదే నిలకడ కొనసాగిస్తూ... మరిన్ని విజయాలు సాధించాలి. ఈ విజయం అందరి బాధ్యతను మరింత పెంచింది. ప్రపంచ కప్ ట్రోఫీ ఎంతో మందిలో స్ఫూర్తి నింపింది' అని సచిన్ పేర్కొన్నాడని నిర్వాహకులు తెలిపారు. వరల్డ్‌కప్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ దీపిక మాట్లాడుతూ... 'సచిన్ మాటలు మాకు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. మేము మైదానంలోకి దిగిన ప్రతిసారీ ఎంతో అంకితభావం, ఆత్మవిశ్వాసంతో ఆడాం. దానికి తగ్గ ప్రతిఫలం వరల్డ్‌కప్ రూపంలో దక్కింది. సచిన్ నుంచి ఇలాంటి వ్యాఖ్యలు వినడంతో మా మనసు ఉప్పొంగుతోంది' అని దీపిక పేర్కొంది.

మధ్యప్రదేశ్‌లోని చందుఖేడీలో పాసింగ్‌ఔట్ పరేడ్ సందర్భంగా బుధవారం విన్యాసాలు చేస్తున్న సశస్త్ర సీమా బల్ జవాన్లు

విపరీతమైన కాలుష్యం కారణంగా ఢిల్లీలోని పార్లమెంట్‌కు బుధవారం అధునాతన మాస్క్‌తో వచ్చిన కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హూడా

భద్రమైన పని వాతావరణం, మెరుగైన జీతభత్యాలను డిమాండ్‌చేస్తూ లండన్‌లోని సెయింట్ థామస్ ఆస్పత్రి పికెట్ లైన్ వద్ద ఆందోళనకు దిగిన జూనియన్ డాక్టర్లు

నోట మాట రాలేదు..!

విమాన ప్రయాణంలో కిటికీ పక్కన కూర్చుని అద్భుతమైన ఫొటో తీసి, దాన్ని చూపించి 'ఒక ఫ్రీ టికెట్ ఇస్తారా?' అని మీరెప్పుడైనా అడిగారా? అడిగి ఉండరు కదా.. 'రైనైర్'.. అంటేనే, టికెట్ ధర కంటే లగేజ్ రుసుము ఎక్కువ ఉండే బడ్జెట్ ఎయిర్‌లైన్ అని ప్రపంచం మొత్తం తెలుసు. అలాంటిది.. ఐర్లాండ్ దేశానికి చెందిన ఈ ఎయిర్‌లైన్‌ని ఫ్రీ టికెట్ అడగడం అంటే.. గోతికాడ నక్కని బిర్యానీ అడిగినట్లే.. ఓకే, కథలోకి వెళ్దాం. అనగనగా ఒక తింగరోడు విమానంలో రోమ్ నగరం మీదుగా వెళ్తున్నాడు. ఆకాశం నీలం, కింద ఇటలీ రాజధాని నగరం అద్భుతంగా కనిపిస్తున్నాయి. వెంటనే తన మొబైల్‌లో ఓ అద్భుతమైన ఏరియల్ షాట్ తీశాడు. అందులో విమానం రెక్క, కింద పట్నం కళ్లకు విందు చేసేలా ఉన్నాయి.

ఫొటో తీశా చూడండి..

ఆ ఫొటో చూశాక మనోడిలో ఆశ చిగురించింది. 'ఆహా! ఈ ఫొటోకి కనీసం ఒక ఫ్రీ టికెట్ అడగాల్సిందే!' అనుకున్నాడు. ఇంకేముంది, ఆలస్యం చేయకుండా, ఆ గొప్ప ఫొటోను 'ఎక్స్' (గతంలో ట్విట్టర్)లో పోస్ట్ చేశాడు. దానిని రైనైర్ ఎయిర్‌లైన్‌కి ట్యాగ్ చేశాడు. 'ఈ అద్భుతమైన ఫొటోకి బదులుగా నాకు ఒక ఉచిత విమాన టికెట్ ఇవ్వగలరా?'.. అని మరీ అమాయకంగా అడిగాడు. దానికి ఏదో నవ్వుతూ, నాలుగు మంచి మాటలు చెబుతారని, లేదా ఓ నవ్వుతున్న ఎమోజీ పంపిస్తారని ఆశించినట్లున్నాడు పాపం.

ఫ్రీ విమాన టికెట్ అడిగిన ప్యాసింజర్

- 'నో'అని రైనైర్ సెటైర్ జవాబు

ఒక్క మాటతో కథ క్లోజ్!

రైనైర్ సోషల్ మీడియా టీమ్ ఉంది చూశారూ.. వాళ్లు సామాన్యులు కారు. వీళ్లు వెటకారానికి బ్రాండ్ అంబాసిడర్లు. విషయం ఏంటంటే, వారు నిమిషం కూడా ఆలోచించకుండా, మర్యాదలన్నీ తుంగలో తొక్కి.. కేవలం ఒక్కే ఒక్క మాట.. నో.. (లేదు) అని జవాబిచ్చారు. అతన్ని ఏ మాత్రం నొప్పించకుండా, నెప్పి తెలియకుండా.. ఒక్కే ఒక్క పదంతో 'గేట్' మూసేశారు. అడగ్గానే 'ఫ్రీ టికెట్' దొరుకుతుందనుకున్న ఆ ప్రయాణికుడికి.. ఎయిర్‌లైన్ స్టైల్‌లో ముఖం మీదే 'ఇక్కడ చపాతీ కూడా ఉచితంగా దొరకదు, నువ్వా ఫ్రీ టికెట్ అడుగుతున్నావ్?' అని సూటిగా చెప్పినట్లయింది.

నెట్టింట నవ్వుల సునామీ!

ఈ 'నో' ఆన్సర్ చూసి నెటిజన్లు పడిపడి నవ్వారు. రైనైర్ నిజాయితీకి, దమ్ముకి సెల్యూట్ కొట్టారు! 'దీన్ని' బ్రాండ్ రిప్లై ఆఫ్ ది ఇయర్' అనాల్సిందే!' అని కొందరు కితాబిచ్చారు. 'ఉచిత టికెట్ అడిగాడు కాబట్టి, అసలు శిక్షగా.. అతని నుంచి తర్వాతి ఫ్లైట్‌లో రెండింతలు ఎక్కువగా వసూలు చేయండి!'.. అని ఒక నెటిజన్ సలహా ఇచ్చాడు. నిజమే, రైనైర్ అంటే అంతే! చవకైన టికెట్లు, కఠినమైన లగేజ్ నిబంధనలు.. ఇదే రైనైర్ బ్రాండింగ్‌లో అతి ముఖ్యమైన భాగం. తమను ఎవరైనా విమర్శించినా, లేదా ఏదైనా అడిగినా.. రైనైర్ సోషల్ మీడియా టీమ్ చాలా సూటిగా, వెటకారంగా, ధైర్యంగా జవాబులిస్తుంది. తమ హాస్యంతో ఎప్పుడూ ఇలాగే హెడ్‌లైన్స్‌లో ఉంటుంది. కానీ ఉచితంగా టికెట్లు మాత్రం ఇవ్వరు! జాగ్రత్త!

\- సాక్షి, నేషనల్ డెస్క్

లేడీ గబ్బర్ సింగ్ లవ్ టార్చర్

పోలీసు ఇన్‌స్పెక్టర్‌ను వేధించిన మహిళ

ఇదోరకం ప్రేమ!

అది అక్టోబర్ 30, 2024. బెంగళూరులోని రామమూర్తి నగర్ పోలీస్ స్టేషన్‌లో 45 ఏళ్ల ఇన్‌స్పెక్టర్, తన దైనందిన పనుల్లో నిమగ్నమై ఉన్నారు. హఠాత్తుగా.. ఆయన అధికారిక ఫోన్‌కి ఒక అపరిచిత నంబర్ నుంచి కాల్ వచ్చింది. ఆ తర్వాత.. వేర్వేరు నంబర్ల నుంచి కాల్స్, మెసేజ్‌లు వెల్లువెత్తాయి. అవతలి నుంచి మాట్లాడుతున్న మహిళ మాటలు అస్పష్టంగా, గందరగోళంగా ఉన్నాయి. మొదట్లో ఇన్‌స్పెక్టర్ దాన్ని ఏదో సాధారణ ఫిర్యాదు అనుకున్నారు. కానీ, అసలు ట్విస్ట్ అప్పుడే మొదలైంది!

ప్రేమించకపోతే ఉద్యోగం తీయిస్తా..

ఆ మహిళ పదేపదే ఫోన్ చేసింది. తనకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి వంటి అత్యున్నత రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పడం మొదలుపెట్టింది. వాట్సాప్‌లో ఆ ప్రముఖులతో తాను ఉన్న ఫొటోలను పంపింది. ఆమెది ఫిర్యాదు కాదని, ప్రేమ ప్రతిపాదన అని ఇన్‌స్పెక్టర్‌కు అర్థమైంది. 'నా ప్రేమను అంగీకరించండి. లేదంటే, నా పలుకుబడిని ఉపయోగించి మీ ఉద్యోగాన్ని, కెరీర్‌ను నాశనం చేస్తాను'.. అంటూ బెదిరింపులకు దిగింది. నిందితురాలి అధికారం, పలుకుబడి ఇన్‌స్పెక్టర్‌ను మానసిక ఆందోళనకు గురిచేసింది.

రక్తంతో లేఖ

అధికారిక విధులకు ఆటంకం కలుగుతుండడంతో, ఇన్‌స్పెక్టర్ ఆమెను పోలీస్ స్టేషన్‌కు వచ్చి రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వమని పదేపదే సూచించారు. కానీ, ఆమె స్టేషన్‌కు రాలేదు.. వేధింపులు కూడా ఆపలేదు. నవంబర్ 7వ తేదీన ఆమె వేధింపులు పతాక స్థాయికి చేరాయి. ఆ మహిళ ఏకంగా ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి వచ్చింది. అతనికి ఒక కవరును అందజేసింది. ఆ కవరులో కొన్ని మాత్రలు, చేతితో రాసిన లేఖలు ఉన్నాయి. అత్యంత భావోద్వేగపూరితంగా ఉన్న ఆ లేఖలు తన రక్తంతో రాసినవని ఆమె స్పష్టం చేసింది. ఇది ఆమె తీవ్రమైన మానసిక సమస్యకు నిదర్శనం. ఇన్‌స్పెక్టర్ అధికారిక డ్యూటీ నంబర్‌కు అనవసర కాల్స్, మెసేజ్‌లు పంపిస్తూ.. ఆయన రోజువారీ పనులకు తీవ్ర ఆటంకం కలిగిస్తూనే ఉంది. పోలీసుల విచారణలో, ఈ మహిళ గతంలో కూడా ఇతర పోలీసులు, ప్రభుత్వ అధికారుల్ని ఇలాగే వేధించినట్లు వెల్లడైంది.

ఆత్మహత్య చేసుకుంటా..

డిసెంబర్ 12న, ఇన్‌స్పెక్టర్‌పై వేధింపుల పర్వం తారస్థాయికి చేరింది. ఆ మహిళ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి, అందరూ చూస్తుండగానే అరిచింది. 'నా ప్రేమ ప్రతిపాదనను అంగీకరించకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటాను. నీ ఉద్యోగాన్ని, కెరీర్‌ను నాశనం చేస్తాను'.. అని బెదిరించింది. ఈ తీవ్ర పరిణామాల నేపథ్యంలో, రామమూర్తి నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు దాఖలు చేశారు. ఫిర్యాదు ఆధారంగా, ఆ మహిళపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 132 (ప్రభుత్వ ఉద్యోగిని విధులకు ఆటంకం కలిగించడం), 351(2) (క్రిమినల్ బెదిరింపు), 221 (ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడం) కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ విచిత్ర కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. ఒక పోలీసు అధికారికి తన విధి నిర్వహణలో ఎదురైన ఈ 'ప్రేమ ఉచ్చు'రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

5 రోజుల కస్టడీకి లూథ్రా సోదరులు

పణజి: గోవాలో పాతికమంది ప్రాణాలను బలిగొన్న 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్ అగ్నిప్రమాదం ఉదంతంలో ఆ క్లబ్ యజమానులు గౌరవ్ లూథ్రా, సౌరభ్ లూథ్రాలను ఐదు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ నార్త్ గోవా కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. డిసెంబర్ ఆరోతేదీన అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఏడోతేదీ తెల్లవారుజామున థాయిలాండ్‌లోని పుకెట్ నగరానికి పారిపోయిన ఈ సోదరులను అక్కడి ప్రభుత్వాధికారులు డిసెంబర్ 11న అరెస్ట్‌చేశారు. మైత్రీ ఒప్పందం మేరకు భారత అభ్యర్థను గౌరవిస్తూ వీళ్లను థాయిలాండ్ వెంటనే బలవంతంగా వెనక్కి పంపేసింది. మంగళవారం థాయిలాండ్ నుంచి ఢిల్లీకి చేరుకున్న సోదరులను గోవా పోలీసులు వెంటనే అరెస్ట్‌చేసి బుధవారం గోవాకు తీసుకొచ్చి మపుసా పట్టణ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పూజా సర్దేశాయ్ ఎదుట హాజరుపరిచారు. దీంతో ఆమె వీళ్లను ఐదు రోజులపాటు పోలీస్‌కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఐఆర్‌సీటీసీ ఈ-వాలెట్ నుంచి విత్‌డ్రా చేయలేరు: రైల్వే మంత్రి

న్యూఢిల్లీ: ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఈ-వాలెట్ ఖాతాలోని డబ్బును టిక్కెట్ల కొనుగోలుకు మాత్రమే ఉపయోగించాలని, దానిని విత్‌డ్రా చేయడానికి అవకాశం లేదని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. ఈ-వాలెట్ క్లోజ్డ్ సిస్టమ్ ప్రీపేమెంట్ ఖాతా అని, ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం పీపీఐ ఖాతా నుంచి వస్తువులు, సేవల కొనుగోలుకు మాత్రమే అవకాశం ఉంటుందని, నగదు ఉపసంహరణకు అవకాశం లేదని తెలిపారు. వాలెట్‌ను పూర్తిగా క్లోజ్ చేసినప్పుడు అందులో ఉన్న మొత్తం నగదు వినియోగదారుల బ్యాంక్ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ అవుతుందన్నారు. బీజేపీ ఎంపీ జనార్దన్‌సింగ్ సిగ్రివాల్ అడిగిన ప్రశ్నకు మంత్రి బుధవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

గగనతల నిషేధాన్ని పొడిగించిన పాకిస్తాన్

లాహోర్: భారత విమానాలపై గగనతల నిషేధాన్ని పాకిస్తాన్ మరో నెల పొడిగించింది. పహల్గామ్ దాడి తర్వాత భారత విమానయాన సంస్థలకు పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసేసిన సంగతి తెలిసిందే. ఇటీవల ప్రకటించిన నిషేధం డిసెంబర్ 24తో ముగియనుంది. ఈ నేపథ్యంలో జనవరి 23 వరకు ఆంక్షలను పొడిగిస్తున్నట్లు పాకిస్తాన్ విమానాశ్రయాల అథారిటీ (పీఏఏ) బుధవారం తెలిపింది. బుధవారం జనవరి 23 వరకు ఆంక్షలను పొడిగించింది. 'భారతీయ విమానయాన సంస్థల యాజమాన్యంలోని, లీజుకు తీసుకున్న, భారత సైనిక విమానాలు సహా భారతదేశంలో రిజిస్టర్డ్ అయిన అన్ని విమానాలకు గగనతల మూసివేత వర్తిస్తుంది' అని పాకిస్తాన్ విమానాశ్రయాల అథారిటీ వెల్లడించింది.

ఆ టోల్‌ప్లాజాలను మూసేయండి

లేదంటే సుదూరానికి తరలించండి

- ట్రాఫిక్ స్తంభనలకు కేంద్రస్థానాలుగా మారిన 9 టోల్‌ప్లాజాలపై సుప్రీంకోర్టు అసహనం
- వారంలోపు నిర్ణయం తీసుకోవాలని ఎన్‌హెచ్‌ఏఐ, ఎంసీడీలకు సూచన

న్యూఢిల్లీ: టోల్‌ఫీజు కట్టేందుకు తరచూ కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిల్చిపోతుండటం, వందల వాహనాల నుంచి ఒకేచోట వెలువడుతున్న పొగ, కాలుష్యం కారణంగా ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్) పరిధిలో కాలుష్యాంబర్లుగా తయారైన 9 టోల్‌ప్లాజాలను తక్షణం తాత్కాలికంగానైనా మూసేయాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. లేదంటే కనీసం ఢిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి సుదూరాలకు తరలించాలని జాతీయరహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ)లకు సుప్రీంకోర్టు బుధవారం సూచించింది. వారంలోపు మీ నిర్ణయం తెలపాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పాంఛోలీల ధర్మాసనం ఆదేశించింది. టోల్‌ప్లాజాల తాత్కాలిక మూసివేత లేదా వేరే చోట ఏర్పాటు ద్వారా హస్తిన సరిహద్దుల్లో తీవ్ర వాయుకాలుష్యానికి కళ్లెం వేయొచ్చని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ''చలికాలంలో వాయు కాలుష్యం విపరీతంగా పెరగడం అనేది ఒక వార్షిక తంతుగా తయారైంది. వాయుకాలుష్యానికి ఇకనైనా చెక్‌పెట్టేలే చర్యలు తీసుకోండి. భారత్ స్టేజ్-4 స్థాయిలో తక్కువ ఉద్గారాలను వెదజల్లని వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవద్దంటూ ఆగస్ట్ 12న మేం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరిస్తాం. ఇక నర్సరీ నుంచి ఐదో తరగతి చిన్నారులు నేరుగా పాఠశాలకు రావొద్దంటూ ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలన్న అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోబోం. ఎందుకంటే త్వరలోనే చిన్నారులకు శీతాకాల సెలవు రాబోతున్నాయి. అప్పుడెలాగు పిల్లలు పాఠశాలకు రారు. ఆమాత్రందానికి మేం జోక్యం చేసుకోవడం అనవసరం''అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఎంసీడీకి పరిహారం ఇవ్వండి

''ఢిల్లీలోకి ఎంట్రీ పాయింట్లుగా మారిన ఈ 9 టోల్‌బూత్‌లు ప్రస్తుతం ఎంసీడీ నిర్వహిస్తోంది. వీటిని తాత్కాలికంగా మూసేయండి. మూసివేత కారణంగా ఎంసీడీ చవిచూసే నష్టాలను ఎన్‌హెచ్‌ఏఐ భర్తీచేయొచ్చేమో యోచించండి. తాత్కాలికంగా ఆదాయం కోల్పోయేందుకు ఎంసీడీ సిద్ధపడాలి. ఆ మేరకు తోడ్పాటునందించేలా ఎంసీడీ ముందుకు రావాలి. ఈ విషయంలో ఎంసీడీ తన నిర్ణయాన్ని వారంలోపు తెలుపుతూ నివేదికను మా ముందు ఉంచండి''అని ఎంసీడీని ధర్మాసనం ఆదేశించింది.

కన్నాట్ ప్లేస్‌లోనూ పెట్టేస్తారా?

కేసు విచారణ సందర్భంగా సీజేఐ ఒకింత అసహనంవ్యక్తం చేశారు. ''గురుగ్రామ్ సరిహద్దులోని ఒక టోల్‌ప్లాజా వద్ద గంటల తరబడివాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో వందల వాహనాల నుంచి దట్టమైన పొగ ఒకేచోట పరుచుకుంటోంది. జనవరిదాకా టోల్‌ప్లాజాను తీసేస్తామని అధికారులు ఎందుకు ధైర్యంగా చెప్పలేకపోతున్నారు?. మిమ్మల్ని ఇలాగే వదిలేస్తే ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ ప్రాంతంలోనూ టోల్‌ప్లాజా కట్టేస్తారు. ఎందుకంటే మీకు టోల్‌ప్లాజా నగదు వసూళ్లు మాత్రమే ముఖ్యంకదా? టోల్‌గేట్లు ఆదాయాన్ని కళ్లజూపిస్తాయేమో అంతకంటే ఎక్కువగా కాలుష్యాన్నీ తీసుకొస్తున్నాయి. ఈ విషయంలో మీరు నిర్మాణాత్మకమైన ప్రణాళికతో రండి. జనవరి 31వ తేదీదాకా టోల్‌ప్లాజా ఉండబోదని ధీమాగా చెప్పగలిగేలా ఒక ప్లాన్‌తో రండి''అని మున్సిపల్ కార్పొరేషన్‌కు సీజేఐ సూచించారు.

6,117 రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై

- యాక్సెస్ కోసం కేవలం మొబైల్ ఓటీపీ సేకరణ
- 11,953 బోగీల్లో సీసీటీవీల ఏర్పాటు
- రైల్వే శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 6,117 రైల్వే స్టేషన్‌లలో ఉచితంగా వైఫై సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు రైల్వే శాఖ బుధవారం వెల్లడించింది. వ్యక్తిగత గోప్యానికి ఏవిధమైన ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా ఆయన ఈ వివరాలు వెల్లడించారు. వైఫైను అందించేందుకు ఆయా ప్రయాణికుల మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని మాత్రమే యాక్సెస్ చేస్తున్నామని, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం 1,731 స్టేషన్లలో సీసీటీవీ నిఘా వ్యవస్థను ఏర్పాటుచేశామని తెలిపారు. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, పాదచారుల వంతెనలు, వేచి ఉండే హాళ్లు, టికెట్ కేంద్రాల వద్ద సీసీటీవీలను ఏర్పాటుచేశారు. రైళ్లలో దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు బోగీల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 11,953 బోగీల్లో సీసీటీవీ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు బోగీల్లో జరిగే కదలికలను తెలుసుకుని, ప్రయాణికుల భద్రతను కాపాడుతున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.

'ఇండిగో'పై పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ: ఇండిగో విమానాల రద్దు వల్ల నష్టపోయిన ప్రయాణిలకు పరిహారం చెల్లించేలా కేంద్ర ప్రభుత్వాన్ని, ఇండిగో సంస్థను ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు బుధవారం తిరస్కరించింది. సీఏఎస్సీ సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ విక్రమ్‌సింగ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. విమాన టిక్కెట్ ధరకు నాలుగు రెట్లు పరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. గత రెండు నెలల్లో ఇండిగో విమానాల రాకపోకలు రద్దు కావడం వల్ల ప్రయాణికులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. వారికి పరిహారం చెల్లించి, న్యాయం చేయాలని విన్నవించారు. ఈ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇదే అంశంపై ఇప్పటికే ఒక పిటిషన్ దాఖలైనట్లు గుర్తుచేసింది. పెండింగ్ పిటిషన్‌లో భాగస్వామ్య పక్షంగా చేరవచ్చని ప్రొఫెసర్ విక్రమ్‌సింగ్‌కు సూచించింది. అతడి పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు స్పష్టంచేసింది.

పిల్లాడిపై లైంగిక వేధింపుల కేసులో 41 ఏళ్ల జైలు

కోజికోడ్: పిల్లాడిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో కేరళలోని ఒక కోర్టు దోషిగా ఏకంగా 41 సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. 64 ఏళ్ల గణపతియత్ మూసా అలియాస్ పంచర మూసా 2021 ఆగస్టులో 14 ఏళ్ల పిల్లాడిని వలయాం పట్టణ బస్టాప్‌కు తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఎవరికీ ఈ విషయం చెప్పొద్దంటూ పిల్లాడికి రూ.50 ఇచ్చాడు. తీవ్ర శారీరక, మానసిక వేదనకు గురైన పిల్లాడు వెంటనే విషయాన్ని తన తండ్రికి చెప్పాడు. దీంతో తండ్రి ఫిర్యాదుతో వలయాం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో బుధవారం నాదపురం ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి కె.నౌషద్ అలీ తీర్పు చెప్పారు. చిన్నారులపై లైంగికవేధింపుల నిరోధక(పోక్సో) చట్టం ప్రకారం దోషిగా మూసాను తేల్చారు. ఈ కేసులో 16 మంది సాక్షులను విచారించి, 16 డాక్యుమెంట్లను పరిశీలించాక మూసాను దోషిగా నిర్ధారించారని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మనోజ్ అరూర్ వెల్లడించారు. భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్లను సైతం దోషిగా ఆపాదించారు.

దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై కాంగ్రెస్ నిరసన

సత్యమేవ జయతే బ్యానర్లతో పార్లమెంట్ ప్రాంగణంలో ప్రదర్శన

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వంటి జాతీయ దర్యాప్తు సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగం చేస్తోందంటూ కాంగ్రెస్ ఎంపీలు బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో నిరసనకు దిగారు. మకర ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు కోర్టులో ఉపశమనం లభించిన నేపథ్యంలో ఈడీని మోదీ సర్కార్ దుర్వినియోగం చేసినట్లు స్పష్టమైందని ఎంపీలు నినదించారు. ఈ కేసులో అగ్రనేతలపైదర్యాప్తు సంస్థ దాఖలు చేసిన మనీలాండరింగ్ అభియోగాన్ని ఢిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరించడంతో సత్యం జయించిందని ఎంపీలు వ్యాఖ్యానించారు. 'సత్యమేవ జయతే. సత్యం గెలుస్తుంది' అని రాసి ఉన్న బ్యానర్‌ను పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రాష్ట్రపతిగా వాజ్ పేయి!

అడ్వాణీకి ప్రధాని పీఠం

- 2002లో బీజేపీలో యోచన
- తిరస్కరించిన వాజ్‌పేయి
- దాంతో తెరపైకి కలాం పేరు
- టాండన్ పుస్తకంలో వెల్లడి

న్యూఢిల్లీ: అటల్ బిహారీ వాజ్ పేయి హయాంలో ఏపీజే అబ్దుల్ కలాం అనూహ్య రీతిలో రాష్ట్రపతిగా ఎన్నికవడం తెలిసిందే. కానీ అసలు వాజ్ పేయినే రాష్ట్రపతిగా చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన అప్పట్లో బీజేపీ నాయకత్వానికి వచ్చిందట! అంతేగాక వాజ్ పేయి స్థానంలో నాటి పార్టీ అగ్ర నేత ఎల్ కే అడ్వాణీని ప్రధానిగా చేయాలన్న ప్రతిపాదన కూడా జోరుగా సాగిందట. కానీ రాష్ట్రపతి అయ్యేందుకు స్వయానా వాజ్ పేయే తిరస్కరించడంతో ఆ ప్రయత్నాలకు అక్కడితోనే తెర పడిందట! నాడు ఆయన మీడియా సలహాదారుగా ఉన్న అశోక్ టాండన్ తన తాజా పుస్తకం 'అటల్ సంస్మరణ్' లో ఈ ఆసక్తికర అంశాన్ని పేర్కొన్నారు. పాలక ఎన్డీఏతో పాటు విపక్షాల మద్దతుతో కలాం 2022లో దేశ 11వ రాష్ట్రపతిగా ఎన్నికవడం తెలిసిందే.

కలాం ఎంపిక వెనక...

ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థిగా కలాం ఎంపిక వెనక ఏం జరిగిందీ, ఈ విషయంలో కలిసి వచ్చేలా కాంగ్రెస్ తో పాటు ఇతర విపక్షాలను వాజ్ పేయి ఎలా ఒప్పించిందీ పుస్తకంలో టాండన్ వివరించారు. 'తాను రాష్ట్రపతి కావాలన్న ప్రతిపాదనను వాజ్ పేయి తీవ్రంగా వ్యతిరేకించారు. జనాదరణ ఉన్న ఒక ప్రధాని ఇలా మెజారిటీ ఆధారంగా రాష్ట్రపతి కావడం భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన భావించారు. అదో తప్పుడు సంప్రదాయానికి నాంది పలుకుతుందన్నారు. అంతేగాక కలాం అభ్యర్థిత్వానికి అన్ని పార్టీ మద్దతు కూడగట్టేందుకు స్వయంగా రంగంలోకి దిగారు. ఈ విషయమై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నేతలను చర్చలకు ఆహ్వానించారు. సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీ, మన్మోహన్ సింగ్ వంటి అగ్ర నేతలు వచ్చి వాజ్ పేయితో చర్చించారు. రాష్ట్రపతిగా కలాంను నామినేట్ చేయాలని ఎన్డీఏ నిర్ణయించినట్టు వాజ్ పేయి తొలిసారిగా ఆ భేటీలోనే ప్రకటించారు. దాంతో కాసేపు అంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు. ముందుగా సోనియానే తేరుకున్నారు. ఈ ఎంపికతో ఆశ్చర్యపోయినట్టు చెప్పారు. అయితే కలాంకు మద్దతివ్వడం తప్ప తమకు మరో మార్గం కూడా లేదని ఆమె అన్నారు' అని ఆయన రాసుకొచ్చారు. 2001 డిసెంబర్ 13న పార్లమెంటుపై ఉగ్ర దాడి సందర్భంగా సోనియా, వాజ్ పేయి ఫోన్ సంభాషణ గురించి టాండన్ ప్రస్తావించారు. 'నాడు విపక్ష నేతగా ఉన్న సోనియా వెంటనే వాజ్ పేయికి కాల్ చేశారు. 'మీరు క్షేమమేనా? నాకు ఆందోళనగా ఉంది' అంటూ ఆరా తీశారు. 'నేను క్షేమం. మీరు పార్లమెంటు హాల్లో ఉన్నారేమోనని నేను ఆందోళన పడ్డా' అంటూ వాజ్ పేయి బదులిచ్చారు' అని పేర్కొన్నారు.

భారత్‌లో తయారీరంగం కునారిల్లుతోంది

ఈ పరిశ్రమకు పునరుజ్జీవం అవసరం

జర్మనీలో బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను సందర్శించాక రాహుల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థలకు తయారీరంగమే వెన్నెముకలా బలీయమైన తోడ్పాటునందిస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. జర్మనీలో పర్యటిస్తున్న ఆయన తాజాగా అక్కడి మ్యూనిక్ నగరంలోని ప్రఖ్యాత బీఎండబ్ల్యూ వెల్ట్, బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను సందర్శించారు. అక్కడి అత్యాధునిక కార్లు, బైక్‌లను ఆసక్తిగా గమనించారు. బైక్‌పై, కారులో కూర్చుని వాటి సదుపాయాలను అనుభూతిచెందారు. అక్కడ భారత్‌కు చెందిన టీవీఎస్ కంపెనీ బీఎండబ్ల్యూ సహకారంతో తయారుచేసిన 450సీసీ సామర్థ్యమున్న కొత్త బైక్‌ను చూసి అచ్చెరువొందారు. తర్వాత భారతీయ తయారీరంగ పరిశ్రమ స్థితిగతులపై మాట్లాడారు. ఆయా విశేషాలను తన సామాజిక మాధ్యమం ఇన్‌స్టా గ్రామ్ ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. '' మ్యూనిక్‌లో బీఎండబ్ల్యూ ప్రపంచంలో కలియతిరిగా. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇక్కడి తయారీ పరిశ్రమ పటిష్టంగా ఉంది. బీఎండబ్ల్యూ షోరూమ్‌లో టీవీఎస్ 450 సీసీ మోటార్‌సైకిల్‌ను చూసి ఎంతో ఆనందపడ్డా. భారతీయ ఇంజనీరింగ్‌ను ప్రదర్శించడం ఎంతో గర్వంగా అనిపించింది. ఏ దేశ ఆర్థిక వ్యవస్థకైనా తయారీరంగమే వెన్నెముక. కానీ దురదృష్టవశాత్తు భారత్‌లో తయారీరంగం రోజురోజుకూ పలు రకాల సమస్యల వలయంలో చిక్కుకుంటోంది. భారత ఆర్థికవ్యవస్థ మరింత పటిష్టంగా ఉండాలంటే మన వద్ద తయారీరంగం ఊపందుకోవాలి. తయారీరంగ అనుకూల వాతావరణాన్ని సృష్టించాలి. అప్పుడే నూతన ఉద్యోగాల సృష్టి సాధ్యం'' అని అన్నారు.

విమర్శించిన బీజేపీ

భారత్‌లో తయారీ పరిశ్రమ దెబ్బతింటోందన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ''విదేశీ గడ్డపై రాహుల్ స్వదేశాన్ని కించపరిచేలా భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారు. తద్వారా స్వదేశాన్ని అవమానించారు. లోక్‌సభలో విపక్షనేత హోదాలో ఉన్న రాహుల్ విదేశాలకు వెళ్లినప్పుడు బాధ్యతాయుతంగా మాట్లాడాలి. కానీ రాహుల్‌లో ఆ బాధ్యత ఏనాడూ చూడలేదు. రాహుల్ ప్రవర్తన.. దేశం పట్ల కాంగ్రెస్ నాయకుల చిత్తశుద్ధికి అద్దంపడుతోంది. వాస్తవానికి ఉత్పత్తి అనుబంధ ప్రోత్సాహక(పీఎల్‌ఐ) పథకంతో భారత్‌లో తయారీరంగం ఏటా గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది'' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు.

‘ఈవీఎం’లను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

ఎన్నికల సంస్కరణలు

భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. సమర్థులు, నిస్వార్థపరులను ప్రతినిధులుగా ఎన్నుకోవడానికి ఎన్నికల సంస్కరణలు అవసరం. నేరచరిత్ర ఉన్న వారిని ఎన్నికల్లో పోటీచేయకుండా నివారించి, ఎన్నికల ప్రక్రియను సులభతరం చేయడానికి ఎన్నికల సంస్కరణలు తప్పనిసరి.

తార్కుండే, టి.ఎన్.శేషన్, జె.ఎం.లింగ్డో, సంపత్ ఎన్నికల కమిషనర్లుగా ఉన్న సమయంలో ఎన్నికల సంస్కరణలను బలోపేతం చేయడానికి ప్రయత్నించారు. ఎన్నికల సంస్కరణలను సూచించడానికి 1974లో తార్కుండే కమిటీ, 1990లో దినేష్ గోస్వామి కమిటీ, 1998లో ఇంద్రజిత్ గుప్తా కమిటీ, 1999లో జస్టిస్ జీవన్‌రెడ్డి అధ్యక్షతన 15వ లా కమిషన్‌ను నియమించారు. జస్టిస్ వెంకటాచలయ్య అధ్యక్షతన నియమించిన రాజ్యాంగ సమీక్ష సంఘం, వీరప్ప మొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో పరిపాలన సంస్కరణల సంఘం కూడా కొన్ని సూచనలు చేశాయి.

వివిధ కమిటీల ముఖ్య సిఫారసులు

1. స్వతంత్ర అభ్యర్థులు మరణిస్తే ఎన్నికను వాయిదా వేయొద్దు. స్వతంత్ర అభ్యర్థులను పోటీకి అనుమతించొద్దు.
2. పార్లమెంటు సభ్యుడికి డిగ్రీ, అసెంబ్లీ సభ్యుడికి ఇంటర్మీడియెట్ కనీస విద్యార్హతగా నిర్ణయించాలి.
3. పార్లమెంటు, అసెంబ్లీకి ఎన్నికైన ప్రతినిధులు తమ ఆస్తుల వివరాలను సభాధ్యక్షునికి, ఎన్నికల సంఘానికి ప్రమాణ స్వీకారానికి ముందే తెలపాలి.
4. కేంద్ర, రాష్ట్ర మంత్రిమండలి సభ్యుల సంఖ్య పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ సభ్యుల సంఖ్యలో పదో వంతుకు మించొద్దు. దీన్ని 2003లో 91వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేర్చారు.
5. కొత్తగా ఎన్నికైన సభ్యులకు మంత్రి పదవులు ఇవ్వాలంటే ప్రభుత్వ నిర్వహణపై నెలపాటు తర్ఫీదు ఇవ్వాలి.
6. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలో సభ్యత్వం లేని వ్యక్తిని శాసనసభ నాయకుడిగా ఎన్నుకోవడానికి అనర్హుడిగా ప్రకటించాలి.
7. ఎన్నికల ప్రచారానికయ్యే అభ్యర్థుల ఖర్చును ప్రభుత్వమే భరించాలి.
8. ఎన్నికల ముందు జరిగిన సర్దుబాట్లకు పార్టీ విప్‌ను ప్రయోగించి పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తింపజేయాలి.
9. ఒక నియోజక వర్గంలో పోలైన ఓట్లలో 51 శాతం సాధించిన అభ్యర్థినే విజేతగా ప్రకటించాలి.
10. పార్టీల ఆదాయ వ్యయాలను ఆడిట్ చేయించాలి.
11. వ్యతిరేక ఓటు పద్ధతిని ప్రవేశపెట్టాలి.
12. రాజకీయ అస్థిరత్వాన్ని సృష్టించే చిన్న గ్రూపులు, చిన్న పార్టీలను నిషేధించాలి.
13. లోక్‌సభ, అసెంబ్లీలు పూర్తి కాలంపాటు కొనసాగేలా చూడాలి.
14. రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ సమయంలో రాష్ట్రపతి పాలన విధించాలి.
15. రాజకీయ పదవుల నిర్వహణలో రెండు పర్యాయాల పరిమితిని నిర్దేశించాలి.
16. ముఖ్యమంత్రి పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి.
17. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రచార సమయాన్ని గణనీయంగా తగ్గించాలి.
18. అభ్యర్థులు ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేయకుండా నిషేధించాలి.
19. లోక్‌సభ, విధాన సభకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలి.
20. ఎన్నికల ప్రవర్తన నియమావళికి చట్టబద్ధహోదా కల్పించి, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి.
21. ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టాలి.

పైన సిఫారసు చేసిన సంస్కరణల్లో కొన్ని అమల్లోకి వచ్చాయి.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

ప్రస్తుత ప్రజాస్వామ్య ప్రభుత్వాల్లో రాజకీయ పార్టీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వాల భవిష్యత్తు రాజకీయ పార్టీలపై ఆధారపడి ఉంటుంది. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల్లో పోటీచేసి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తుంది. ఒక పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని నడిపితే, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ లోపాలను ఎండగడుతూ అధికార పార్టీని నియంత్రిస్తాయి. కానీ కొన్ని సందర్భాల్లో అభ్యర్థులు ఒక రాజకీయ పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీలోకి ఫిరాయిస్తున్నారు. ఫలితంగా రాజకీయ అస్థిరత్వం ఏర్పడి ప్రజాభిప్రాయం అభాసుపాలవుతుంది.

ఉదాహరణకు 1967 తర్వాత దేశంలో పార్టీ ఫిరాయింపులు జోరందుకున్న నేపథ్యంలో ‘ఆయారామ్ గయారామ్’ అనే పదం పాపులర్ అయింది. దీంతో పార్టీ ఫిరాయింపులను నివారించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని రూపొందించారు.

రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని ప్రత్యేకంగా పదో షెడ్యూల్‌లో చేర్చారు. 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ చట్టాన్ని సవరించారు.

అనర్హత వేటుపడే సందర్భాలు

1. ఒక పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీలో చేరినప్పుడు.
2. పార్టీ విప్‌కు విరుద్ధంగా ఓటు వేసినప్పుడు, ఓటు వేయనప్పుడు.
3. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికై ఏదో ఒక పార్టీలో చేరినప్పుడు.
4. నామినేటెడ్ సభ్యుడు 6 నెలల తర్వాత ఏదో ఒక పార్టీలో చేరినప్పుడు.

రద్దుచేసే అధికారం

1. సభ్యుడిపై అనర్హత వేటు వేసే అధికారం స్పీకర్‌కు లేదా సభాధ్యక్షునికి ఉంటుంది.
2. స్పీకర్ లేదా సభాధ్యక్షుడు ఫిరాయిస్తే నిర్ణయాధికారం సభ ఎన్నుకున్న మరో సభ్యుడికి ఉంటుంది.

మినహాయింపులు

1. ఒక రాజకీయ పార్టీ మరో పార్టీలో విలీనమైనప్పుడు సభ్యుల సభ్యత్వం రద్దు కాదు.
2. ఒక పార్టీలోని మొత్తం సభ్యులు మరో పార్టీలో చేరినప్పుడు సభ్యత్వం రద్దుకాదు.
3. గుర్తింపులేని పార్టీనుంచి వెళ్లితే ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు.
4. ఒక పార్టీకి చెందిన మొత్తం సభ్యుల్లో 2/3 వంతు సభ్యులు ఫిరాయిస్తే సభ్యత్వం రద్దుకాదు.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం - ఉపయోగాలు

1. రాజకీయ సుస్థిరత సాధించవచ్చు.
2. రాజకీయాల్లో అవినీతి, అనైతికతను నివారించ వచ్చు.
3. సంకుచిత, స్వార్థ, అవకాశవాద రాజకీయాలను అరికట్టవచ్చు.

91వ రాజ్యాంగ సవరణ

2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించారు. ఈ సవరణ ద్వారా..

1. మంత్రిమండలి సభ్యుల సంఖ్య లోక్‌సభ, విధానసభ సభ్యుల సంఖ్యలో 15 శాతానికి మించొద్దు. రాష్ట్ర మంత్రివర్గంలో కనీసం 12 మంది ఉండాలి.
2. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హులుగా ప్రకటించిన వారిని మంత్రులుగా నియమించొద్దు.
3. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హుడిగా ప్రకటించిన వారిని లాభదాయక పదవుల్లో నియమించొద్దు.
4. పార్టీ ఫిరాయింపు చట్టం ద్వారా చీలిక (1/3వంతు) పదానికి మినహాయింపు ఉండేది. దీన్ని తొలగించారు.

మాదిరి ప్రశ్నలు

1. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రం?
ఎ) తమిళనాడు
బి) కర్ణాటక
సి) జమ్మూకశ్మీర్
డి) ఆంధ్రప్రదేశ్
2. ఫ్లోర్ క్రాసింగ్ అంటే?
ఎ) అధికార పార్టీకి మద్దతు ప్రకటించడం
బి) రాజకీయ లబ్ధికోసం అధికార పార్టీలోకి ఫిరాయింపు
సి) రాజకీయ రంగాన్ని వీడటం
డి) పైవన్నీ
3. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హతపై అంతిమ అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) సుప్రీంకోర్టు
బి) కేంద్ర ఎన్నికల సంఘం
సి) సభాధ్యక్షులు డి) రాష్ట్రపతి
4. భారత రాజ్యాంగంలోని ఏ అధికరణ పార్లమెంటు సభ్యుల అనర్హతల గురించి తెలుపుతుంది?
ఎ) అధికరణ 101
బి) అధికరణ 102
సి) అధికరణ 108
డి) అధికరణ 110
5. ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
ఎ) కేరళ బి) హర్యానా
సి) అసోం డి) పంజాబ్
6. ‘నోటా’ బటన్‌ను తొలుత ఏ లోక్‌సభ ఎన్నికల్లో ప్రవేశపెట్టారు?
ఎ) 13వ బి) 14వ
సి) 15వ డి) 16వ
7. పార్టీ ఫిరాయింపుల చట్టం గురించి తెలిపే షెడ్యూల్ ఏది?
ఎ) 8 బి) 9 సి) 10
డి) పైవేవీ కావు
8. ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
ఎ) మణిపూర్ బి) మేఘాలయ
సి) హర్యానా డి) హిమాచల్ ప్రదేశ్
9. అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చును ప్రభుత్వమే భరించే దేశం?
ఎ) పాకిస్తాన్ బి) యూఎస్ఏ
సి) ఇండియా డి) బ్రిటన్
10. ఓటరు దినోత్సవంగా ఏ రోజును జరుపుకుంటారు?
ఎ) జనవరి 3 బి) జనవరి 25
సి) జనవరి 26 డి) అక్టోబర్ 2
11. ఎన్నికల సంస్కరణల సిఫారసుల కోసం వి.పి.సింగ్ ప్రభుత్వం నియమించిన కమిటీ?
ఎ) తార్కుండే కమిటీ
బి) దినేష్ గోస్వామి కమిటీ
సి) ఇంద్రజిత్ గుప్తా కమిటీ
డి) 15వ లా కమిషన్
12. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదించారు?
ఎ) 52వ రాజ్యాంగ సవరణ
బి) 73వ రాజ్యాంగ సవరణ
సి) 91వ రాజ్యాంగ సవరణ
డి) 61వ రాజ్యాంగ సవరణ
13. ఎన్నికల సంస్కరణలను ప్రవేశపెట్టడానికి కృషిచేసిన ఎన్నికల కమిషనర్?
ఎ) పేరిశాస్త్రి బి) సుకుమార్ సేన్
సి) టి.ఎన్. శేషన్ డి) నజీంజైది
14. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ ఎంత కాలంలో నిర్ణయం ప్రకటించాలి?
ఎ) 3 నెలలు బి) 6 నెలలు
సి) ఏడాది డి) పైవేవీ కావు

సమాధానాలు

1) సి; 2) బి; 3) సి; 4) బి; 5) ఎ; 6) డి; 7) సి; 8) సి; 9) డి; 10) బి; 11) బి; 12) ఎ; 13) సి; 14) డి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఎన్నికల సంస్కరణల అంశాన్ని ఏ కమిటీ ప్రస్తావించింది?
1) తార్కుండే కమిటీ
2) గోస్వామి కమిటీ
3) సంతానం కమిటీ
4) సబార్ కమిటీ
ఎ) 1, 2 మాత్రమే
బి) 1, 3 మాత్రమే
సి) 1, 2, 3 మాత్రమే
డి) 3, 4 మాత్రమే
2. ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా మంత్రుల సంఖ్యకు పరిమితి విధించారు?
ఎ) 87 బి) 86 సి) 91
డి) 73
3. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1960
బి) 1961
సి) 1962
డి) 1964

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి.

ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

1. భారతదేశం ఏ రకమైన శీతోష్ణస్థితిని కలిగి ఉంది?
జ. ఉష్ణమండల రుతుపవన శీతోష్ణస్థితి
2. మన దేశంలో పశ్చిమ దిశగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్న నదులేవి?
జ. నర్మద, తపతి, మహి, సబర్మతి
3. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం?
జ. రాజస్థాన్‌లోని జైసల్మీర్
4. మనదేశంలో నైరుతి రుతుపవన కాలం?
జ. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు
5. ఈశాన్య రుతుపవనాలు (తిరోగమన రుతుపవనాలు) వీచే కాలం?
జ. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు
6. నైరుతి రుతుపవనాల వల్ల మొదటగా ఏ రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయి?
జ. కేరళ
7. ఈశాన్య రుతుపవనాలు మొదటగా ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తాయి?
జ. పంజాబ్
8. ప్రస్తుతం హిమాలయాలున్న భూభాగంపై మధ్య మహాయుగంలో ఉన్న సముద్రం?
జ. టెథిస్
9. భారత ద్వీపకల్ప పీఠభూమిని పూర్వం ఏమని పిలిచేవారు?
జ. గోండ్వానా పీఠభూమి
10. హిమాలయాలు ఏ రకమైన పర్వతాలు?
జ. నవీన ముడుత పర్వతాలు
11. సిమ్లా పట్టణం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. ధౌల్‌దార్ శ్రేణి
12. అరుణాచల్‌ప్రదేశ్‌లోని బాహ్య హిమాలయాలను ఏమని పిలుస్తారు?
జ. మిష్మి కొండలు
13. ప్రముఖ వేసవి విడిది కేంద్రమైన డెహ్రాడూన్ ఏ రాష్ట్రంలో ఉంది?
జ. ఉత్తరాఖండ్
14. ప్రపంచంలో రెండో అతి ఎత్తైన శిఖరం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. కారకోరం శ్రేణి
15. మడ అడవులు (సుందర వనాలు) ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి?
జ. పశ్చిమ బెంగాల్
16. ఆరావళి పర్వతాల్లో ఎత్తైన శిఖరం?
జ. గురుశిఖర్ పర్వతం (1722 మీటర్లు)
17. ఆరావళి పర్వతాలు ఏ రకాని చెందినవి?
జ. అతి పురాతన ముడుత పర్వతాలు
18. ఛోటా నాగపూర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. జార్ఖండ్
19. ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. రాజస్థాన్
20. ఊటీ ఏ కొండల్లో ఉంది?
జ. నీలగిరి కొండలు (తమిళనాడు)
21. సింధు నది ముఖ్య ఉపనదులు?
జ. జీలం, చీనాబ్, బియాస్, సట్లెజ్, రావి
22. బ్రహ్మపుత్ర నదిని అరుణాచల్‌ప్రదేశ్‌లో ఏమని పిలుస్తారు?
జ. ది హాంగ్
23. అసోం దుఃఖదాయనిగా పేరొందింది?
జ. బ్రహ్మపుత్రా నది
24. కృష్ణా నది జన్మస్థానం?
జ. మహాబలేశ్వర్ (మహారాష్ట్ర)
25. సింధు నది జన్మస్థానం?
జ. మానస సరోవరం (టిబెట్)
26. అమర్ కంటక్ వద్ద జన్మించిన నది?
జ. నర్మద
27. తపతి నది జన్మస్థానం?
జ. ముల్టాయి (బేటల్, మధ్యప్రదేశ్)
28. కోరమండల్ తీరంలో ఏ రుతుపవనాల వల్ల అధిక వర్షం కురుస్తుంది?
జ. ఈశాన్య రుతుపవనాలు
29. కరువుకు గురయ్యే ప్రాంతాల ప్రణాళిక (DPAP)ను ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు?
జ. 1973
30. మహానది ఏ రాష్ట్రంలో ఎక్కువ దూరం ప్రవహిస్తోంది?
జ. ఒడిశా
31. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
జ. దామోదర్ నది
32. సుగంధ నూనెలను తయారుచేయడానికి ఉపయోగపడే రూసా గడ్డిని ఏ జిల్లాలో పండి స్తున్నారు?
జ. నిజామాబాద్
33. భారతదేశ సగటు అటవీ శాతం?
జ. 20.55%
34. అడవుల విస్తీర్ణం పరంగా మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, చివరిస్థానంలో ఉన్న రాష్ట్రం?
జ. హర్యానా
35. వైశాల్యం పరంగా అత్యధిక శాతం అడవులు ఉన్న రాష్ట్రం?
జ. అరుణాచల్ ప్రదేశ్
36. మృత్తికా క్రమక్షయం అంటే?
జ. సహజ కారణాల వల్ల సారవంతమైన నేలల పైపొర కొట్టుకొని పోవడం
37. ఉష్ణమండల చెర్నోజెమ్ మృత్తికలుగా పేరొందినవి?
జ. నల్లరేగడి నేలలు
38. మౌసమ్ అనేది ఏ భాషా పదం?
జ. అరబిక్ (అర్థం–రుతువు)
39. మన దేశంలో ఇప్పటి వరకూ అత్యల్ప ఉష్ణోగ్రత (–40°C) ఎక్కడ నమోదైంది?
జ. ద్రాస్ (కార్గిల్– కశ్మీర్)
40. అత్యధిక వర్షపాతం (1141సెం.మీ.) నమోదయ్యే మాసిన్‌రామ్ ప్రాంతం ఏ రాష్ట్రంలో ఉంది?
జ. మేఘాలయ
41. తమిళనాడులో అత్యధిక వర్షపాతం సంభవించడానికి కారణమయ్యే రుతుపవనాలు?
జ. తిరోగమన రుతుపవనాలు
42. పత్తి పంటకు అత్యంత అనుకూలమైన నేలలు?
జ. నల్లరేగడి నేలలు
43. భంగర్, ఖాదర్ మృత్తికలుండే నేలలు?
జ. ఒండ్రు నేలలు
44. మృత్తికా పరిరక్షణ పద్ధతులేవి?
జ. కాంటూర్ బండింగ్, ఫిర్రోయింగ్, స్ట్రిప్ క్రాసింగ్
45. దక్కన్ లావా నేలలుగా పేరుగాంచినవి?
జ. నల్లరేగడి నేలలు
46. జనసాంద్రత అంటే?
జ. చదరపు కిలోమీటరుకు నివసించే సగటు జనాభా
47. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏ రోజున జరుపుకుంటాం?
జ. జూలై 11
48. తెలంగాణలో అక్షరాస్యత ఎక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్ కాగా తక్కువగా ఉన్న జిల్లా?
జ. మహబూబ్‌నగర్ (55.4%)
49. తెలంగాణ రాష్ట్ర మొత్తం జనాభా?
జ. 3 కోట్ల 52 లక్షలు
50. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న జిల్లా రంగారెడ్డి. కాగా, అతి తక్కువ జనాభా ఉన్న జిల్లా?
జ. నిజామాబాద్
51. తెలంగాణలో ఎస్సీ జనాభా తక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్. కాగా, ఎక్కువగా ఉన్న జిల్లా?
జ. కరీంనగర్
52. తెలంగాణలో ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లా ఖమ్మం కాగా, తక్కువగా ఉన్న జిల్లా ఏది?
జ. హైదరాబాద్
53. దేశంలో ఎక్కువగా వ్యవసాయానికి తోడ్పడే నీటి పారుదల వనరు?
జ. బావులు
54. పెరియార్, మెట్టూరు కాలువలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
జ. తమిళనాడు
55. చెరువుల ద్వారా సాగయ్యే భూమి ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉంది?
జ. తెలంగాణ
56. కాలువలు, బావుల ద్వారా సాగయ్యే భూమి అత్యధికంగా ఉన్న రాష్ట్రం?
జ. ఉత్తరప్రదేశ్
57. ఏ రాష్ట్రంలో చాలా వరకు వ్యవసాయమంతా నీటిపారుదల వసతుల కిందే జరుగుతుంది?
జ. పంజాబ్
58. భారీ నీటిపారుదల పథకాల ఆయకట్టు ప్రాంతం ఎంత ఉంటుంది?
జ. 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ
59. చిన్నతరహా నీటిపారుదల పథకాల ఆయ కట్టు ప్రాంతం ఎన్ని హెక్టార్లలోపు ఉం టుంది?
జ. 2000
60. తెల్లబొగ్గుగా పిలిచేది?
జ. జలవిద్యుచ్ఛక్తి
61. దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుచ్ఛక్తిలో జలవిద్యుచ్ఛక్తి వాటా?
జ. 22 శాతం
62. మనదేశంలో జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తికి అత్యంత అనువైన ప్రాంతం?
జ. హిమాలయ పర్వతపాద ప్రాంతం
63. ఏ బహుళార్థసాధక పథకం వల్ల అధికంగా జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది?
జ. భాక్రానంగల్
64. మనదేశంలోని ఏకైక అంతర్జాతీయ బహుళార్థసాధక ప్రాజెక్టు
జ. కోసి ప్రాజెక్టు
65. భాబర్ అంటే?
జ. గులకరాళ్లతో కూడిన సచ్ఛిద్ర మండలం
66. టెరాయి అంటే?
జ. చిత్తడి ప్రాంతం
67. భంగర్ అంటే?
జ. ప్రాచీన కాలంలో ఏర్పడిన ఒండలి మైదానం.
68. ఖాదర్ అంటే?
జ. నూతనంగా ఏర్పడిన ఒండలి మైదానం
69. రే/ కల్లార్ అంటే?
జ. చవుడు, లవణీయ, స్ఫటికీయ భూభాగం

బహుళార్థసాధక ప్రాజెక్టు	నది	నిర్మించిన ప్రదేశం	లబ్ధి పొందుతున్న రాష్ట్రాలు
భాక్రానంగల్ ప్రాజెక్టు	సట్లెజ్	భాక్రానంగల్ (హిమాచల్ ప్రదేశ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
బియాస్ ప్రాజెక్టు	బియాస్	పాంగ్ (పంజాబ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
దామోదర్ ప్రాజెక్టు	దామోదర్	జార్ఖండ్	పశ్చిమ బెంగాల్, జార్ఖండ్
హిరాకుడ్ ప్రాజెక్టు	మహానది	సంబల్‌పూర్	ఒడిశా
నాగార్జునసాగర్ ప్రాజెక్టు	కృష్ణా	నందికొండ (నల్గొండ, తెలంగాణ)	తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
తుంగభద్ర ప్రాజెక్టు	తుంగభద్ర	మల్లాపూర్ (బళ్లారి)	కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
కోసి ప్రాజెక్టు	కోసి నది	హనుమాన్ నగర్ (బిహార్)	బిహార్, నేపాల్ (అంతర్జాతీయ పథకం)
చంబల్ ప్రాజెక్టు	చంబల్	మధ్యప్రదేశ్	మధ్యప్రదేశ్, రాజస్థాన్
గండక్ ప్రాజెక్టు	గండక్	వాల్మీకి నగర్ (బిహార్)	బిహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్
రామ్‌గంగా ప్రాజెక్టు	రామ్‌గంగా	కాలాగర్	ఉత్తరాఖండ్

పర్వతాలు	రాష్ట్రం
మహాదేవ్ కొండలు	మధ్యప్రదేశ్
రాజ్‌మహల్ కొండలు	జార్ఖండ్
మిష్మి కొండలు, డాఫ్లా కొండలు	అరుణాచల్‌ప్రదేశ్
కచార్ కొండలు	అసోం
పాట్‌కాయ్ కొండలు	నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్
ఖాసీ కొండలు, జాంతియా కొండలు, గారో కొండలు	మేఘాలయ
పళని కొండలు, నీలగిరి కొండలు, షెవరాయ్ కొండలు	తమిళనాడు
యాలకుల (కార్డమమ్) కొండలు, అన్నామలై కొండలు	కేరళ
లూషాయ్ కొండలు	మిజోరాం
గిర్ కొండలు	గుజరాత్

తీరప్రాంత మైదానం	విస్తరించిన రాష్ట్రం
సర్కార్ తీరం	ఆంధ్రప్రదేశ్
ఉత్కల్ తీరం	ఒడిశా
కోరమండల్ తీరం	తమిళనాడు
మలబార్ తీరం	కేరళ
కెనరా తీరం	కర్ణాటక
కొంకణ్ తీరం	గోవా, మహారాష్ట్ర

2011 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో

మొత్తం జనాభా	121 కోట్లు
జనాభా పెరుగుదల రేటు (దశాబ్దంలో)	17.7%
అక్షరాస్యత	74%
లింగనిష్పత్తి	1000 : 943
జనసాంద్రత	382
పట్టణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	గోవా (62.2%)
గ్రామీణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	హిమాచల్ ప్రదేశ్ (90%)

కుడి నుంచి వారి స్థానాలు వరుసగా?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

మెంటల్ ఎబిలిటీ

ర్యాంకింగ్ టెస్ట్

పోటీ పరీక్షల్లో మెంటల్ ఎబిలిటీలో భాగంగా ర్యాంకింగ్ టెస్ట్ అంశం నుంచి ప్రశ్నలు తప్పనిసరిగా అడుగుతున్నారు. దీనిలో ప్రధానంగా ఒక తరగతిలో లేదా ఒక వరుసలో వ్యక్తుల స్థానాలను (ర్యాంకులను) ఒకవైపు నుంచి ఇచ్చి మరోవైపు నుంచి కనుక్కోవాలని అడుగుతారు. స్థానాలను పరస్పరం మార్చడం ద్వారా కొత్తగా ఏర్పడే వరుసలోని ర్యాంకులను గుర్తించాలని ప్రశ్నలు ఇస్తారు. కొందరి ర్యాంకులను ఇచ్చి సమూహంలోని మొత్తం వ్యక్తుల సంఖ్యను గుర్తించమనడం లాంటి అంశాలపై కూడా తరచుగా ప్రశ్నలు ఇస్తారు. ఇచ్చిన సమాచారాన్ని అవగాహన చేసుకుని సునిశిత పరిశీలన ద్వారా సమాధానాలను సులభంగా గుర్తించవచ్చు. ర్యాంకింగ్ టెస్ట్‌ను ప్రధానంగా 4 రకాలుగా విభజించవచ్చు. అవి

టైప్-1

- ఒక వరుస లేదా తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య, ఏదైనా ఒక విద్యార్థి స్థానం ఒక వైపు (కుడి లేదా ఎడమ) నుంచి ఇచ్చి రెండోవైపు నుంచి ఆ విద్యార్థి స్థానాన్ని కనుగొనడం.
- ఇలాంటి ప్రశ్నలకు కింది సూత్రం ద్వారా సమాధానాలను తేలికగా రాబట్టవచ్చు.
- ఒక వరుసలో లేదా తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య (T). ఏదైనా ఒక విద్యార్థి స్థానం ఒక వైపు నుంచి (R_1) అయితే రెండో వైపు నుంచి ఆ విద్యార్థి స్థానం(R_2).
  $R_2 = (T - R_1) + 1$

ఉదాహరణ:

- 30 మంది విద్యార్థులున్న తరగతిలో రోహిత్ మొదటి(ఎడమ) నుంచి 12వ స్థానంలో ఉన్నాడు. అయితే చివరి (కుడి) నుంచి అతడి స్థానం ఎంత?

సాధన: మొత్తం విద్యార్థులు T = 30
మొదటి నుంచి రోహిత్ స్థానం
$R_1 = 12$
చివరి నుంచి రోహిత్ స్థానం R_2 = ?
$\therefore R_2 = (T - R_1) + 1$
$R_2 = (30 - 12) + 1 = 18 + 1 = 19$
∴ చివర నుంచి రోహిత్ స్థానం 19.

టైప్-2

ఒక వరుస లేదా తరగతిలోని ఒక విద్యార్థి స్థానాన్ని రెండు వైపుల నుంచి ఇచ్చి ఆ వరుస లేదా తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య కనుగొనడం.

ఇలాంటి ప్రశ్నలకు కింది సూత్రం ద్వారా సులభంగా సమాధానాలు రాబట్టవచ్చు.

ఒక వరుస లేదా తరగతిలోని ఒక విద్యార్థి స్థానాలు రెండు వైపుల నుంచి R_1, R_2, మొత్తం విద్యార్థుల సంఖ్య T. అయితే
$T = (R_1 + R_2) - 1$

ఉదాహరణ:

- ఒక తరగతిలో ఒక విద్యార్థి స్థానం మొదటి (ఎడమ) నుంచి 12. చివరి (కుడి) నుంచి 17. అయితే ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య?

సాధన: మొదటి నుంచి స్థానం = R_1
చివర నుంచి స్థానం = R_2
ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య (T)
$= (R_1 + R_2) - 1$
$= (12 + 17) - 1 = 29 - 1 = 28$
తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య = 28

టైప్-3

ఒక వరుస లేదా తరగతిలోని విద్యార్థుల స్థానాలు పరస్పరం మారినప్పుడు వారి స్థానాలను నిర్ణయించడం.

ఉదాహరణ:

- ఒక వరుసలో పద్మ ఎడమ నుంచి 9వ స్థానంలో, పుష్ప కుడి నుంచి 12వ స్థానంలో ఉన్నారు. వారిద్దరూ పరస్పరం స్థానాలను మార్చుకోగా పద్మ ఎడమ నుంచి 15వ స్థానంలో ఉంది. అయితే ఆ వరుసలో మొత్తం బాలికల సంఖ్య?

సాధన:





పద్మ ఎడమ నుంచి 9వ స్థానంలో, పుష్ప కుడి నుంచి 12వ స్థానంలో ఉన్నారు. వారిద్దరూ పరస్పరం స్థానాలను మార్చుకుంటే పద్మ ఎడమ నుంచి 15వ స్థానంలో ఉంది. ఆ స్థానం ఇంతకు ముందు పుష్పది. కాబట్టి ఆ వరుసలోని మొత్తం బాలికలు.. (15 + 12)–1 = 26

టైప్-4

ఒక వరుస లేదా తరగతిలోని ఇద్దరు విద్యార్థుల స్థానాలు రెండు వైపుల నుంచి ఇచ్చి, వారి మధ్యలో మూడో విద్యార్థి ఉంటే, తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్యను కనుగొనడం.

ఉదాహరణ:

- ఒక తరగతిలో B స్థానం పైనుంచి 9. C స్థానం కింది నుంచి 8. A సరిగ్గా వారిద్దరి మధ్య ఉన్నాడు. B, Aల మధ్య నలుగురు విద్యార్థులు ఉంటే, తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య? **(2006-SI)**

సాధన:
A అనే విద్యార్థి B, Cల మధ్య ఉన్నాడు. B, Aల మధ్య నలుగురు విద్యార్థులు ఉన్నారు. కాబట్టి A, Cల మధ్య కూడా నలుగురు విద్యార్థులు ఉంటారు.
∴ B, Cల మధ్యలో 9 మంది విద్యార్థులు ఉంటారు.
B స్థానం పైనుంచి 9.
C స్థానం కింది నుంచి 8.



కాబట్టి ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య = 26

- ఒక తరగతిలో 36 మంది బాలురు, బాలికలు సమాన సంఖ్యలో ఉన్నారు. బాలురు బేసి సంఖ్యల స్థానంలో కూర్చున్నారు. అయితే శ్రీను పై నుంచి 17వ స్థానంలో ఉన్నాడు. అయితే శ్రీను కింద ఎంతమంది బాలురు ఉన్నారు?

సాధన: బాలురు బేసి సంఖ్యల స్థానంలో ఉంటే, బాలికలు సరి సంఖ్యల స్థానంలో ఉంటారు. 36 మంది సమాన సంఖ్యలో ఉన్నారు కాబట్టి బాలురు 18. బాలికలు 18. శ్రీను స్థానం పై నుంచి17(బేసిసంఖ్య).
అంటే అతని ముందు 16 మంది (బేసి, సరి సంఖ్యలు) ఉన్నారు. అందులో శ్రీను పైన 8 మంది బాలురు ఉంటారు. మొత్తం 18 మంది బాలురల్లో 8 మంది పైన ఉంటే కింద (10–1)= 9 ఉంటారు.
∴ శ్రీను కింద ఉండే బాలుర సంఖ్య 9.

మాదిరి ప్రశ్నలు

1. ఒక తరగతిలో పాస్ అయిన విద్యార్థుల్లో రవి ఎడమ నుంచి 18వ స్థానంలో, కుడి నుంచి 24వ స్థానంలో ఉన్నాడు. 15 మంది పరీక్షలో ఫెయిల్ అయ్యారు. ఐదుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. అయితే తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత?
   పాస్ అయిన విద్యార్థులు:
   $T = (R_1 + R_2) - 1$
   $T = (18+24) - 1 = 42 - 1 = 41$
   ఫెయిల్ అయిన విద్యార్థులు
   15+5 = 20
   కాబట్టి తరగతి మొత్తం విద్యార్థులు
   పాస్ + ఫెయిల్ = 41+ 20 = 61
2. ఒక వరుసలో రవి ఎడమ నుంచి 18వ స్థానంలో, శివ కుడి నుంచి 24వ స్థానంలో ఉన్నారు. ఇద్దరి మధ్యలో వేణు, రవి తర్వాత 14వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ వరుసలో ఎంతమంది ఉన్నారు?

సాధన: ఒక వరుసలో ఎడమ నుంచి రవి వరకు 18 మంది, కుడి నుంచి శివ వరకు 24 మంది ఉన్నారు.
అంటే 18+24 = 42
రవి, శివల మధ్య వేణు, రవి తర్వాత 14 స్థానంలో ఉన్నాడు.
అయితే (14+14–1) = 27
రవి, శివల మధ్య 27మంది ఉన్నారు.
కాబట్టి ఆ వరుసలో మొత్తం విద్యార్థుల సంఖ్య = 42+27 = 69



3. 53 మంది విద్యార్థులు ఉన్న ఒక తరగతిలో ముగ్గురు విద్యార్థులు రోహిత్, శివ, శంకర్ ల స్థానాలు ఎడమ నుంచి వరుసగా 9,12,17. అయితే కుడి నుంచి వారి స్థానాలు ఎంత?

సాధన: మొత్తం విద్యార్థులు (T) = 53
రోహిత్ స్థానం (R_1) = 9
$R_2 = (T - R_1) + 1$
$R_2 = (53 - 9) + 1$
$R_2 = 44 + 1 = 45$
∴ కుడి నుంచి రోహిత్ స్థానం 45.
మొత్తం విద్యార్థులు (T) = 53
శివ స్థానం (ఎడమ)(R_1) = 12
శివ స్థానం (కుడి) (R_2) = $(T - R_1) + 1$
= (53–12)
= 41+1 = 42
∴ కుడి నుంచి శివ స్థానం 42.
మొత్తం విద్యార్థులు (T) = 53
శంకర్ స్థానం (ఎడమ)(R_1) = 17
శంకర్ స్థానం (కుడి)(R_2) = ?
$R_2 = (T - R_1) + 1$
$R_2 = (T - R_1) + 1$
= (53–17)+1
= 36+1 = 37.
∴ కుడి నుంచి శంకర్ స్థానం 37.

4. వేప చెట్ల వరుసలో మొదటి, చివరి నుంచి ఒక చెట్టు స్థానం 5. అయితే ఆ వరుసలో మొత్తం చెట్ల సంఖ్య. **(2008 SI)**

సాధన:



$(R_1 + R_2 - 1)$ = Total
$R_1 = 5$, $R_2 = 5$
Total = $(R_1 + R_2) - 1$
= (5+5)–1 = 10–1= 9
∴ ఆ వరుసలోని మొత్తం వేపచెట్లు 9.

5. ఒక వరుసలో ఎడమ నుంచి గణేశ్ స్థానం 12. కుడివైపు నుంచి రాజన్ స్థానం 15. వారి స్థానాలను పరస్పరం మారిస్తే కుడివైపు నుంచి రాజన్ స్థానం 20. ఆ వరుసలో ఎంత మంది ఉన్నారు. **(2006, SI)**

సాధన: గణేశ్ ఎడమ నుంచి 12వ స్థానంలో, రాజన్ కుడి నుంచి 15వ స్థానంలో ఉన్నాడు. వారిద్దరూ పరస్పరం స్థానాలను మార్చుకుంటే రాజన్ కుడి నుంచి 20వ స్థానంలో ఉన్నాడు. ఆ స్థానం ఇంతకు ముందు గణేశ్‌ది.
కాబట్టి కుడి నుంచి గణేశ్ స్థానం 20, ఎడమ నుంచి 12.
∴ ఆ వరుసలో మొత్తం బాలురు
= (20+12) –1 = 31



What is the code for "earn"



Model Questions

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
   1) April 2) June 3) July
   4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
   1) The person whose joining date is in May
   2) The person whose joining date is in January
   3) D 4) A
   5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
   1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
   1) Only two people sit to the left of D
   2) D is sitting second to the right of the person whose joining date is in July
   3) E and B are immediate neighbours of D
   4) D's joining date is in May
   5) None is true
5. Who among the following has joining date in June?
   1) F 2) E 3) G 4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
   1) A and the person whose joining date is in August
   2) The person whose joining date is in May and E
   3) C and G
   4) The persons whose joining dates are in March and June
   5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
   1) D sits at one of the extreme ends of the line
   2) A sits on the immediate left of D
   3) Q faces D
   4) C is an immediate neighbour of D
   5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
   1) P 2) Q 3) R 4) S
   5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
    1) P 2) Q 3) R 4) S
    5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
    1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
    1) A 2) B 3) C 4) D
    5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
    1) si 2) ru 3) ha 4) ma
    5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
    1) pa jo 2) zi ki 3) ma ki
    4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
    1) ru 2) pa 3) jo
    4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
    1) ki to 2) ma pa 3) fi ma
    4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
    1) well 2) manage
    3) time 4) enough
    5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
    1) ru si 2) da ha 3) si pa
    4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
    How many steps will be required to complete the rearrangement?
    1) Five 2) Six 3) Seven
    4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
    Which of the following is definitely the input?
    1) enemy 25 joy defeat yes 52 37 46
    2) 37 enemy 25 joy yes defeat 52 46
    3) enemy joy defeat 25 52 yes 46 37
    4) Cannot be determined
    5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
    How many more steps will be required to complete the rearrangement?
    1) Three 2) Four 3) Five
    4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
    Which of the following steps will be the last but one?
    1) VII 2) IV 3) V
    4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
    Which of the following will be step VI?
    1) 33 store 52 of 75 81 full goods
    2) 33 store 52 of 75 full 81 goods
    3) 33 store 52 of 75 goods 81 full
    4) There will be no such step
    5) None of these

Explanations

(1-7):



1. 4 **2.** 1 **3.** 1 **4.** 5 **5.** 2
6. 3 **7.** 1

(8-12):



8. 4 **9.** 1 **10.** 2 **11.** 5 **12.** 1

(13-18):
time and money ® ma jo ki... (i)
manage time well ® pa ru jo...(ii)
earn more money® zi ha ma..(iii)
earn well enough ® si ru ha ...(iv)
From (i) and (ii), time ® jo
From (i) and (iii), money ® ma
From (i), and ® ki
From (ii) and (iv) well ® ru
From (ii), manage ® pa
From (iii) and (iv), earn ® ha
From (iii), more ® zi
From (iv), enough ® si
13. 3 **14.** 5 **15.** 2
16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**
17. 1
18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):
The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

19. Input: 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always
Step VI: 31 shut 45 open 49 door 86 aways **Ans: 2**

20. Can't proceed backward. **Ans: 4**

21. Step II: 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**

22. Input: where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**

23. Step II: 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**